
మొగుడు
పెళ్ళాం మధ్యలు
యర్రంశెట్టి సాయి

# యర్రంశెట్టి శాయి


# మొగుడు -
# ఇంకో పెళ్ళాం -
# వజ్రాలు


-: ప్రచురణ :-

**ఇంద్రధనుస్సు పబ్లికేషన్స్**

3-2-57, శాతవాహన నగర్,

యల్.బి.నగర్, హైదరాబాద్-500 074.

సెల్ : 9848 264 364

**MOGUDU-INKOPELLAM-VAJRALU**
*by* ***Yerramsetti Sai***

© ***with author***
*No part of this book may be utilized in any form or by any means including electronic recording or retrieval system without permission in writing from the publishers.*

First Edition : 2012

Price : 200/-

***Published by:***
***INDRADHANUSSU PUBLICATIONS,***
3-2-57, Satavahana Nagar,
L.B.Nagar, Hyderabad-500 074.

***Books Available at:***
Vishalandra Book House, Ph : 24744580
Navodaya Book House, Ph : 24652387
Navayuga Book House, Ph : 24754688
Indradhanussu Publications, Cell : 9848 264 364
Telugu Book House, Cell : 9247446497
Ganesh Book stall, Dilsukhnagar, Cell: 9393804466

***DTP & Layout***
**Hari : 9393 5254 61**.

***Printed at :***
S.P. Graphics.
Bagh Lingampally, Hyderabad,
Cell : 93968 00098

ఒకప్పటి కాలేజ్‌మేట్ తాలూకూ ఫ్యామిలీ మాటర్లో
సాయం చేయబోయి- తనూ అడ్డంగా ఇరుక్కుపోయి -
మొత్తం మేటర్‌ని కాంప్లికేట్ చేసేశాడు
భవానీ శంకర్ - ఇప్పుడా మెస్‌లో నుంచి తన ఫ్రెండ్‌ని బయటకు
లాగటం అలా వుంచి - ముందు తను బయటపడాలి
అంతేకాదు పూర్తిగా చేజారిపోతున్న
తన డ్రీమ్‌గాళ్‌ని మళ్ళీ దక్కించుకోవాలి
కెన్ హీ డూ ఇట్?
సూపర్ డూపర్ హ్యూమర్ నవల

# మొగుడు - ఇంకోపెళ్ళాం - వజ్రాలు

మోస్ట్ హిలేరియస్ భవానీశంకర్‌ని మరో
కొత్త యాంగిల్లో చూడండి

పెళ్ళయిన మొదటిరోజు మీరు మీ భార్యకు

వరం ఇస్తారు- హనీమూన్‌కి డార్జిలింగ్

వెళ్దామని! ఆక్షణం నుంచి ఆ అమ్మాయి

మిమ్మల్ని ముప్పయ్ తిప్పలు పెట్టి మూడు

చెరువుల నీళ్ళు తాగించేస్తుంది- హనీమూన్

విషయం గుర్తుచేసి! ఆ గొడవ భరించలేక

మీరు హనీమూన్‌కి ప్రోగ్రాం వేస్తారు. కానీ

బడ్జెటే డౌట్- మీకు మీ ఫ్రెండ్ సారథికూడా

తోడయితే అప్పుడు మొదలవుతుంది-

అసలు సిసలు కామెడీ -

(దీనికితోడు చిన్నిగాడు, తాతయ్య ఎక్స్ట్రా)


మీక్కావలిసిన

కామెడీ నవలలు ఉచితంగా చదువుకోడానికి

***www.yerramsettisai.com***

***or***

***www.indradhanussu.com***

విజిట్ చేయండి

హాపీగా నవ్వుకోండి


# మొగుడు – ఇంకో పెళ్ళాం– వజ్రాలు

గోపాల్రావ్‌కీ.. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్‌కీ బొత్తిగా పడటం లేదు.

ఇది గోపాల్రావ్ అభిప్రాయం.

ఇది ఇవాళ్టి వ్యవహారం కాదు.

మొదటినుంచీ ఇంతే.

మాంచి ప్రిస్టేజియస్ రెసిడెన్షియల్ స్కూల్లో చదవాలనుకుంటే ఎందుకూ పనికిరాని పరమ నికృష్టమయిన గవర్నమెంట్ స్కూల్లో ఆడ్మిషన్ వచ్చింది.

అయినాగానీ గోపాల్రావ్ నిరుత్సాహపడక మిగతా అందరు స్టూడెంట్స్‌లా కాపీలు కొట్టి పరీక్షలు పాసయిపోయాడు.

ఆ తరువాత అడ్డమయిన కంప్యూటర్ కోర్స్‌ల ప్రకటనలూ పేపర్లో చదివి మా కోర్స్ చదివితే మీ భవిష్యత్తు ఉజ్వలం అన్న స్లోగన్‌కి పడిపోయి సంవత్సరంపాటు దేశంలోని అతి పెద్ద ఇన్‌స్టిట్యూట్ అని భ్రమపడిన ఓ సంస్థలో చేరి పాతికవేలు ఫీజుకట్టి కోర్స్ పూర్తిచేసి ఎందుకూ పనికిరాని డిప్లొమా ఇచ్చిన ఇన్‌స్టిట్యూట్‌కెళ్లి మీ కంప్యూటర్ డిప్లొమా మీరు తీసుకుని నా పాతికవేల ఫీజు నాకిచ్చేయమన్నాడు.

అదేమిటి అని వాళ్ళడిగితే, నాకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని మీరంటేనే నేనీ కోర్స్‌లో జాయినయాను. ఏది ఆ ఉజ్వలమయిన భవిష్యత్తు? ఎక్కడ? సంవత్సరం నుంచీ మీరిఇచ్చిన పీ.జీ.డిప్లొమా తీసుకుని అడ్డమయిన ఉద్యోగానికీ తిరిగాను. ఈ కంప్యూటర్ డిప్లొమాలున్నవాళ్ళు వాళ్ళ ఆఫీసుల్లో ప్యూన్లుగా చేస్తున్నారని వాళ్ళన్నారు. కనుక ఇలాంటి బేవార్స్ డిప్లొమా నాకక్కర్లేదు. తీసుకుని నా డబ్బు నా కిచ్చేయండి. లేకపోతే యువతను మిస్‌గైడ్ చేసే ప్రకటనలతో మోసం చేస్తున్నారని కంజూమర్ కోర్ట్‌లో వేస్తాను అంటూ బెదిరించాడు.

వాళ్ళతని మాటలు విని నవ్వుకున్నారు. తర్వాత పక్కకు తిరిగి నవ్వారు. ఆ తర్వాత మోహం మీదే పగలబడి నవ్వారు.

పోనీ– నాకు ఆ చెత్త ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వకపోతే పోనీ– అని మండిపడుతూన్న సమయంలో ప్రభుత్వం డిగ్రీ ఎనిమిదిసార్లు తప్పి రోడ్ల వెంబడి బేవార్సుగా తిరుగుతూ దాదాగిరీ చేస్తున్న రాములుకి మంచి ఉద్యోగం యిచ్చింది.

"ఇంత మోసమా? సరే ఎప్పటికయినా నీ అంతు చూస్తా" అంటూ గోపాల్రావ్ ఓ

చెత్త ప్రయివేట్ కంపెనీలో జాయినైపోయాడు.

ఆ తర్వాత అతను చారెడేసి కళ్ళున్న అందమైన అమ్మాయికోసం దేశమంతా తిరిగి చివరకు అలాంటి అమ్మాయి సీత అనే పేరుతో హైదరాబాద్‌లోనే కర్నల్ కనకారావు ఇంట్లో పెరుగుతోందని తెలుసుకొని కర్నల్ కనకారావ్ సోమాజీగూడాలో నడుపుతోన్న కంపెనీలో అతి తక్కువ జీతానికి చేరి సీతతో ఫ్రెండ్‌షిప్ చేసుకుని లవ్‌లో పడేసుకున్నాడు. విషయం తెలిసి అప్పటికే ఇల్లరికం అల్లుడికోసం వెతుకుతోన్న కనకారావ్ గన్‌పెట్టి అతనితో తన కూతురు మెడలో తాళి కట్టించాడు.

సీతా కాపురానికొచ్చిన మొదటిరోజు బెడ్‌మీద కూర్చుని ఆమె అందమైన కళ్ళలోకి తన్మయత్వంతో చూస్తూ "అబ్బ! నీ కళ్ళు ఎన్త అద్భుత్తంగా వుళ్ళయ్..." అంటూంటే కావాలని డైలాగ్ మధ్యలోనే ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ పవర్ కట్ చేసింది.

అయినాగానీ తను డాబా ఎక్కి వెన్నెల్లో కబుర్లు చెప్పుకోబోతే, కార్పొరేషన్ వాళ్ళు ఎన్నో కోట్లు ఖర్చుపెట్టి పెంచుతున్న హైబ్రీడ్ దోమలు యిద్దరినీ చీల్చి– చెండాడి ఇంట్లోకి తోలేసినయ్.

ఈ గవర్నమెంట్‌తో ఎప్పటికైనా తలనొప్పేనని సీతనీసుకుని హనీమూన్‌కి కర్ణాటక రాష్ట్రం వెళ్దామని రైల్లో బయల్దేరితే ఆ రోజు ఆ రైలుకి యాక్సిడెంట్ చేయించి బ్రతికున్న వారందరినీ బస్‌లో మళ్ళీ హైద్రాబాద్‌కి పంపించివేసింది.

అయినాగానీ గోపాల్రావ్ పట్టువిడవలేదు.

"సీతా! ఇవాళ మనం ఎగ్జిబిషన్ కెళ్దాం. మొత్తం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మన కెదురుతిరిగినా మనం వెళ్ళి తీరాల్సిందే. అక్కడ పవర్ కట్‌లు చేస్తారు వాళ్ళు. అయినా మనం ఐస్‌క్రీమ్ స్టాల్లో మళ్ళీ కరెంటు వచ్చేవరకూ ఐస్‌క్రీమ్స్ తింటూ కూర్చుందాం.

మిర్చి బజ్జీలు తింటూ జయింట్‌వీల్‌లో తిరుగుదాం. కూల్‌డ్రింక్స్ తాగుతూ రోమన్ కాజిల్ చూద్దాం. కాష్మీరీ షాల్ కొనుక్కుందాం, కొల్హాపురి చెప్పులు వేసుకుందాం......"

సీత కిలకిల నవ్వేసింది.

"మనకు విలన్స్ లేరు ఎవరూ లేరు. ఊరికే అలా ఇమేజినేషన్‌లో కెళ్ళిపోకు" అంది సీత.

ఇద్దరూ ఎగ్జిబిషన్ చేరుకున్నారు.

అక్కడి వాతావరణం గోపాల్రావ్‌కి మరింత ఉత్సాహం కలిగించింది.

రంగురంగుల లైట్లు, అందమైన అమ్మాయిలు, పక్కన బ్యూటీ క్వీన్!

"నేనూ మా ఫ్రెండ్ భవానీశంకర్‌గాడూ ప్రతి సంవత్సరం ఎగ్జిబిషన్‌లో భలే ఎంజాయ్ చేసేవాళ్ళం సీతా! అందమైన అమ్మాయిల వెంట పడేవాళ్ళం. కొద్దిసేపటికి వాళ్ళతో



ఫ్రెండ్‌షిప్, తర్వాత కలిసి మిర్చి బజ్జీలు తినటం, ఆ తర్వాత ఎవరి దారిన వాళ్ళు విడిపోవడం...." అతను ఇంకెంతసేపలా మాట్లాడేవాడోగానీ పక్కన వినేవాళ్ళెవరూ లేని ఫీలింగ్ కలిగేసరికి ఆదిరిపడి సీతకోసం వెతికాడు.

సీత వెనుకే నిలబడిపోయి వుంది.

ఆమె మొహంలో కోపం!

"సీతా! ఏమిటలా నిలబడిపోయావ్?" అడిగాడు ఆశ్చర్యంగా.

"నాతో మాట్లాడకు. ఐ హేట్ యూ..." అందామె హఠాత్తుగా చేతుల్లో మొహం దాచుకొని ఏడ్చేస్తూ.

గోపాల్రావ్ ఉక్కిరిబిక్కిరయిపోయాడు.

"సీతా! ఏమిటిది? ఏం జరిగింది? నేనేం చేశాను....?" అన్నాడు భయంగా.

"ఇంకా ఏం చేశానని అడుగుతున్నావా? సిగ్గుండక్కర్లేదూ? ఇప్పుడే డాడీకి ఫోన్ చేసి చెప్పేస్తా– వచ్చి నన్ను తీసుకెళ్ళమని. ఇంక ఒక్క క్షణం కూడా నీ దగ్గరుండను" వెక్కి వెక్కి ఏడ్చేస్తూ, మధ్యలో ఏడుపు ఆపి విరుచుకుపడుతూంటే గోపాల్రావ్ నిశ్చేష్టుడై చూస్తూ వుండిపోయాడు.

ఇంత అందమైన అమ్మాయి లోపల ఓ చిన్నసైజు కాళికావతారం వుండటం అతనికి మింగుడుపడటం లేదు.

"ఏది ఫోన్ బూత్ ఎక్కడ? ముందు డాడీకి ఫోన్ చేయాలి" ఫోన్ బూత్ కోసం నాలుగువేపులా చూస్తోంది.

"సీతా! ప్లీజ్.... ఏం జరిగిందో చెప్పు. ఎందుకింత కోపం వచ్చింది నీకు? నేను పొరబాటున నిన్నేమైనా అన్నానా?"

"పొరబాటున కాదు– అలవాటుతోనే అన్నావ్! అమ్మాయిల వెంటపడటం నీ అలవాటని ముందే తెలిసివుంటే అసలు నీతో పెళ్ళికే వప్పుకునేదాన్ని కాదు. ఛీ.. ఎంత చీప్ మనుషులు! ఏ అమ్మాయి కనబడితే ఆ అమ్మాయి వెంటపడిపోవటమేనా? నువ్వేం జంతువు కాదుగదా! మనిషి... అసలు– ముందు మా డాడీతో మాట్లాడాలి."

ఆమె కోపం చూసి అప్పటికప్పుడే కొన్ని వందలమంది ఉత్సాహవంతులైన యువతీ యువకులు వాళ్ళిద్దరి చుట్టూ మూగారు.

"హలో సీతా! మై తుమ్హారా డాడీ బాత్ కర్ రహా హు! క్యా హువా బేటీ?" అంటూ అరిచాడొకడు వాళ్ళ మధ్యనుంచి.

అంత ఘొల్లుమన్నారు.

సీతకు మరింత వళ్ళుమండింది.

"బత్తమీజ్! షరమ్‌నై ఆతీ? అయ్‌సా బాత్ కర్‌నేకో.....?" అంది పబ్లిక్ వేపు తిరిగి.

అంతా మళ్ళీ ఘొల్లుమన్నారు.

"సీతా! పద వెళ్దాం. జరిగిందానికి నేను సారీ చెపుతున్నా కదా... ప్లీజ్" అన్నాడు గోపాల్రావ్ కొంచెం గొంతు తగ్గించి.

"అదేం నడవదు. కాళ్ళమీద పడు" ఇంకెవరో అరిచారు జనంలో నుంచి.

మళ్ళీ నవ్వులు.

"షటప్! ఎవడ్రా వాగుతోంది?" షర్టు చేతులు మడిచి ఆ గొంతు వినిపించిన వేపు తిరిగాడు గోపాల్రావ్.

"ఎవడ్నా? మై సీతాకా బాప్ హురే... సీతా! ఆ... గలే లగ్‌జా" ఇంకోవేపు నుంచి ఎవడో అరిచాడు.

"అరే సాలే! సీతా కా బాప్ మై హు రే! సీతా! ఇదరావ్! మేరే గలే లగ్‌జా" అని ఇంకోడు ఇంకో వేపు నుంచి అరిచాడు.

"అరే పాగల్ ఏక్ సీతాకో దో దో బాప్ కహాసే ఆతేరే?" మరో గొంతు.

మళ్ళీ నవ్వులు, కేకలు, విజిల్స్.

ఆ గొడవతో సీత కోపమంతా తగ్గిపోయింది.

తన తెలివి తక్కువతనం వల్ల తామిద్దరి గొడవనీ ఎగ్జిబిషన్ కొచ్చిన జంటనగరాల ప్రజలంతా ఎంజాయ్ చేస్తున్నారన్న విషయం అర్థమైంది.

చప్పున గోపాల్రావ్ చేయి పట్టుకుని ఆ గుంపులో నుంచి బయటకు ఈడ్చుకుపోయిందామె.

ఇద్దరూ జనసమ్మర్ధం లేనిచోట ఆగారు.

"అయామ్ సారీ" అన్నాడు గోపాల్రావ్.

"తప్పు నాదే– అయామ్ సారీ" అంది సీత.

"ఇంకో అమ్మాయితో మాట్లాడినంత మాత్రాన నీకు అంత కోపం వస్తుందని తెలీదు సీతా."

"నాకెందుకో మొదటి నుంచీ పొజెసివ్‌నెస్ ఎక్కువ. మా డాడీ కేవలం నా ఒక్కదానికే రిజర్వ్‌డ్ అనే ఫీలింగ్‌తో వుండేదానిని. పొరపాటున ఇంకెవర్నయినా మా డాడీ దగ్గరకు తీసుకుని ముద్దాడినా నాకు అమితమైన కోపం వచ్చేసేది. అలాగే మా మమ్మీ కూడా. అంతెందుకు? మా మమ్మీ మా డాడీని ప్రేమగా ట్రీట్ చేసినా అనీజీగా ఫీలయ్యేదానిని."

గోపాల్రావ్‌కి అర్థమైంది.

"పిల్లలందరిలోనూ వుండే ఫీలింగే అది. నథింగ్ అన్నేచురల్" అన్నాడు ఎందుకయినా



మంచిదని ఆమెని సపోర్ట్ చేస్తూ.

"తమాషా ఏమిటంటే పెద్దయ్యాక అలాంటి ఫీలింగ్సన్నీ పోతాయని అనుకునేదాన్ని. కానీ ఇప్పుడు మరీ ఎక్కువయిపోయాయ్. మా క్లోజ్ ఫ్రెండ్ రాధకు పెళ్ళయిందీ మధ్య. అది వాళ్ళాయనతో క్లోజ్‌గా వుంటే నాకెంత జెలసీగా వుండేదో చెప్పలేను. అది నన్ను మోసం చేసినట్లు, అంతవరకూ నాతో చేసిన గాఢ స్నేహం అంతా నటన అన్నట్లు ఫీలయ్యాను."

"జనరల్‌గా అందరూ అంతే."

"ఇప్పుడు నీ గురించి కూడా అలాగే ఫీలవుతున్నాను. నువ్వు నా వాడివనీ, నా ఒక్కదానికే స్వంతమనీ, ఇంకెవ్వరికీ చెందవనీ, చెందకూడదనీ నా కోరిక. నువ్వింకే అమ్మాయితో క్లోజ్‌గా మూవ్ అయినా నాకు పట్టరాని కోపం వచ్చేస్తుంది. ఆ కోపంలో నేనేం చేస్తానో నాకే తెలీదు. నాకు తెలుసు – అంత జెలసీ, అంత ఆవేశం మంచిది కాదని. కానీ చెప్పాను కదా– అది నా వీక్‌నెస్."

ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

గోపాల్రావ్ ఆమె భుజం మీద చేయి వేశాడు అప్యాయంగా.

"దట్సాల్ రైట్! జరిగిందేదో జరిగిపోయింది. ఇంక ఆ విషయం ఆలోచించకు" అన్నాడు అనునయంగా.

"నన్నర్థం చేసుకుంటావ్ కదూ?" దీనంగా అడిగింది.

"నిన్ను కోరి చేసుకుంది ఎందుకనుకున్నావు సీతా! నువ్వు నా డ్రీమ్‌గాళ్‌వి. నా డ్రీమ్‌గాళ్ ఎప్పుడూ అందంగా, ఆనందంగా వుండటమే నాక్కావలసింది. నీ ఆనందం కోసం నేను ఏమయినా చేస్తాను" కొంచెం సినిమా ఫక్కీలో అన్నాడు.

సీత అతని చేతిని మృదువుగా నొక్కింది.

"థాంక్యూ"

"ఇంక వెళ్దాం పద. చాలా స్టాల్స్ చూడాల్సి వుంది మనం."

ఇద్దరూ ఆనందంగా మళ్ళీ నడవసాగారు.

జెయింట్ వీల్ మీద తిరగటం, మోటార్ సైకిల్ ఫీట్స్ చూడటం, చిలక మేజిక్ – అన్నీ చూసుకుంటూ తిరుగుముఖం పట్టాక జరిగిందో సంఘటన...

ఇద్దరూ కూల్‌డ్రింక్స్ కోసం ఓ కూల్‌డ్రింక్ షాప్ దగ్గర కెళ్తూండగా గోపాల్రావ్ ఠక్కున ఆగిపోయాడు. అతని గుండె వేగంగా కొట్టుకోసాగింది. గొంతు తడారిపోయింది.

"ఏమిటాగిపోయావ్?" అందామె ఆశ్చర్యంగా.

గోపాల్రావ్ ఆ ప్రశ్నకు బాంబ్ పడిన లెవెల్లో రియాక్షనిచ్చాడు.

"ఆ.. అదా... అదీ... మరేం లేదు. మనం ఇంకోచోట కూల్ డ్రింక్ తాగుదాం- ఇక్కడేం బావుండదు" అన్నాడు కంగారుగా.

అతని చూపులు మాత్రం అటువైపు తిరిగి నిలబడి మరో అమ్మాయితో కబుర్లు చెపుతూ కూల్‌డ్రింక్ తాగుతున్న రజని మీదున్నాయి.

ఆ పిల్ల తన ఖర్మ కాలి ఇటు తిరిగిందో తన బ్రతుకు ఆంధ్రప్రదేశ్ అయిపోతుంది.

అందుకే అక్కడి నుంచి పారిపోవాలన్న ప్లాన్‌లో వున్నాడు.

"కూల్‌డ్రింక్ ఎక్కడయితే ఏమిటి? బాగోపోడానికి వీడేం స్వంతంగా తయారు చేస్తాడా?" ఆశ్చర్యంగా అడిగింది సీత.

"అవును. వీడు కల్తీ చేసి అమ్ముతున్నాడని మొన్నే పోలీసులు అరెస్టు చేశారు."

"వాళ్ళందరూ తాగుతూండగా లేంది మనకేనా ఏమిటి? మళ్ళీ వెనక్కు నడవటం నా వల్ల కాదు- కాళ్ళు నొప్పులు పుడుతున్నాయి రా" అంటూ కౌంటర్ దగ్గర కెళ్ళి కూల్ డ్రింక్స్ అందుకుంది.

గోపాల్రావ్ గత్యంతరం లేక ఆ రజని ఒకవేళ వెనక్కు తిరిగినా తనను గుర్తుపట్టడానికి వీలుకాకుండా సైడ్‌కి నడవసాగాడు.

నిజానికి గోపాల్రావ్‌కి తెలుసు.

అతి తెలివిపరులూ, ఓవర్ స్మార్ట్‌గా వుండేవాళ్ళూ, అతి జాగ్రత్త పరులూ ఖచ్చితంగా చావుదెబ్బ తింటారని.

ఎంతోమందికి ఎన్నోసార్లు ఆ విషయం ఎగ్జాంపుల్స్‌తో సహా తనే చెప్పాడు కూడా.

కానీ ఆ క్షణంలో మాత్రం ఆ రూల్ ఏ మాత్రం గుర్తుకి రాలేదు.

రూల్ గుర్తుకి రాకపోయినంత మాత్రాన చావుదెబ్బ తగలకమానదు కదా?

అంచేత మొహం పగిలేట్లు తగిలింది.

మొహం సైడ్‌కి పెట్టుకుని ఓ పక్కకు నడుస్తూంటే రజనితో మాట్లాడుతున్న పిల్ల చూసింది ముందు.

"ఏయ్ రజనీ! ఆ పక్షి ఎవరో చూడవే- చాలా పెక్యూలియర్‌గా నడుస్తున్నాడు. త్వరగా చూడు.... మళ్ళీ మిస్ అయిపోతావ్" అంది రజనితో.

రజని పూర్తిగా వెనక్కు తిరిగి ఆ విడ్డూరం చూసింది ముందు. తర్వాత.....

ఆ విడ్డూరం తాలూకూ మొహం చూసి ఆనందంతో ఒక్క కేక పెట్టింది- హాయ్! గోపాల్" అంటూ.

గోపాల్రావ్‌కి ఆ కేక వింటూనే 'హ సీతా' అని మారీచుడు అరుస్తున్న ఫీలింగ్ కలిగింది. తనకు ఇంచుమించుగా మూర్ఛ వస్తున్నట్లనిపించింది.



గాబరాగా సీత రియాక్షన్ ఏమిటా అని చూశాడు.

సీతా షాక్ తిన్నట్లు చూస్తోంది.

ఆమె నమ్మలేకపోతోంది. ఇంకెవరో అమ్మాయి 'హాయ్ గోపాల్రావ్' అంటూ అరవటం.

చప్పున సీత దగ్గరకు చేరుకుని కూల్‌డ్రింక్ తీసుకున్నాడు.

"సీతా! నీకో సంగతి చెప్పానా? జాన్సన్, నికొల్సన్, విల్సన్- అని ముగ్గురు బ్రదర్స్ వుండేవాళ్ళు ఆ రోజుల్లో. అంటే మేము కాలేజీ చదివే రోజుల్లో. ఓసారేమయిం దనుకున్నావ్? జాన్సన్, విల్సన్ కలిసి నికొల్సన్ అపోజిషన్ గ్రూపులో వున్న కిషన్, మోహన్, భూషణ్‌ని ఎటాక్ చేశారు. అప్పుడు రాజేష్, గిరీష్, శిరీష్‌లు నికొల్సన్‌ని కిడ్నాప్ చేసి- జాన్సన్, విల్సన్‌ని భూషణ్, మోహన్ రూమ్‌లో పెట్టారు. ఈ సంగతి తెలిసి జాల్సన్, విల్సన్‌లు- రాజేష్, శిరీష్‌లను కిడ్నాప్ చేసుకెళ్ళి భీమేష్, ఉమేష్, రమేష్ రూమ్‌లో వుంచారు. కానీ రాజేష్, శిరీష్‌ల అన్నయ్య మహేష్ తన గ్రూప్ జగన్, మదన్‌లను తీసుకొచ్చి......."

అలా ఎంతవరకూ చెప్పేవాడోగానీ రజని ఆనందంగా వాళ్ళిద్దరి మధ్య కొచ్చేసింది.

"హాయ్! ఏమైపోయావ్ ఇన్నాళ్లూ?" అంది ఉత్సాహంగా గోపాల్రావ్ షర్టు తాలూకూ బొత్తాం నిమురుతూ.

గోపాల్రావ్‌కి కొద్ది క్షణాలు మాట రాలేదు. చెమటలు పట్టేసినయ్.

ఆమె చేతిని గొంగళి పురుగుని తీసిపారేసినట్లు విదిలించికొట్టాడు.

సీత మొహంలో ఎక్స్‌ప్రెషన్ క్షణక్షణానికీ భయంకరంగా మారిపోతున్నాయి.

"ఎక్స్‌క్యూజ్‌మీ- హూ ఆర్ యూ?" అన్నాడు రజనిని జీవితంలో అదే మొదటిసారి చూస్తున్న ఎక్స్‌ప్రెషన్‌తో.

ఆపదల్లో ఇరుక్కున్న సమయాల్లో భారత ప్రజలు ఇంగ్లీషులో మాట్లాడితే ఆ ప్రమాదాల నుండి తప్పించుకుని బయటపడే అవకాశాలు ఎక్కువగా వుంటాయని గోపాల్రావ్‌కి దీప్‌కుమార్ ఓసారి ఇంగ్లీష్‌లో లెక్చర్ యిస్తున్నప్పుడు చెప్పాడు.

ఆ తర్వాత ఒకటి రెండుసార్లు ఆ సూత్రాన్ని అమలు చేసి అది నూటికి నూరుపాళు ళ్ళ నిజమని ఋజువు చేసుకున్నాడు గోపాల్రావ్. అందుకే ఇప్పుడు ఇంగ్లీషులోకి వచ్చేశాడు.

"వ్వాట్? హూ ఆర్ యూ? ఒక్క నెల రోజులు కలుసుకోక పోయేసరికి వ్యవహారం అంత దూరం వచ్చేసిందా?" ఆశ్చర్యపోతూ అందా పిల్ల.

సీతకు ఆ దృశ్యం చాలా ఆసక్తికరంగా కనబడుతోంది.

తనింతకు ముందు చూసిన డిటెక్టివ్ సినిమాలకంటే కూడా చాలా బావున్నట్లనిపిస్తోంది.

"అయామ్ సారీ! మీరు వేరెవర్నో చూసి ఇంకెవరో అని నన్ను అనుకుని... ఊహు... అలాక్కాదు. నేనెవరో అనుకుని ఇంకెవర్నో చూసి నేననుకుని వేరేవరినో ఇంకెవరో అనుకుని నన్ను.. ఊహు... ఇలా కూడా కాదు. నన్ను చూసి ఇంకెవరో అనుకుని మాట్లాడుతున్నారు– దేరీజ్ సమ్ కన్ఫ్యూజన్" అన్నాడు సీత తన మాటలు నమ్ముతుందో లేదో క్రీగంట చూస్తూ.

"ఓహో! అయితే నేనెవరో తెలీదన్న మాట?"

"ఒక్క ఇంచ్ కూడా తెలీదు."

"మనిద్దరం ఇంతకుముందెప్పుడూ కలుసుకోలేదన్నమాట?"

"నెవర్! ఒకవేళ కలుసుకున్నా నన్ను పోలిన వ్యక్తిని కలుసుకుని వుండవచ్చు."

"ఐసీ! అయితే నేను చాలాసార్లు కలుసుకున్న వ్యక్తి అచ్చంమీలా వుండి వుంటాడని మీరంటారు."

"ఘూర్! మనుషుల్ని పోలిన మనుషులంటారని మీరు పేపర్లో చదవలేదా?"

"లేదు"

"చదవండి. ఈ మధ్యనే వచ్చిందా ఆర్టికల్. చాలా ఇంటరెస్టింగ్ ఆర్టికల్. ప్రపంచంలో మొత్తం పదమూడు తరహాల మొహాలే వుంటాయట. మొత్తం జనాభా అంతా ఆ పదమూడుమందిలో ఎవరొకరిని పోలి వుంటారట."

రజనికి వళ్ళు మండిపోతోంది.

తనకంటే అందమయిన పిల్ల దొరికినంతమాత్రాన తనను మరీ అంత చీప్‌గా ఇన్సల్ట్ చేస్తాడా? ఇలాంటి వాళ్ళను వదిలేస్తే లాభంలేదు. చాలా కఠినంగా బుద్ధి చెప్పాలి. కొత్తగా ఇతగాడి వల్లో పడిన ఆ పిల్లకయినా ఇతగాడి పాడు గుణం టెలికాస్ట్ చేయాలి.

"ఓ–ఐసీ! మొత్తం జనాభా అంతా పదమూడుమందిని పోలి వుంటారన్నమాట."

"అవును! కావాలంటే ఈ నెల 24వ తారీఖు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ చూడండి."

"తప్పకుండా చూస్తాను. ముఖాలు పదమూడే వుండవచ్చుగానీ పేర్లు కూడా పదమూడే వుండాల్సిన అవసరం లేదనుకుంటాను."

గోపాల్రావ్ ముఖం పాలిపోయింది.

రజిని తనని మరో చావుదెబ్బ ఎలా కొట్టబోతుందో అర్థమయేసరికి ముందే నీరసం ఆవహించేసింది.

"నో నో నో .... నెవర్! పేర్లు కూడా పోలి వుండాల్సిన అవసరం లేదు. అయినా ఒకోసారి పేర్లు కూడా పోలి వున్న సంఘటలున్నాయి కూడా.." అన్నాడు ఎందుకయినా మంచిదని.



అనేసి కూల్‌డ్రింక్ గడగడా తాగేసి బాటిల్ కౌంటర్ మీద పెట్టి ఇరవై నోటు వాడి మీదకు విసిరేసి–

"పద సీతా! వెళ్దాం" అన్నాడు హడావుడిగా.

కాని సీత అక్కడి నుంచి హడావుడిగా వచ్చేయడానికి ఏ మాత్రం ఉత్సాహపడ లేదు.

ఈలోగా రజని నెక్స్ట్ డైలాగ్ కొట్టనే కొట్టేసింది–

"అచ్చం మీలాగా వుండిన మా ఫ్రెండ్ పేరు గోపాల్రావ్! మీ పేరు అది కాదనుకుంటా?" అంది టీజింగ్‌గా చూస్తూ.

గోపాల్రావ్ మీద పిడుగు పడినట్లయింది.

భయంగా సీత వైపు చూశాడు.

సీతలో ఆవేశం ఉప్పెనలా వస్తోంది

లోపల దాక్కున్న కాళికావతారం నెమ్మదిగా బయటికొస్తోంది.

ఆమె చేతిలోని కూల్‌డ్రింక్ బాటిల్ విసిరికొట్టింది.

చరచరా అక్కడి నుంచి బయటకు నడవసాగింది.

గోపాల్రావ్ ఆమె వెంట పరుగెత్తాడు.

"సీతా... సీతా! వన్ మినిట్."

"ఛీ! సిగ్గులేకపోతేసరి."

"ఆ! ఏమన్నావు?."

"సిగ్గులేకపోతేసరి అన్నాను."

"ఓ–అదేనా? ఇంకేదో అనుకున్నాను."

"కాదు–అదే."

"కానీ నేనిప్పుడు సిగ్గులేనంత పనేం చేశాను?"

"ఆ మాటడగడానికి సిగ్గులేకపోతేసరి."

"యూ ఆర్ మిస్టేకెన్ సీతా! ఆ పిల్ల ఎవరో అనుకుని నన్ను చూసి ఇంకెవర్నో పోలివున్నానని వేరెవరో అనుకుని..."

"షటప్! మా డాడీకి ఫోన్ చేస్తా. నీలాంటి వాడితో ఇంకొక్క క్షణం కూడా కాపురం చేయటం నావల్ల కాదు."

"సీతా... ప్లీజ్! నేను చెప్పేది విను."

"వినను... వినను... వినను... అంటూ సెల్ రింగ్ చేసింది.

"సీత ప్లీజ్! వద్దు. మీ డాడీకి అసలే కోపం ఎక్కువ."

"నో... ఏమైనా సరే నేనిక్కడ ఇంకొక్క క్షణం కూడా వుండను. హలో డాడీ! నేను సీతను మాట్లాడుతున్నాను. మీరు వెంటనే వచ్చి నన్ను తీసుకెళ్ళండి డాడీ. ఈ చీట్‌తో నేను సంసారం చేయలేను."

"ఆజా బేటీ! మై లేకే జావుంగా" అరిచాడో స్టూడెంట్ బయట నుంచి.

అంతా ఘొల్లుమన్నారు.

"వ్వాట్! మీరు మా డాడీ కాదా? సారీ! రాంగ్ నెంబర్" కోపంగా ఫోన్ పెట్టేసిందామె.

"సీతా.... ప్లీజ్! డోంట్ మేక్ ఏ సీన్ హియర్. పద..... ఇంటికి వెళ్దాం."

"ప్లీజ్ సీతా! ప్లీజ్ సీతా! ప్లీజ్ సీతా" అంటూ స్టూడెంట్స్ కోరస్‌గా అరవసాగారు.

సీతకు వాళ్ళమీద వళ్ళు మండిపోయింది.

"రాస్కెల్స్!" అనేసి బయటకు నడిచి ఆటోలో కూర్చుని 'అమీర్‌పేట' అంది. ఆటో స్టార్టయి వెళ్తూంటే గోపాలరావ్ పరుగెత్తి తనూ ఎక్కేశాడు.

ఆ రాత్రి ఇద్దరూ అన్నం తినలేదు.

"నాకాకలి లేదు. నువ్వు తిను" అంది మొండిగా.

"నేనూ తినను" అన్నాడు గోపాలరావ్.

"పాత ప్రియురాలు కనిపించిన ఆనందంలో ఇంక ఆకలేం వుంటుంది?"

"సీతా! నన్నపార్థం చేసుకుంటున్నావు."

"షటప్! అర్థం చేసుకుంటున్నాను."

"ఇలాంటి పొరబాట్లు ఒక ముందు జరగవని ఇందాకేగా ప్రామిస్ చేశాను?"

"చేశాక మళ్ళీ ఇప్పుడీ పొరబాటు జరిగింది కదా?"

"ఇది ఇంతకుముందు జీవితం తాలూకూ పొరబాటే! కొత్తది కాదు."

సీతకు అందులో లాజిక్ కనిపించింది.

"అయినా సరే" అంది కొంచెం కూల్ అవుతూ.

గోపాలరావ్‌కి ఆమె టోన్ తెలిసిపోయింది. ఆమెలో కోపం తగ్గిపోయింది.

"సీతా! నీలాంటి అందమయిన అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాక ఇంక వేరే అమ్మాయిని కన్నెత్తి ఎందుకు చూస్తాను? వేరీజ్ ది నెస్సెసిటీ?" సిన్సియర్‌గా మాట్లాడుతున్నట్లు నటించాడు.

"ఆర్ యూ సిన్సియర్?" అనుమానంగా అడిగింది సీత.

"ఆఫ్‌కోర్స్! అయామ్ సీరియస్‌లీ సిన్సియర్."

"ఆర్ యూ రియల్లీ సీరియస్?"

"ఆఫ్‌కోర్స్.... అయామ్ రియల్లీ అండ్ సిన్సియర్లీ సీరియస్" ఓవర్ సిన్సియర్‌గా



అన్నాడు.

సీత పూర్తిగా నార్మల్ కొచ్చేసింది.

"నేను నిజంగా అంత అందంగా వుంటానా?" సిగ్గుపడుతూ అడిగింది.

"నీకు తెలీదుగానీ... మాఫ్రెండ్స్‌ంతా నన్ను చూసి తెగ జెలసీతో ఏడ్చి ఛస్తున్నారు."

"ఒకవేళ నాకంటే అందమయిన అమ్మాయి కనబడితే మీరు తప్పకుండా నా సంగతి మర్చిపోయి ఆ పిల్ల వెంటబడతారు."

"ఆఫ్‌కోర్స్! అహహహ-నో-నో-నో నువ్వు తప్ప ఇంకెవరూ అందంగా కనబడరు నాకు."

"ఇందాక కూల్‌డ్రింక్ షాప్ దగ్గర అలా గొడవ చేసినందుకు అయామ్ సారీ!"

"నో సీతా! ఇందులో నీ తప్పేం లేదు. మనం సోషల్‌గా ఆడపిల్లలతో మూవ్ అయితే ఎలాంటి గొడవలు చుట్టుకుంటాయో ఇప్పుడర్థమయింది నాకు. ఆ పిల్లకీ, మనకీ మధ్యలో ఏమీ లేకపోయినా....."

"గతంలో జరిగిందేదో జరిగిపోయింది. భవిష్యత్తులో ఇంకే అమ్మాయితోనూ ఎఫైర్ వుండదని ప్రామిస్ చేయండి."

గోపాలరావ్ సీత చేతిలో చేయి వేశాడు.

"ప్రామిస్ సీతా!"

"నేను చిన్నప్పటి నుంచీ చాలా పొజెసివ్. మా మమ్మీగానీ, మా డాడీగానీ కేవలం నా ఒక్కదానినే ప్రేమించాలనీ, నా ఒక్కర్తెతోనే ప్రేమింపబడాలనీ కోరుకునేదానిని. మా డాడీని....."

"ఇంకెవ్వరు డాడీ అన్నా, మీ డాడీ ఇంకే పాపను ముద్దాడినా నీకు అమితమయిన ఆవేశం, జెలసీ, కోపం అన్నీ వచ్చేస్తాయి. అలాగే నీ భర్తకూడా కేవలం నిన్నే ప్రేమించాలనీ, నీ ప్రేమను మాత్రమే నీ భర్త అందుకోవాలనీ నీ కోరిక. అంతేనా?" నవ్వుతూ అడిగాడు.

సీత నవ్వేసింది.

అతని కౌగిట్లోకి వాలిపోయింది చిరుకోపంతో.

"నన్ను ఆటలు పట్టిస్తున్నావ్ కదూ?"

"అంత ధైర్యమా? ఎప్పుడు మీ డాడీకి ఫోన్ కొడతావోనని గుండెలు చేత్తో పట్టుకుని బ్రతుకుతున్నాను."

వంటవాడు బయట హాల్లో నుంచి వాళ్ళ బెడ్‌రూమ్‌కి ఫోన్ చేశాడు.

"ఇదిగో! మర్యాదగా వచ్చి భోజనం చేస్తారా లేక నన్ను తినేసి పడుకోమన్నారా? ఏ సంగతీ అయిదు నిమిషాల్లో చెప్పండి. అడ్డమైన వాళ్ళకోసం రాత్రి పన్నెండింటివరకూ

భోజనం చేయకుండా ఎదురుచూడటం నా వల్లకాదు" అనేసి ఫోను పెట్టేశాడు.

సీత కోపంతో అదిరిపడింది.

"చూశారా– ఆ భజన్‌గాడు ఎలా రఫ్‌గా మాట్లాడుతున్నాడో?"

"ఏమిటంటాడు?"

"అడ్డమైన వాళ్ళ కోసం తను వెయిట్ చేయడంట. అన్నం తినాలనుకుంటే అయిదు నిమిషాల్లో వచ్చి తినాలంట."

గోపాల్రావ్ నవ్వేశాడు.

"వాడేమన్నా మనం రియాక్ట్ అవకుండా సైలెంట్‌గా అనుభవించటం మంచిది సీతా! పెళ్ళాం పోతే ఇంకో పెళ్ళాం దొరుకుతుంది. మొగుడు పోతే ఇంకో మెగుడు దొరుకుతాడు. తల్లీ, తండ్రీ పోతే మరో తల్లిదండ్రులు దొరుకుతారుగానీ, వంటవాడు పోతే మాత్రం ఇంకోడు దొరకడు డియర్. నీకా వంట సరిగ్గా రాదు. ఈ పరిస్థితిలో వాడు ఆడించి నట్టల్లా ఆడటం తప్ప గత్యంతరం లేదు."

ఆ రాత్రంతా ఇద్దరికీ ఆనందంగా గడచిపోయింది.

∘ ∘ ∘

జీప్ వచ్చి ఆ టైన్‌లోని ఓ క్రాస్ రోడ్స్ పక్కన ఆగింది. అందులో నుంచి పోలీస్ ఇన్స్‌పెక్టర్ రాంబాబు దిగాడు. అతనిని చూడగానే ఆ క్రాస్ రోడ్స్‌లో ట్రాఫిక్‌ని రెగ్యులేట్ చేస్తున్న ట్రాఫిక్ కాని స్టేబుల్ బషీర్ మాంఛి కడక్ సెల్యూట్ ఒకటి కొట్టాడు. కడక్ సెల్యూట్ కొట్టటం ద్వారా పోలీస్ బాస్‌ని మెస్మరైజ్ చేయవచ్చని అతను "బాస్ కో మారో గోలీ" అనే ఉర్దూ పుస్తకంలో చదివాడు. ఆ ట్రాఫిక్ జంక్షన్‌లో కొన్ని వేలమంది పబ్లిక్ చూస్తూండగా బషీర్ తనకలాంటి కడక్ సెల్యూట్ యివ్వటం ఇన్స్‌పెక్టర్ రాంబాబుకి అమితమయిన ఆనందం కలిగించింది.

"జీప్‌లో కూర్చోండి సార్! టిఫిన్ పంపిస్తాను" అన్నాడు బషీర్ దూరంగా నిలబడ్డ ఆటో వాడికి సైగ చేస్తూ.

"లారీ వాళ్ళు ఎవరయినా దొరికారా?" అడిగాడు రాంబాబు రోడ్డు పక్కన ఆగి వున్న లారీల వేపు చూస్తూ.

"మొత్తం పది లారీలు దొరికినయ్ సార్! ఇసుక లారీలోళ్ళు నలుగురు ఎనిమిది దాటాక సిటీలోకి వెళ్ళాలన్నారు. తలో పాతికా తీసుకుని వదిలేశాను. మిగతా లారీలు తలో పదీ యిచ్చారు."

"ఎలాగయినా సాయంత్రానికి రెండువేలు పోగుజెయ్యాలి. ఇవాళ మంగళవారం గుర్తుంది కదా!"



"గుర్తుంది సార్! మా పెద్ద బాస్‌కి మనం మామూలిచ్చే రోజు ఇవ్వాళ."

ఆటోడ్రైవరు ఓ ప్లాస్టిక్ బ్యాగ్‌లో హొటల్నుంచి ఫలహారాలు తీసుకొచ్చాడు.

రాంబాబు జీప్‌లో కూర్చుని టిఫిన్ చేశాడు.

"ఈ హొటల్ వాడు కొంచెం నకరాలు చేస్తున్నాడు సార్! నిన్న మధ్యాహ్నం మా దోస్త్ వచ్చినప్పుడు టూ బై ఫోర్ చాయ్ తాగుదామని వెళితే బిల్ కట్టాల్సిందేనని కిరికిరి పెట్టాడు. రోజూ మాణింగ్ ఒక్కసారే కాఫీ ఫలహారం ఇస్తానుగానీ రోజంతా ఫ్రీగా యివ్వటం కుదరదని అందరిముందూ గలీజ్‌గా మాట్లాడాడు సార్!"

"అంత తల పొగరుగా వుంటే ఓ రోజూ హొటల్ ముందు రోడ్డు మీద పార్క్ చేసిన వాడి కస్టమర్సు స్కూటర్లు, కార్లు అన్నీ చలాన్ చేసి పడెయ్. రెండో రోజు వాడి కలెక్షన్ సగమయిపోతుంది."

"ఎస్సార్!" ఆనందంగా అన్నాడు బషీర్.

అతను ఫలహారం చేసేసరికల్లా బషీర్ ఫ్లాస్క్‌లో కాఫీ తెప్పించాడు.

"నాలుగు కేస్‌లు పట్టుకురా– త్వరగా వెళ్ళాలి."

"ఎస్సార్" అని ట్రాఫిక్ జంక్షన్ మధ్యకెళ్ళాడతను.

అయిదు నిమిషాల్లో అరడజను స్కూటర్లను తీసుకొచ్చి రాంబాబు ముందు నిలబెట్టాడు.

"ఇన్సూరెన్స్ నిన్నే ఎక్స్‌పైర్ అయింది సార్! రేపు రెన్యూ చేయిస్తాను" అన్నాడొకడు.

"అదేం కుదరదు. నూటయాభై చలాన్ కట్టు" కఠినంగా అన్నాడు రాంబాబు చలాన్ పుస్తకం కోసం వెతుకుతున్నట్లు నటిస్తూ.

రెండో కానిస్టేబుల్‌కి తనేం చేయాలో క్షుణ్ణంగా తెలుసు. ఆ స్కూటర్ వాడిని పక్కకు పిలిచాడు.

"ఓ యాభయ్ నాకిచ్చెయ్. ఇన్స్‌పెక్టర్‌గారికి తెలీకుండా వదిలేస్తాను."

అతను చప్పున యాభయ్ నోటు తీసిచ్చి స్కూటర్ డ్రైవ్ చేసుకెళ్ళిపోయాడు.

రాంబాబు టైమ్ చూసుకున్నాడు.

పదయింది.

ఇంకో గంట టైముంది బ్యాంక్ క్లోజ్ చేయడానికి.

అంత పోలీస్ ఇన్స్‌పెక్టరయినా అతని గుండె వేగంగానే కొట్టుకోసాగింది. చాలా పెద్ద రిస్క్ తీసుకుంటున్నాడు తను.

కానీ తప్పదు. అర్జంటుగా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలంటే అంతకంటే గత్యంతరం లేదు.

టైమ్ పదకొండయింది. రాంబాబు వెంటనే జీప్‌లో కూర్చుని స్టార్ట్ చేశాడు.

బషీర్ మళ్ళీ సెల్యూట్ కొట్టాడు.

"నేను ఓ రౌండ్ కొట్టి వస్తాను. జాగ్రత్త."

జీప్ నెమ్మదిగా వెళ్తోంది రోడ్డుమీద.

బ్యాంక్ దగ్గరకొచ్చాక స్లో అయింది.

కొద్దిదూరంలో పార్కింగ్ దగ్గర ఆపి ఓసారి చుట్టూ చూశాడు.

ఎవరూ తనని గమనించటం లేదు. బ్యాంక్ గేటు మూసివేశారు.

కొద్దిసేపు వెనుక డోర్ తెరచి వుంచుతారు లోపలివాళ్ళు వెళ్ళిపోడానికి. అతనికి చెమటలు పట్టేస్తున్నాయి.

ఇంకో అయిదు నిమిషాలు–

అంటే సరిగ్గా పదకొండున్నరకు వాళ్ళిద్దరూ దొంగిలింపబడిన స్కూటరు మీద వస్తారు.

అతను చూస్తూండగానే స్కూటర్ వచ్చి ఆగింది. ముందు విక్కీ స్కూటరు దిగాడు. ఎవరూ చూడకుండా వాడికి చేయి వూపాడు రాంబాబు. వాడు కూడా చేయి వూపి బ్యాంక్ వెనుక డోర్ వూపు వెళ్ళాడు. మరికొద్ది నిమిషాల తర్వాత రాణీ కూడా హాండ్‌బ్యాగ్‌తో లోపలకు నడిచింది.

రాంబాబుకి భయం పెరిగిపోతోంది.

అంతా సవ్యంగా జరిగేవరకూ టెన్షన్ తప్పదు.

ఇలాంటి బ్యాంక్ రాబరీల్లో విక్కీ పెద్ద ఎక్స్‌పర్టే.

అయినాగానీ రాణీకిది కొత్త. రాణీ ఇంతవరకూ కేవలం చీటింగ్ కేసుల్లోనే పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా దొంగనోట్లు చెలామణీ చేయటంలో రాణీని మించినవారు లేరు.

ఇంకో క్వాలిఫికేషనేంటంటే రాణీ చాలా సెక్సీ ఫిగర్.

ఛాన్స్ దొరుకుతే రాణీతో సెకండ్ సెటప్ ఏర్పాటు చేసుకోవాలని తన కోరిక.

కానీ రాణీలాంటి దాన్ని మెయింటెయిన్ చేయాలంటే మాటలు కాదు. నెలకు కనీసం యాభైవేలు ఆదాయం వుండాలి.

ఈ బ్యాంక్ రాబరీ ప్లాన్ సక్సెస్ అయితే అప్పుడింక ఏ సమస్యా వుండదు.

రాంబాబుకి భయం ఎక్కువయిపోతోంది.

జీప్‌లో కూర్చుని చకచక తన యూనిఫారం తాలూకూ షర్టు తీసేసి సివిల్ షర్టు వేసుకున్నాడు.

టైమ్ చూశాడు... పదకొండూ నలభై!

జీప్ స్టార్ట్ చేశాడు. బ్యాంక్‌కి పక్కనే వున్న పెద్ద చెట్టుకింద ఇంజన్ ఆఫ్ చేయకుండా



పార్క్ చేసాడు.

జీప్ నెంబరు ప్లేటు ముందే మార్చేశాడు.

ఏ క్షణాన్నయినా విక్కీ, రాణి పరుగుతో రావచ్చు. కొంచెం నగరానికి దూరంగా వున్న ఏరియా కావడంతో జనసమర్థం చాలా తక్కువగా వుంది.

ఒక్కసారిగా రివాల్వర్ కాల్పులు వినిపించినయ్ బ్యాంక్ భవనంలో నుంచి.

వరుసగా మూడు బులెట్స్.... 'అబ్బా' అన్న ఆర్తనాదం... కెవ్వున ఆడవాళ్ళ కేకలు......

మళ్ళీ వెంటనే నిశ్శబ్దం!

రాంబాబు గుండె నోట్లో కొచ్చినట్లనిపించింది.

భయం నరాల్లో నుంచి పాకుతోంది.

ఏం జరిగుంటుంది? కాల్పులెవరివి? విక్కీవా లేక సెక్యూరిటీ గార్డువా?

అంతలోనే ధైర్యం...

విక్కీ సామాన్యమయిన దొంగకాదు– డేర్ డెవిల్ రాబరర్! ఎన్నోసార్లు బ్యాంక్‌లు లూఠీ చేశాడు. కానీ కేవలం ఒక్కసారి మాత్రమే దొరికాడు.

అందుకే వాడిని ఎన్నుకున్నాడు తను.

మరుక్షణం పెద్దగా బ్యాంక్ అలారం వినిపించసాగింది. ఏం జరిగివుంటుంది? విక్కీ లొంగిపోయాడా వాళ్ళకు?

రాంబాబు కేం చేయాలో అర్థం కాలేదు.

ఆ సమయంలో తనక్కడ వుండటం ఎవరయినా చూస్తే తను చిక్కుల్లో పడతాడు. హఠాత్తుగా ఫ్రంట్ డోరు తెరచుకుంది. శరవేగంతో ముందు రాణి, వెనుక విక్కీ పరుగుతో రావటం చూసేసరికి రాంబాబుకి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది.

ఫస్ట్ గేరు వేశాడు.

జీప్ నెమ్మదిగా కదులుతోంది.

ముందు రాణీ ఎక్కేసింది వెనుకనుంచి.

జీప్ వేగం అందుకుంటూండగా విక్కీ కూడా ఎక్కేసి వెనుక కాన్వాస్ క్లోజ్ చేసేశాడు.

రాంబాబు జీప్ వేగం సడెన్‌గా పెంచేశాడు.

కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయతనికి.

అనుకున్న ప్రకారం క్షణాల్లో జీప్ ఓల్డ్ సిటీలో కొచ్చేసింది. సంతోషనగర్ సమీపంలో వుంది తాము వెళ్ళాల్సిన కాలనీ.

మెయిన్‌రోడ్ మీద నుంచి జీప్ కాలనీలోకి వేగంగా తిరిగేసరికి కల్నల్ కనకారావు తన కుక్క పిల్లను అప్పుడే రోడ్డు మీదకు గొలుసుతో తీసుకొస్తూ జీప్‌కి అడ్డం వచ్చేశాడు.

జీప్‌ని చూసి బెదిరిన కుక్కపిల్ల రోడ్‌కి ఒక వేపూ, కనకారావు మరొక వేపూ నిలబడాల్సి వచ్చింది.

రాంబాబుకి వళ్ళు మండిపోయింది కనకారావు మీద.

"కమాన్– ఆ కుక్కపిల్లను అడ్డం తియ్యవయ్యా" అన్నాడు కోపంగా.

"ఏయ్ మిస్టర్! డోంటాక్ రాట్! ఇక్కడ స్పీడ్ ముప్పైకి దాటకూడదన్న బోర్డు కనిపించలేదూ నీకు? ఆర్ యూ బ్లైండ్? రెసిడెన్షియల్ కాలనీలో ఇంత స్పీడా? ఇప్పుడే పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఫోను చేస్తా" అన్నాడు మండిపడుతూ.

రాంబాబుకి ఏం చేయాలో అర్థం కావటం లేదు.

ఆ కుక్కపిల్ల మీద నుంచే జీప్‌ని పోనివ్వాలని వుందిగానీ తమంతట తామే పోలీసులకి 'క్లూ' ఇచ్చినట్లవుతుంది.

విక్కీ చటుక్కున జీప్‌లోంచి దూకి కుక్కపిల్ల దగ్గరకొచ్చి అమాంతం దానిని రెండు చేతుల్తో ఎత్తి కల్నల్ వేపు విసిరేశాడు. 'కుయ్యో' మంటూ గావుకేకలు పెట్టసాగిందది.

జీప్ స్టార్టయింది.

విక్కీ మళ్ళీ పరుగుతో జీప్ ఎక్కేశాడు.

కల్నల్ ఇంగ్లీష్‌లో తిడుతూ గావుకేకలు పెడుతున్నాడు.

"బాస్టర్డ్స్! ఒక్క నిమిషం అగండ్రా... మీ జీప్‌నీ, మిమ్మల్నీ గన్‌తో కాల్చిపారేస్తాను" అంటూ రివాల్వర్‌తో రెండు రౌండ్లు కాల్చాడుగానీ అవి జీప్‌కి తగల్లేదు.

రాంబాబు శరవేగంతో జీప్ నడుపుతూ జీపులోని వైర్‌లెస్ ఆన్‌చేశాడు.

"హలో... హలో... హలో.... ఇన్స్‌పెక్టర్ రాంబాబు హియర్! అనుమానాస్పద పరిస్థితుల్లో ఒకడు ఒక జీప్‌ని డ్రైవ్ చేసుకుంటూ కూకట్‌పల్లి వేపు వెళుతున్నాడు. ఫాలో హిమ్– ఎలర్ట్ కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్" అన్నాడు మిస్‌లీడ్ చేస్తూ.

జీప్‌లో వెనుక కూర్చున్న విక్కీ ఉలిక్కిపడ్డాడు.

"అదేంటి గురూ! అలా ఎందుకు చెప్పావ్?"

"క్రైమ్ పద్ధతినిబట్టీ, బ్యాంక్‌వాళ్ళు చెప్పే వర్ణనలను బట్టి రాబరీ చేసింది నువ్వేనని మా వాళ్ళకు తేలిగ్గా తెలిసిపోతుంది. నీ కోసం వెతుకుతూ అందరూ కూకట్‌పల్లి ఏరియా చుట్టుముడతారు. మనమిక్కడ సేఫ్" అన్నాడు రాంబాబు.

విక్కీకి అతని మాటలు అనుమానం కలిగించాయి.

జీప్ ఇప్పుడు ఇంకో ఏరియాలో ప్రవేశించింది.

కొత్తగా కడుతున్న కాలనీ అది.

అక్కడక్కడ ఓ ఇల్లు కనబడుతోంది.



"ప్లాన్ సెంట్ పర్సెంట్ సక్సెసేనా?" అడిగాడు రాంబాబు.

"విక్కీ యా మజాకానా? బ్యాక్ డోర్ ఎంట్రీ, ఫ్రంట్ డోర్ ఎగ్జిట్ మన స్పెషాలిటీ గురూ!" గర్వంగా అన్నాడు విక్కీ.

రాణీ విక్కీ చేతిని అందుకుని ముద్దుపెట్టుకుంది.

"ఆఖర్లో సెక్యూరిటీవాడు నేను అమ్మాయిని కదాని కొంచెం ఎడ్వంచర్ చేయడానికి ప్రయత్నించాడు. నేను రెండు బులెట్స్ వాడి మోకాళ్లోకి దించాకగానీ వాడికి అర్థం కాలేదు నా లెవలేంటో" అంది రాణి.

"మరి మూడు బులెట్స్ శబ్దాలు వినిపించాయేమిటి?"

"ఎందుకయినా మంచిదని ఒకటి మేనేజర్ నెత్తికి రెండంగుళాల పైన వదిలాను దెబ్బకు అన్‌కాంషస్ అయిపోయాడు.

జీప్ ఓ అందమయిన ఇంటిముందాగింది.

ఇంటికి తాళం వేసి వుంది. తాళం ఓపెన్ చేశాడు.

ముగ్గురూ లోపలకు నడిచారు.

విక్కీ బుర్రంతా ఆలోచనల్లో కిక్కిరిసిపోయి వుంది.

రాంబాబు వైర్‌లెస్‌లో చెప్పిన వివరాలు అతనిలో అనుమానాలను రగిలించాయి.

తనను ఎలాగయినా పోలీసులకి పట్టిచ్చి రాంబాబే వజ్రాలను కాజేయాలని ప్లాన్ చేసినట్లు అనుమానంగా వుంది.

లేకపోతే అలా చెప్పాల్సిన అవసరం లేదు.

"ఒరే రాంబాబూ! నువ్వు పోలీసోడివయితే నేను దొంగన్రా! పోలీసోడు ఎప్పటికయినా దొంగలు కనిపెట్టే కొత్త కొత్త టెక్నిక్‌ల గురించి అంతా అయిన తర్వాత నేర్చుకోవలసిందేగానీ, దొంగలను పట్టుకోడానికి కొత్తటెక్నిక్‌లు కనిపెట్టడం మీ వల్ల కాదురా" అనుకున్నాడు లోలోపల.

"ఎన్ని వజ్రాలున్నాయ్?"

"తెలీదు... మొత్తం బాక్స్ కొట్టుకొచ్చేశాం" అంది రాణి.

ముగ్గురూ బాక్స్ తెరచి చూశారు.

రెండు వజ్రాలున్నాయి.

అవి ఒకోటీ కనీసం పాతిక కోట్లుంటుందని తను న్యూస్‌పేపర్లో చదివాడు చాలా కాలం క్రితం.

రాంబాబు కళ్ళు జిగేల్‌మన్నాయి వాటిని చూసేసరికి.

అదంతా నిజమని నమ్మబుద్ధి కావటం లేదు.

కేవలం ఓ చిన్న రిస్క్‌తో కోటీశ్వరుడయ్యే అవకాశాలు బోలెడున్నాయి ఈ లోకంలో.

రాంబాబు హాల్లో ఇనప్పెట్టె తెరిచాడు తాళం చేతితో.

"బాక్స్ లోపల పెట్టెయ్" రాణికి చెప్పాడు.

రాణీ బాక్స్ లోపల పెట్టగానే తిరిగి తాళం వేసేశాడతను.

"తాళం చెవి నాకివ్వు గురూ" అడిగాడు విక్కీ.

"ఎందుకు?"

"నీ మీద నాకు నమ్మకం లేదు. ఎందుకంటే నువ్వు పోలీసువి. ఏ క్షణంలోనయినా నన్ను మోసం చేసి ఆ వజ్రాలు నువ్వు కాజేస్తావని నాకు అనుమానం"

రాంబాబు నవ్వాడు.

"ఒరేయ్! అనుమానించటం మా డిపార్ట్‌మెంట్ పనిరా! దొంగల పనికాదు. ఎవడి డ్యూటీ వాడు చేస్తేనే బాగుంటుంది. అదీగాకుండా నీ బుద్ధి ఒరిజనల్‌గానే దొంగబుద్ధని నాకు తెలుసుకదా. మర్యాదగా బయటకు పద– మనం ముగ్గురం ఈ పోలీసుల హడావుడి తగ్గాక ఒక రోజు ఇక్కడే కలుసుకుని ఆ వజ్రాలు అమ్మేసి సమంగా పంచుకుని ఎవరి దారిన వాళ్ళు ఆనందంగా గడుపుదాం– ఓ.కె?"

రాంబాబు తలూపాడు.

విక్కీకి లోలోపల అనుమానం మరింత బలపడింది.

రాంబాబు బ్రెయిన్లో చెడ్డ ఆలోచన వుంది. లేకపోతే తల అన్ని సార్లు వూపాల్సిన అవసరం లేదు. తన తండ్రి ఎప్పుడూ ఒకేమాట చెప్తూండేవాడు.

"ఒరే విక్కీ! ఎవడ్నయినా నమ్ముగానీ పోలీసోడిని మాత్రం నమ్మకురా– సర్వనాశనం అయిపోతావ్"

మొదట్లో తండ్రి మాట అబద్ధమని కొట్టిపారేశాడు గానీ అనుభవం మీద అది గోల్డెన్ రూల్ అన్న విషయం తెలిసొచ్చింది.

అందుకే రాంబాబు విషయంలో ఇంతగా ఆలోచిస్తున్నాడు.

తనను జైలు నుంచి స్వయంగా విడిపించి "ఒరే విక్కీ! ఈ చిల్లర దొంగతనాలు ఎంతకాలం చేస్తావురా? నేనో ప్లాన్ చెప్తా– చేశావంటే నువ్వూ నేనూ కూడా కోటీశ్వరులయిపోవచ్చురా. ఆ డబ్బుతో నువ్వు ఎలక్షన్లలో నిలబడి గెల్వచ్చు. లేదా బిజినెస్ చేసుకోవచ్చు. పోలీసుల చేతిలో పడే గొడవంతా వదిలిపోతుంది" అని చెప్పాడు రాంబాబు.

తను వెంటనే వప్పుకున్నాడు.

అప్పుడు ఈ బ్యాంక్ రాబరీ గురించి చెప్పాడు రాంబాబు.

ఆ బ్యాంక్‌లో ఒక కస్టమర్ వజ్రాలు దాచుకున్నట్లు తనకు ఇన్‌ఫర్‌మేషన్ వచ్చిందనీ,



తను లోపల వ్యవహారం చూసుకుంటే అతను బయట వ్యవహారం చూసుకుంటాడనీ అన్నాడు.

లోపల తనకో అసిస్టెంటు అవసరం వుంటుందన్నాడు తను.

రాంబాబు అప్పుడు లాకప్‌లో వున్న రాణిని విడిపించుకొచ్చాడు.

రాణి వేగం తనకు నచ్చింది.

జీవితాంతం రాణి తన పక్క నుంటే వరల్డ్ బ్యాంక్‌ని కూడా ఖాళీ చేసేయ వచ్చనిపించింది.

ముగ్గురూ ఇంటికి తాళం వేసి బయటికొచ్చారు.

హఠాత్తుగా విక్కీ మీదకు తాళం చేతులు విసిరేడు రాంబాబు.

విక్కీ ఆశ్చర్యంగా చూశాడు.

"తాళం చేతులు నీకెందుకిచ్చానో తెలుసా?"

"ఎందుగ్గురూ?"

"దొంగకు తాళం చేతులిమ్మని పెద్దలన్నారు కాబట్టి. తాళం చేతులిస్తే వాడి చేతులు కట్టేసినట్లేనట" పగలబడి నవ్వుతూ అన్నాడు.

రాణీ కూడా అతనితోపాటు నవ్వేయసాగింది.

"జీపెక్కండి– మీ యిద్దర్నీ మెయిన్‌రోడ్ దగ్గర వదిలి నే వెళ్ళిపోతాను."

ఇద్దరూ జీపెక్కారు.

మెయిన్‌రోడ్ దగ్గరకు రాగానే జీప్ ఆపి వాళ్ళిద్దర్నీ దింపేశాడు.

"ఒరే విక్కీ! ఇద్దరూ వారానికో రోజు నాకు ఫోన్ చేస్తూండండి. అంతా సవ్యంగా వుందనుకున్నప్పుడు ముగ్గురం ఈ ఇంటి దగ్గరే కలుసుకుని సొమ్ము పంచుకుందా– సరేనా?"

ఇద్దరూ ఆనందంగా తలూపారు.

జీప్‌స్టార్ట్ చేస్తూంటే రాణి రాంబాబు వంక చూసి కన్నుకొట్టింది.

రాంబాబు వులిక్కిపడ్డాడు.

అది తనకంటే ఫాస్ట్‌గా వున్నట్లుంది.

"రాణీ! నువ్వు రేపే ఫోన్ చెయ్యి."

"అలాగే సార్."

వాళ్ళ కోడ్ విక్కీకి అర్థమైంది. తన పిచ్చిగానీ రాణిలాంటిదాన్ని రాంబాబు వదుల్తాడా?

వాళ్ళిద్దరూ చెరో దారి వెళ్ళిపోగానే తను మళ్ళీ యూనిఫారం వేసుకుని జీప్ నెంబర్

ప్లేట్ తీసి తుప్పల్లో పారేసి ఒరిజినల్ ప్లేట్ ఫిట్ చేసుకుని స్టార్ట్ చేసుకుని హెడ్ క్వార్టర్స్ వైపు బయలుదేరాడు.

రాంబాబు వైర్‌లెస్‌తో అంతా అల్లకల్లోలంగా వుంది.

తను పారేసిన నెంబర్ ప్లేట్‌గల జీప్‌కోసం వెతకమని అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ ఇన్‌స్ట్రక్షన్స్ వెళ్తున్నాయి.

రాంబాబు గుండె ఝల్లుమంది.

తన జీప్ నెంబరెలా దొరికింది వాళ్ళకు?

బ్యాంక్ వాళ్ళు చూసే అవకాశం లేదు.

ఇంకెవరు కనిపెట్టి వుంటారు?

కొంతదూరం వెళ్ళేసరికి పెట్రోల్ వాన్ ఎదురొచ్చింది.

లోపల ఏ.సి.పి. కనిపించేసరికి జీప్ దిగి సెల్యూట్ కొట్టాడు రాంబాబు.

"నీ కోసమే వెతుకుతున్నా రాంబాబూ! వేర్ యూ హావ్ గాన్?"

"నాకు ఇన్‌ఫర్మేషన్ వచ్చింది సార్! ఆ బ్యాంక్ రాబరర్స్ వుపయోగించిన జీప్ ఇటే వెళ్ళిందని."

"ఎక్కడైనా కనిపించిందా?"

"లేద్సార్! కానీ ఆ విక్కీగాడు ఒక జీప్ డ్రైవ్ చేసుకుంటూ రాష్‌గా వెళ్ళడం నేను గంటక్రితం చూశాను. బహుశా వాడే బ్యాంక్ రాబరీ జేసి వుంటాడు."

"విక్కీ యా? అనుమానం లేదు. ఇది ఖచ్చితంగా వాడి పనే అయి వుంటుంది. బ్యాంక్ రాబరీ చేసిన పద్ధతి కూడా అచ్చం వాడు ఫాలో అయ్యే పద్ధతే. కమాన్- మెసేజ్ ఫ్లాష్ చేయండి. విక్కీ కోసం ఛేజ్ మొదలుపెట్టమనండి" అరిచాడు ఏ.సి.పి.

వాన్ వెళ్ళిపోయింది.

వెనుకే జీప్ కూడా బయల్దేరింది.

రాంబాబు తనలో తను ఆనందంగా నవ్వుకున్నాడు.

విక్కీ పోలీసుల చేతి నుంచి తప్పించుకోవటం ఇంపాజిబుల్. బహుశా తెల్లారేసరికల్లా లాకప్‌లో వుంటాడు. వాడే బ్యాంక్ రాబరీ చేసినట్లు దొంగ సాక్ష్యాలను తను ఏర్పాటు చేశాడంటే కనీసం పదేళ్ళు జైల్లో వుంటాడు.

తనూ, రాణీ ఆ వజ్రాలు తీసుకుని హాయిగా జీవితం ఎంజాయ్ చేస్తారు.

◦ ◦ ◦

రాంబాబు జీప్‌లో అటు వెళ్ళాడో లేదో విక్కీ ఛటుక్కున వెనక్కి తిరిగి పరుగుతో అడ్డదారిన మళ్ళీ ఆ ఇంటి దగ్గరకు చేరుకుని తలుపు తాళం తెరచి లోపలికెళ్ళి ఇనప్పెట్టె



తెరుస్తూంటే- వెనుక గాజుల చప్పుడు వినిపించింది. అదిరిపడి వెనక్కు తిరిగి చూశాడు.

రాణి........

"ను.... ను... నువ్వా?" అన్నాడు కంగారుగా.

"నువ్విలాంటి వెధవపని చేస్తావని నాకు ముందే తెలుసు" అంది రాణి.

"రాణీ! ఆ ఇన్స్‌పెక్టర్ రాంబాబు మీద నాకు నమ్మకం లేదు. మనకంటే ముందే వచ్చి వీటిని కాజేస్తాడని నాకు తెలుసు. అందుకని నేనే కాజేస్తున్నాను."

"ఓ-అలాగా!"

"నీ షేర్ నీ కిచ్చేస్తాను రాణీ."

"షేర్ అంటే ఎంత?"

"నీకు పాతికయితే నాకు డెబ్బయ్ అయిదు."

"ఆడపిల్లలక్కూడా ఇప్పుడు ఆస్తిలో సమాన వాటా వుందని పేపర్లో రాశారు- చదవలేదా?"

"నేను న్యూస్‌పేపర్లు చదవను."

"ఆడెడె... ఆ సంగతి తెలిస్తే ఆడపిల్లలకు 75 శాతం ఆస్తి చెందుతుందని రాసినట్లు చెప్పేదానినే."

"సరే! ఫిఫ్టీ ఫిఫ్టీ..."

అతను సేఫ్‌లో నుంచి వజ్రాల బాక్స్ తీశాడు.

సరిగ్గా అప్పుడే వినిపించింది పోలీస్ సైరన్.

"రాణీ! కమాన్ పరుగెత్తు. ఎవర్దారి వాళ్ళు వెళ్ళిపోదాం. ఇంకాసేపయ్యాక మా ఇంటికిరా- నీ సగం వాటా నీకిచ్చేస్తాను" అనేసి బాక్స్‌తో బయటకు పరుగెత్తాడు. దూరంగా పోలీస్ వాన్ కనిపించిందతనికి. ఎలా పారిపోవాలా అని చుట్టూ చూశాడు.

ఇంటి ముందు స్కూటర్ మీద కూర్చుని హారన్ కొట్టి భార్యను పిలుస్తున్నాడు ఓ యువకుడు.

"ఒసేయ్! కమాన్. ఎంతసేపు? నీ అలంకారం తగలబడినట్టేవుంది. త్వరగా తగలడు" అంటూ అరుస్తూండగానే ఆ బాక్స్‌తో అతని నెత్తిన కొట్టాడు విక్కీ.

కిక్కురుమనకుండా కింద పడిపోయాడతను.

వెంటనే ఆ స్కూటర్ తీసుకుని స్టార్ట్ చేసుకెళ్ళిపోయాడు విక్కీ.

సందుల్లోనుంచి తిరిగి తిరిగి మెయిన్‌రోడ్ మీదకు చేరుకునేసరికి అప్పుడే వస్తున్న మరో పోలీస్ జీప్ కనిపించింది.

ఒక్కసారిగా స్కూటర్ వేగం పెంచాడతను.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఎర్ర సిగ్నల్‌లో దాటేసరికి ట్రాఫిక్ పోలీస్‌కి అనుమానం వచ్చేసింది. ఆ పక్కనే నిలబడ్డ ఇన్స్‌పెక్టర్ బుల్లెట్ స్టార్ట్ చేసి వెంటపడ్డాడు.

కొంతదూరం వచ్చాక స్కూటర్ రోడ్ పక్కన వదిలి సందులోకి పరుగెత్తి అక్కడ ఆపి వున్న ఆటో ఎక్కి తనే డ్రైవ్ చేసుకుంటూ తనింటికి సమీపంగా చేరుకున్నాడు.

ఆటో రోడ్‌మీద ఆపి ఇంటివేపు నడవసాగాడు నెమ్మదిగా.

ఉండుంది వెనక్కు తిరిగి చూస్తున్నాడు. ఎవరయినా వెంటాడు తున్నారేమోనని.

సడెన్‌గా అతి సమీపంలో పోలీస్ సైరన్ వినిపించేసరికి అతనికి అర్థమయింది.

తనింటిమీదకే వస్తున్నారు వాళ్ళు.

పరుగుతో ఇంటికి చేరుకుని తలుపు తట్టాడు.

అతని అసిస్టెంట్ వీర్రాజు తలుపు తెరిచాడు.

లోపలకు దూరి తలుపులు గడవేసేశాడు.

వీర్రాజు ఆశ్చర్యంగా చూశాడు.

"పోలీసులొచ్చారా?" ఆతృతగా అడిగాడు విక్కీ.

"అవును బాస్"

"ఎప్పుడు?"

"ఇంతకుముందే"

"సరే సరే! నువ్వెళ్ళి ఆ కిటికీ దగ్గర నిలబడి చూస్తూండు. వాళ్ళొస్తే నాకు సైగ చెయ్..."

వీర్రాజు వెళ్ళి కిటికీ దగ్గర నిలబడి రోడ్‌వేపు చూడసాగాడు.

విక్కీకి అర్థమయిపోయింది.

తన తండ్రి చెప్పినంతా అయింది.

పోలీసుని నమ్మి మళ్ళీ మోసపోయాడతను.

కానీ వజ్రాలు తను రాంబాబుకి తెలీకుండా కాజేయటం ద్వారా.... పోలీసోడికి భలే చక్కని గుణపాఠం కూడా నేర్పాడు.

తనను వజ్రాల చోరీ కేసులో ఎలాగైన జైలుకి పంపిస్తే- ఆ తరువాత వజ్రాలు తనే కాజేయవచ్చని ప్లాన్ వేశాడు రాంబాబు.

వీర్రాజు బిగ్గరగా అరిచాడు.

"బాస్! పోలీస్...."

విక్కీకి అర్థమయిపోయింది.

తన దగ్గరున్న వజ్రాలు ఏమయినాసరే పోలీసులకు దక్కడానికి వీల్లేదు. తన కష్టార్జితం



అవి. చెమటోడ్చి లాకర్ ఓపెన్ చేసి సంపాదించిన ఆస్తి అది. అల్లా టప్పాగా, అప్పనంగా వచ్చింది కాదు.

బాక్స్‌లోని వజ్రాలు తీసి హాల్లోని చేపల ఎక్వేరియంలో పడేశాడు.

నీళ్ళ అడుగున్న వున్న రంగురంగుల రాళ్ళలో కలిసిపోయినాయ్ వజ్రాలు.

మరుక్షణం పెరట్లో నుంచి లోపలికొచ్చారు పోలీసులు.

విక్కీని చూస్తూనే గన్ గురిపెట్టారు.

"చేతులు పైకెత్తి బయటకు పద" అరచాడొక ఇన్స్‌పెక్టర్.

విక్కీ బయటకు నడిచాడు. వీర్రాజు దీనంగా వెనుకే వచ్చాడు- "దిగులు పడకురా తంబీ! వెంటనే వచ్చేస్తాన్లే..."

వీర్రాజు హాపీగా ఫీలయ్యాడు. బాస్ జైలుకెళ్తే ఆ వజ్రాలు తను కాజేయవచ్చు.

వాడికి తనంటే విపరీతమయిన ప్రేమ, గౌరవం.

పోలీస్‌స్టేషన్ చేరుకున్నాడు విక్కీ.

తనను చిత్రహింసలు చేయనీగాక- వజ్రాలు ఎక్కడ దాచింది. ఛస్తే నోరు విప్పడు. రెండ్రోజుల తర్వాత వీర్రాజుకి చెప్తాడు. వాడు వాటిని జాగ్రత్తగా దాస్తాడు. తను జైలు నుంచి విడుదల అయేవరకూ.

✪ ✪ ✪

భజన్‌రావు కాఫీ ఫలహారం తెచ్చి డైనింగ్ టేబుల్ మీదుంచాడు. బెడ్‌రూమ్ దగ్గరకు నడిచి గట్టిగా అరచాడు.

"ఇదిగో- కాఫీ ఫ్లాస్కులో వుంది. ఫలహారం హాట్ పాక్‌లో వుంది. ఇప్పుడొస్తే నే వడ్డిస్తా. మళ్ళీ వంటింట్లో కెళ్ళానంటే మీరు అరచి గీ పెట్టినా రాను. ఆనక మీ యిష్టం."

"వచ్చేస్తున్నాం.... వచ్చేస్తున్నాం..." కంగారుగా అన్నాడు గోపాల్రావు.

సీతకు వళ్ళు మండిపోయింది.

"వాడి బెదిరింపులేమిటో నాకర్థం కావటం లేదు. వాడిని బయటకు గెంటేయాలనుంది నాకు."

"మరి మనకి వంటెవరు చేస్తారు?"

"హొటల్లో తిందాం. వీడికిచ్చే జీతం, వీడికయే ఖర్చు లెక్కేస్తే మాంఛి హొటల్లోనే రెండు పూట్లా భోజనం చేయవచ్చు"

"అదో పెద్ద ప్రాబ్లమ్ అయిపోతుంది సీతా మనకి. ఇరవై నాలుగ్గంటలూ హొటల్ చుట్టూ తిరిగడానికే సరిపోతుంది మనకు."

"నన్ను మీరేం గెంటనక్కర్లే- నేనే మర్యాదస్తుల ఇల్లు చూసుకుంటాన్లెండి.

మీలాటోళ్ళ దగ్గర పని చేయటం నాకు హెడేక్‌గానే వుంది" బయటనుంచీ అన్నాడు భజన్‌రావు.

సీత వాడి చెంప వాయగొడతానికి ఆవేశంగా బయటకు నడిచిందిగానీ గోపాల్రావు పరుగుతో వెళ్ళి ఆమెకు అడ్డుపడ్డాడు.

"సీతా ప్లీజ్! ఫుడ్‌కి ప్రాబ్లమ్ అయిపోతుంది."

సీతా శాంతించింది.

ఇద్దరూ ఫలహారం తీసుకుని కాఫీ తాగారు.

"సాయంత్రం ఆఫీస్ నుంచి పెందలాడే వస్తావ్ కదూ?"

"ఓ! అయిదున్నరకల్లా వాల్తాను."

"ఇంకొంచం ముందుగా రాలేవా? నాలుగ్గంటలకు."

"రావచ్చనుకో. కానీ ఎందుకు?"

ఫోన్ మోగిందప్పుడే.

పరుగుతో వెళ్ళి ఫోన్ అందుకుందామె.

"హల్లో డాడీ! హౌ అర్ యూ?" అంది ఆనందంగా.

"ఫైన్ బేటీ! విష్ యూ ఎ హాపీ అండ్ లవ్‌లీ బర్త్‌డే."

"ఓ! థాంక్యూ డాడీ! మీరూ, మమ్మీ ఎప్పుడొస్తున్నారు డాడీ?"

"ఈవెనింగ్ కేక్ తీసుకుని వస్తున్నాం బేటీ! ఈసారి ఎంత కాస్ట్‌లీ కేక్ ఆర్డరిస్తున్నామో తెలుసా? టెన్ థౌజెండ్ రూపీస్ కేక్."

"మైగాడ్! టెన్ థౌజెండ్ రూపీస్ కేక్!"

"ఎస్ బేటీ! మీ ఫ్రెండ్స్ అందరినీ పిలిచావా?"

"ఎక్కువమంది లేరు డాడీ! ఓన్లీ ఫైవ్ ఫామిలీస్."

"వెరీ నైస్! డిన్నర్ ఇంట్లో చేయిస్తున్నావా?"

"నో డాడీ! భజన్ రావుగాడిని నమ్ముకుంటే కొంప కొల్లేరయిపోతుంది. అందుకని ఫైవ్‌స్టార్ హెూటల్‌కి ఆర్డర్ చేస్తున్నాను."

ఫోన్ డిస్కనెక్ట్ చేయగానే ఆదరంగా సీతను దగ్గరకు తీసుకున్నాడు గోపాల్రావ్.

"అయితే నాకు చెప్పకుండానే బర్త్‌డే చేసుకుంటున్నావన్న మాట"

"అందుకేగా మిమ్మల్ని సాయంత్రం నాలుగింటికి రమ్మంది"

'ఓ.. అదా సంగతి. ఎనివే... విష్ యూ హాపీ అండ్ రోమాంటిక్ బర్త్ డే సీతా!"

"ష్... అవతల భజన్ రావుగాడు.."

"ఉంటే ఏం లెండి- వాడో మనిషి కింద లెక్కా ఏమైనానా? ఇంతకూ



మధ్యాహ్నానికయినా భోజనం తయారు చేయాలా... ఫైవ్‌స్టార్ హెూటల్ నుంచి తెప్పించుకుంటారా?" అడిగాడు భజన్‌రావు.

"మధ్యాహ్నం నువ్వే చేయాలి" కోపంగా అంది.

"ఆ మాటే నోటి నుంచి రాలితే ముత్యాలు రాలిపోతాయా? ప్రపంచంలో ఎవరికీ కొత్తగా పెళ్ళవనట్లు, ఈవిడగారొక్కరికే అయినట్లు" అనుకుంటూ వెళ్ళిపోయాడు.

"చూడండి... వీడు నా పేషెన్స్ పరీక్షిస్తున్నాడు."

"నీదేకాదు, అందరిదీ."

అతను రడీ అయి ఆఫీస్‌కెళ్తూంటే అతనితోపాటు బయటి వరకూ వచ్చిందామె.

"నేను చెప్పినవన్నీ గుర్తున్నాయిగా?"

'ఓ! ఫైవ్‌స్టార్ హెూటల్ నుంచి ఇరవైమందికి డిన్నర్ హెూమ్ డెలివరీ ఆర్డరివ్వాలి, ఆ తర్వాత దేవిగారికి ఓ మాంఛి గిఫ్టు, ఇవిగాక ఓ అందమయిన పూలదండ. అంతేకదా?"

"అసలయింది మర్చిపోయారు. చూశారా?"

"ఏమిటది?"

"సాయంత్రం నాలుగ్గంటకల్లా ఇంటికి రావటం."

"ఓ! ఐయామ్ సారీ... తప్పకుండా వచ్చేస్తాను."

గోపాల్రావ్ ఆఫీస్ కొచ్చేశాడు.

వస్తూనే రిసెప్షన్‌లో కొత్త అమ్మాయి కూర్చుని ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు.

"హలో! మీరు కొత్తగా వచ్చారా?" వద్దనుకుంటూనే అడిగాడు.

"అవున్సార్!" చిరునవ్వుతో అంది.

అహా! ఎంత బ్యూటిఫుల్‌గా వుంది నవ్వుతూంటే.

"ఐయామ్ గోపాల్- వైస్ ప్రెసిడెంట్ సేల్స్."

"గ్లాడ్ టు మీట్ యూ సర్! మైనేమ్ ఈజ్ సురేఖా."

"ఒండర్‌ఫుల్ నేమ్. మీకో విషయం చెప్పనా?"

"వెల్‌కమ్ సర్."

"యూ ఆర్ వెరీ బ్యూటిఫుల్."

"ఓ... థాంక్యూ సర్."

గోపాల్రావ్ తన ఛాంబర్లోకి వచ్చేశాడు.

సీట్లో కూర్చున్నాక ఆశ్చర్యం కలిగింది.

కొద్దిగంటల క్రితమే తను చెంపలు వేసుకున్నాడు. ఇంక జన్మలో ఏ ఆడపిల్లతోనూ మాట్లాడకూడదని, ఇంకెప్పుడూ సీతకు కోపం తెప్పించకూడదని.

కానీ ఎదురుగా ఆడపిల్ల కొంచెం ఎట్రాక్టివ్‌గా కనిపించేసరికి మొత్తం గాలికొదిలేశాడు.

లోలోపల భయం వేసిందిగానీ అంతలోనే ధైర్యం తెచ్చుకున్నాడు.

తన భ్రమగానీ ఆఫీసులో విషయాలు సీతకెలా తెలుస్తాయ్?

లైఫ్‌లో ఈ మాత్రం ఎడ్వెంచర్ లేకపోతే ఎలా? అతనికి రాత్రి ఎగ్జిబిషన్‌లో జరిగిన సీన్ కళ్ళముందు కనిపించింది.

"నో... వద్దు... ఎ బర్డ్ ఇన్ హాండ్ ఈజ్ వర్త్ టూ ఆర్ త్రీ ఇన్ ది బుష్."

ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ విజయ్ వచ్చాడు హడావుడిగా.

"గురూ– సిగరెట్."

గోపాల్రావ్ సిగరెట్ యిచ్చాడు.

"ఆ రోజు మా ఇంట్లో పార్టీ కొచ్చినప్పుడు మా ఇంటి కెదురుగా కనిపించిన బ్యూటీక్వీన్ గుర్తుందా?" సిగరెట్ వెలిగించుకుని అన్నాడు.

"భలే ఫిగర్ గురూ! ఎలా మర్చిపోతాం?"

"ఆ ఫిగర్తో నిన్న సినిమాకెళ్ళాను."

గోపాల్రావు అదిరిపడ్డాడు.

"నో... నేన్నమ్మను."

"నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఒకటే."

"కానీ ఇంటి కెదురుగా వ్యవహారం– మీ మిసెస్‌కి తెలిస్తే?"

"తెలిస్తే తెలీనీ గురూ! నాల్రోజులు గొడవచేసి వూరుకుంటుంది. దాని కోసమని లైఫ్‌లో స్వీట్ ఎఫైర్స్ ఎలా వదులుకుంటాం–"

"అదృష్టవంతుడివి.. మీ మిసెస్ నాల్రోజుల గొడవతో వదిలేస్తుంది. మా మిసెస్ భూమీ ఆకాశం ఒకటి చేసేసి ఆ తర్వాత అవి రెండూ జన్మలో కలుసుకోకుండా విడగొట్టేసి ముక్కలు ముక్కలు చేసేస్తుంది."

"పెళ్ళయిన కొత్తలో అలాగే వుంటార్లే– తర్వాత నార్మల్ అయిపోతారు."

అతను వెళ్ళిపోయాడు.

గోపాల్రావు ఆఫీస్ వర్కులో పడిపోయాడు.

సరిగ్గా మూడింటికి ఆఫీస్ నుంచి బయటపడ్డాడు.

ఓ గంటసేపు షాపింగ్ చేసి సీత బర్త్‌డే గిఫ్ట్ కొనుక్కుని ఇంటి కెళ్ళిపోవటమే.

మిగతా ఏర్పాట్లన్నీ ఫోన్ మీద చేసేశాడు.

షాపింగ్ కాంప్లెక్స్ దగ్గరకొచ్చే సరికి కొత్తగా ఓపెన్ చేసిన ఐస్‌క్రీమ్ గార్డెన్ పార్లర్‌లో



ఓ అందమయిన అమ్మాయి ఒంటరిగా ఐస్‌క్రీమ్ తింటూ కూర్చోవటం చూసి కొంచెం టెంప్ట్ అయ్యాడు.

అదివరకులాగా అమ్మాయిలను పలుకరించకపోయినా, ఆ అమ్మాయిల పక్కన కూర్చుని అందాల్ని ఆస్వాదించటంలో తప్పు లేదనిపించిందతనికి.

నెమ్మదిగా వెళ్ళి ఆమెకు సమీపంగా ఉన్న ఖాళీ బెంచ్ మీద కూర్చున్నాడు.

బేరర్ వచ్చి మెనూ కార్డ్ యిచ్చాడు.

* * *

ఇన్స్‌పెక్టర్ రాంబాబుకి వెంటనే తెలిసిపోయింది. విక్కీని పోలీసులు అరెస్ట్ చేశారని. ఎక్కడలేని ఆనందం కలిగిందతనికి.

ఇంక ఆ వజ్రాలన్నీ తనవే– అడ్డు కాస్తా తొలగిపోయింది.

మధ్యాహ్నం రెండు గంటలకు వజ్రాలు దాచిన ఆ ఇంటి దగ్గరకు చేరుకుని డూప్లికేట్ తాళం చేతులతో ఇనుపపెట్టె ఓపెన్ చేసి, లోపల ఖాళీగా కనిపించేసరికి– షాక్ తిన్నాడు.

వెనుక నుంచి కిలకిల నవ్వు వినిపించి అదిరిపడి వెనక్కు తిరిగాడు.

రాణి విరగబడి నవ్వుతోంది.

"ఇన్స్‌పెక్టర్‌గారూ! తెలివితేటలు మీ బాబుగాడి సొంతం కాద్సార్! విక్కీ మీకన్నా రెండు రాబరీలు ఎక్కువ చదివిన వాడు."

"అంటే?"

"మీకన్నా ముందే కాజేశాడు."

"నీకెలా తెలుసు?"

"మరీ ఇంత బిలో యావరేజ్ పోలీసేమిటి సార్ మీరు? ఎలా తెలుసేమిటి? ఇనప్పెట్టె ఖాళీగా కనిపిస్తుంటే అర్థం ఇదే కదా?"

రాంబాబు ముఖం పాలిపోయింది.

కోపం, నిస్సహాయతలో కొద్ది క్షణాలు ఏమీ మాట్లాడలేకపోయాడు.

హఠాత్తుగా రాణివైపు అనుమానంగా చూశాడు.

"నువ్వెలా వచ్చావిక్కడికి?"

"అదిగో పోలీస్ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. నీ మీద నమ్మకం లేక నిన్నే కనిపెడుతున్నాను. నువ్వు జీప్‌లో ఇటు తిరిగేసరికి నాకర్థమైపోయింది. నువ్వు విక్కీకన్న పెద్ద దొంగవని! మా ఇద్దరికీ హాండిచ్చి వజ్రాలు కొట్టేయబోతున్నావని. అందుకని ఆటోలో వెంటపడి వచ్చాను."

రాంబాబుకి రాణి మొహంలోకి చూడాలంటే భయం వేసింది.

"విక్కీగాడు నాకే చెక్కా యిచ్చాడన్నమాట."

"పొద్దున్న మనం అటు వెళ్ళగానే వాడిటు వచ్చి కాజేసుంటాడు."

"ఇప్పుడేమిటి చేయటం?" నిరాశగా అడిగాడు.

"నీకెందుకు చెప్పాలి...? మనిద్దరం వేరే సెటప్ పెట్టుకుని లైఫ్ ఎంజాయ్ చేద్దాం అని చెప్పి నాకే హేండివ్వడానికి రడీ అయావంటే నువ్వు ఎంత కేడీ నెంబర్ వన్వో తెలుస్తోంది."

"రాణీ! నిజం చెపుతున్నాను. విక్కీని మోసం చేద్దామనుకున్నాను గానీ నిన్ను మోసం చేయాలనుకోలేదు."

"దబులాక్షనొద్దు. పద విక్కీ ఇంటికెళదాం... ఇంట్లోనే ఎక్కడో దాచి వుంటాడు."

ఇద్దరూ జీప్లో విక్కీ ఇంటికి చేరుకున్నారు.

వీర్రాజు వాళ్ళను చూస్తూనే కంగారుపడ్డాడు.

"విక్కీ-ఎక్కడ దాచావ్రా- వజ్రాలు?" అడిగాడు రాంబాబు.

"వజ్రాలేంటి"

"నీ యబ్బ- డ్రామాలాడకు!"

ఇద్దరూ ఇల్లంతా వెతికారు. సామాన్లన్నీ చిందరవందర చేశారు. రాంబాబు వేరే గదిలో వెతుకుతూండగా ఫిష్ ఎక్వేరియంలో రాళ్ళ మధ్యలో కనిపించినయ్ వజ్రాలు రాణికి.

అమాంతం వాటిని ఏరి తన పర్సులో వేసుకుని బయటకు పరుగెడుతూంటే వీర్రాజు చూశాడు.

"వీటినమ్మేశాక నీ దగ్గరకొస్తా- అప్పుడు మనిద్దరం పెళ్ళి చేసుకుందాం-" అంటూ పరుగెత్తింది.

రాంబాబు ఇల్లంతా వెతికి బయటికి వచ్చి ఆమె లేకపోవటం చూసి జీప్ దగ్గరకు పరుగెత్తి వైర్లెస్లో మెసేజ్ ఫ్లాష్ చేశాడు.

రాణి వజ్రాలు తీసుకుని పారిపోతోంది పట్టుకోమని.

కొద్ది నిమిషాల్లో నగరమంతా రాణికోసం గాలింపు ప్రారంభమయింది. ఆ న్యూస్ ఒక షాపులో టీవీలో చూసిన రాణీకి తను వజ్రాలతో సహా దొరికిపోవటం తప్పదని అర్థమయిపోయింది. అయినాగానీ ఆఖరి ప్రయత్నంగా ఓ సూపర్ బజారులో దూరింది.

అక్కడ కౌంటర్ మీద బోలెడు ఫ్యాన్సీ పెన్లు పడివున్నాయ్... లావుగా వున్న ఆ చెక్క పెన్నులకు పెద్దపులి తలలూ, సింహాల తలలూ, గుర్రాలూ, ఏనుగుల తలలూ



అమర్చి వింతగా కనబడుతున్నాయి.

ఓ పెన్ తీసుకుని తల వూడదీసి చూసిందామె.

లోపల ఖాళీ...

తన పర్సులోని వజ్రాలు తీసి ఆ పెన్లో వేసి రెడ్ ఇండియన్ తల అమర్చి స్ట్రూటైట్ చేసింది.

"ఇదెంత?" అడిగింది క్యాష్ కౌంటరు దగ్గరకొచ్చి.

"ఫార్టీ రూపీస్."

ఆమె డబ్బిచ్చి పెన్నుతో బయటకు నడిచింది.

బయట కానిస్టేబుల్ ఒకడు తనవంకే అనుమానంగా చూస్తున్నాడు.

వాడిని ఎలాగైనా తప్పించుకోగలిగితే మంచిది.

హఠాత్తుగా ఆ జనప్రవాహంలో పరుగు ప్రారంభించిందామె.

పోలీస్ విజిల్స్ మార్మోగిపోయాయ్.

ఆ సమయంలో ఐస్క్రీమ్ పార్లర్ దగ్గర ఒంటరిగా కూర్చుని మెనూకార్డ్ చూస్తున్న గోపాల్రావ్ కనిపించడామెకి.

ఆమెను చూసి, ఆమె ఒంపుల శరరీ సౌష్టవానికి స్టన్ అయి కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడతడు.

విజిల్స్ అన్ని వేపుల నుంచీ దగ్గరవుతుండటంతో ఆమె వడివడిగా వచ్చి గోపాల్రావ్ పక్కనే కూర్చుని అతని వేపు చూసి చిరునవ్వు నవ్వింది.

అతడు నిశ్చేష్టుడైపోయాడు.

అంత అందమైన సెక్సీ గాళ్ తనను చూసి నవ్వి తన పక్క కొచ్చి కూర్చుంటే అతనికి వళ్ళంతా పులకరించేసింది.

"హలో! మిమ్మల్ని ఇంతకు ముందెక్కడో చూసినట్లు గుర్తు....." అంది తీయగా.

అతను పూర్తిగా ఐసయిపోయాడు.

"ఆఫ్కోర్స్...! నేనూ అదే ఆలోచిస్తున్నాను... ఎక్కడ కలుసుకున్నామా అని. ఎక్కడబ్బా... ఎక్కడబ్బా...."

"పోనీండి. ఎక్కడ కలుసుకుంటేనేం... వుయార్ ఫ్రెండ్స్... కదూ?"

"షూర్- షూర్! క్లోజ్ ఫ్రెండ్స్."

"అయితే మరి నాకో మాంఛి ఐస్క్రీమ్ ఆర్డర్ చేయవచ్చు కదా?"

"అయిదు నిమిషాల్లో తెప్పిస్తాను...." అంటూ బేరర్ని పిలిచి ఐస్క్రీమ్ తెప్పించాడు.

ఇద్దరూ ఐస్క్రీమ్ తింటూండగా పోలీసుల వచ్చారు.

"సార్! ఇటెవరైనా ఓ అమ్మాయి పరుగెత్తుకొచ్చిందా?" అడిగాడు గోపాల్రావుని.

"ఎవరూ రాలేదు" చెప్పాడతను.

వాళ్ళు మళ్ళీ పరుగుతో వెళ్ళిపోయారు.

"మీ పేరు చెప్తే మనం ఇంతకు ముందెక్కడ కలుసుకున్నామో గుర్తొస్తుందేమో" అన్నాడతను.

"నా పేరు రాణి."

"వాటే లవ్‌లీ నేమ్!"

"మీ పేరు?"

"గోపాల్రావు."

అతను సీతను పూర్తిగా మర్చిపోయాడు. అంతకు ముందురోజు ఎగ్జిబిషన్‌లో జరిగిన సన్నివేశాలు మర్చిపోయాడు.

సీతకిచ్చిన మాట మర్చిపోయాడు.

కబుర్లతో రెండు గంటలు గడిచిపోయింది.

రాణి కింకలేచి తన దారిన తను పోవాలనుందిగానీ, ఓ కానిస్టేబుల్ దూరంగా నిలబడి తననే అబ్జర్వ్ చేయటం భయం కలిగించింది.

టైమ్ ఎనిమిదై పోయింది.

"మిస్టర్ గోపాల్! నిజంగా మీ కంపెనీ ఎంత లైవ్‌లీగా వుందో చెప్పలేను. వదిలి వెళ్ళాలనిపించటం లేదు. సరదాగా ఎక్కడైనా మూన్‌లైట్ డిన్నర్ కెళ్దామా?"

"ఓ ష్యూర్! పదండి."

ఇద్దరూ అతని కారులో ఫైవ్‌స్టార్ హొటల్‌కి చేరుకుని రూఫ్ గార్డెన్‌లో కూర్చున్నారు.

అదే సమయానికి గోపాల్రావు ఇంటి దగ్గర సీత వాడిపోయిన మొహంతో కూర్చుని వుంది. అందమైన ఆమె కళ్ళు ఏ క్షణాన్నయినా వర్షించేందుకు సిద్ధంగా వున్నాయి. ఆమె చుట్టూ ఆమె స్నేహితురాండ్రు ఆమె తండ్రి కల్నల్ కనకారావు, ఆమె తల్లి ప్రభ నిలబడి వున్నారు. మధ్యలో పెద్ద కేక్ సిద్ధంగా వుంది.

"కమాన్ బేబీ! గోపాల్ ఏదో అనుకోని ప్రాబ్లెమ్‌తో ఎక్కడో హెల్డప్ అయిపోయి వుంటాడు. లేకపోతే రాకుండా ఎలా వుంటాడు? అదీ నేను ఇంట్లో వుండగా నా డాటర్‌ని ఇన్సల్ట్ చేయడానికి ఎన్ని గుండెలుండాలి?" అన్నాడు కనకారావు.

"అవున్సార్! మీ కోసమైనా తప్పకుండా వచ్చేసేవాడు" అన్నాడు భజన్‌రావు.

అతని మాటకు సీతకు వళ్ళు మండిపోయింది.

"నువ్వు నోర్మూసుకో కాసేపు" అంది కోపంగా.



"ఇదిగో చూడండి మేడమ్.... అలా మాట్లాడి నన్ను ఇన్సల్ట్ చేస్తే ఒక్క క్షణం కూడా ఈ ఇంట్లో పనిచేయను. మీరెన్నన్నా పడివుంటడానికి నేనేం మీ ఆయన్ని కాదు. వంటవాడిని" అన్నాడు ఆవేశంగా.

కల్నల్‌కి వళ్ళుమండి గన్ తీసి వాడి ఛాతీ మీద ఆనించాడు.

"ఏయ్ భజన్‌రావు...! నోరు తెరిచావంటే కాల్చిపారేస్తాను. కేస్ అయితే తర్వాత చూసుకుంటా. నీలాంటి ఇడియట్‌ని కాల్చిపారేస్తే ఆ తర్వాత యావజ్జీవం వేసినా హాపీగా అనుభవిస్తాను"

భజన్‌రావుకి భయమేసింది.

ఓసారి ఏదో గుడి కోసం చందా లడగటానికొచ్చిన గూండాలు అతిగా మాట్లాడటంతో ఒకడిని కాల్చిపారేసి సెన్సేషన్ క్రియేట్ చేశాడాయన.

చాలా రోజులు కోర్టులో కేస్ నడిచాక కొట్టేశారు.

అప్పటినుంచీ భజన్‌రావుకి అతన్ని చూస్తేనే భయం.

నెమ్మదిగా కిచెన్‌లోకెళ్ళి కూర్చుండిపోయాడు.

కనకారావు మళ్ళీ బలవంతం చేసేసరికి సీత కేక్ కట్ చేసింది.

అందరూ ఆనందంగా తప్పట్లు కొట్టారు.

డిన్నర్ అవుతూంటే అందరూ ఆ సమయంలో గోపాల్రావ్ లేకపోవటం గురించే చెవులు కొరుక్కుంటున్నట్లు ఫీలయింది సీత.

అంతమందిలో అవమానం జరిగినట్లనిపించింది.

అందరూ ఎప్పుడు వెళ్ళిపోతారా అని ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

"హలో సీతా! థాంక్స్ ఫర్ ఇన్‌వైటింగ్ అజ్- డిన్నర్ చాలా బాగా ఎరేంజ్ చేశారు. అన్నట్లు మీ హజ్బెండ్ ఇంకా రాలేదేమిటి?" అడిగింది ఫ్రెండ్ సునీత.

"ఆయన అనుకోకుండా సడెన్‌గా మద్రాస్ వెళ్ళాల్సి వచ్చింది. ఆఫీస్ పని మీద" అంది సీత.

"ఓ-ఐసీ! ఒకోసారి అంతే! మన ప్రోగ్రామ్స్ అన్నీ అప్‌సెట్ అవుతుంటాయి"

అప్పుడే కనకారావు వచ్చాడు హడావిడిగా.

"గోపాల్రావ్ ఆఫీస్‌లో కూడా లేడంట. మధ్యాహ్నం మూడింటికే ఆఫీస్ నుంచి వెళ్ళిపోయాడంట" అన్నాడు సీతతో.

సునీత ఆశ్చర్యంగా చూసింది.

"అదేమిటి మద్రాస్ వెళ్ళారన్నారుగా" అడిగింది అనుమానంగా.

సీత మొహం వాడిపోయింది. తండ్రి వేపు కోపంగా చూసింది.

"అవున్నాడీ– మద్రాసెళ్ళారట ఆఫీస్ పని మీద" అంది సర్ది చెప్పడానికి ప్రయత్నిస్తూ.

"అంతా బోగస్. మద్రాస్ లేదు, ఏమీ లేదు. మూడింటివరకూ ఆఫీస్‌లోనే వున్నాడంటే మద్రాస్ వెళ్ళడమేమిటి?"

అతిథులంతా ముఖాలు చూసుకున్నారు.

అందరిలోనూ తను 'ఫూల్' అయిపోవటం సీతకు మరింత చిరాకు కలిగించింది.

అక్కడినుంచి వేగంగా తన రూమ్‌లోకెళ్ళి మంచం మీద వాలిపోయింది.

గోపాల్రావు మళ్ళీ ఏ అమ్మాయితోనో షికార్లు కొడుతూండి ఉంటాడని అనిపించిందామెకి.

"ఏంటమ్మా సీతా! గెస్ట్లు అందరూ ఎదురుచూస్తుంటే ఇలా వచ్చేశావు?" సీత తల్లి రత్నప్రభ గదిలోకొస్తూ అడిగింది.

"నాకు తలనొప్పిగా ఉందమ్మా!"

"నాకు తెలుసులే. ఇదంతా నీకు ఆ గోపాల్రావు తెచ్చిన తలనొప్పి. నేను మొదటినుంచీ చెప్తూనే వున్నా. అతని ముఖం చూస్తూంటే నాకు నమ్మబుద్ధి కావం లేదమ్మా అతనిని పెళ్ళి చేసుకోవద్దు అని. వింటేనా? కాదు అతను మంచాడనీ, చూడ్డానికి చాలా ఫాషనబుల్‌గా బావున్నాడు అంటూ నువ్వూ, మీ డాడీ నా మాట కాదని చేసుకున్నారు.

ఇప్పుడు చూడు. నేను ఖచ్చితంగా చెప్పగలను. అతనెక్కడో, ఎవతింట్లోనో మందు కొడుతూండి వుంటాడు".

తల్లి మాటలు వినేసరికి సీతకి మరింత దు:ఖం వచ్చింది.

"మమ్మీ" అంటూ అమాంతం లేచి తల్లికౌగిట్లో వాలిపోయింది.

రత్నప్రభకు కూతురి మీద అమితమయిన జాలి కలిగింది.

"ఏడవకమ్మా! అల్లుడి అంతు మేమిద్దరం యిక్కడే వుండి తేలుస్తాం గదా. ఈ పిచ్చి వేషాలేమిటో ఇలాంటి ముఖ్యమయిన సంధర్భాల్లో బయట ఈ తిరుగుళ్ళేమిటో అన్నీ తేల్చేస్తాం."

"అవును మమ్మీ! మీరిద్దరూ ఇక్కడే వుంటేగానీ ఆయన దారికిరారు" కన్నీరు తుడుచుకుంటూ అంది.

"ఇంతకుముందు కూడా ఇలా ఎప్పుడయినా చేశాడా?"

"చాలాసార్లు ఆఫీస్‌లో లేటయిందని చెప్తే నమ్మాను కానీ ఆ మధ్య ఒకరోజు ఎగ్జిబిషన్‌లో ఓ పిల్ల కనిపించి "ఏమిటీ మధ్య దర్శనం లేదు" అనడిగింది. అంటే అంతకుముందు రెగ్యులర్‌గా ఆ పిల్లను కలుసుకుంటున్నట్లేగా?"

"ఇంకా అనుమానం ఏమిటి? అసలు పెళ్ళయిన కొత్తలో నావేపు కూడా అదోలా



చూడటం మొదలెట్టాడు."

సీత ఉలిక్కిపడింది.

"ఆ– నిజంగానా?"

"ఏమో! అలా అనే నాకనిపించింది మరి."

సీత మళ్ళీ కళ్ళవెంబడి నీళ్ళు పెట్టుకుంది.

"నువ్వేం దిగులుపడకు. నేను మీ డాడితో మాట్లాడతాగా. అల్లుడిని పూర్తిగా సెట్‌రైట్ చేయందే మేమిక్కడనుంచి కదలం"

సీత కన్నీరు తుడుచుకుంది.

"గెస్ట్లు అందరినీ నేను పంపించేస్తాన్లే! నువ్వు హాయిగా రెస్టు తీసుకో! టీవీ చూడు" అంటూ టీవీ ఆన్ చేసి వెళ్ళిపోయింది రత్నప్రభ.

* * *

ఫైవ్‌స్టార్ హొటల్లో చాలా అద్భుతమయిన మ్యూజిక్ ప్రోగ్రాం జరుగుతోంది.

సినిమా ప్లేబాక్ సింగర్ ఒకతను అద్భుతమయిన ఆర్కెస్ట్రాతో హిట్‌సాంగ్స్ పాడుతున్నాడు. ఆ ప్రోగ్రామ్ చూస్తూంటే టైమ్ తెలీటం లేదెవరికీ.

గోపాల్రావుకి మాత్రం ఆ ప్రోగ్రామ్ కంటే రాణీ అందచందాలు ఎక్కువ కిక్ ఇస్తున్నాయి.

"డిన్నర్ నువ్వే ఆర్డర్ చెయ్యి రాణీ" అంటూ మెనూకార్డు ఆమె ముందుకి తోశాడు.

ఆమె కార్డు చూసింది.

సూపర్‌వైజర్ పాడ్ పట్టుకొచ్చి రాసుకోడానికి సిద్ధంగా నిలబడ్డాడు.

"టూ– లార్జ్ – పీటర్ స్కాట్ బ్రాంది" అందామె.

గోపాల్రావు అదిరిపడ్డాడు.

"స్నాక్స్ మేడమ్?"

"చికెన్ నైన్టీఫైవ్"

అతను వెళ్ళిపోయాడు.

"మీరు డ్రింక్స్ తీసుకుంటారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏం మీరు తీసుకోరా?"

"అహహహ– అందుక్కాదు– జస్ట్ అడిగాను. అంతే!"

"ఉమెన్స్ కాలేజీ హాస్టల్లో వున్నప్పుడు అలవాటయింది."

"ఒండర్‌ఫుల్"

అతనికి ఆమె అందాలను చూస్తుంటే పిచ్చెక్కిపోతోంది.

తన సర్వీస్‌లో ఇంత సెక్సీ ఫిగర్‌ని చూళ్ళేదు.

ఈ ఫిగర్ని ఎలాగయినా వదలకూడదు. ఎలాగయినా ఏదొక రోజు లాగించెయ్యాలి.

ఇద్దరూ డ్రింక్స్ తీసుకుంటూండగా ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుల్స్ రూఫ్ గార్డెన్‌లో కొచ్చారు.

రాణి వాళ్ళను చూస్తూనే ఫ్రీజ్ అయిపోయింది.

గుండె వేగంగా కొట్టుకుంది.

ఇన్స్‌పెక్టర్ తన వేపు చూడకముందే అతని కళ్ళజోడు తీసిపెట్టుకుంది.

అతను ఆశ్చర్యంగా చూశాడు.

"నాకెలా ఉంటుందీ కళ్ళజోడు?" అంది నవ్వుతూ.

"అద్భుతంగా వుంది, మీ శరీరం బంగారం రంగు గనుక గోల్డ్ ఫ్రేమ్ బ్రహ్మాండంగా సూటవుతుంది."

ఇన్స్‌పెక్టర్ వాళ్ళ పక్కనుంచే వెళ్ళిపోయాడు గానీ అతని చూపంతా రాణీ మీదే వుంది. దూరంగా నిలబడి తనవంకే చూస్తూ కానిస్టేబుల్స్‌తో ఏదో గుసగుసలాడటం ఆమె కనిపెడుతూనే వుంది.

వాళ్ళకు తన మీద అనుమానం కలిగింది గానీ తనను సోదా చేయడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. అందుక్కారణం పక్కనున్న గోపాల్రావ్ అతని డ్రస్సూ, అతని రూపం చూస్తే తెలిసిపోతోంది అతనో ఎగ్జిక్యూటివ్ అని. పోలీసులు కాసేపటి తర్వాత వెళ్ళిపోయారు. డిన్నర్ స్టార్టయింది.

బాత్‌రూమ్ వంకతో లేచి వెళ్ళి పిట్టగోడ మీద నుంచి కిందకు చూసింది. లాన్స్‌లో కూర్చుని వున్నారు ఇద్దరు కానిస్టేబుల్స్. అమెకు అర్థమయింది.

తనూ, గోపాల్రావు ఎవరి దారిన వాళ్ళు బయల్దేరగానే తనను ఫాలో చేసి సోదా చేస్తారు.

ఆమెకి ఏం చేయడానికి తోచటం లేదు.

ఎలా వాళ్ళను తప్పించుకోవటం?

ఆమె కేమీ అర్థం కావటం లేదు.

ఈ రాత్రికి అతనితో ఏ హెూటల్లోనో గడిపితే?

అతను వప్పుకుంటాడా?

ఒప్పుకుంటాడేమో! తన మీద బాగా మోజు పడుతున్నాడు కదా!

రాత్రి పదకొండయిపోయింది.



మ్యూజిక్ ప్రోగ్రాం ఇంకా జరుగుతూనే వుంది. జనం ఎవ్వరూ కదలటంలేదు.

గోపాల్రావ్ ఆమె చేయి నిమురుతూ స్వర్గలోకానికి ఓ పావుగజం కిందగా నిలబడి మాట్లాడుతున్నాడు.

ప్రోగ్రామ్ మరో గంట తర్వాత ముగిసింది.

"మళ్ళీ ఎప్పుడు కలుసుకుందాం మనం?" అడిగాడు గోపాల్రావ్.

"మీ ఇష్టం"

"మీ అడ్రసేమిటి?"

"కనుక్కోవటం కష్టంలెండి. మీ అడ్రసిస్తే నేనే మీ ఇంటికి వస్తాను."

గోపాల్రావ్ ఉలిక్కిపడ్డాడు. ఇంటి అడ్రసిస్తే కొంప మునిగిపోతుంది.

"మా ఇల్లు కూడా కనుక్కోవటం చాలా కష్టమండీ!"

"అయితే ఫోన్ నెంబరివ్వండి."

అతను ఫోన్ నెంబర్ ఇచ్చాడు.

"ఇది ఇంటి ఫోన్ నెంబరా?"

"కాదండి- ఆఫీస్‌ది! నేను ఎక్కువగా ఇంటి దగ్గరుండనన్న మాట. అందుకని ఆఫీస్ ఫోనే బెటర్."

టైమ్ పన్నెండయింది.

మ్యూజిక్ ప్రోగ్రామ్‌లో ఆఖరి అయిటమ్ కూడా అయిపోయింది.

ఒకేసారి అందరూ లిఫ్ట్ దగ్గరకు నడిచారు.

అప్పుడు గుర్తుకొచ్చింది గోపాల్రావ్‌కి...

ఆ రోజు సీత బర్త్‌డే.

బర్త్‌డే డిన్నర్ పార్టీ తనే ఎరేంజ్ చేశాడు. రాణి మైకంలో పడి ఆ సంగతి పూర్తిగా మర్చిపోయాడు.

గుండెలదరిపోయినాయ్ అతనికి.

తను సీతకు బర్త్‌డే గిఫ్ట్ కొనాలని బయల్దేరి ఆ సంగతే మర్చిపోయాడు.

ఈపాటికి పార్టీ అంతా ముగిసి వుంటుంది.

తను రాకపోవటం సీతకు అమితమయిన కోపం కలిగి వుంటుంది. ఇప్పుడు యింకో ప్రమాదం కూడా వుంది.

సీత ఫాదర్ కూడా తనింట్లోనే వున్నాడు. కల్నరల్ కనకారావుకి మరీ పిచ్చికోపం. ఆ కోపంలో ఎప్పుడు గన్ పేల్చేస్తాడో ఎవడికీ తెలీదు.

ఎప్పుడూ ఎవడొకడి మీద పోట్లాడటం, గన్‌తో వాడి కాలో చేయో కాల్చటం, కోర్టు

చుట్టూ తిరగటం, తర్వాత వాడికి డబ్బిచ్చి కాంప్రమైజ్ చేసుకుని కేస్ నుంచి బయటపడటం సర్వసాధారణంగా జరుగుతూనే వుంటుంది.

అందుకే తనకు అతనంటే చాలా భయం.

వీలయినంతవరకూ ఎదురుపడకుండా మానేజ్ చేస్తూంటాడు.

సీత కూడా ఆ తండ్రి కోపమే పుణికిపుచ్చుకుంది.

ఇప్పుడు ఇంటికెళ్ళి సీతకేం కథ వినిపించాలి.

అదివరకులాగా ఏదొక కథ చెప్తే లాభంలేదు. ఎందుకంటే ఇవాళ్టి కథ ఆమె తండ్రీ తల్లీ కూడా విని మార్కులేస్తారు.

రాణి అతని చేయి పట్టుకుని లిఫ్ట్‌లోకి లాగింది.

"కమాన్! అలా చూస్తూ నిలబడితే ఇక్కడే వుండిపోతాం రాత్రంతా."

లిఫ్ట్ పెద్ద శబ్దంతో జెర్క్స్‌తో కొద్ది గజాలు దిగి సడెన్‌గా ఆగిపోయింది. మరుక్షణంలో అంధకారం...

గోపాల్రావ్‌కి భయం వేసింది.

లిఫ్ట్ ఫెయిలయిపోయినట్లే.

లిఫ్ట్‌లో వున్న ఫోన్ తీసుకుని రిసెప్షన్‌కి డయల్ చేసి మాట్లాడాడు గోపాల్రావ్.

"మెకానిక్ వస్తున్నాడు సార్! కొద్దిసేపు ఆగాలి."

గోపాల్రావ్ రాణి నడుము చుట్టూ చేయివేసి దగ్గరకు తీసుకున్నాడు.

రాణికి ఆనందంగా వుంది.

రాత్రంతా ఈ లిఫ్ట్‌లో గడిచిపోతే చాలు. ఉదయం తిన్నగా విమానంలో బాంబే వెళ్ళిపోవచ్చు...

ఈ తర్వాత తన చరిత్రే మారిపోతుంది.

ఆ వజ్రాలు రెండూ అమ్ముతూ ఓ ఇల్లు, కారు కొనుక్కుని కావలసినంత బ్యాంక్ బ్యాలెన్స్ ఏర్పాటు చేసుకుని... తనకిష్టమైన 'లేడీస్ బ్యూటీకేర్' సెంటర్ ఓపెన్ చేస్తే... అంతే... ఇంక ఈ మోసాలూ, దొంగతనాలూ ఏమీ లేకుండా, పోలీసులతో గొడవలు లేకుండా జీవితం గడిచిపోతుంది.

మెకానిక్ రావటం, టార్చ్‌లైట్‌తో చెక్ చేయటం... లిఫ్ట్‌కి ఓ వైపు వున్న అద్దాల్లో నుంచి కనబడుతూనే వుంది.

లోపల కొంచెం సఫోకేటింగ్‌గా వున్నా కొంచెంగా గాలి వస్తూండంతో ఫరవాలేదనిపించింది.

మరో రెండు గంటలు గడిచినాయి.



గోపాల్రావ్‌కి భయం పెరిగిపోయింది.

ఇప్పటికయినా ఇంటికి చేరుకుంటే బావుండేది. రెండు దాటాక ఇల్లు చేరటమంటే కొరివితో తల గోక్కోవటమే.

సీతకేం చెప్పాలి?

ఎటూ తోచటం లేదతనికి.

ఆఫీస్‌లో వున్నానంటే నమ్మరు.

అనుకోకుండా ఫ్రెండ్‌కి హార్ట్ ఎటాక్ రావటం వల్ల హాస్పిటల్‌కి తీసుకెళ్ళాననీ, అక్కడే రాత్రంతా వున్నాననీ చెప్తే?

నమ్ముతుందా?

సీతయితే నమ్ముతుంది కొంతవరకూ...

కానీ ఆ కల్నల్‌గాడు ఛస్తే నమ్మడు.

"ఏ హాస్పిటల్లో చేర్చావు?' అనడుగుతాడు.

అప్పుడు తను ఏదొక హాస్పిటల్ పేరు చెప్పాల్సి వస్తుంది.

వెంటనే ఆ హాస్పిటల్‌కి ఫోన్ చేస్తాడు.

ఫలానా పేషంట్ ఉన్నాడా? ఎప్పుడు చేరాడు? రాత్రంతా ఆ పేషంట్‌తో ఎవరున్నారు? వాడి పేరేంటి? అంటూ న్యూసెన్స్ చేస్తాడు- కనుక అలాంటి సాకు చెప్పకూడదు.

కనుక అలాంటి రీజనేం కుదరదు.

రాణికి అద్దాల్లో నుంచి లాన్స్‌లో కూర్చున్న కానిస్టేబుల్స్ ఇంకా కనబడుతూనే వున్నారు.

ఏ పరిస్థితిలోనూ తను వజ్రాలు దాచిన ఆ పెన్ తన దగ్గర వుంచుకోవటం చాలా రిస్క్. తన భవిష్యత్తంతా దానిమీదే ఆధారపడి వుంది.

ఈ ఒక్కసారికీ ఎలాగయినా తప్పించుకోగలుగుతే ఇంక జన్మలో పోలీసులకు భయపడనఖ్ఖర్లేదు.

హఠాత్తుగా ఓ అయిడియా వచ్చిందామెకి.

అవును... ఆ పెన్ ఎలాగోలా గోపాల్రావ్ దగ్గర ఒక రోజుంచగలిగితే తన మీద ఎవరికీ అనుమానం రాదు.

కానీ గోపాల్రావ్‌కి అనుమానం రాకుండా పెన్ అతని దగ్గరుంచటం ఎలా?

అతనికి తెలీకుండా అతని బ్యాగ్‌లో పడేస్తే?

అది తన దగ్గరుండటం చూశాడు గనుక మర్నాడు తనకి తెచ్చి ఇచ్చేస్తాడు.

దాంతో ప్రాబ్లెమ్ సాల్వ్ అయిపోతుంది.

అది ఫాన్సీ పెన్ గనుక ఎవరికీ దాని బరువు గురించి అనుమానం రాదు.

అతని బ్యాగ్ వైపు చూసిందామె.

∘ ∘ ∘

కర్నల్ కనకారావ్ గడియారం వంక చూశాడు.

మూడు గంటలు కొట్టిందది.

కనకరావ్ ముందున్న విస్కీ గ్లాస్ ఖాళీ అయింది.

"నువ్వేం వర్రీ అవకు సీతా! ఈ అల్లుడుగాడెక్కడున్నాడో ఇప్పుడే తేల్చేస్తా" అంటూ ఫోన్ దగ్గరున్న టెలిఫోన్ బుక్ తీశాడు.

ఆ బుక్‌లో గోపాల్రావ్ ఆఫీసు ఫోన్ నెంబర్లు, అతని బంధువుల నెంబర్లు, అతని ఫ్రెండ్స్ నెంబర్లు, సీత ఫ్రెండ్స్ నెంబర్లూ అన్నీ రాసి వున్నాయ్.

"వీడెవడు బేబీ! లక్ష్మణ్‌రావ్ అట పేరు- ఎవడు వీడు?"

"ఆయన క్లోజ్ ఫ్రెండ్ డాడీ."

"అయితే గోపాల్రావ్ ఎక్కడుందీ వీడికి ఖచ్చితంగా తెలుస్తుంది"

అంటూ అతని నెంబరుకి రింగ్ చేశాడు.

అయిదు నిమిషాలు మోగాక మత్తుగా, బండగా, బొంగురుగా 'హలో' అందో గొంతు.

"హలో! అయామ్ కర్నల్ కనకారావ్ హియర్! లక్ష్మణరావేనా మాట్లాడేది?"

"అవును!"

"సారీ టు డిస్టర్బ్ యూ- కానీ అవసరం. గోపాల్రావ్ మా అల్లుడు. అతను ఇంతవరకూ ఇంటికి రాలేదు. బై ఛాన్స్ మీ ఇంట్లో వున్నాడా? ఎందుకంటే ఇదివరకు ఇలాగే ఆలస్యంగా ఇంటికొచ్చినప్పుడు మీ ఇంట్లో పేకాడుతూ కూర్చున్నానని మా అమ్మాయితో చెప్పాడట."

అవతలి వ్యక్తి నిద్రమత్తంతా వదిలిపోయింది.

"ఓ! గోపాల్రావా? గోపాల్రావ్ ఇంకా ఇంటికి రాలేదా?"

"రాలేదనే చెప్తున్నాను" కోపంగా అన్నాడు కనకారావ్.

"అహ్హాహ్హాహ్హా! భలేవారే- ఎలా వస్తాడు? రాడు."

"వాడ్డూయూ మీన్ బై 'రాడు'?"

"ఐ మీన్- గోపాల్రావ్ మీ ఇంటికి రాలేడు."

"రాలేడా?"



"అవును! రాలేడు- ఇంపాజిబుల్."

"ఎందుకు?"

"ఎందుకంటే మా ఇంట్లో పార్టీ అయింది. ఫ్రెండ్సందరం మందుకొట్టి పడిపోయాం. అర్ధరాత్రి తాగి కారు డ్రైవ్ చేయటం ప్రమాదం కదా? అందుకని నేనే ఇంటికెళ్ళొద్దన్నాను."

"వెళ్ళొద్దనటానికి నువ్వెవరు?"

"అతని ఫ్రెండ్‌ని! క్లోజ్ ఫ్రెండ్..."

"డోంటాక్ రాట్! ఇల్లూ, ఇంట్లో పెళ్లాం వుండగా ఫ్రెండ్స్ ఇంట్లో పడుకోవటమేమిటి? ఈజ్ దేర్ ఎనీ సెన్స్?"

"ఆఫ్‌కోర్స్ దేరీజ్ సెన్స్- తాగి అర్ధరాత్రి ఇంటికి డ్రైవ్ చేసుకెళితే లారీకి డాష్ యిచ్చి టపాకట్టేస్తాడు. మా క్లోజ్ ఫ్రెండ్ టపా కట్టటం మాకిష్టం లేదు. అందుకని ఇక్కడే పడుకోమన్నాను. ఓ.కె. గుడ్‌నైట్! డోంట్ డిస్టర్బ్" ఫోన్ పెట్టేశాడతను.

కల్నల్ కోపంతో మండిపడ్డాడు గానీ చేసేదేమీ లేకపోయింది.

"ఏమన్నాడు డాడీ?"

"గోపాల్రావ్ వాళ్ళింట్లోనే తాగి పడిపోయాడని అంటున్నాడు గానీ నాకెందుకో వాడి మాటల మీద నమ్మకం కుదరటం లేదు."

"ఎందుకని?"

"ఎందుకంటే గోపాల్రావ్ ఇంటికి రాలేదని చెప్తే, ఇంకా రాలేదా అని అడిగాడు ముందు. అంటే వాళ్ళింట్లోలేనట్లే అని అర్థం కదా?"

"అవును. కానీ అలా ఎందుకబద్ధం ఆడాడంటావ్?"

"తెలీదు. ఏదో సీక్రెట్ వుందందులో. అదేమిటో ఇప్పుడే తెలిసిపోతుందిగా. ఈ రంగనాద్ అనే అతనెవరు?"

"అతను కూడా ఆయన క్లోజ్ ఫ్రెండే డాడీ."

కనకారావ్ ఆ నెంబర్‌కి రింగ్ చేశాడు.

అతను కూడా అయిదు నిమిషాలు ఫోన్ మోగాక మాట్లాడాడు.

"రళ్గళార్ హియళ్" అన్నాడు ముద్దగా.

"మిస్టర్ రంగనాథ్! అయామ్ కల్నల్ కనకారావ్! మా సన్-ఇన్-లా గోపాల్రావ్ ఇంకా ఇంతవరకూ ఇంటికి రాలేదు. బై ఛాన్స్ మీ ఇంట్లో వున్నాడా?"

"ఎవరది? కె. గోపాల్రావా? సి. గోపాల్రావా?"

"కె. గోపాల్రావ్."

"ఇంతవరకూ ఇంటికి రాలేదా?"

"లేదు"

"అహ్హహ్హహ్హ" నవ్వాడు. "ఇంకా రాలేదా? వెరీ బాడ్! ఇంతవరకూ రాలేదంటే–ఆ! అవునవును! గోపాల్రావ్ యిక్కడే వున్నాడు. మర్చేపోయాను"

"అక్కడా?!" ఆశ్చర్యంగా అన్నాడు కల్నల్.

"అవును"

"అంటే?"

"మా ఇంట్లోనే ఫ్రెండ్సంతా కలిసి పార్టీ చేసుకున్నాం. అతనికి ఓ పెగ్గు ఎక్కువయినట్లుంది. ఇక్కడే పడుకున్నాడు"

"అక్కడే పడుకున్నాడా?"

"అవును"

"ఇప్పుడు మీ ఇంట్లో వున్నాడా?"

"ఎస్! సెంట్ పర్సెంట్"

"ఆర్యూ షూర్?"

"హలో కర్నల్! దిసీజ్ నాట్ ఆర్మీ లైఫ్! ఓ.కె. దిసీజ్ సివిలియన్ వే ఆఫ్ లివింగ్! కావాలంటే ఇంకో పెగ్గుకొట్టి పడుకోండి. తెల్లారేసరికి మీ అల్లుడు మీ ఇంట్లో వుంటాడు."

ఫోన్ డిస్కనెక్ట్ అయిపోయింది.

"ఏమన్నాడు డాడీ?" ఆత్రుతగా అడిగింది సీత.

"వీడి ఫ్రెండ్సంతా కూడా మహా మాయగాళ్ళలాగున్నారమ్మా. ఎవడ్నడిగినా అతను మా ఇంట్లోనే వున్నాడు, పొద్దున్నే ఇంటికొచ్చేస్తాడు అంటున్నారు. అసలు నిజంగా ఎవడింట్లోనయినా వున్నాడా లేదా అనేది తెలీటం లేదు"

ఈసారి సీత గోపాల్రావ్ తాలూకూ మరో క్లోజ్ ఫ్రెండ్ మూర్తికి ఫోన్ చేసింది.

"హలో! నేను గోపాల్రావ్ మిసెస్‌ని మాట్లాడుతున్నానండి."

"నమస్తే సిస్టర్!"

"నమస్కారమండి"

"ఏమిటి సిస్టర్ ఇంత అర్థరాత్రి ఫోన్ చేశారు?"

"అదే– ఆయన ఇంతవరకూ ఇంటికి రాలేదు. ఒకవేళ ఎక్కడ వున్నారో మీకేమైనా తెలుస్తుందేమోనని..."

"భలేదానివే సిస్టర్! అతను మా ఇంటికి తప్ప ఇంకెక్కడి కెళ్తాడు. ఇడుగో నా పక్క బెడ్ మీద పడుకుని గాఢ నిద్రలో వున్నాడు."

"నిజంగానా?"



"ఎస్ సిస్టర్! నిజం చెప్పాలంటే ఇవాళ నా పుట్టినరోజు సిస్టర్! అందుకని ఇద్దరం కలిసి మందుకొట్టాం. మనాడికి కొంచెం డోస్ ఎక్కువయి యిక్కడే సెటిలయిపోయాడు."

"ఓకే. థాంక్యూ" అంటూ డిస్కనెక్ట్ చేసింది.

"ఏమంటున్నాడమ్మా?"

"వీళ్ళందరిదీ ఓ పెద్ద రాకెట్ డాడీ! అతను కూడా గోపాల్రావ్ వాళ్ళింట్లోనే వున్నాడంటున్నాడు"

"నన్నడిగితే గన్ తీసుకెళ్ళి వీళ్ళందర్నీ కాల్చిపారేయాలి"

"ఇప్పుడేం చేద్దాం డాడీ?" దీనంగా అడిగింది.

"పోలీస్‌కి కంప్లయింట్ యిద్దామా?"

రత్నప్రభ కలవరపడింది.

"ఇంకేమైనా వుందా? ఊరంతా అల్లరయిపోతుంది. మన పరువు గంగలో కలిసిపోతుంది"

"ఆఫ్‌కోర్స్! ఆ మాట నిజమే! పోలీసుల్ని నమ్మటానికి వీల్లేదు. న్యూస్ పేపర్‌కి చెప్పేస్తారు".

అంతా సైలెంటయిపోయారు.

గడియారం నాలుగు గంటలు కొట్టింది.

"ఓకే బేబీ! నాకు నిద్రొస్తోంది. నువ్వు కూడా పడుకో. మాణింగ్ లేచాక చూద్దాం. అప్పటికి వచ్చేస్తాడేమో– లేదంటే అప్పుడు ఆల్టర్నేటివ్ ఆలోచిద్దాం– ఓకే"

"ఓకే డాడీ"

"గుడ్‌నైట్"

"గుడ్‌నైట్"

కర్నల్ తూలుకుంటూ తన గదిలోకి వెళ్ళి బెడ్ మీద వాలిపోయాడు.

❂ ❂ ❂

"ఆ బ్యాగ్‌లో ఏముంటుంది?" అడిగింది రాణి చిరునవ్వుతో.

"ఏముంటాయి? ముఖ్యమైన ఆఫీస్ కాగితాలు, ఓ చిన్న డైరీ, పాకెట్ కంప్యూటర్ బ్యాంక్ కార్డ్– అంతే!"

"బ్యాగ్... చాలా బావుంది"

"ఓ– ఈజిట్ సో! మీక్కావాలా?"

"నో! జస్ట్ ఐ లైక్డ్ ఇట్! ఏదీ" అంటూ బ్యాగ్ అందుకుని ఓపెన్ చేసిందామె.

"ఓ! లోపల చాలా అరలున్నాయి" అంటూ తన బ్యాగ్‌లో నుంచి పెన్ తీసి పట్టుకుంది.

"ఆ పెన్ చాలా బావుండి" అన్నాడతను.

"ఫ్యాన్సీ పెన్– టేబుల్ మీద పెన్ స్టాండ్‌లో వుంచితే భలే అందంగా వుంటుంది. డెకరేషన్ కోసమే కొన్నాను. మీక్కావాలా? తీసుకోండి" అంటూ బ్యాగ్‌లో వుంచింది.

"నో.. నో... నేనింకోటి కొనుక్కుంటాను– అది మీ దగ్గరే వుండనీయండి"

"ఓకే" అంటూ పెన్ తీసినట్లు తీసి అతను చూడకుండా మళ్ళీ బ్యాగ్‌లోకి తోసి బ్యాగ్ అతని కిచ్చేసింది.

హఠాత్తుగా లిఫ్ట్‌లో లైట్లు వెలిగాయి.

"ఇంకొక అర్థగంట ఓపిక పట్టండి సార్! బోల్ట్ ఒకటి విరిగి పోయింది. ఇంకొద్దిసేపట్లో వచ్చేస్తుంది" అన్నాడు మెకానిక్.

సరిగ్గా నాలుగున్నరకి లిఫ్ట్ రిపేరయి కిందకు దిగింది.

"మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను మిస్ రాణీ" అన్నాడు గోపాల్రావ్.

"నో ప్లీజ్! మా వాళ్ళు అనుమానపడతారు– ఆటోలో వెళ్ళిపోతాను" అంటూ సిద్ధంగా వున్న ఆటోని పిల్చిందామె.

ఆటో వెనుకే పోలీస్ వ్యాన్ కూడా బయల్దేరింది.

ఆమె తన ఇంటి దగ్గర ఆటో దిగుతూండగా వ్యాన్ వచ్చి ఆగింది.

"రాణీ! ముందు ఉన్నపళంగా ఓసారి స్టేషన్‌కొచ్చి వెళితే బాగుంటుంది" అంది లేడి కానిస్టేబుల్ వ్యాన్ దిగుతూ.

"ఎందుకు?"

"బ్యాంక్‌లో వజ్రాలు పోయిన దగ్గర్నుంచీ నువ్వు చాలా బిజీగా తిరుగుతున్నావు– అందుకని"

"ఓ.కె! నాకేం భయం? మీరెక్కడికి రమ్మంటే అక్కడికొస్తాను"

వ్యాన్ రాణీతోపాటు పోలీస్‌స్టేషన్ చేరుకుంది.

రాంబాబు ఆత్రుతగా, ఆనందంగా వచ్చాడామె దగ్గరకు.

"నన్ను తప్పించుకుపోయేవాళ్ళు ఇంకా పుట్టలేదు" అన్నాడు నవ్వుతూ.

"ఇంక పుట్టరు కూడా" తనూ నవ్వుతూ అంది.

"విక్కీ ఇంట్లో నీకు వజ్రాలు దొరికాయ్ కదూ?"

"దొరుకుతే ఈపాటికి బొంబేలో వుండేదానిని– ఇంకా యిక్కడే ఎందుకు తిరుగుతూంటాను?"

"మరెందుకు పారిపోయావు విక్కీ ఇంట్లోంచి?"



"నేను మీతో కలిశానని తెలిస్తే విక్కీ జైలు నుంచి బయటికొచ్చాక నన్ను చంపేస్తాడు. అందుకని మీరు నన్ను బలవంతంగా ఆ ఇంటికి తీసుకెళ్ళినట్లు వీర్రాజుని నమ్మించడానికి వాడు చూస్తూండగానే బయటకు పారిపోయాను"

రాంబాబుకి నమ్మకం కలగటంలేదామె మాటలు.

దూరంగా నిలబడ్డ లేడీ కానిస్టేబుల్స్‌కి సైగ చేశాడు.

ఇద్దరూ వచ్చి రాణీని పక్క గదిలోకి తీసుకెళ్ళి ఆమె బ్యాగంతా వెతికారు. తర్వాత ఆమె బట్టలన్నీ తీయించి వెతికారు.

"ఇప్పటికయినా తీరిందా అనుమానం?" అడిగింది రాణి.

"మాక్కాదు అనుమానం– మా బాస్‌కి"

ముగ్గురూ మళ్ళీ రాంబాబు దగ్గరకొచ్చారు.

"దొరకలేద్సార్!"

"ఇదిగో రాణీ! నిన్నిప్పుడు వదిలేస్తున్న గానీ ఇరవై నాలుగ్గంటలూ నిన్నే కనిపెడుతూంటానన్న సంగతి మర్చిపోకు! విక్కీ గాడితో నువ్వూ చేతులు కలిపావని తెలిస్తే మాత్రం నా చేతిలో చచ్చావే– గుర్తుంచుకో!"

"ఒకవేళ విక్కీ మనిద్దరినీ మోసగించాడనీ ఋజువయితే?"

"అప్పుడు మనిద్దరం ఒకటవుతాం, నువ్వు నా లైఫ్ పార్ట్‌నర్‌వి అవుతావు"

"మా ఇల్లు కూడా సోదా చేయించావా?" అనుమానంగా అడిగింది.

"అవును అక్కడ కూడా దొరకలేదు కాబట్టే వదిలేస్తున్నా"

"నీయమ్మ..." అని ఇంకేదో తిట్లబోయి ఆగిపోయింది రాణి.

రాంబాబు కోపంగా చూశాడు.

"ఏంటే? నోటిమీద బెల్టు దెబ్బ కావాలా– మళ్ళీ మళ్ళీ పిచ్చివాగుడు వాగకుండా".

రాణి బయటికెళ్ళిపోయింది.

• • •

గోపాల్రావ్ కారు గారేజ్‌లో వుంచి నిశ్శబ్దంగా బాత్‌రూమ్ పక్కనున్న గది కిటికీ దగ్గరకెళ్ళి "ఓరే భజన్‌రావ్!" అంటూ పిలిచాడు.

వాడు పలకలేదు.

వాడి గురక వినబడుతోంది.

రాయి తీసుకుని కిటికీలో నుంచి వాడి మంచం మీదకు విసిరాడతను.

గావుకేక పెట్టి ఎగిరి మంచం దిగి నిలబడ్డాడు. లైట్ స్విచ్ వేసి తన ముఖానికి

తాకిందేమిటో అర్థంకాక మంచం కింద వెతకసాగాడు.

"ఏయ్! నేన్రా రాయి వేసింది" అన్నాడు గోపాల్రావ్ రహస్యంగా.

వాడు ఆశ్చర్యంగా కిటికీ వేపు చూశాడు.

"మీరా సార్!"

"తలుపు తియ్‌రా– తర్వాత ఆశ్చర్యపోదువుగానీ"

"రాత్రంతా ఎక్కడున్నారు సార్?"

"షటప్! ఆ సంగతి నీకవసరం. నౌఖరుగాడివి నౌఖరుగాడిలా వుండు. ముందు తలుపుతియ్!"

"సరే తప్పేదేముంది సార్! మీరెలా చెప్తే అలా. ఎక్స్ట్రా యాక్టివిటీ నాకెందుకు?"

తలుపు దగ్గరకు నడిచి తలుపు తెరిచాడతను.

గోపాల్రావ్ లోపలికొచ్చాడు. సోఫాలో కూర్చుని బూట్లు తీయసాగాడు.

"ఏం గొడవ లేదు కదా?"

"ఏం లేద్సార్!"

"నాకోసం సీత ఎదురు చూసిందా?"

"చూశారు సార్!"

"మహా అనుమానం పక్షి. అనుమానానికి తగ్గట్లే మనం ఏదొక వ్యవహారంలో ఇరుక్కుపోతూంటాం"

"అవున్సార్!"

"పైగా ఇవాళ ఆ కర్నల్ పక్షి కూడా ఇక్కడే వున్నట్లున్నాడు. కనుక అగ్గికి ఆజ్యం పోసినట్లే– కదూ?"

"అది కేవలం మీ అభిప్రాయం సార్! దాంతో నాకేం సంబంధం లేదు"

"సరే ఓ పని చేస్తావా?"

"చేయదగినదయితే తప్పకుండా చేస్తాను సార్!"

"మరేంలేదు– నేను రాత్రి ఒంటిగంటకు ఇంటికొచ్చేసి యీ సోఫాలోనే పడుకుని నిద్రపోయినట్లు అమ్మగారికి చెప్పాలి"

"అలాగా సార్!"

"ఏం? ఏమయినా అనుమానమా?"

"కానీ అలా చెప్తే వాళ్ళు నమ్మరు సార్! ఉన్నదున్నట్లు చెప్తే బాగుపడతారు"

"ఎందుకు నమ్మరు?"

"ఎందుకంటే అందరూ ఆ మూల వున్న కేన్ చెయిర్స్‌లో కూర్చుని మన మాటలన్నీ



వింటున్నారు సార్! లైట్ డిమ్ చేశారు కనుక వాళ్ళు మీ కంటికి కనిపించటం లేదు"

గోపాల్రావ్ అదిరిపడి తలతిప్పి కేన్ చెయిర్స్ వున్న వేపు చూశాడు.

సీత, రత్నప్రభ, సీత చెల్లెలు పూజ కూర్చుని తనవంకే చూస్తున్నారు.

పై ప్రాణాలు పైనే పోయాయి అతనికి.

తన సీత ముందు ఎంత పెద్ద ఫూల్ అయిందీ తెలిసిపోయింది.

పూజ అతని అవస్థ చూసి పగలబడి నవ్వేయసాగింది.

"అరె! మీరంతా ఇంకా మేలుకునే వున్నారా? ఎందుకని పడుకోలేదు సీతా?" చాలా కాజువల్‌గా మాట్లాడుతున్నట్లు నటిస్తూ అన్నాడు.

సీతకు ఉద్రేకం ఆగటం లేదు.

నెమ్మదిగా అతని దగ్గరకొచ్చి లాగి అతని చెంపపగలకొట్టింది. అదిరిపడ్డాడు.

"ఏంటిది? నీకేమైనా మెంటలా?"

"ఆహా... ఏం యాక్షన్ చేస్తున్నావు బావా! ఏం తెలీనట్లు– ఇంత యాక్షన్ ఉండి నువ్వు సినిమాల్లో ఎందుకు చేరలేదు బావా?" టీజ్ చేస్తూ అంది పూజ.

గోపాల్రావ్ ఇరకాటంలో పడిపోయాడు.

"సారీ సీతా! అనుకోకుండా ఏం జరిగిందంటే మా ఫ్రెండ్ ఒకడికి..."

"తెలుసు. అనుకోకుండా హార్ట్ ఎటాక్ వచ్చింది. అనుకోకుండా మీరొక్కరే పక్కనున్నారు. అనుకోకుండా హాస్పిటల్‌కి తీసుకెళ్ళి ఎడ్మిట్ చేశారు".

గోపాల్రావ్ గుండె ఆగినంత పనయింది.

నిజంగా తను అదే చెప్దామనుకున్నాడు.

సరిగ్గా అప్పుడే బిగ్గరగా కల్నల్ కేక వినిపించింది.

"వాట్ బేబీ! ఇంకా పడుకోలేదా? డోంట్ వర్రీ– మాణింగ్ నేను గన్ తీసుకుని రాత్రి 'మా ఇంట్లోనే ఉన్నాడని' చెప్పిన వాళ్ళందరి ఇళ్ళకూ వెళతాను" అంటూ హాల్లోకి కళ్ళు నులుముకుంటూ వచ్చాడు.

"ఒరే భజన్‌రావ్!"

"ఏం సార్?"

"నిన్న నాకు నువ్వు తెచ్చిచ్చిన విస్కీ ఏ షాప్ నుంచి తెచ్చావురా?"

"అగర్‌వాల్ వైన్‌షాప్ నుంచండి"

"వాడినీ, నిన్నూ కూడా కాల్చిపారేస్తానొరేయ్! మీరిద్దరిలో ఎవడో ఒకడు కల్తీ చేశాడది."

"కల్తీయా.. నేనెలా చేస్తాను సార్?"

"ఆ సంగతి నువ్వు చెపాల్రా? రాస్కెల్ నీ అంతు తేల్చేస్తా నిప్పుడు. బాటిల్ తీసుకుని నువ్వు తూలుతూ వచ్చినప్పుడే నాకు అనుమానం కలిగింది. అందులో కొంచెం తాగేసి మళ్ళీ హాఫ్ నీళ్ళతో ఫుల్‌చేసి తెచ్చి వుంటావని."

"నేనలాంటి వాడిని కాద్సార్! అయ్యగారిచ్చిన రిఫరెన్స్ సర్టిఫికెట్ చూడండి కావాలంటే" అంటూ గోపాల్రావ్ వైపు చూపించాడు.

గోపాల్రావ్ వైపు అప్పుడు చూశాడు కనకారావ్.

"వ్వాట్? నొవ్వొచ్చేశావా?" కోపంగా అన్నాడు.

"వచ్చేశాను- చాలా సేపయిపోయింది"

"ఏం కాదు. వచ్చి అయిదు నిమిషాలు కూడా కాలేదు"

"నాకు తెలుసు. బేబీ! ఐ నో- మీ పెళ్ళయిన కొత్తలో ఆ సెక్సీ అడ గొంతు ఫోన్ చేసినప్పుడే నాకు అనుమానం వచ్చింది ఇతని కేరెక్టర్ మీద"

"ఆ గొంతు మా ఆఫీస్ స్టెనోదనీ, కేవలం ఆఫీస్‌కి సంబంధించిన విషయం మాట్లాడ్డానికే ఫోన్ చేసిందని చెప్పాను కదా!" నిష్ఠూరంగా అన్నాడతను.

"అయితే ఆ తర్వాత మరోసారి ఫోన్‌చేసిన స్టెనో గొంతు ఇంకో రకంగా ఎందుకుంది?"

"ఎందుకంటే పాత స్టెనో రిజైన్ చేసేసరికి కొత్త స్టెనోని తీసుకోవలసి వచ్చింది. కొత్త స్టెనో గొంతు సెక్సీగా వుండదు"

"ఐ డోంట్ బిలీవ్" అన్నాడు కనకారావ్.

"ఇంతకూ రాత్రంతా ఏమైపోయావో చెప్పు ముందు' అంది సీత.

"ఎస్! యూ హావ్ యాన్ ఎక్స్‌ప్లనేషన్"

అతను చకచక ఆలోచించాడు. పక్కన కల్నల్ ఉండగా కథలు చెప్పటం ఇంపాజిబుల్. జరిగిందంతా ఉన్నదున్నట్లు చెప్పేయటం మంచిది. రాణీ సంగతి తప్ప.

"అసలు జరిగిందేమిటంటే..."

"ఎస్! ఏం జరిగింది?" పైప్ వెలిగించుకుంటూ అన్నాడు కల్నల్.

"మా ఫ్రెండ్... ఐ మీన్ చిన్నప్పటి ఫ్రెండ్ ఒకతను అనుకోకుండా నా కోసం ఆఫీస్ కొచ్చాడు. ఇద్దరం కలుసుకుని అయిదేళ్ళయిపోయింది. కేవలం నన్ను కలుసుకుని నాతో సరదాగా గడపటం కోసం పాపం అంతదూరం నుంచీ వచ్చాడు. అలాంటి వాడిని డిజప్పాయింట్ చేయటం బావుండదని వాడితోపాటు బార్‌కి వెళ్ళాను. కొంచెం సేపు వాడితో గడిపి సీత బర్త్‌డే పార్టీకి వచ్చేయవచ్చని నా ప్లాన్. కానీ ఇద్దరం చిన్న నాటి కబుర్లతో పడిపోయూసరికి టైమ్ తెలీలేదు. రాత్రి పన్నెండింటివరకూ తాగుతూనే వున్నాం"



సీతనూ, కర్నల్‌నీ తన కథ ఎంతవరకూ ఇంప్రెస్ చేస్తుందో జాగ్రత్తగా కనిపెడుతూ మాట్లాడుతున్నాడతను. వాళ్ళ ముఖకవళికలను బట్టి తను చాలా విజయవంతంగా కథ చెపుతున్నట్లనిపించింది.

"వద్దంటున్నా వాడు కొంచెం ఎక్కువ మందు కొట్టించేసరికి నాకు కొంచెం మైకం కమ్మినట్లయింది. దాంతో బర్త్‌డే సంగతి పూర్తిగా మైండ్‌లో నుంచి వెళ్ళిపోయింది. నా పరిస్థితి చూసి పాపం వాడు ఆ స్థితిలో నన్ను ఇంటికి పంపటం ఇష్టంలేక ఆ పక్కనే వున్న హోటల్లో వాడి రూమ్‌కి తీసుకెళ్లాడు. దాంతో అక్కడే నిద్రపోయాను. సడెన్‌గా తెల్లారుజామున నాలుగ్గంటలకు మెలకువ వచ్చింది."

"రాగానే నేనిక్కనున్నానూ అని ఉంటావ్" అంది పూజ నవ్వాపుకుంటూ.

గోపాల్రావ్‌కి మరదలి మీద కోపం వచ్చింది గానీ అది కోపాలు ప్రదర్శించే టైమ్ కాదని రాజీపడి ఓ చిరునవ్వు నవ్వాడు.

"అప్పుడు వాడిని నిద్ర లేపి నాలుగు తిట్టాను- అనవసరంగా నాకు తిగించి బంగారం లాంటి నా ప్రోగ్రాం అంతా అప్సెట్ చేశావు కదురా! మా మిసెస్ బర్త్‌డే నిన్న. ఆమెకు మాంఛి గిఫ్ట్ కూడా యివ్వాలనుకున్నాను. అనేసరికి పాపం వాడు చాలా ఫీలయిపోయాడు సారీ బ్రదరూ! నేనే మీ ఇంటికొచ్చి సిస్టర్‌కి స్వయంగా క్షమార్పణలు చెప్పుకుంటాను అన్నాడు."

"ఏడీ వచ్చాడా?" అనుమానంగా అడిగాడు కర్నల్.

"వద్దామనే అనుకున్నాడు. కానీ అతను పాపం- ఆరు గంటల బస్‌కి వాళ్ళూరు వెళ్ళడానికి రిజర్వేషన్ ముందే చేసుకున్నాడు కదా- టైమ్ చాలదని వెళ్లిపోయాడు."

సీతకు ఈ కథ మీద ఏమాత్రం నమ్మకం కలగనట్లు ఆమె ముఖం చూస్తే తెలిసిపోతుంది.

ఆమె కనకారావ్ వైపు చూసింది.

కనకారావ్ గోపాల్రావ్ చెప్పిన కథంతా ఓసారి మననం చేసుకుంటూ అందులోని లూప్‌హోల్స్ వెతకడానికి ప్రయత్నం చేస్తున్నట్లు కనిపించాడు. గోపాల్రావ్ ఇంక ఈ కథ ముగిసిందని వాళ్ళకు ఫీలింగ్ ఇవ్వడం కోసం రిలాక్సయినట్లు సోఫాలో కూర్చుని టీపాయ్ మీదున్న వీక్లీ తిరగేయసాగాడు.

"మీ ఫ్రెండ్ పేరేమిటన్నావు?" మొదటి బాంబ్ వేశాడు కల్నల్.

అతనికి చెమటలు పట్టేశాయి.

ఏం చెప్పాలో తెలీలేదు.

ఛటుక్కున అతని దృష్టి తన చేతుల్లో ఉన్న మాగజైన్ మీదపడింది. అందులో ఓ

టీవీ సీరియల్ రచయిత పేరు కొట్టొచ్చినట్లు కనబడింది.

ఠక్కున అదే పేరు చెప్పేశాడతను.

"చంద్రకాంత్"

"చంద్రకాంతా? ఇంతకుముందెప్పుడూ నువ్వా పేరే తల్చుకోలేదే?" అనుమానంగా అడిగింది సీత.

"లోలోపల తల్చుకునే వుంటాను. వాడినెలా మర్చిపోగలను? వెరీ క్లోజ్ ఫ్రెండ్! దొంగ వెధవ- తెగ క్లోజ్"

"అతనింటి పేరేమిటి?"

అతను మళ్ళీ పత్రికలోకి దొంగతనంగా చూశాడు.

"సిరివెన్నెల చంద్రకాంత్"

"ఓ- ఐసీ! అన్నాడు కల్నల్. "సిరివెన్నెల- ఈ పేరుతో ఏదో సినిమా ఉన్నట్లుందే..." తనలో తను అనుకుంటున్నాడు.

"సిరివెన్నెల చంద్రకాంతా?" ఆశ్చర్యంగా అడిగింది పూజ.

"అవును."

"అతని అడ్రసేమిటి?" అడిగింది సీత మరింత అనుమానంగా.

అతనికి ఊపిరాడటం లేదు. బుర్ర బొత్తిగా పని చేయటం మానేసింది.

"అడ్రసా?"

"అవును. ఎక్కడుంటాడు. అతని అడ్రసేమిటి?" మరింత దబాయింపుగా అడిగింది.

"వాడి అడ్రస్ వెరీ సింపుల్" అంటూ మళ్ళీ మాగజైన్‌లో పేజీ చూశాడు చంద్రకాంత్ అడ్రస్ కోసం కనబళ్ళేదు-.

"ఆ! సిరివెన్నెలచంద్రకాంత్ఎట్‌జీమెయిల్‌డాట్‌కామ్-" అన్నాడు చిరునవ్వుతో.

కర్నల్ అప్పటికప్పుడే ఆ అడ్రస్ ఓ కాగితం మీద రాసుకుంటూ కనబడ్డాడు.

అతనికి కర్నల్ చర్య కొంచెం ప్రమాదకరంగా కనిపించింది.

తను కొంచెమయినా ఆఫెన్స్‌లో కెళ్ళకపోతే వాళ్ళు తను చెప్పిన కథని చీల్చి చెండాడే అవకాశాలు ఎక్కువగా వున్నట్లు అర్థమైంది.

"కానీ మీరు మరీ ఇన్ని వివరాలడగటం టూమచ్. నేను మరీ అబద్ధాల కోరునయినట్లూ, రోజూ రాత్రుళ్ళు ఇంట్లో వుండకుండా ఎక్కడెక్కడో తిరుగుతున్నట్లూ బిహేవ్ చేస్తున్నారు. ఐ డోంట్ లైకిట్" అన్నాడు ప్రొటెస్ట్ చేస్తున్న ధోరణిలో.

"ఆ! గుర్తుకొచ్చింది" కెవ్వున కేక వేసింది పూజ.

గోపాల్రావ్‌కి వణుకు పుట్టుకొచ్చింది ఆ కేక విసేసరికి.



"ఏం గుర్తుకొచ్చింది?"

"మీ ఫ్రెండ్ పేరు చంద్రకాంత్ అన్నావు కదూ?"

"అవును" భయంగా అన్నాడు.

"ఇంటిపేరేమన్నావు?"

"సిరిమువ్వల అన్నాను."

"ఛట్- కాదు. సిరివెన్నెల అన్నావు"

"ఆ అవునవును! సిరివెన్నెల చంద్రకాంత్ కరెక్టే! నాకు భలే కన్‌ఫ్యూజన్‌లే ఎప్పుడూ."

"వండర్‌ఫుల్ బావా! ఫేమస్ రచయిత చంద్రకాంత్ మీ ఫ్రెండని ఎప్పుడూ చెప్పలేదే మరి?" ఎగ్జయిటయిపోతూ అంది.

అతని గుండె ఆగిపోతుందేమో అనిపించింది.

అంతా సద్దుమణికిపోతుందనుకుంటూంటే ఈ పూజ మళ్ళీ ఏవో గోతులు తవ్వుతోంది.

"ఆ.. అందులో పెద్ద చెప్పుకునేదేముంది? ఏదో రాస్తూంటాడు వాడు హోప్‌లెస్ ఫెలో"

"అయ్యో! అంత గొప్ప రచయితను పట్టుకొని ఏదో రాస్తూంటాడేమిటి బావా? నీకు తెలుసో తెలీదో, అతను ఒకప్పుడు నా అభిమాన రచయిత! నాకే కాదు- ఆంధ్రదేశంలో ఎంతోమందికి అభిమాన రచయిత!"

"అయితే నువ్వు రాత్రంతా ఆ రచయిత చంద్రకాంత్‌తో గడిపానంటావ్? అడిగాడు కర్నల్.

"ఎస్! సెంట్‌పర్సెంట్! తప్పలేదు. చెప్పాను కదా కొంచెం మందు ఓవర్ అయి..."

"ఆల్ రైట్! ఇందులో ఎంతవరకూ నిజముందో నేను కనుక్కుంటాను"

గోపాల్రావ్ గుండె గుభేల్‌మంది.

కొంపదీసి ఈ కర్నల్‌గాడు ఆ రచయితను కలుసుకుంటాడా ఏమిటి?

రత్నప్రభ కల్పించుకుంది.

"అయిందేదో అయింది. పాపం అతగాడినలా నిలబెట్టి హింసిస్తున్నారేంటి? భజన్‌రావ్" అంటూ పిలిచిందామె.

అతను కప్పుతో కాఫీ తాగుతూ వచ్చాడు.

"ఏంటి మేడమ్?"

"మా అందరికీ బెడ్‌కాఫీ ఇవ్వవేం?"

"నేను ముందు తాగాలి కదండీ! బెడ్ కాఫీ తాగందే ఏ పనీ చేయటం అలవాటు

లేదు."

"ముందు నువ్వు తాగాలా?" మండిపడుతూ అంది.

"ఔనండీ! అందుకిష్టమైతేనే పని చేస్తానని ముందే చెప్పాను. కావాలంటే మేడమ్‌ని కనుక్కోండి"

"అవును మమ్మీ! నిజమే.. వంటవాళ్ళ షార్టేజ్..." వప్పుకుంది సీత.

"బేబీ...! నువ్వు అనవసరంగా అందరికీ లీనియెన్స్ ఇచ్చి చెడగొడుతున్నావ్. నా కొక్కసారి ఫోన్ చేసి పిలిస్తే ఆ ఒప్పందం ఇంకో రకంగా వుండేది" కోపంగా అన్నాడు కనకారావ్.

భజన్‌రావు తన బెడ్‌కాఫీ తాగి అప్పుడు వంటింట్లో కెళ్ళాడు.

"సీతా! రాత్రంతా నిద్రలేదు సరిగ్గా. ఇవాళ రెస్టు తీసుకుంటాను. ఆఫీస్ వాళ్ళు ఫోన్ చేస్తే నేను రానని చెప్పేసెయ్"

అనేసి తన బెడ్‌రూమ్‌లోకి నడిచాడు గోపాల్రావ్ వాళ్ళనుంచి తప్పించుకోడానికి.

తలుపులు వేసుకుని బెడ్ మీద వాలాక కొంత ధైర్యం వచ్చింది.

జరిగిందంతా ఓసారి గుర్తు తెచ్చుకున్నాడు.

ఇంతవరకూ ఎలాగోలా మానేజ్ చేశాడు గానీ ఇప్పుడు ఆ మావగాడు సీత కింకేమైనా కొత్త మెలికలు నేర్పిస్తాడేమో కనిపెట్టి వుండాలి.

వంటవాడు కాఫీ తీసుకొచ్చాడు.

"భజన్ రావ్..."

"ఏం సార్?"

"గొడవంతా సద్దుమణిగినట్లేనా?"

"ప్రస్తుతం అలాగే వుంది సార్...! ఓ ఇరవై రూపాయలుంటే ఇస్తారా సార్? షేవింగ్ క్రీమ్ కొనుక్కోవాలి."

అతనికి అర్థమైంది.

వాడితో తనకిప్పుడు అవసరం వుంది గనుక బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు.

వెంటనే లేచి పర్సులో నుంచి ఇరవై రూపాయలు తీసి ఇచ్చాడు.

"మీరు చెప్పిన కథ బాగానే వుందిగానీ, అందులో కొన్ని లూప్‌హోల్స్ వున్నాయ్ సార్!"

అతను ఉలిక్కిపడ్డాడు.

"నేను చెప్పింది కథేమిటి? నిజంగానే జరిగింది"

"బుద్ధున్నోడెవడూ అది నిజమంటే నమ్మడు సారూ!"



"అంత వీక్‌గా వుందంటావా?"

"కిండర్‌గార్డెన్ కుర్రాడు ఇంకొంచెం మంచి కథ చెప్పగలడు సార్!"

వాడిని దబాయించి లాభం లేదని అర్థమైందతనికి.

"సరే! నేను చెప్పింది కథే అనుకో. అందులో లూప్‌హోల్స్ ఏం కనబడ్డాయ్ ఆ మిలటరీ వాడికి?"

"అదే సార్! మీరిచ్చిన అడ్రస్."

అతను గాబరాగా చూశాడు.

"ఏమైందా అడ్రస్‌కి?"

"ఇప్పుడే అమ్మగారూ, వాళ్ళ మిలట్రీ నాన్నా కలిసి ఆ రచయితకు- అంటే మీ మీ ఫ్రెండ్‌గారికి టెలిగ్రామ్ ఇచ్చారండీ!"

గోపాల్రావ్ సగం తాగిన కాఫీ అంతా బయటకొచ్చేసింది.

"ఏమని?" అదిరిపడుతూ అడిగాడు.

"అదేసార్- మీ ఫ్రెండ్ చంద్రకాంత్‌ని ఓసారి మీకు తెలీకుండా ఇక్కడికొచ్చి అమ్మగారిని కలుసుకోమని"

అతనికి కాళ్ళూ చేతులూ వణకటం మొదలుపెట్టినయ్.

"కొంప మునిగింది భజన్‌రావ్!"

"చాలా నేచురల్‌గా మునిగిందండీ. బహుశా ఇంక ఛస్తే బయటకు రాదు"

"ఇప్పుడిందులో నుంచి బయటపడటం ఎలా?"

"ఓ పాతికుంటే కొడతారా? మా గాళ్‌ఫ్రెండ్‌కి ఫెయిర్ అండ్ లవ్‌లీ కొనాలి"

"ఆ! మీ గాళ్‌ఫ్రెండ్ అంత కాస్ట్‌లీ క్రీమ్ వాడుతుందా?"

"కొనిచ్చే వాడుంటే ఎంత కాస్ట్‌లీ అయితే మాత్రం ఏముంది?"

అతను ఇంకో పాతిక ఇచ్చాడు.

"మీరు ఆ చంద్రకాంత్ అనేవాడికి వెంటనే ఇంకో టెలిగ్రామ్ యివ్వండి."

"ఏమని?"

"నేనే ఫలానా మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని కల్సుకుంటాను. డోంట్ కమ్- సీత" అని.

"వండర్‌ఫుల్ ఐడియా. ప్రస్తుతానికి గండం తప్పుతుంది"

"అవున్సార్! కొంతవరకూ- ఆ మిలటరీవాలా స్వయంగా వెళ్ళి ఆ చంద్రకాంత్‌ని కలుసుకోవాలని ప్లాన్‌లో వున్నాడు. ఒకవేళ అలా చేస్తే మాత్రం మిమ్మల్ని ఆ దేవుడు కాదుగదా- ఆఖరికి నేను కూడా రక్షించలేను"

"అయితే నేనిప్పుడే స్నానం చేసి, నువ్వు చెప్పినట్లు 'మెయిల్' కొట్టేస్తా"

"ఎంత త్వరగా ఆ పని చేస్తే అంత మంచిది సార్!"

"ఈలోగా ఇంకేమైనా కొత్త డెవలప్‌మెంట్స్ ఉన్నాయేమో కనిపెడుతూండు."

"డేగలాగా చూస్తూంటానండీ"

అతను హడావుడిగా కాఫీ తాగి బాత్‌రూమ్‌కెళ్ళి స్నానం ముగించాడు.

డ్రెస్ చేసుకుంటూంటే వచ్చింది సీత.

"ఆఫీస్‌కి వెళ్ళనన్నావ్ గదా? మళ్ళీ ఎక్కడికి?"

"అదే.. నేను నిన్న బర్త్‌డే గిఫ్ట్ కొనటం మర్చిపోయాను కదా! వెళ్ళి తీసుకొచ్చేస్తాను."

"ఆ... ఆ... అబద్ధాలు చెప్పకు బావా! ఆడపిల్లలు పుడతారు... ఇదిగో... అక్కయ్యకు నిన్నే కొన్నావుగా ఈ బ్యూటిఫుల్ గిఫ్ట్" అంది పూజ విచిత్రమైన పెన్ చూపిస్తూ.

ఆమె చేతిలో రాణి పెన్ చూసి పక్కనే బాంబ్ ప్రేలినంత కంగారుగా గాల్లో కెగిరి కిందపడ్డాడు.

"అ.. అ... అ... అదెక్కడిది నీకు?" గాబరాగా అరిచి మళ్ళీ తీసేసుకోడానికి ప్రయత్నిస్తూ అడిగాడు.

పూజ దానిని అమాంతం వెనుకకు తీసుకుంది.

"అబ్బా! ఆశే పాపం. ఇది నువ్వు అక్కకి గిఫ్ట్‌గా ఇస్తే అక్క నాకు బహుమతిగా యిచ్చింది."

"కానీ... అది..."

"ఊఁ ఏది?"

"అది కొంచెం డిఫెక్టివ్‌గా వుంది. ఐ మీన్– ఇంతకన్నా మంచి కలరు ఇంకోటుంది. ఎక్స్ఛేంజ్ చేసి ఆ కలరు తెద్దామని"

"కానీ నాకీ కలరే బాగుంది బావా! ఐ సింప్లీ లవిట్."

"అలాగా! ఓకే– ఓకే– అయితే సరే."

"థాంక్యూ! పెన్ కాఫ్‌కి రెడ్ ఇండియన్ తలకాయ ఎంత బావుందో తెలుసా? సింప్లీ సూపర్బ్ సెలక్షన్ బావా!"

"అయితే ఇంక మీరు బయటకు వెళ్ళక్కర్లేదు కదా!" అంది సీత.

"ఆ అవసరం లేదనుకో! కానీ ఆ.... గుర్తుకొచ్చింది, ఒక్కసారి ఆఫీస్ కెళ్ళాలి"

"ఎందుకు?"

"ఆల్మారా తాళం చెవి నా దగ్గరే వుంది. వాళ్ళకేమయినా ఫైల్స్ అవసరమొస్తే తీసుకోవాలి కదా! ఇచ్చేసి వస్తాను."



బయటకు నడిచాడతను గాబరాగా.

గేటు తీస్తూండగా షాక్ తగిలినట్లయింది.

ఎదురుగా రాణి ఆటో దిగుతూ కనిపించింది.

పై ప్రాణం పైనే పోయింది.

"హాయ్" అందామె చిరునవ్వుతో దగ్గరకొస్తూ.

"హాయ్ ఏమిటిలా వచ్చారు?" లోపల్నుంచి సీత చూస్తుందేమో అన్న భయంతో వెనక్కి తిరిగి చూస్తూ అన్నాడు.

"ఏమిటలా కంగారుపడుతున్నావ్? ఎనీ ప్రాబ్లెమ్?"

"అహహ ప్రాబ్లెమేం లేదు."

"మరింట్లోకి ఇన్‌వైట్ చేయరేం?"

"ఆ.. ఇంట్లోకా?" గాబరాగా అరిచాడు.

భజన్‌రావ్ వెనుక వేపు నుంచి వచ్చాడు వారి దగ్గరకు.

"ఇంట్లో ఇప్పటికే చుట్టాలు నిండిపోయారు మేడమ్!"

"ఓ– అలాగా!"

"అదీగాక అమ్మగారికి అంటే గోపాల్రావ్‌గారి మిసెస్‌కి లేడీ ఫ్రెండ్స్ అంటే అంత లైకింగ్ వుండదు."

అతను భజన్‌రావ్ వేపు కోపంగా చూశాడు.

"షటప్– ఏమిటా పిచ్చివాగుడు?" అన్నాడు మందలింపుగా.

"అర్థమయిందిలెండి. అయితే నేను తక్షణం ఇక్కడినుంచి వెళ్ళిపోవటం మంచిది కదూ?" చిరుకోపంతో అంది రాణి.

"అహహ.. అలా అని కాదు. పోనీ మా ఆఫీస్ కొస్తారా?"

"అవసరం లేదు! మీకు రావాలనిపిస్తే మీరే మా ఇంటికి రండి."

"ఓ– ష్యూర్! అడ్రసివ్వండి."

ఆమె కార్డు ఇచ్చింది.

"నేను మీ ఇంటికెందుకొచ్చానా అనుకుంటున్నారు కదూ?"

"నో నో నో నో! అలా ఎందుకనుకుంటాను. వెల్‌కమ్ వెల్‌కమ్ కానీ– ఇంకోసారి అహహ"

"నాకు తెలుసులే– అబద్ధాలు చెప్పకండి. నిన్న మర్చిపోయి ఆ ఫ్యాన్సీ పెన్ మీ బ్యాగ్‌లో పెట్టాను. నిజానికది నాది కూడా కాదు, మా ఫ్రెండ్‌ది. ఆమె వెంటనే అది తీసుకురమ్మని పంపింది. అదిస్తే ఇంకెప్పుడూ మిమ్మల్ని ట్రబుల్ చేయను"

అతనికి మతిపోయినట్లయింది.

"ఆ పెన్ను కోసమా? పోనీ ఓ పని చేయకూడదూ! అలాంటి పెన్ను ఇంకోటి కొనిస్తాను."

"సారీ! మా ఫ్రెండ్‌కి ఆ పెన్నుతో సెంటిమెంట్. అదే కావాలని పట్టుపట్టింది. నేనిక్కడే నిలబడతాను- తెచ్చిచ్చారంటే...."

"ఆల్ రైట్! రేపు ఆఫీసుకి రండి- తెచ్చిస్తాను. ఓ.కె.! ప్రస్తుతం మళ్ళీ ఇంట్లోకెళ్ళి తేవటం కుదరదు. ఇల్లంతా గెస్ట్స్."

"తప్పకుండా తెచ్చిస్తారా?"

"సెంట్‌పర్సెంట్"

"ఒకవేళ లేకపోతే నేను మళ్ళీ ఇంటికి రావాల్సి వస్తుంది."

"అహహ.... వద్దు వద్దు- తప్పకుండా ఆఫీస్‌కే తెచ్చిస్తాను."

"ఓకే సీయూ."

"సీయూ- టాటా- బై- వెళ్ళరేం ఇంకా?"

"అవునూ- ఒంటరిగా అమ్మాయి కనిపిస్తే కొంతమంది మగాళ్ళు అంత గౌరవంగా, ప్రేమగా, అంత స్నేహంగా బిహేవ్ చేస్తారు. కానీ ఆ అమ్మాయి ఇంటికొస్తే అంత అప్సెట్ అయిపోయి ఆ అమ్మాయి ఎప్పుడు వెళ్ళిపోతుందా అని ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుంటా రెందుకని?" టీజింగ్‌గా అడిగింది.

అతను ఆలోచనలో పడినట్లు నటించాడు.

"ఎందుకంటే ఆ అమ్మాయిని రియల్‌గా లైక్ చేస్తారు కాబట్టి మేడమ్" అన్నాడు భజన్‌రావ్.

"ఎస్ కరెక్ట్!" అన్నాడతను.

"ఎస్ యూ ఆర్ కరెక్ట్! ఓకే సీయూ" అనేసి అదే ఆటోలో వెళ్ళిపోయిందామె.

"హమ్మయ్య.... పెద్ద గండం నుంచి బయటపడ్డాం" అన్నాడతను కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ.

"అని మీరనుకుంటున్నారు సార్! కానీ ఆ కిటికీ దగ్గర్నుంచి చూస్తున్న మేడమ్- ఆ మిలట్రీవాలా మాత్రం అలా అనుకోవటం లేదు."

అతను అదిరిపడి వెనక్కి తిరిగి చూశాడు.

సీత బయటికొచ్చిందప్పుడే.

"ఎవరా అమ్మాయి?" అనుమానంగా అడిగింది.

అతనికేం జవాబు చెప్పాలో తెలీలేదు. బ్రెయిన్‌కి పక్షవాతం వచ్చి నట్లయి పోయింది.



"కొత్తగా మార్కెట్లోకొచ్చిన బట్టల సబ్బులమ్మే సేల్స్‌గాళ్ మేడం, కొనమని తెగ బ్రతిమాలింది గానీ సార్ ఏమాత్రం అవసరం లేదని అన్నారు. ఇప్పటికే ఇంట్లో పెద్ద బార్ సోప్ వుంది. మళ్ళీ వేరే సోప్‌లెందుకని గెంటేశారు."

అతను స్టన్ అయిపోయాడు.

అంత అద్భుతమయిన అయిడియా తనకెందుకు రాలేదు?

"ఓ.కె! వెళ్తాను" కార్లో కూర్చుని స్టార్ట్ చేస్తూ అన్నాడతను.

కారు కొంతదూరం వచ్చాకగానీ మళ్ళీ మామూలు మనిషి కాలేకపోయాడు.

భజన్‌రావ్ సమయస్ఫూర్తితో తనను రక్షించబట్టిగానీ లేకపోతే రెడ్‌హాండెడ్‌గా దొరికిపోయేవాడు.

వెంటనే చేరుకుని. త్వరత్వరగా ల్యాప్‌టాప్ నుంచి మెయిలిచ్చేశాడు.

"నేనే వచ్చే ఆదివారం మీయింకొస్తున్నాను. అక్కడే కలుసుకుందాం- సీత" అని రాశాడందులో.

అప్పటికి ధైర్యం వచ్చిందతనికి.

అయినా ఇంకా లోలోపల అనుమానం పూర్తిగా పోలేదు.

మొదటి మెయిల్ చూసి కుతూహలం కొద్దీ ఆ రచయితగాడు "హూ ఆర్ యూ?" అంటూ మళ్ళీ మెయిల్ కొట్టాడంటే కథ మళ్ళీ మొదటికొచ్చేస్తుంది.

అదీగాక ఆ కర్నల్‌గాడు ఏ క్షణాన్నయినా నిజం ఋజువు చేసుకోవాలని చంద్రకాంత్‌ని కలుసుకోడానికి వాడి ఊరువెళ్ళినా ఆశ్చర్యపోనక్ఖర్లేదు.

ఎటూ తోచక ఆఫీస్ వరండాలోనే నిలబడి ఆలోచనలో పడిపోయాడు అతను. ఆ పరధ్యానంలో వుండగా భుజం మీద దభేల్‌మని ఎవరో లాగి కొట్టేసరికి కెవ్వున కేక వేశాడు. ఆ కేకకు వరండాలో నిలబడ్డ చాలామంది ఏం జరిగిందో తెలీక బయటకు పరుగెత్తారు. ప్రాణాలు అరచేతిలో పట్టుకుని-

"ఏంటి మిత్రమా అలా అరచావు? నేనే కొట్టింది" అన్నాడు భవానీశంకర్.

గోపాల్రావ్‌కి అతనిని చూసేసరికి పోయిన ప్రాణం తిరిగివచ్చినట్లయింది.

"ఓరి నువ్వా? ఎంతకాలానికి కనబడ్డావురా? ఏమైపోయావు ఇన్నాళ్ళూ?" అడిగాడు ఉత్సాహంగా.

"స్ట్రగుల్ ఫర్ సర్వైవల్ బ్రదర్! రకరకాల ఉద్యోగాల్లో చేరటం కొద్ది రోజుల తర్వాత ప్రొప్రయిటర్‌కీ, మనకీ అభిప్రాయ బేధాలు రావటం, పురజనుల కోరిక మీద మనం రిజైన్ చేయటం, మళ్ళీ ఉద్యోగం వేటలో పడటం, ఇదీ నెట్‌వర్క్ కార్యక్రమం మిత్రమా! నా సంగతి సరే! ప్రస్తుతం నీ కార్యక్రమం ఏమిటి? మనిద్దరం ఎక్కడయినా త్రీ బై టూ

కాఫీ కొడుతూ మంచి చెడూ మాట్లాడుకునే ఛాన్సుందా”

“ఓ లాట్సాఫ్ టైమ్”

“ఒండరఫుల్! అయితే పద మాంచి హొటల్‌కి...”

“ఓకే!”

ఇద్దరూ ఓ హొటల్‌కి చేరుకుని త్రీ బైటూ కాఫీ తాగసాగారు.

భవానీ శంకర్ చెప్పే మాటలకు ‘ఊ’ కొడుతూనే మధ్య మధ్యలో ట్రాన్స్‌లో కెళ్ళిపోతున్నాడు గోపాల్రావ్.

“నీ బాడీ, నీ మనసు రెండూ వేరు వేరు కాపురాలు పెట్టినట్లు నాకనిపిస్తోంది మిత్రమా! ఏమిటి సంగతి? సెకండ్ సెటప్‌లాంటి దేమయినా పెట్టావా?”

గోపాల్రావ్ స్పృహలోకొచ్చాడు.

“నో నో! అలాంటిదేమీ లేదురా. ఒక్క సెటప్‌తోనే మటాష్ అయిపోతున్నాను”.

“అయితే ఆఫీస్‌లో లక్షలు లక్షలు ఫ్రాడ్ చేసి వుండాలి. ఇది మనదేశంలో ఫ్రాడ్‌ల సీజన్ కదా.”

“కాదురా! ఇంట్లో గొడవలు.”

“ఇంట్లో గొడవలా? ఇంపాజిబుల్ మిత్రమా! కావాలని లవ్ చేసి పెళ్ళిచేసుకున్న పిల్లతో గొడవా?”

“అది మామూలు పిల్లకాదురా నాయనా! ఏకే47! అచ్చం వాళ్ళ నాన్నే అనుకో దానికితోడు నా మీద అనుమానం. నేను వేరే అమ్మాయిలతో ఎఫైర్స్ పెట్టుకున్నానని–”

“అనుమానమేముంది? నిజమేగా! అదివరకు ఎక్కడ అమ్మాయి కనబడినా....”

“ష్! అరవకు. మనల్ని మా మావగాడు ఫాలో అయినా అయివుండవచ్చు...” చుట్టూ భయంగా చూస్తూ అన్నాడు.

“పరిస్థితి అంత దారుణంగా వుందా బ్రదర్?”

“నిన్నటినుంచీ అసలు నిప్పంటుకున్న ఇంట్లో వున్నట్లు వుందనుకో.”

“కారణం ఏమిటి మిత్రమా? కారణంలేందే పొగరాదనే సూత్రం మీద మనక్కొంచెం గురి ఎక్కువలే. అందుకని అడిగాను.”

“అయితే నీకు మొదటినుంచీ జరిగిందంతా చెప్పాలి.”

“కొంచెం క్లుప్తంగా చెప్తే మనిద్దరికీ శ్రేయస్కరమని నా అభిప్రాయం”.

“ఆల్‌రైట్! ఎక్కడినుంచి మొదలు పెట్టను?”

“నిన్న ఓ పిల్ల కనిపించింది’ దగ్గర్నించి మొదలుపెట్టు. ప్రపంచంలో ఇబ్బందులన్నీ అక్కడినుంచే మొదలవుతాయ్ కదా?”



“ఎస్! నిన్న ఓ పిల్ల కనిపించింది...”

అంటూ గోపాల్రావ్ జరిగిందంతా చెప్పాడు.

“చెప్పటం అయిపోయిందా?” అడిగాడు భవానీశంకర్.

“అయిపోయింది.”

“అయితే ఇంక విను... నువ్వీ మెస్‌లోనుంచి బయటపడ్డానికి దేరీజ్ ఓన్లీ వన్ వే...”

“ఏమిటదీ?” ఆతృత్రగా అడిగాడు.

“స్కీమ్ నెంబర్ త్రీ...”

“అంటే?”

“వెంటనే మనం ఆ రచయిత చంద్రకాంత్‌గాడిని ఈడ్చుకొచ్చి నిన్న రాత్రంతా నువ్వు వాడితోనే గడిపినట్లు చెప్పించటం.”

గోపాల్రావ్‌కి చిరాకు పుట్టుకొచ్చింది.

“ఏడ్చినట్లుంది. ఆ రచయితగాడికిం కేం పని వుండదా? పెళ్ళాలకు అబద్ధాలు చెప్పిన వాళ్లందరి ఇళ్ళకూ వెళ్ళి మీ ఆయన నాతోనే వున్నాడని సర్టిఫికేట్స్ యిస్తూ టూరింగ్ చేస్తూంటాడా? ఛస్తే రాడు.”

“వాడు కాపోతే ఇంకోడు వస్తాడు మిత్రమా!”

“ఇంకోడెవడు?”

“ఎవడైనా కావచ్చు. ఒకవేళ ఇంకెవడూ కాకపోతే నేను కావచ్చు.”

“అంటే?”

“అంటే నేనే చంద్రకాంత్‌నంటూ మీ ఇంటికొస్తాననుకో. అహహ! అనుకో. నన్నెలాగూ ఇంతవరకూ మీ మిసెస్ వాళ్ళ మిలట్రీ ఫాదర్ చూళ్ళేదు. కనుక నా మాట చచ్చినట్లు నమ్మక తప్పదు. ఎలా వుందిది?”

గోపాల్రావ్ ముందు నిశ్చేష్టుడయ్యాడు.

ఆ తర్వాత కొద్ది క్షణాలు స్పృహ తప్పాడు.

ఆ తర్వాత మళ్ళీ స్ప ృహలోకొచ్చీ రాగానే అమాంతం భవానీ శంకర్‌ని కౌగలించుకున్నాడు.

“అబ్బ... ఎంత మంచి అయిడియా వచ్చిందిరా! సింప్లీ సూపర్బ్– మా మిసెస్‌కాదు గదా– ఆ కర్నల్‌గాడు కూడా ఈ దెబ్బతో సైలెంటయి పోవలసిందే.”

“చచ్చినట్లు...”

“అవును.. ఏం?”

"నీ బ్రెయిన్ని నమ్ముకుంటే నన్ను కూడా సర్వనాశనం చేసేట్లున్నావు. మనిద్దరం కలిసి వెళితే అనుమానం వస్తుంది మిత్రమా! అంచేత నేను ముందు వెళ్ళి డ్రామా ఆడుతూంటాను. డ్రామా ఆఖర్లో నువ్వురావాలి."

"ఓకే బ్రదర్! వెళ్ళిపో- ఆలస్యం చేయకు. కమాన్ ప్లీజ్! డోంట్ వేస్ట్ టైమ్."

"మీ ఇంటి అడ్రస్ యివ్వకుండా ఎలారా?"

"ఆటోవాడికి గుర్తులు నేనే చెప్తానుకదా?" అంటూ ఆటోని పిలిచి అరగంటసేపు ఇంటి గుర్తులు చెప్పాడు.

అంతి వినేసరికి ఆటోవాడి బ్రెయినంతా పాడైపోయినట్లయింది.

"అలా కన్ఫ్యూజన్ చేయకండి సార్! మరీ ఎక్కువ గుర్తులు చెప్పకూడదు ఎప్పుడూ. వీలైనంత తక్కువగా మాట్లాడితే తేలిగ్గా అర్థమవుతూంది..." అన్నాడు నెత్తిమీద గట్టిగా కొట్టుకుంటూ...

"వాడెందుకులే బ్రదర్! నేను చూపిస్తా ఇల్లు పద....." అన్నాడు భవానీశంకర్.

ఆటో పావుగంటలో ఇల్లు చేరుకుంది.

దిగి లోపలకు నడిచాడతను. హాల్లో ఎవరూ కనిపించలేదు.

"హలో!" అన్నాడు హాల్లో నిలబడి- "హలో... హలో... హలో... హలో..."

సీత ఆతృతగా బయటికొచ్చింది. అలా పిట్టలా అరుస్తోందీ ఎవరా అని చూడ్డానికి. అతనిని చూసి ఠక్కున ఆగిపోయింది.

"ఎవరి కోసం?" అడిగిందామె.

"ఇంకెవరి కోసం ఫ్రెండ్! మిసెస్ సీతా గోపాల్రావ్...."

"నేనే సీతను. మీరు...."

"ఏడ్చినట్లుంది మైడియర్ సీతాజీ- మెయిల్ ఇచ్చి రమ్మని పిలిచేది మీరే. వచ్చాక మీరెవరని అడిగేది మీరేనా? వెరీబాడ్... వెరీబాడ్...."

సీతకు ఛటుక్కున అర్థమైపోయింది.

"మైగాడ్! మీరు చంద్రకాంత్గారా?"

"అంటే నేనెవరో తెలీకుండానే మెయిల్ ఇచ్చారన్నమాట. నాకు తెలుసు మేడమ్! ఇలాంటి తిరకాసేదో వుంటుందనీ..."

"అహహ మీరు తెలీదని కాదు... మీరు తెలుసు కానీ మిమ్మల్నెప్పుడూ చూడలేదన్నమాట. అంటే మీరు తెలీదుగానీ, మీరు బాగా తెలుసు" తడబడుతూ అంది.

"ఇంత అర్జంటుగా రమ్మని ఎందుకలా మెయిలిచ్చారు? ఎనీ ప్రాబ్లెమ్? గోపాల్రావ్ కేమైనా జబ్బు లాంటిది సడెన్గా వచ్చిందా?"



"అహహ అదీ- అది... మీరు కూర్చోండి కాఫీ తెస్తాను."

"కాఫీ ఇవ్వటం కోసం అర్జంటుగా రమ్మని మెయిలిచ్చి పిలిపించారా?" కోపంగా అడిగాడు.

"అహహ! అదికాదు. ఇదంతా మా డాడీయే చేశారు."

"ఎవరు? ఆ మిలటరీవాలానా? మరి అతనే కాఫీ తయారుచేశాడా?"

అతని గొంతు విని అక్కడకు చేరుకుంటున్న కనకారావ్కి వళ్ళు మండిపోయింది.

"ఏయ్ నువ్వేనా మిలటరీవాలా అంది?" అమాంతం భవానీశంకర్ దగ్గరకొచ్చి అతనిని చొక్కా పట్టుకుని పైకి లేపుతూ అడిగాడు.

"నో నో నో! యూ ఆర్ మిస్టేకెన్ మైడియర్ మిలటరీవాలా! మిలటరీవాలా అంటే నా ఉద్దేశ్యం మిలటరీవాలా అని కాదు- నెవర్"

"కాపోతే మరేమిటి?"

"మిలటరీ జెంటిల్మన్ అని అర్థం..."

సీత చప్పున తండ్రికి అడ్డుపడింది.

"డాడీ! ఈయనే చంద్రకాంత్ డాడీ! మన మెయిల్ అందగానే బయల్దేరి వచ్చేశారు. రైటర్ చంద్రకాంత్."

"ఓ! దిస్ ఫెలో?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఎస్ డాడీ! సేమ్ ఫెలో...."

"సో- యూ ఆర్ మిస్టర్ చంద్రకాంత్?" చంద్రకాంత్ నడిగాడు అనుమానం తీరిక.

"ఎస్సర్! అయామ్ మిస్టర్ చంద్రకాంత్- ఎనీ డౌట్?"

"నో- నో! ఓ వెరీ గ్లాడ్ టు సీయూ" బలవంతంగా కరచాలనం చేశాడు.

"నేను కూడా మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషించే వాడినే మిత్రమా! ఎటొచ్చీ నా చేతిని కొంచెం లూజ్గా వదుల్తే తక్కువ ఫ్రాక్చర్స్తో బయటపడతాను- ఎక్కువ సంతోషంగా వుంటాను."

కల్నల్ పగలబడి నవ్వాడు.

"అహ్హాహ్హాహ్హా! మనం కొంచెం టఫ్లే. ఆర్మీ కదా! సివిలియన్స్ అంతా డెలికేట్ సన్నాసులు. కమాన్- సిడౌన్."

చంద్రకాంత్ సోఫాలో కూలబడ్డాడు.

"ఓకే! మిలటరీ జెంటిల్మన్! నన్ను అర్జంటుగా పిలిపించిన కారణం చెప్పనే లేదు."

"ఆ- ఎస్ దేరీజ్ రీజన్"

భజన్రావ్ ట్రేలో కాఫీలు తీసుకొచ్చాడు "వాటీజ్ దట్ రీజన్?" అడిగాడు భవానీ.

"కాఫీ తీసుకోండి" అంది సీత.

భవానీశంకర్ ఓ కప్పు అందుకున్నాడు.

"షుగర్ తక్కువయితే ఇప్పుడే చెప్పండి సార్! నేను వెళ్ళాక గావుకేకలేస్తే కుదర్దు" అన్నాడు భజన్‌రావ్.

భవానీశంకర్ కాఫీ సిప్ చేశాడు.

"ఆహా! ఒండర్‌ఫుల్ కాఫీ- మీ వంటవాడెవడోగానీ ఎక్కువకాలం బ్రతకడు."

భజన్‌రావ్ ఉలిక్కిపడ్డాడు.

"ఎందుకని సార్?"

"మంచి పేరు తెచ్చుకున్న వాడినే దేవతలు పైకి పిల్చేస్తారని మా తాతయ్య అంటుండేవాడు. అది ఫాక్ట్ కూడా- ఇప్పుడీ మిలటరీ వాలాని చూడు- దేవతలు చావనన్నా చస్తారుగానీ ఈ బాపతుని ఛస్తే పిలవరు."

కనకారావ్ ముఖం జేవురించిందిగానీ తమాయించుకున్నాడు. "డోంటాక్ నాన్సెన్స్" అని భజన్‌రావ్ వైపు తిరగాడు.

"భజన్ రావ్!" పిలిచాడతను.

"ఎస్సర్!"

"ఇక్కడే నిలబడి ముఖాలు చూడనఖ్ఖర్లేదు. గెటెవే" మండిపడుతూ అన్నాడు.

భజన్‌రావ్ లోపలికెళ్ళిపోయాడు.

"మిస్టర్ చంద్రకాంత్! మిమ్మల్నో విషయం కన్ఫర్మ్ చేసుకోడానికని పిలిచాము" విషయంలోకొస్తూ అన్నాడు.

"ఓ- అలాగా ఫ్రెండ్! వెల్‌కమ్- ఏమిటది?"

"అదే.. నిన్న రాత్రంతా మా వాడు అయ్‌మీన్ మా సనిన్లా- అంటే మీ ఫ్రెండ్ గోపాల్రావ్ మీతో హొటల్ రూమ్‌లో పార్టీ చేసుకుంటూ గడిపామని చెపుతున్నాడు. ఈజిటే ఫాక్ట్?" అది వెరిఫై చేసుకోడానికే మా అమ్మాయి నీకు మెయిలిచ్చింది.

"ఇలా అర్జంటని మెయిల్చిచ్చి అందరినీ పిలిపించడం, అదీ మా అల్లుడు రాత్రంతా మీతో వున్నాడా లేదా అని వెరిఫై చేసుకోవడం, చాలా నికృష్టమైన అయిడియా మేజర్! ఎవరు కనిపెట్టారీ అయిడియా?"

కర్నల్‌కి కోపం ఎక్కువయిపోయింది.

"నేను మేజర్‌ని కాదు."

"మేజర్ కాకపోతే కాప్టెన్"

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్? ఆయామ్ కర్నల్".



"కర్నల్? అయితే ఇంకా సిగ్గుపడాల్సిన విషయం కర్నల్! మీ అల్లుడు చెప్పిన మాటలు నమ్మకుండా బయటివాడయిన అతని ఫ్రెండ్ చెప్పే విషయాలే మీరు నమ్ముతున్నారంటే... మీ మెదడు ఓసారి స్కానింగ్ చేయించుకోవాలని నా పర్సనల్ అభిప్రాయం. ఏసియన్ హాస్పిటల్లో ఆ ఫెసిలిటీ వుంది. వెంటనే బయల్దేరటం మంచిది. స్కానింగ్ చేసేవాడు మనకి ఫ్రెండే! అపాయింట్ మెంటు లేకుండా చేసేస్తాడు."

"వాట్! నేను బ్రెయిన్ స్కానింగ్ చేయించుకోవాలా? ముందు నీ మెదడులోకి రెండు బుల్లెట్లు పంపాక అప్పుడు స్కానింగ్ గురించి ఆలోచిద్దాం" అంటూంటే సీత చప్పున వారించింది.

"అయ్యో డాడీ! మనం ఇతనిని గోపాల్రావ్‌కి తెలీకుండా పిలిపించామన్న సంగతి మర్చిపోతున్నారు. ఆయనొచ్చేలోగానే అసలు విషయం తెలుసుకుని పంపించేయాలి. లేకపోతే ఆయన మనమీద మండిపడతారు."

"ఓ... అవునవును... ఎస్... ఓ.కె. మిస్టర్ చంద్రకాంత్! మీకు మీ ఫ్రెండ్ గోపాల్రావ్ సంగతి తెలిసే వుంటుంది. అందంగా కనబడే అమ్మాయిలంటే వీక్‌నెస్ వుంది."

"ఆఫ్‌కోర్స్! ఉంది. అది ఎక్కువగా వుండబట్టే మీ అమ్మాయిని వెంటపడి బ్రతిమాలి పెళ్ళి చేసుకున్నాడు."

కనకారావ్, సీత ముఖాలు వాడిపోయినయ్.

"దటీజ్ ఓ.కె. మిస్టర్! పెళ్ళయాక కూడా ఆ వీక్‌నెస్ వుండటం మంచిది కాదని నా అభిప్రాయం."

"కర్నల్! ఇంక లాభం లేదు- యూ మస్ట్ గో టు హాస్పిటల్! బ్రెయిన్ స్కానింగ్ తప్పదు. కమాన్- నేను తీసుకెళ్తాను మిమ్మల్ని- మన ఫ్రెండే వున్నాడక్కడ. అపాయింట్‌మెంట్ లేకుండానే..."

"నో" బిగ్గరగా అరిచాడు కనకారావ్.

"లేకపోతే ఏమిటి కర్నల్? 'వీక్‌నెస్' అనే పదానికి అర్థం తెలుసా?"

"తెలుసు!"

"తెలిస్తే చెప్పండి ఏమిటో?"

"వీక్‌నెస్ అంటే... అదే వీక్‌నెస్."

"ఎస్! వీక్‌నెస్‌కి అర్థం వీక్‌నెస్ అయినప్పుడు అది ఏ మనిషిలో నుంచయినా ఎలా పోతుంది? పోదు- వీక్‌నెస్ అనేది పర్మనెంట్. మనిషి చచ్చేవరకూ అంతే! మీకు మాట్లాడితే గన్ పట్టుకుని కాల్చాలనుకోవటం వీక్‌నెస్. ఎంత వయసొచ్చినా ఆఖరికి డెత్‌బెడ్ మీదున్నా మీకా వీక్‌నెస్ పోదు. చచ్చేలోగా ఇంకొక్కసారి గన్ ఎవడిమీదో

ప్రయోగించాలనిపిస్తుంది. అవునా, కాదా?"

"నో-"

"ఎస్! డోంట్ సే నో- కనుక మా గోపాల్రావ్‌గాడిక్కూడా వీక్‌నెస్ వుండటం సహజం. అందమయిన అమ్మాయిలు కనబడితే మాట్లాడవచ్చు. నవ్వవచ్చు, పరిచయం చేసుకోవచ్చు. అందులో తప్పేమిటి? నథింగ్? అవునా కాదా?"

"అంతవరకూ ఓ.కే. మిస్టర్! కానీ నిన్న రాత్రంతా ఇంటికి రాక పోయేసరికి..."

"రాకపోయేసరికి ఎవరో అమ్మాయితో గడిపాడని అనుమానించేయటమేనా? మిస్టర్ కర్నల్! వెరీ బాడ్- వెరీ బాడ్ బ్రదర్! మీరు గన్ పట్టుకుని ఎవడి వెంటో పడినంత మాత్రాన మీరు కాల్చి చంపేసి వుంటారని అనుకోవాలా? నో... ఖచ్చితంగా మీ బ్రెయిన్లో ఏదో లోపం వుంది మిత్రమా! నా మాట నమ్మండి- కమాన్ ఏసియన్ హాస్పిటల్ కెళ్దాం. ఇప్పటికయినా మించిపోయింది లేదు. మన ఫ్రెండే స్కానింగ్ మిషన్ దగ్గరున్నాడు."

"అంటే నిన్న రాత్రంతా ఆయన మీతోనే వున్నారా?" అడిగింది సీత ఆత్రుతగా.

"ఎస్ సిస్టర్! గోపాల్రావ్ చెప్పింది సెంట్‌పర్సెంట్ కరెక్ట్. చాలా కాలానికి కలుసుకున్నామని చెప్పి నేనే బలవంతం చేసి బార్‌కి లాక్కెళ్ళాను.అక్కడ కల్నల్ బ్రాండ్ విస్కీ తాగుతూ చిన్ననాటి రోజులు గుర్తుకు తెచ్చుకుంటూంటే రాత్రి పన్నెండయిపోయింది. ఆ టైమ్‌లో కారు డ్రైవ్ చేసుకుంటూ ఇంటికెళ్ళటం మంచిది కాదని నేనే అన్నాను. ఆ పక్కనే వున్న మా హెూటల్ రూమ్‌లో పడుకున్నాం. పూర్ ఫెలో! నిద్రలో కలవరిస్తూంటే విన్నాను. సీతా! అయామ్ సారీ! నీ బర్త్‌డే సంగతి మర్చిపోయాను- ప్లీజ్ ఫర్ గివ్‌మీ సీతా" అని ఒకటే ఏడుపు. తలగడంతా ఏడుపుతో తడిసిపోయాక నేనేవాడిని లేపి డోంట్ వర్రీ! భారత భార్య తప్పకుండా భర్తను అర్థం చేసుకుంటుంది. అది మన భారత స్త్రీ సంప్రదాయం అని ఓదార్చాను."

సీత కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్.

"అయామ్ సారీ చంద్రకాంత్‌గారూ! మీకు చాలా ఇబ్బంది కలిగించాను."

"దట్సారైట్ సిస్టర్! ఈసారికి పర్లేదు. కానీ భవిష్యత్తులో ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చేయకండి. పచ్చని సంసారాలు కేవలం భార్యల అనుమానాలవల్లే సర్వనాశనమయిపోతాయన్న విషయం తెలుసుకోండి. మరి నే వెళ్ళిరానా కల్నల్?"

"ఓ.కె. జెంటిల్మన్! మీరు చేసిన సహాయానికి చాలా థాంక్స్"

భవానీ శంకర్ గతుక్కుమన్నాడు.

"రెండ్రోజులు వుండండి" అంటుందేమో అని ఎక్స్‌పెక్ట్ చేశాడు. సరిగ్గా అపుడే స్కూటరు ఇంటిముందాపి లోపలకు పరుగుతో వచ్చింది పూజ.



"అక్కా! మాకు హాలీడేస్ ఇచ్చేశారు. పదిరోజుల వరకూమన మకాం ఇక ఇక్కడే" అంది వుత్సాహంగా.

"ఎందుకని హాలీడేస్ ఇచ్చారు?" అడిగాడు కల్నల్.

"ఎవరో చచ్చిపోయారంట."

"ఎవరు?"

"ఎవరో తెలీదు. మా ప్రిన్సిపాల్ ఎవరు పోయారో తెలుసుకుందామని ఫోన్లు చేసి చేసి చివరకు మనకెందుకులే అని శలవు డిక్లేర్ చేసేశాడు" అంటూ భవానీశంకర్ని చూసింది.

అప్పటికే అతను పూజ అందాన్ని తనివితీరా చూస్తున్నాడన్న విషయము గమనించి కొంచెం సిగ్గుపడింది.

"సీతాజీ! హూ యీజ్ దిస్ బ్యూటిఫుల్ గాళ్ ఆన్ దిస్ పార్ట్ ఆఫ్ ది ఎర్త్?" అడిగాడు భవానీశంకర్.

"మా సిస్టరండీ! పేరు పూజ. ఈయన చంద్రకాంత్ గారు పూజా! మీ బావ ఫ్రెండ్."

పూజ ఉలిక్కిపడింది.

"మైగాడ్! రచయిత చంద్రకాంత్ గారా?"

"ఎస్ ఫ్రెండ్! మనమే..." సగర్వంగా అన్నాడు భవానీశంకర్-

"ఫేమస్ రైటర్ చంద్రకాంత్ మనమే".

అమాంతం అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుని కరచాలనం చేసిందామె.

"అయామ్ యువర్ ఫాన్ మిస్టర్ చంద్రకాంత్! మీర్రాసిన "జీవితమా- ఓ నిముషం ఆగు" అనే నవల నేనెన్నిసార్లు చదివానో! కెన్ యూ ఇమేజిన్?"

"నో.. నావల్ల కాదు."

"టూ హండ్రెడ్ టైమ్స్"

"నో.. నేన్నమ్మను."

"యూ మస్ట్ బిలీవ్! నా డైరీలో డిటైల్స్ కూడా రాసుకున్నాను ఎప్పుడెప్పుడు చదివిందీ- నా డైరీ చూపించమంటారా..?"

"అహ.. డైరీ అవసరం లేదు మిత్రమా! అందమైన కళ్ళే అంతరంగ డైరీలని నేనే ఏదో నవల్లో రాశాను."

పూజ థ్రిల్ అయిపోయింది.

"అబ్బ...! సూపర్బ్ ఎక్స్‌ప్రెషన్. అందమైన కళ్ళే అంతరంగ డైరీలు.. మీరు తప్ప ఇంకెవరు రాయగలరలా..?"

"ఎవడివల్లా కాదు డియర్! అంతెందుకు - అలాంటిది మళ్ళీ రాయమంటే నేనే రాయలేను."

"రాయలేరా?"

"నో..."

"ఎందుకని?"

"ఎందుకంటే.. జీనియస్‌ల మాస్టర్ పీస్‌లు చాలా తక్కువగా వుంటాయ్."

"అబ్బ! మళ్ళీ సూపర్బ్ ఎక్స్‌ప్రెషన్. జీనియస్‌లు ఏం మాట్లాడినా మాస్టర్ పిస్ అని నా అభిప్రాయం. మీరాసిన '24 గంటలు' నవల్లో ప్రతి వాక్యం మాస్టర్ పీసే అని నా డైరీలో రాసుకున్నాను. కావాలంటే డైరీ చూపిస్తాను. మేడ మీద గదిలోకొస్తారా?"

"అక్కర్లేదు. మీ మాట మీద నాకు ఎంతో నమ్మకం"

పూజా ఆనందంగా చూసింది.

"నా మాటంటే అంత నమ్మకం ఎలా కలిగింది?"

"అందమైన అమ్మాయిలు అబద్ధాలు చెప్పరు. వాళ్ళ మాటలు అందరూ నమ్మి తీరాల్సిందే.."

వాళ్ళ సంభాషణ కర్నల్‌కి నచ్చటం లేదు అతనికసలు రచయితల మీద సదభిప్రాయం లేదు. మన దేశంలోని దౌర్భాగ్యాలన్నిటికీ కారణం రచయితలేనని అతని తిరుగులేని అభిప్రాయం. నవలల ద్వారానూ, టీవీ సీరియల్ ద్వారానూ, సినిమాల ద్వారానూ, కథా రచయితలు, గీత రచయితలు కలసి యువతను సర్వనాశనం చేస్తున్నారని అతను మనస్ఫూర్తిగా నమ్మాడు. ముఖ్యంగా అతను ఇటీవల చదివిన 'హోకస్ ఫోకస్' అనే నవల-

అందులో హీరో హిప్నాటిజం నేర్చుకుని ప్రజల్ని ఎన్నో బాధల నుండీ, సమస్యల నుండీ రక్షిస్తూ రాత్రింబగళ్ళు తిరుగుతూంటాడు.

ఏనాటికైనా ఆ నవలా రచయిత కనబడితే అతని చేతి వేళ్ళమీద కాల్చాలని కర్నల్ కనకారావు కోరిక.

"ఆల్‌రైట్ మిస్టర్ చంద్రకాంత్! మీ ట్రెన్‌కి టైమయినట్లుంది" అన్నాడతను.

"నో డాడీ! చంద్రకాంత్ గారు అప్పుడే వెళ్ళిపోడానికి వీల్లేదు.. ఇలాంటి గొప్ప వ్యక్తి మనింటికొస్తే అంత తేలిగ్గా పంపించి వేస్తామా..?నో... కనీసం రెండు రోజులైనా మనింట్లో వుండాల్సిందే" అంది పూజ పట్టుదలతో.

"ఆ... రెండు రోజులా? ఎందుకు?" చిరాగ్గా అడిగాడు కల్నల్.

సరిగ్గా అప్పుడే గోపాలావ్ వచ్చాడు.



"నేననుకుంటూనే వున్నా. ఆఫీస్‌కెళితే మనల్ని వదలని. అలాగే జరిగింది. మా బాస్ కబుర్లు చెప్పటం మొదలుపెట్టాడు. వదిలించుకునేసరికి యీ టైమయింది" అంటూ భవానీశంకర్‌ని చూసి ఆశ్చర్యపోయాడు.

"మైగాడ్ నువ్వా? ఏమిటీ సర్‌ప్రైజ్? నువ్వు ఉదయం ఆరుగంటల బస్‌కి ఖమ్మం వెళ్ళిపోతానన్నావుగా? వెళ్ళ లేదా?"

"ఆరుగంటల బస్ మిస్సయింది బ్రదర్! ఆరుగంటల బస్ ఆరుగంటలకే వెళ్ళిపోయింది."

గోపాలావ్ హోరున ఆశ్చర్యం నటించాడు.

"మైగాడ్! ఆరుగంటల బస్ ఆరుగంటలకే వెళ్ళిపోయిందా?"

"అవును."

"వెరీ బాడ్! ఆరుగంటల బస్ సాధారణంగా ఏడు గంటలకు కదా వెళ్ళాల్సింది?"

"అవును కానీ ఎందుకో ఆరుగంటల బస్ ఆరుగంటలకే వెళ్ళిపోయింది."

"విన్నావా సీతా! ఆరుగంటల బస్ ఆరుగంటలకే వెళ్ళిపోయిందట! ఈజ్ దేర్ ఎనీ సెన్స్? బై దిబై... వీడెవడో తెలుసా? నా చిన్ననాటి ఫ్రెండ్ చంద్రకాంత్! రాత్రంతా మేమిద్దరం కలిసి గడిపామని చెప్పాను గదా! సేమ్ ఫెలో..."

"ఇప్పుడే పరిచయం చేసుకున్నాం."

"సరిగ్గా ఫోర్ ఇయర్స్ తర్వాత కనబడ్డాడు. ఫన్నీ ఫెలో... కదురా?"

"ఫోర్ ఇయర్స్ థర్టీన్ డేస్"

"అవునవును. ఫోర్ ఇయర్స్ థర్టీన్ డేస్. భలే జ్ఞాపకశక్తి నీకు"

"ఎలాగూ ఆరుగంటల బస్ మిస్సైందిగదాని, మీ వాళ్ళందరినీ చూడాలని ఇంటికొచ్చేశాను మిత్రమా.. నీపెళ్ళికి రాలేకపోయాను కదా! వెళ్ళిరానా మరి?"

"నో... అప్పుడేనా? కనీసం నెలరోజులైనా ఇక్కడుండాలి. అసలే ఫోర్ ఇయర్స్ థర్టీన్ డేస్ తర్వాత కలుసుకున్నాం."

"అవునవును ఫోర్ ఇయర్స్ థర్టీన్ డేస్. అయినా నెలరోజులు వుండటం కష్టం"

"పోనీ రెండ్రోజులైనా వుండాల్సిందే."

భవానీశంకర్ అందరి ముఖాల్లోకి చూశాడు.

"ఔనండీ! రెండ్రోజులైనా వుండండి" అంది సీత.

"యూ మస్ట్- మిస్టర్ చంద్రకాంత్...! మీతో ఎన్నో విషయాలు మాట్లాడాలి" అంది పూజ.

"ఇప్పుడే వుండాలనిలేదు. ఇంకోసారెప్పుడైనా వచ్చి వుండవచ్చు" అన్నాడు కనకారావు

అయిష్టంగా.
"తప్పదంటావా?" గోపాల్రావ్ వైపు చూస్తూ అన్నాడు భవానీ.
"ఏ మాత్రం తప్పదు."
"ఆల్‌రైట్...! మీరంతా అంత ఇదిగా అంటూంటే నేనంత ఇది చేయటం బాగుండదు."
"ఏ మాత్రం బాగుండదు."
"ఓకే టూ డేస్ గ్రాంటెడ్."
పూజ ఆనందంతో ఎగిరి గంతేసింది.
గోపాల్రావ్ ఆనందంగా అతన్ని కౌగలించుకున్నాడు.
"కమాన్! నీ గదిలో కెళ్దువుగాని."
"నా గదా? నా గది మీ ఇంట్లో ఎలా వుంది?"
"ఐమీన్ మా గెస్ట్ రూమ్."
ఇద్దరూ మేడ మీదకు నడిచారు.
కనకారావ్ చేయి అప్రయత్నంగా గన్ మీద కెళ్ళింది కసితో.

• • •

ఇన్‌స్పెక్టర్ రాంబాబు మందుకొట్టిన పెద్దపులిలా పోలీస్‌స్టేషన్‌లో పచార్లు చేస్తున్నాడు.
లాకప్‌లో రాణి కూర్చుని "పోలీసులు- వారి సైకాలజీ" అనే పుస్తకం చదువుతోంది. ఆ పుస్తకం ప్రముఖ గజదొంగ, డెకాయిట్ విక్కీ రాశాడు.
విక్కీ అసలు పేరు గంగరాజు. గంగరాజంటే పోలీసులు సరిగ్గా భయపడటం లేదని అనుమానం వచ్చి తన పేరు విక్కీగా మార్చుకున్నాడతను.
మార్చుకున్న దగ్గర్నుంచీ నిజంగానే అతనంటే పోలీసులకు గౌరవం పెరిగింది.
అదివరకు గంగరాజుగాడు- అనేవాళ్ళల్లా ఇప్పుడు విక్కీగారు అంటున్నారు. అయితే తమ సైకాలజీ గురించి విక్కీ అనే డెకాయిట్‌గాడు పుస్తకం రాయటం పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి నచ్చలేదు గానీ, ఈ పుస్తకాన్ని దూరదర్శన్ తెరమీద కనబడాలన్న కోరికతో మగ్గిపోతున్న పోలీస్ కమీషనరే దూరదర్శన్ కెమెరా ముందు ఆవిష్కరించేసరికి గత్యంతరం లేక అంతా తలో కాపీ కొనుక్కోవాల్సి వచ్చింది.
ఇద్దరు కానిస్టేబుల్స్ హడావుడిగా లోపలికొచ్చారు.
"ఏమయింది? దొరికినయ్యా?" అడిగాడు రాంబాబు ఆత్రుతగా.
"లేద్సార్- ఇల్లంతా వెతికాము- రాణి ఫ్రెండ్ ఇంకో దొంగ రజని ఇల్లు కూడా సోదా చేశాం సార్- దొరకలేదు. దొంగ నగలు, వజ్రాలు కొనే వ్యాపారస్థుల్ని కూడా



ఎంక్వయిరీ చేశాం. రాణి తమకేమీ అమ్మలేదని చెప్పారు."
రాంబాబు రాణి వైపు చూశాడు.
"నేను ముందే చెప్పానా? వజ్రాలు నేను కాజేయలేదని?"
"మరెమయినట్లు?"
"ఆ విక్కీ వాటిని ఎక్కడ పెట్టాడో చెప్పేవరకూ కనుక్కోవటం కష్టం"
"అయితే నువ్వు మరి ఆ రోజు విక్కీ ఇంట్లో మనం సోదా చేస్తున్నప్పుడు మధ్యలో సడెన్‌గా ఎందుకు పారిపోయావు?"
"చెప్పాను కదా- విక్కీగాడికి మనిద్దరం ఒకటయ్యామని తెలీకూడదు. అందుకే వాడి అసిస్టెంట్ వీర్రాజు చూసేట్లు పారిపోయాను."
"ఆ తర్వాతేం చేశావు?"
"మిగిలింది నా పర్సనల్ విషయం."
"పోలీస్‌లకి తెలీకుండా దొంగలకేం పర్సనల్ విషయాలుంటాయ్?"
"ఒకతనిని ఆ టైమ్‌కి కలుసుకుంటానికి చెప్పాను."
"తెలుసు. నువ్వు ఒకడితో ఎఫైర్ పెట్టుకున్నావు- వాడితో ఫైవ్ స్టార్ హోటల్లో డిన్నర్ కెళ్ళావు. ఆ తర్వాత ఇద్దరూ చెడిపోయిన లిఫ్ట్‌లో యిరుక్కుపోయారు. ఆ తర్వాత నీ ఇంటికెళ్ళావు" సీరియస్‌గా చాలా గొప్ప పరిశోధకుడిలాగా చెప్పాడు.
"మైగాడ్! మీకివన్నీ ఎలా తెలిసినయ్?" విస్తుపోతున్నట్లు నటిస్తూ అంది రాణి.
రాంబాబు మరింత గర్వంగా చూశాడు.
"ఎవరు ఎప్పుడెక్కడ ఏం చేస్తోందీ మనం వెయ్యి కళ్ళతో కనిపెడుతూనే వుంటాం. డోంట్ అండర్ ఎస్టిమేట్ రాంబాబు- ఓ.కే.!"
రాణి నవ్వుకుంది.
అప్పుడే విక్కీ రాసిన 'పోలీసులు వారి సైకాలజీ' బుక్‌లో చదివింది. కామన్‌సెన్స్‌తో తెలుసుకోగలిగిన విషయాలన్నీ ఎంతో కష్టపడి ఎందుకూ పనికిరాని పద్ధతుల ద్వారా తెలుసుకొంటూంటారు పోలీసులు! అంతేకాదు, తాము అలా కనుక్కోవడంలో సూపర్‌హ్యూమన్ బీయింగ్స్ అని అంతా అనుకోవడమే వారికి నచ్చిన సైకాలజీ అని విక్కీ రాశాడు. అంతేకాదు, వారు అలా అనుకోడానికి తగిన ప్రోత్సాహం కలిగించటం ప్రతి దొంగ లేక నేరస్థుని కర్తవ్యమని కూడా సలహా యిచ్చాడు.
"ఆల్‌రైట్! మనిద్దరం వెళ్ళి ఆ విక్కీ గాడిని అడుగుదాం పద."
రాణి లాకప్‌లో నుంచి బయటికొచ్చింది.
జీప్‌లో విక్కీ ఉన్న సెల్‌కి చేరుకున్నారు.

"వాడిని నేను ఇంటరాగేట్ చేయాలి– మీరంతా వెళ్ళిపోండి"

కానిస్టేబుల్స్‌కి చెప్పి సెల్‌లోకి నడిచాడు రాణీతో.

విక్కీ రాంబాబుని చూస్తూనే నవ్వాడు.

"నీ కోసమే చూస్తున్నా– ఇంకా రాలేదేమిటా అని. దా! దా! దా!"

"ష్... అలా మాట్లాడితే మా వాళ్ళకు నా మీద కూడా అనుమానం కలుగుతుంది. జాగ్రత్త!"

"అయితే ఎందుకొచ్చావసలు?"

"వజ్రాలు ఎక్కడ పెట్టావ్?"

"కిండర్ గార్డెన్ స్కూల్లో కుర్రాడి నడిగినట్లు అడుగుతున్నావు. నీ మెదడు అదే దశలో వుండిపోయిందని నాకు తెలుసు గానీ– నేను ఆ దశలో లేను 'ఫలానా చోట పెట్టాను' అని చెప్పేయడానికి"

"ఒరే విక్కీ– పిచ్చివాగుడు వాగకు– ఆ వజ్రాలు అమ్మేయటానిక ఏర్పాట్లు చేస్తాన్నేను. నిన్ను ఎలాగూ తర్వాత పోలీసులు వదిలేస్తారు. వదలకపోతే అప్పుడు నేను వదిలించే ఏర్పాటు చేస్తా. అర్థమయిందా?"

"ఆహా... చాలా గొప్ప ప్లాన్లు కూడా వేస్తావన్న మాట నువ్వు. అందుకే పోలీస్ డిపార్ట్‌మెంటులోకి సెలక్ట్ చేసి వుంటారు నిన్ను. ఏయ్ రాంబాబూ! నన్ను లోపల వేయించింది నువ్వే– ఏమీ తెలీనట్లు నాటకమాడుతోంది నువ్వే– నా దగ్గర కాదు నీ వేషాలు– నన్ను జైల్లో నుంచి వదిలే వరకూ వజ్రాలు ఎక్కడ దాచిందీ చెప్పను"

"చెప్పకపోతే జీవితాంతం నువ్వు జైల్లోనే ఉండేట్లు చేస్తాను. నా సంగతి నీకు తెలీదు."

"ఏం ఫర్లేదు. వజ్రాలు నీకు దక్కకుండా వుంటే– జైల్లో ఎంత కాలం వున్నా ఓ.కే!"

రాంబాబు కేం చేయాలో తెలీలేదు.

"సరే– చావ్– నువ్వు జైల్లోనే భూస్థాపితం అయ్యేట్లు చేస్తాను" అన్నాడు కసిగా.

వాళ్లిద్దరూ వెళ్ళగానే విక్కీ వీర్రాజు వచ్చాడతనిని చూడ్డానికి.

"నువ్వో పనిజేయాల్రా! చేయగలవా?"

"ఏంటది"

"ఇలా దగ్గకు రా."

తన తల కటకటాల దగ్గరకు చేర్చాడు వీర్రాజు.

"వజ్రాలు రెండూ మన చేపల ఎక్వేరియంలో వేశాను. అవి తీసుకెళ్ళి మార్కెట్లో అమ్మేసేయాలి– మనం దొంగ నగలు అమ్మే షాప్‌లో యిచ్చేసేయ్."

"పోలీసులకు తెలుస్తుందేమో!



"ష్! పోలీసుల పేరెత్తకు– వాళ్ళు నీ జోలికి రార్లే. వాటిని ఆ షాప్‌లో అమ్మేసి మళ్ళీ వచ్చి నాక్కనబడు."

వీర్రాజు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

తనూ రాణీ వాటికి అమ్మేసి లేచిపోతారని పిచ్చిబాస్‌కీ తెలీదు అనుకున్నాడు.

• • •

రచయిత చంద్రకాంత్ టీవీ చానెల్ ఆఫీస్ కొచ్చాడు.

చానెల్ క్రియేటివ్ హెడ్ నీలకంఠం మందు కొడుతున్నాడు గదిలో.

"ఏంటి గురువుగారూ! అర్జంటుగా రమ్మని కబురు చేశారంట?" అన్నాడు టేబుల్ మీద కూర్చుంటూ.

నీలకంఠానికి కోపం ఆగలేదు.

"నీకేమయినా బుద్ధుందా? నీకెన్నిసార్లు చెప్పాను– హిందీ సీరియల్స్‌ని మక్కికి మక్కీ కాపీ కొట్టొదని. ఇదిగో ఈ ఉత్తరం చూడు. నువ్వు కాపీ కొట్టిన ఒరిజినల్ హిందీ సీరియల్ తాలూకూ ప్రొడ్యూసర్ లాయర్ నోటీస్ పంపాడు" ఉత్తరం చంద్రకాంత్ ముఖాన కొట్టాడు.

అది చదివేసరికి చంద్రకాంత్‌కి భయం వేసింది.

"మనం కాపీ కొట్టినట్లు ఎక్కడో బాంబేలో ఉన్నవాడికి ఎలా తెలిసిందంటావ్?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఎవడో మనమంటే పడనోడు చేసిన పని యిది."

"మా ఘోస్ట్ రైటర్‌కి ముందే చెప్పాను బాస్! ఉన్నదున్నట్లు కాపీ కొట్టకురా అని. వాడికి మరీ బద్ధకం బలిసిపోయి వున్నదున్నట్లు దంచేస్తున్నాడు."

"అందుకే నీ స్క్రిప్ట్ నువ్వే రాయటం అలవాటు చేసుకోమన్నాను."

"మూడువేలు పడేస్తే రాసిచ్చే వాడున్నప్పుడు మనకెందుకు బాస్ ఆ హెడేక్."

"ఇప్పుడా లాయర్ నోటీస్‌కి ఏం సమాధానం చెప్తావు?"

"నాకేం తెలుసు? మీరేగా అది కాపీ కొట్టి రాయమంది?"

"ఆ తప్పుడు వాగుడే వాగొద్దన్నాను. పోన్లే కదాని మంచి రేటింగ్ ఉన్న హిందీ సీరియల్ స్క్రిప్ట్‌ని రహస్యంగా తెప్పించి నీకిచ్చి రాయించినందుకు నా మీదకే తోస్తావ్?"

"మాతో వూరికే రాయిస్తున్నావా? రాసే ఛాన్స్ నాకిచ్చినందుకు కిక్‌బాక్స్ తీసుకోవటంలా? పైగా పొడ్యూసర్ దగ్గర మళ్ళీ కమిషన్ కొట్టేయటంలా?"

నీలకంఠం స్టన్ అయిపోయాడు.

తనకు ఇంతవరకూ ఏ రచయితా ఇలా ఎదురు తిరగలేదు.

కోపం పెరిగిపోయింది.

"అలాగా! డబ్బిమ్మని నేనేమయినా ఏడ్చానా? నువ్వే నా కాళ్ళమీదపడి ఛాన్స్ ఇమ్మని అడిగావు. ఆ రచన మీద వచ్చే డబ్బులో ఫిఫ్టీ పర్సెంట్ మీరే తీసుకోండి సార్! అని బ్రతిమాలావ్- మర్చిపోయావా?"

చంద్రకాంత్ స్పృహలో కొచ్చాడు.

"సారీ గురువుగారూ! కోపంలో ఏదో అనేశాను. మీరేం చెప్తే అది చేస్తాను. కావాలంటే హిందీ సీరియల్ కాపీ కొట్టింది నేనే, మా క్రియేటివ్ హెడ్‌గారికేం సంబంధం లేదని రాసిచ్చేస్తాను."

నీలకంఠానికి కోపం తగ్గిపోయింది.

"అలా దారికిరా! ఇప్పుడు అర్జంటుగా మొగుడు-ప్రియుడు సీరియల్ హీరోయిన్ నీలిమ ఇంటికెళ్ళి దాన్ని మన గెస్ట్‌రూమ్‌కి తీసుకురా!"

"ఇంట్లో వాళ్ళాయన వుంటాడేమో!"

"ఉండడు- ఇవాళ పేకాడ్డానికి వెళుతున్నాడని ఫోన్ చేసి చెప్పింది. ఒకవేళ వాళ్ళాయన వున్నా కూడా నీలిమ మన చానెల్ సీరియల్ గురించి క్రియేటివ్ హెడ్ గారు అర్జంటుగా డిస్కషన్ చేయాలంటున్నారని చెప్పు"

చంద్రకాంత్‌కి చిరాకుగా వుంది.

నీలకంఠం తీసుకురమ్మన్న యాంకర్లనూ, మిగతా లేడీ ఆర్టిస్ట్‌లనూ గెస్ట్‌హౌస్‌కి తీసుకెళ్ళి అప్పజెప్పటం, తర్వాత మళ్ళీ వాళ్ళను తీసుకెళ్ళి ఇంటి దగ్గర డ్రాప్ చేయటం.

నీలకంఠం మెప్పు సంపాదించి నాలుగు డబ్బులు చేసుకోవాలంటే ఇలాంటి వెధవపన్లు చేయక తప్పదు.

నీలిమ ఇల్లు చేరుకున్నాడు చంద్రకాంత్. ఆమె అలంకరించుకుని సిద్ధంగానే వుంది.

"మిమ్మల్ని నీలకంఠంగారు తీసుకురమ్మన్నారు" చెప్పాడతను.

"పదండి. మీ కోసమే ఎదురుచూస్తున్నాను" అంటూ బయటకు వచ్చి ఆటో ఎక్కింది.

ఇద్దరూ గెస్ట్‌హౌస్‌కి చేరుకున్నారు.

అప్పటికే విస్కీ సీసా ముందు పెట్టుకుని కూర్చున్నాడు నీలకంఠం.

"నువ్వు బీరు తాగుతావా, విస్కీ తాగుతావా?" అడిగాడతను.

"నేనా? విస్కీయే గురూజీ!" ఉత్సాహంగా అన్నాడు చంద్రకాంత్.

"నేనడిగేది నిన్ను కాదు, నీలిమని."

"ఛీ- నేను తాగను" అంది నీలిమ.

"అదేంటి- ఇంత గొప్ప హీరోయిన్ వయ్యావ్- ఇంకా తాగకపోతే ఎలా? ఇవాళ



ప్రారంభోత్సవం చెయ్- కమాన్" అంటూ ఆమెతో విస్కీ తాగించసాగాడు నీలకంఠం.

చంద్రకాంత్ నాలుక తడుపుకుంటూ విస్కీ బాటిల్ వేపు చూస్తున్నాడు. నీలకంఠం వళ్ళో నీలిమను కూర్చోబెడుతుంటే తను ఆమె నడుంచుట్టూ చేయివేశాడు చంద్రకాంత్. దాంతో నీలకంఠానికి కోపం వచ్చేసింది."

"ఏయ్ చంద్రకాంత్! నువ్వెళ్ళి బయట కూర్చో కాసేపు" అన్నాడు కసిగా.

చంద్రకాంత్ బయటకు వెళ్ళగానే తలుపు వేసుకుంది నీలిమ. "మీరు ఒక్కరూ అంటే ఫర్లేదు. వాడు కూడా నన్నలా చూస్తే వూరుకోను" అంది కోపంగా.

సరిగ్గా అప్పుడు స్కూటర్ దిగాడు పానకాలు.

"ఏదది? ఎక్కడుంది?" చంద్రకాంత్ దగ్గరకొచ్చి చొక్కా పట్టుకుంటూ అడిగాడు.

అతని చేతిలో కత్తి చూసేసరికి చంద్రకాంత్ పై ప్రాణాలు పైనే పోయాయి.

"ఏమిటది?" అడిగాడు అర్థంకాక.

"ఏమిటదా? ఇదిగో- ఇదీ" అంటూ బలంకొద్దీ లాగి చెంప మీద కొట్టాడు.

చంద్రకాంత్ దభేల్‌మని కిందపడ్డాడు.

"అరె! నన్ను కొడతావేమిటి?" దుమ్ము దులుపుకుంటూ లేచి నిలబడ్డాడు. చంద్రకాంత్.

"మర్యాదగా చెప్పు- ఏదది?"

"ఏమిటది?"

మళ్ళీ చెంప పేలిపోయింది.

"అదేమిటో చెప్పకుండా ఏదది అంటే నాకేం తెలుస్తుంది?" ఏడుపు ఆపుకుంటూ అడిగాడు.

"అదే నా భార్య నీలిమ ఎక్కడుంది? స్కూటరు మీద తీసుకొచ్చింది నువ్వేనా?"

"నేనే... అహహ... నేను కాదు" భయంగా అన్నాడు.

"ఎక్కడుందది?"

"ఆ గదిలో..."

పానకాలు ఆ తలుపు మీద దభేల్‌మని తన్నాడు.

ఆ తలుపు పగులిచ్చింది.

రెండో తన్నుకి విగిరిపోయింది.

నీలకంఠం వళ్లో పడుకున్న నీలిమ అదిరిపడి లేచి నిలబడింది.

ఒక్క దూకు దూకి ఆమె జుట్టు పట్టుకున్నాడతను.

"ఏమే ఇల్లు కదలొద్దంటే అడడ్డమయినోడితో తిరుగుతున్నావా?" అంటూ ఒక్క

తన్ను తన్నాడు.

నీలిమ కింద పడిపోయింది. అది చూసి నీలకంఠం బయటకు పరుగెత్తాడు శరవేగంతో.

నీలకంఠాన్ని చూసి చంద్రకాంత్ పరుగెత్తాడు. పానకాలు కత్తి పట్టుకుని ఇద్దరి వెంటా పడ్డాడు. రోడ్డుమీద జనమంతా వాళ్ళని ఆశ్చర్యంగా చూస్తున్నారు. కొంతమంది సినిమా షూటింగేమో అనుకుని కెమెరా కోసం వెతుకుతున్నారు.

నీలకంఠానికి సన్మానం చేసిన ఆ ఏరియా సాంస్కృతిక సమాజం తాలూకూ మెంబర్లు కొంతమంది అతని వెనుక ఓ రచయిత, వాళ్ళిద్దరి వెనకా కత్తి పట్టుకుని ఓ ఆవేశపరుడూ పరుగెత్తటం చూసి ఏమీ అర్థంగాక–

"సార్! ఏమిటలా పరుగెడుతున్నారు?" అనడిగారు వారూ పక్కనే పరుగెడుతూ.

"మరేం లేదోయ్! డాక్టర్‌గారు రోజూ రెండు కిలోమీటర్లు పరుగెత్తితే హెల్త్‌కి మంచిదన్నారు" అన్నాడతను రన్నింగ్ ఆపకుండానే.

పానకాలు రన్నింగ్ వేగం పెంచాడు.

అది చూసి చంద్రకాంత్, నీలకంఠం కూడా వేగం పెంచేశారు.

పానకాలు కత్తితో మరీ దగ్గర పడడంతో చంద్రకాంత్ అమాంతం బాగా రద్దీగా వున్న సందులోకి తిరిగిపోయాడు.

పానకాలు నీలకంఠంనే టార్గెట్ చేసుకోవటం వల్ల అతనివే అందుకోవడానికి ప్రయత్నించసాగాడు.

నీలకంఠాన్ని గుర్తుపట్టిన ఇద్దరు ప్రొడ్యూసర్లు "సార్! మేము పంపిన స్క్రిప్ట్ ఏమైంది సార్? తీసుకుంటున్నారా? రిజెక్ట్ చేస్తున్నారా?" అనడిగారు పక్కనే కొద్ది దూరం పరుగెడుతూ.

"డైలీకీ అయిదు లక్షలు– వీక్లీ సీరియల్‌కీ మూడు లక్షలు" అన్నాడు నీలకంఠం పరుగు వేగం కొంచెం తగ్గించి ఆశగా.

"అబ్బే! మాకు ఇప్పుడు డబ్బివ్వకపోయినా ఫర్లేదు సార్! యాక్సెప్ట్ చేస్తే చాలు."

"మీకివ్వటం కాదోయ్– మీరే కిక్‌బాక్స్ నాకివ్వాలని చెప్తున్నాను" కోపంగా అన్నాడతను.

"ఆ! అంత డబ్బే– ఓ పాతిక వేలు కొడితే చాలు– యాక్సెప్ట్ చేస్తారని మా ఫ్రెండ్ చెప్పాడు సార్?"

"షటప్! పిచ్చివాగుడు వాగకు. యాక్సెప్ట్ చేయడానికి ముందు ఎనిమిదిసార్లు బార్‌లో మందు తాగించాలి– ఆ సీరియల్ హీరోయిన్ని తీసుకొచ్చి ఓనైట్ నాకప్పగించాలి" అంటూ



వెనక్కు తిరిగి పానకాలు బాగా దగ్గరగా వచ్చేయటం చూసి మరింత వేగంగా పరుగెత్తాడు.

పానకాలు ఇంక పరుగెత్తలేక ఆగిపోయాడు.

"ఒరేయ్! మీరిద్దరూ ఎక్కడ కనబడ్డా మర్డర్ చేస్తాను– రోజులు లెక్కపెట్టుకోండి" అన్నాడు బిగ్గరగా అరుస్తూ.

చంద్రకాంత్ ఆటో ఎక్కి ఒకవేళ పానకాలు ఇంకా వెంబడిస్తున్నాడేమో అన్న అనుమానంతో కొంతదూరం వెళ్ళాక ఇంకో ఆటో ఎక్కి రైల్వేస్టేషన్ చేరుకుని అప్పుడే ఖమ్మం వేపు వెళుతూన్న రైలెక్కేశాడు.

అతని భార్య అష్టలక్ష్మి తలుపు తీయగానే చిరునవ్వు నటిస్తూ లోపలికొచ్చాడు.

"ఏమిటలా వున్నారు?" అడిగింది అష్టలక్ష్మి అనుమానంగా.

"అబ్బే... ఎలా వున్నాను? బాగానే వున్నాను' అంటూ కంగారుని కప్పిపుచ్చుకోడానికి "లలలా– లాలలలా" అంటూ సినిమా ట్యూన్ పాడాడు.

దాంతో అష్టలక్ష్మి అనుమానం మరింత పెరిగిపోయింది.

"నిజం చెప్పండి! హైదరాబాద్ ఆటోలో దాన్నెవత్తెనో వేసుకుని తిరిగారా లేదా?" నిలేసిందామె ఊరికే దబాయించి చూద్దామని.

ఆమె దబాయింపుకి దభేల్‌మని పడిపోయాడు చంద్రకాంత్.

"అదా... అదీ... అది... మన క్రియేటివ్ హెడ్ గారెవర్నో డ్రాప్ చేయమంటేనూ... తీసుకెళ్ళి బస్ స్టాప్ దగ్గర డ్రాప్ చేశాను.."

"బెల్ట్ తీసుక్కొడతాను నిన్నూ, నీ క్రియేటివ్‌నీ– పద ఇప్పుడే తేల్చుకుంటాను. అదెవత్తో– దాన్ని వాడు మీతో ఎందుకు పంపించాడో.."

"ఏమిటే ఆ పిచ్చివాగుడు– ఆమె ఎవరనుకుంటున్నావ్? ఫేమస్ హీరోయిన్ నీలిమాదేవి."

"సిగ్గు లేకపోతే సరి– దాన్ని హీరోయిన్ అనడానికి! బూతుశాస్త్రం ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చే లావార్సీదాన్ని పట్టుకొచ్చి హీరియినంటావా? దాని క్యారెక్టర్ ఎప్పుడూ పదిమందితో తిరగటమేగా? అయినా దాంతో మీకేమిటి పని? ఏ సంబంధమూ లేకపోతే మీతో ఎందుకొచ్చింది? రోడ్డున పోయేవాడి నెవడినడిగినా నెత్తినెక్కించు కెళ్తారుగా".

"ఛ! బై గాడ్ చెప్తున్నానే– నేనెప్పుడూ, ఎవరినీ అలాంటి దృష్టితో చూడను."

"బెల్ట్ తీసుక్కొడతాను అబద్ధాలు కూశావంటే– నేను పుట్టింటి నుంచి ఆ రోజు సడెన్‌గా వచ్చేసరికి ఇంట్లో నువ్వూ, నీ సినిమాల్లో ఎక్స్ట్రా...."

"అబ్బా!అది వేరే! ఆ రోజు నన్ను అదే బలవంతం చేసింది– అయినా ఆ రోజు నీకు ప్రామిస్ చేశాను కదా ఇంకెప్పుడూ ఆడదాని వంక కన్నెత్తి చూడనని"

ఆమె కొంచెం శాంతించింది.

"మరిప్పుడు ఆటోలో ఆ బూతు హీరోయిన్ని.."

"అబ్బా! ఇది ఆబ్లిగేషనే. చెప్పిన పని చేయకపోతే వాడు నాతో సీరియల్ రాయించడు చేయడు. రాయించకపోతే మనకి నెలనెలా వచ్చే సంపాదన తగ్గిపోతుంది."

"ఎందుకొచ్చిన సంపాదన అది– బోడి సంపాదన– సగం వాడికే ఇవ్వాలి. కొంత వాడి పార్టీలకు తగలెయ్యాలి– ఇంకేమిటి మిగిలేది?"

"అసలు రచయిత కాపోయినా మనకెంత పేరొచ్చిందో చూడు ఆంధ్రదేశమంతా మోగిపోతోంది. డబ్బు కొంచెం తక్కువ స్తేనేం?"

"ఇదిగో– నువ్వేమయినా చేయ్ వప్పుకుంటానుగానీ, ఇంకో దాన్తో వ్యవహారంలోకి దిగావంటే మాత్రం బెల్ట్ తీసుక్కొడతాను. తర్వాత మా పుట్టింటికెళ్ళిపోతాను. మా వూళ్ళో ఇప్పటికీ నన్ను పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా వున్నాళ్ళు ఇద్దరున్నారు– తర్వాత మీ ఇష్టం."

చంద్రకాంత్ అప్యాయంగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"ఎందుకంత కోపం? అలాంటి వేషాలేమీ వేయనని నీకు ప్రామిస్ చేశాను కదా–"

స్నానం చేసి తన గదిలో కూర్చుని మెయిల్ ఓపెన్ చేసేసరికి సీతాగోపాల్రావ్ అనే ఆమె ఇచ్చిన మెయిల్ కనిపించింది.

"హలో– మీరే మా ఆయన ఫ్రెండ్– ఒకసారి అర్జంటుగా మా యింటికి రండి! ఇదీ నా అడ్రస్. నేనిలా మెయిలిచ్చిన విషయం మా ఆయనకు చెప్పకండి. నేను మీ ఫాన్ని. మీర్రాసిన టీవీ సీరియల్స్ చూస్తున్నాను"

సీతాగోపాల్రావ్ ఎవరో ఎంత ఆలోచించినా అర్థం కాలేదతనికి. ఒకవేళ క్రియేటివ్ హెడ్ నీలకంఠం కేసేమో.

ఎప్పుడో తనతోపాటు ఆటోఎక్కి వుంటుంది. దారిలో తను కూడా లైట్‌కొట్టి వుంటాడు. అందుకని వాళ్ళాయన లేనప్పుడు రమ్మని మెయిలిస్తోంది.

మరి కొద్దిసేపు నీలకంఠం చానెల్లో టెలికాస్ట్ అయ్యే సీరియల్స్ తాలూకూ హీరోయిన్స్ అందరి పేర్లూ గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించాడతను.

సీత అనే పేరు ఎక్కడా తగలటం లేదు.

"ఎవరిచ్చారా మెయిల్?" అడిగింది అష్టలక్ష్మి.

చంద్రకాంత్ అదిరిపడ్డాడు.

"ఆ– ఇదా– ఇదీ– ఇది– ఆ– మా ఫ్రెండ్ దగ్గర్నుంచి– మా క్లోజ్ ఫ్రెండ్‌లే" అతని కంగారు అనుమానం కలిగించిందామెకి.

"పేరేంటి?"



"గోపాల్రావ్"

"ఆ పేరేప్పుడూ మీ దగ్గర విన్నట్లు లేదే?" మరింత అనుమానంగా అడిగింది.

"భలేదానివే– నేను ఎప్పుడూ వాడినే తల్చుకుంటాను. హైదరాబాద్ వెళ్ళినప్పుడల్లా– కల్సుకోవాలని ట్రై చేస్తుంటాను. కానీ కలుసుకోవటం కుదరటం లేదు."

"అంటే అతను హైదరాబాద్‌లో వుంటాడా?"

"అవును!"

"ఇప్పుడెందుకు మెయిలిచ్చాడు?"

"ఏమిటో– పిచ్చి వెధవ. నేనంటే తెగ ప్రేమ– రేపు వాడి బర్త్‌డే ఆట. నేను లేకుండా చేసుకోవటం యిష్టం లేదట."

"అంటే రేపు కూడా హైదరాబాద్ వూరేగుతారన్నమాట."

"తప్పదు కదా! పాపం వెళ్ళకపోతే వాడు చాలా ఫీలవుతాడు."

"ఆ వంకతో మళ్ళీ దేన్నో ఆటోలో వేసుకుని తిరగడానికి ప్లాను."

"ఛ! అవన్నీ మానేశానే అని చెపుతున్నా కదా."

ఆమె లోపలకు వెళ్ళగానే సీతాగోపాల్రావ్ అడ్రస్ చూసి తన డైరీలో రాసుకున్నాడతను.

అనుకోకుండా దొరికింది కేస్– ఇంతకూ అందంగా వుంటుందో లేదో– ఆ– ఎలా వుంటే తనకేం?

కొంచెం వయసులో వుంటే చాలు.

ఆ రాత్రి అతనికి ఎగ్జయిట్ మెంట్‌తో నిద్ర పట్టలేదు.

మర్నాడు తను, ఆ సీతాగోపాల్రావ్‌తో జరపబోయే ప్రణయం తాలూకు సెక్స్‌సీన్లు కళ్ళముందు కనిపించి చక్కిలిగిలి పెడుతున్నాయ్.

అతని పక్కనే పడుకున్న అష్టలక్ష్మికి కూడా నిద్ర పట్టడం లేదు.

ఆ మెయిల్ గురించి చంద్రకాంత్ యిచ్చిన వివరణ ఆమెకు సంతృప్తి కలిగించలేదు. అతను ఏదో దాస్తున్నాడని అనుమానం కలిగింది.

నిజం తెలుసుకోవాలంటే అతని మెయిల్ పక్కింటి కాలేజ్ స్టూడెంట్ సుజాతతో చదివించుకుని ఆ ఇంగ్లీష్‌కి అర్థం తెలుసుకోవాలి.

తనకు ఇంగ్లీష్ రాకపోవటం ఓ పెద్ద సమస్య అయిపోయింది.

తెల్లారుజామున అయిదింటికి మెలకువ వచ్చినప్పుడు సుజాతో ఆ మెయిల్ చదివించి అడ్రస్ నోట్ చేసుకుంది అషలక్ష్మి.

• • •

భవానీశంకర్ గదిలోకి కాఫీ తీసుకొచ్చాడు. భజన్‌రావ్.

"హల్లో మైడియరల్ భజన్‌రావ్! ఇంతకుముందే కదా కాఫీ తాగింది- మళ్ళీ తెచ్చావేమిటి?"

"ఇందాక తాగింది పది గంటల కాఫీ సార్- అది కొంచెం లేటవటం వల్ల పదకొండు గంటలకిచ్చాను. ఇదేమో పన్నెండు గంటల కాఫీ ఓ అరగంట ముందుగా యిస్తున్నానన్నమాట"

"టైమింగ్స్ విషయంలో నువ్వు బ్రిటిష్ తాతలాగున్నావ్ భజన్‌రావ్"

"ఏదో- అలా అలవాటైపోయింది సార్."

భవానీశంకర్ కాఫీ చప్పరించాడు.

"ఆహా! సూపర్బ్ టేస్ట్. డైరక్ట్‌గా నీలగిరి నుంచి వచ్చినట్లుంది."

"మీరేదో రాస్తున్నట్లున్నారు సార్?"

"తప్పదు భజన్‌రావ్! నిరంతర పరిశ్రమ! రచయిత జీవితం అంటే చాలా ఎగ్జయింటింగ్ లగ్జరియస్‌గా వుంటుందనుకుంటారు మీరు. కానీ నో- ఏ రోజుకారోజు మేటర్- అయ్‌మీన్ సీరియల్ తాలూకూ మేటర్ ఆ చానెల్‌కి స్పీడ్ పోస్ట్‌లో పంపుతూండాలి. అభిమానుల నుంచి వచ్చే లక్షలాది ఉత్తరాలు చదివి వారిలో కొంతమందికి మెయిల్స్ ఇస్తుండాలి. రాయబోయే కొత్త సీరియల్స్ గురించి బుర్ర బద్దలు కొట్టుకుంటూ కథ తయారు చేస్తూండాలి. మరో పక్క మన కథ సినిమా వాళ్ళెవరయినా తీసుకుంటే వాళ్ళతో రోజుల తరబడి డిష్కన్స్ చేస్తూండాలి- ఇంకోపక్క అనేక సభలకు సన్మానాలకూ హాజరవుతూండాలి"

"అవున్సార్! పాపం చాలా కష్టమయిన పని"

"నిజం చెపుతున్నాను భజన్‌రావ్! ఒకోసారి రచయిత జీవితం వదిలేసి నటన వృత్తిగా స్వీకరిద్దామా అనిపిస్తూంటుంది."

"ప్రతి మనిషిలోనూ నటుడున్నాడని మా ధన్‌రాజ్ అంటూండేవాడు సార్"

"చాలా గొప్పగా చెప్పాడు ఆ ధన్‌రాజ్ ఎవరోగాని"

"మా కజిన్ సార్! వాడి సంగతలా వదిలేద్దాం సార్ కాసేపు-"

"ఓ.కే. వదిలేద్దాం- ఇంకేదయినా విషయం మాట్లాడాలా భజన్‌రావ్?" అనుమానంగా అడిగాడు భవానీశంకర్.

"అవున్సార్"

"కమాన్ భజన్‌రావ్! మాట్లాడాలని పిలిచినప్పుడు ఆలస్యం లేకుండా మాట్లాడే



యటం ఆరోగ్యం లక్షణం. హరియప్! ఇప్పుడు మాట్లాడలేకపోతే- తీరా అన్ని ద్వారాలూ మూసుకుపోయాక మాట్లాడినా ప్రయోజనం వుండదని- ఆమెరికన్ రచయిత్రి ఒకావిడ తన ఆత్మకథలో రాసింది."

"ఎంత గొప్పగా రాసింది సార్! సంగతేమిటి సార్. ఆ మధ్యనోసారి- అంటే చాలా కాలం క్రితం లెండి- చంద్రకాంత్ అనే ఆ రచయిత ఫోటో నేను పత్రికలో చూశానండీ!"

భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు. అయితే తన ఉలికిపాటు భజన్‌రావ్ గమనించనీయకుండా ఉలిక్కిపడటం తన సహజసిద్ధమైన గుణం అన్నట్లు నటించాడు.

"ఎంతోమంది రచయితల ఫోటోలు పత్రికల్లో వేస్తూంటారు భజన్‌రావ్! ఆ ఫోటోలు చూసే హాబీ నీకు వుందని నాకు తెలీదు. చాలా మంచి హాబీ అది భజన్‌రావ్. కీపిటప్- నన్నడిగితే నువ్వు స్టాంపులు సేకరించే హాబీలాగా ఫోటోలు సేకరించే హాబీ ఏర్పాటు చేసుకుంటే థ్రిల్లింగ్‌గా వుంటుంది. రచయితలని, సినిమాస్టార్స్‌వీ, రాజకీయ నాయకులవీ, గూండాలవీ, దొంగలవీ, టెర్రరిస్ట్‌లవీ..."

"నేను చెప్పేదది కాద్సార్!"

"మరేమిటి భజన్‌రావ్?"

"నేను రచయిత చంద్రకాంత్ ఫోటో ఆ మధ్య అదేదో పత్రికలో చూశాన్సార్!" స్ట్రెస్ చేస్తూ అన్నాడు.

భవానీశంకర్‌కి చెమటలు పట్టినయ్.

"అంటే నా ఫోటో ఇంతకు ముందే చూశావన్నమాట- వెరీగుడ్ భజన్‌రావ్! నా సీరియల్స్ కూడా ఏమయినా చూస్తుంటావా?"

"నేను ఫోటోల సంగతి మాట్లాడుతున్నానండీ ప్రస్తుతం- టీవీ సీరియల్స్ టాపిక్ తర్వాత చూద్దాం"

"ఓహో ఒకే సమయంలో ఒకే టాపిక్ మాట్లాడాలనే పాలసీ అన్న మాటనీది. బైదిబై మీ పూర్వీకులెవరయినా వన్ వే ట్రాఫిక్ రోడ్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా వుండేవారా?"

"లేద్సార్! ఇంతకూ నేను చెప్పదల్చుకుంది- రచయిత చంద్రకాంత్ ఫోటోకి, మీకూ బొత్తిగా పోలికలు కనిపించటం లేదు"

"అహ్హహ్హహ్హ" అంటూ విరగబడి నవ్వాడు భవానీశంకర్.

"అదా నీ అనుమానం. భలే వాడివే! అది మరీ పాతకాలంనాటి ఫొటో- అయిదేళ్ళ కిందటి ఫోటోకీ ఇప్పటి రూపానికీ చాలా తేడాలు వస్తాయ్ కదా?"

"రావచ్చుగావండీ... అసలు మనిషే మారిపోయేంత తేడాలొస్తే కొంచెం అనుమానించాల్సి వస్తుందండీ"

"అనుమానం పెనుభూతం అని వూరికే అనలేదు భజన్‌రావ్! అంచేత దానిని వెంటనే చీల్చిచెండాడి మనసులో నుంచి చెరిపేయటం మంచిది."

"ఇంతకూ తమరెవరు సార్? చంద్రకాంత్ రచయిత పేరుతో వచ్చారు?"

భవానీశంకర్‌కి కొద్దిక్షణాలు మాట రాలేదు.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్ భజన్‌రావ్! నేనే రచయిత చంద్రకాంత్‌ని. మన గోపాల్రావ్, నేనూ చిన్నప్పటి నుంచీ ఫ్రెండ్స్– చిన్నప్పటి నుంచీ నేను కథలు రాయటం చూసి పువ్వు పుట్టగానే పరిమళిస్తోందని గోపాల్రావ్ అంటూండే వాడు."

"ఇంతకూ తమరెవరో నిజం చెప్పలేదండి యింకా– చెప్తే మా కల్నల్ బాబుగారికీ, మా సీతా మేడమ్‌గారికీ కూడా ఈ ఇన్ఫర్మేషన్ ఇస్తే వాళ్ళు నా డిటెక్టివ్ బ్రెయిన్‌ని అభినందించకుండా వుండలేరండి. మా మేడమ్ సంగతి మీకు తెలీదనుకుంటానండీ. ఇలాంటి కీలకమయిన విషయాలు ఇన్‌వెస్టిగేషన్ చేసినందుకు నాకు కనీసం రెండు వందలు క్యాష్ బహుమతిగా యిస్తారండీ"

వాడు తను చంద్రకాంత్ కాదన్న విషయం తెలుసుకుని తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని అర్థమైందతనికి.

"నన్నడిగితే నువ్వు చేసే అద్భుతమయిన సేవకి వాళ్ళు అయిదు వందలిచ్చినా పాపం లేదు భజన్‌రావ్."

"లేదనుకోండి– కానీ మేడమ్ అంతకంటే ఒక్క పైసా యివ్వరండీ మహా కంజూస్ ఆ విషయంలో"

"ఆమె ఇవ్వకపోయినంత మాత్రాన దేశమంతా గొడ్డుపోయిందనుకోకు భజన్‌రావ్. నాలాంటి మహానుభావులు నీలాంటి క్రియాశీలక వీరులకు తప్పకుండా అయిదు వందలు యిస్తారు."

"మీరిలా ఫలానా రచయిత చంద్రకాంత్‌గారు కాదనీ, ఆ పేరుతో దిగి నాటకమాడుతోన్న మరో మోసగాళ్ళని ఎవడికీ తెలీని రహస్యం... నేను బయటకు పొక్కనీకుండా దాచినందుకు అయివందలిస్తారా? చాలా దారుణం సార్. కొంచెం హృదయ వైశాల్యం పెంచండి సార్. ఇరుకు హృదయం దేశానికే వినాశకరం సార్."

"ఎంత పెంచాలి?"

"కనీసం ఒక్క సున్నా అయినా పెంచాలి సార్. ఆ తర్వాత దానిని రెండుతో గుణించాలి. అంతే!"

భవానీశంకర్ అదిరిపడ్డాడు.

"వాట్– పదివేలా?"



"నాకు తెలుస్సార్ మీరు ఆశ్చర్యపోతారని– ఇదే ఇంకెవడయినా అయితే ఇలాంటి బ్రహ్మాండమయిన అవకాశం వచ్చినప్పుడు కనీసం పాతికవేలు గుంజేస్తాడు. వీడేమిటా పదివేలే అడుగుతున్నాడు పూర్ ఫెలో– ఇడియట్ అని అనుకుంటున్నారు. కద్సార్?"

"అవును మైడియర్ భజన్‌రావ్! ఎదుటి వాళ్ళ బ్రెయిన్ని డిటెక్టివ్ నవల చదివినట్లు చదివేస్తునావు. ఓ.కే.! మనిద్దం రాజీకి రావటం చాలా అవసరం గనుక ఓ వెయ్యి రూపాయలు ఇస్తాననుకో ఎలా వుంటుంది?"

"చాలా చీప్‌గా వుంటుంది సార్. పదివేలుకి ఒక్క పైసా తగ్గను. మీరివ్వనంటే వెంటనే కల్నల్‌గారికి, సీతా మేడమ్‌గారికీ మీరు రచయిత చంద్రకాంత్ ప్లేస్‌లో వచ్చిన డూప్లికేట్ అని చెప్పేస్తాను. రెండు నిమిషాలు టైమిస్తున్నా సార్! ఇప్పుడు నా వాచీలో పన్నెండు గంటల ఎనిమిది నిమిషాలు"

"ఓకే భజన్‌రావ్! నువ్వంత అభిమానంగా అడుగుతోన్నప్పుడు కాదని నేనూ అనలేను. వన్ మినిట్" అంటూ తన బ్రీఫ్ కేస్‌లో నుంచి చెక్‌బుక్ తీసి చెక్కు పదివేలు రాసి సంతకం చేసి అతనికిచ్చాడు.

"ఈజిట్ ఓకే భజన్‌రావ్?"

"సెంట్‌పర్సెంట్ ఓకే సార్! అయితే చెక్ తిరిగి రానంతవరకే ఓకే సార్!"

సీత, పూజ హడావుడిగా వచ్చారా గదిలోకి.

"ఏమిటి భజన్‌రావ్‌తో మాట్లాడుతున్నారు?" అడిగింది పూజ.

"భజన్‌రావ్ నా సీరియల్స్ చూసే వీరాభిమాని అన్న విషయం. ఇప్పుడే తెలిసింది పూజాజీ! కేవలం నా మీద అభిమానంతో ఖమ్మం వచ్చి నన్ను కలుసుకుని నా ఫొటో ఆటోగ్రాఫ్ కూడా తీసుకున్నాడట."

పూజ ఆశ్చర్యపోయింది.

"మైగాడ్! నిజంగానా? నువ్వు బాగా టేస్ట్ ఉన్న కుక్‌వన్నమాట" అంది సీత.

"అవును మేడమ్! మా ఫామిలీయే బాగా కల్చర్ బ్యాక్ గ్రౌండ్ వున్న ఫామిలీ. నేను గవర్నమెంట్ లైబ్రరీలో చదవని గ్రంథం లేదు."

"మీతో ఓ విషయం మాట్లాడమని మా పూజ గొడవ చేస్తోంది." అంది సీత.

"వెల్‌కమ్ సిస్టిరిన్లా! ఒకటి కాదు, వంద విషయాలు మాట్లాడండి రడీ."

"మా పూజక్కూడా సినిమా స్క్రిప్ట్ రాయాలని ఎంతో కోరిక. పోతే ఆ టెక్నిక్ తెలీటం లేదు. మీరు హెల్ప్ చేస్తే నేర్చుకోవాలని ముచ్చటపడుతోంది.

"ఓ– ఒండర్‌ఫుల్! పూజాకి తెలీటంలేదుగానీ ఆమె ఇప్పటికే ఓ గొప్ప రచయిత్రి. రచయిత్రి అవాలంటే అందమయిన ఆమె మొహం చాలు వెయ్యి చానెల్స్ టీఆర్పీని

రాకెట్‌లాగా ఆకాశంలోకి పంపించేయగలదు. ఆ అందం ఆమెకు టూమచ్‌గా వుంది. ఇంక టెక్నిక్ అంటారా... వారం రోజుల్లో నేర్పించేస్తాను. అంతే- ఆ తర్వాత శోభాడే, విక్రమ్‌సేఠ్‌లాగా..."

"ఓ- థాంక్యూ వెరీమచ్! ఎప్పట్నుంచీ నేర్పుతారు?" అడిగింది పూజ ఉత్సాహంగా.

"ఎప్పుడోనా? అలస్యాత్ అమృత్ విషమ్ అన్నారు. ఇవాళ మధ్యాహ్నం మూడు గంటల నుంచీ స్టార్ట్."

"అంటే రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు"

"నో- నో- నో! యూ ఆర్ మిస్టేకెన్ పూజాజీ! ఇది ఎమ్సెట్ కోచింగ్ సెంటర్ కాదు- గంటకో బాచ్‌కి కోచింగ్ ఇచ్చి పంపించేయడానికి. ఇదొక అద్భుతమైన కళ. కళకి ఓ టైమంటూ వుండదు. సడెన్‌గా నాకు ఉదయం ఆరుగంటలకు 'రచన' గురించి ఉపన్యాసం ఇవ్వాలనిపించవచ్చు. లేదా రాత్రి ఎనిమిదింటికి గార్డెన్‌లో పచార్లు చేస్తూండగా ఇంతవరకూ ఏ రచయితా కనుక్కోలేకపోయిన కొన్ని మెళకువలు తెలియజేయాలనిపించవచ్చు. అదీగాకపోతే రాత్రి ఒంటిగంటకు వర్షం కురుస్తూండగా మిమ్మల్ని లేపి 'వర్షం' అనే ఓ పురుగల కథను రాయమని చెప్పి దగ్గరుండి రాయించవచ్చు."

పూజ ఆనందంతో పొంగిపోయింది.

"ఫెంటాస్టిక్! ఐ లైకిట్!"

"ఓకే చంద్రకాంత్‌గారూ! మీరు రిలాక్సవండి. భోజనం వడ్డించాక పిలుస్తాను" అంది సీత.

"బై!"

థౌజెండ్ కాండిల్స్ బల్బ్‌లా వెలిగిపోతూ పూజ ఆమెను ఫాలో అయి బయటకు నడిచింది.

"ఈ చెక్ ఎక్కడ క్యాష్ అవుతుంది సార్?" అడిగాడు భజన్‌రావ్.

"అబిడ్స్ బ్రాంచ్‌లో మైడియర్! మధ్యాహ్నం రెండు నుంచీ సాయంత్రం ఆరు వరకూ బ్యాంకు టైమింగ్స్"

భజనరావ్ కూడా వెళ్ళిపోయాడు.

భవానీశంకర్ రిలాక్సయిన కాసేపటికి గోపాల్రావ్ వచ్చాడు నెమ్మదిగా.

"వండర్‌ఫుల్ పెర్ఫారమెన్స్ రా! మా ఫాదిరిన్లాని బోల్తా కొట్టించిన ఏకైక వీరుడివి నువ్వే."



"మీ ఫాదరిన్లా గ్రాండ్ ఫాదర్ని కూడా మాయ చేసేయగలం బ్రదర్ అవునూ... బై ది బై- మీ మరదలు పిల్ల చాలా అందంగా వుందే."

"మా మిసెస్ కంటే అందంగా వుంటుంది కదూ?"

"ఛ! మీ మిసెస్ ఆ అమ్మాయి ముందు ఫిఫ్టీ పర్సెంట్ కూడా వుండదు."

గోపాల్రావ్ నిరాశగా కూలబడిపోయాడు.

"దెబ్బతినేశాను గురూ!"

"ఏమిటి దెబ్బతినటం?"

"మా మరదలినే చేసుకునుంటే బావుండేది. అప్పట్లో మనకు కరెక్ట్ జడ్జిమెంట్ ఏడ్చి చచ్చేది కాదు."

"ప్రస్తుతానికా క్రూకెడ్ ఆలోచనలు మానెయ్ మిత్రమా! ఎందుకంటే చేను పూజ ప్రేమలో మునిగిపోయాను."

"మునిగిపోయావా?"

"ఎస్-నెక్ డీప్!"

"ఈ విషయం కల్నల్‌కి తెలిసిందంటే నీ 'డెడ్ బాడీ' పోస్ట్‌మార్టమ్ టేబుల్ మీదుంటుంది."

"నో ప్రాబ్లమ్! నాకూ, పూజకూ తప్ప ఇంకెవరికీ తెలీదు కదా! అయినా కర్నల్ దాకా రావటానికింకా టైముంది బ్రదర్! ప్రస్తుతం ట్రైల్ రన్‌లో ఉంది."

"ఉంటే వుండుగానీ నన్నిందులోకి లాగకు. నా పరిస్థితేం బావుండలేదు ప్రస్తుతానికి."

"డోంట్ వర్రీ బ్రదర్! నీ అశీర్వాదం వుంటే చాలు దున్నేస్తాను."

"కానీ తర్వాత నువ్వు ఒరిజినల్ చంద్రకాంత్‌వి కాదని తెలిస్తే?"

"రేపటి సంగతొద్దు- ఇవాల్టి గురించి ఆలోచించు మిత్రమా- ప్రపంచము నీ కాళ్ళ దగ్గరుంటుంది అన్నాడో ఫేమస్ ఫెలో. విన్‌ఛాధాలు, హర్షద్ మెహతాలు... ఇలా ఎంతోమంది ఆ రూల్‌ని ఫాలో అయి ఇవాళ అనుకున్నది సాధించారు బ్రదర్! ప్రపంచాన్ని కాళ్ళ దగ్గరకు తెచ్చేసుకున్నారు. రేపేమవుతుంది అని వాళ్ళు ఆలోచిస్తే కనీసం టెంపరరీగా అయినా వాళ్ళు ఆ సక్సెస్ సాధించేవాళ్ళా? లేదు. అంచేత..."

"ఓకే భవానీ! భోజనానికి పిలుపు వచ్చింది. కమాన్!"

"మనం స్పీచ్ ఇస్తున్నప్పుడు మధ్యలో ఎవరేం పలికినా వినిపించదు మిత్రమా! కమాన్ లెటజ్ గో!"

అందరూ డైనింగ్ టేబుల్ దగ్గరకు చేరుకున్నారు.

"మిస్టర్ చంద్రకాంత్! నువ్వు రచయితనన్నావు కదూ?"

"ఎస్సర్!"

"రచయితలంటే నాకు పరమద్వేషం. డూ యూ నో దట్?"

భవానీశంకర్ గాబరా పడ్డాడు.

"ద్వేషమా మేజర్?"

"నేను మేజర్ కాదు– కర్నల్"

"ఓ సారీ– కర్నల్! రచయితలంటే ద్వేషం ఎందుకని కర్నల్?"

"కాలేజీలో చదివేప్పుడు ఓ రచయితగాడు కాలేజ్ మాగజైన్‌లో ఓ ఇడియాటిక్ కథ రాశాడు. అందులో ఏమి రాశాడంటే చేతిని పావుగంట సేపు ఐస్‌లో వుంచితే తేలు కుట్టినా, పాము కుట్టినా విషం చేతికి ఎక్కదని రాశాడు. వాడి కథను నమ్మి మా కాలేజ్ బ్యూటీ ముందు తేలుతో కుట్టించుకున్నాను. దాంతో విషం ఎక్కి నురగలు కక్కి పడిపోయి బ్యూటీక్వీన్ ముందు ఇన్సల్ట్ అయిపోయి, హాస్పిటల్లో చేరి రెండ్రోజులు వుండాల్సి వచ్చింది."

అందరూ పగలబడి నవ్వారు

"అది కథ అని గుర్తుంచుకుంటే ఎంతో బావుండేది కర్నల్! రచయితలు రాసే కథల్ని నిజాలనుకొని వాటితో ఎక్స్‌పెరిమెంట్స్ చేసేశాళ్ళు ముందు మొదదు కండిషన్ చెక్ చేయించుకోవాలి" భవానీశంకర్ సలహా ఇచ్చాడు.

కర్నల్ కనకారావ్‌కి వళ్ళు మండిపోయింది.

పక్కనే వున్న రివాల్వర్ తీసి చంద్రకాంత్‌కి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కబోయాడు. రత్నప్రభ అతని చేతి మీద లాగి కొట్టేసరికి రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది.

"అంటే ఆ బ్యూటీక్వీన్ దగ్గర ఆ రోజు ఫెయిలయి ఇన్సల్ట్ అవకపోతే ఈపాటికి దాన్నే చేసుకుని వూరేగేవారన్నమాట" అంది కోపంగా.

కర్నల్ గాబరాపడ్డాడు.

"నిన్ను కలుసుకోకముందు ఆ అమ్మాయినే బ్యూటీక్వీన్ అనుకున్నానే– ఆముదపు చెట్టులాగా– అహ్హహ్హా" అన్నాడు కవర్ చేసుకుంటూ.

"షటప్! సిగ్గు లేకపోతే సరి ఆ రచయితెవరోగానీ గ్రేట్‌మాన్. అందుకే మీలాంటి బుద్ధిలేనివాళ్ళకి బుద్ధి చెప్పటానికే అలా రాశాడు" రత్నప్రభ మరింత కఠినంగా అంది.

"నో! అలా పాఠకుల్ని మిస్‌గైడ్ చేసే రచయితలంటే నాకు వళ్లుమంట. ఐ హేట్ దెమ్. ఇంకో రచయితగాడేం చేశాడో తెలుసా మిస్టర్ చంద్రకాంత్?"

"ఏదో చేసే వుంటాడు కర్నల్! అందులో ఏమాత్రం సందేహం లేదు. మనం వాళ్ళ గురించి పెద్దగా పట్టించుకోనవసరం లేదు."

"నో! ఐ డోంట్ ఎగ్రీ. పట్టించుకోవాల్సిన అవసరం వుంది. ఎందుకో తెలుసా?"



"తెలుసుగానీ మర్చిపోయాను."

"యూ షుడ్ నెవర్ ఫర్‌గెట్! రచయితంటే సమాజాన్ని గైడ్ చేసే ఒక మహావ్యక్తి. అతనేం రాసినా సమాజం పట్ల బాధ్యతతో రాయాల్సి వుంటుంది."

"ఆఫ్‌కోర్స్! నేనెప్పుడూ అలాగే రాస్తూంటాను."

"నీ సంగతి కాదు మిస్టర్ చంద్రకాంత్ నేను మాట్లాడేది. "హోకస్ ఫోకస్" అనే నవల రాసిన ఒక పరమ నికృష్ణ రచయిత గురించి మాట్లాడుతున్నాను."

"ఆ నవల పేరు చూస్తేనే వాడో నికృష్ట రచయితని తెలిసిపోతోంది" తనూ ఉత్సాహంగా అన్నాడు భవానీశంకర్.

పూజ కెవ్వున కేక వేసింది.

"వాటీజ్ దిస్ మిస్టర్ చంద్రకాంత్? ఆ నవల ఫెంటాస్టిక్ నవల ఐ సింప్లీ లవిట్– మీర్రాసిన నవల్స్ అన్నింటిలోనూ అది మాస్టర్ పీస్" అంది ఉత్తేజంగా.

భవానీశంకర్ స్టన్ అయ్యాడు.

"అది నేను రాసిన నవలా?"

"మీర్రాసిన నవల మీరే మర్చిపోయారా?" ఆశ్చర్యపోతూ అంది పూజ.

భజన్‌రావ్ చప్పున అందుకున్నాడు.

"ఒకేసారి అయిదారు నవలలు రాసే సీజన్ కదండీ– పాపం– పాత నవలలన్నీ తెగ మర్చిపోతూంటారు ఈ రచయితలు. అందులోనూ చంద్రకాంత్‌గారు మరీ బిజీ రైటర్."

"అవునవును గుర్తుకొచ్చింది. 'హోకస్ ఫోకస్' నేనే రాశానది. ఏ సంవత్సరమో గుర్తులేదుగానీ, నేనే. విత్ మైన్ ఓన్ హాండ్స్– రాశాను" సర్దుకుంటూ అన్నాడు భవానీ.

కనకారావు అమాంతం లేచి నిలబడ్డాడు. అగ్గి అయిపోతూ.

"వాట్? హోకస్ ఫోకస్ నవల నువ్వు రాశావా?"

భవానీ డైలమాలో పడ్డాడు.

ఆ నవల రాసిన వాడిని మర్డర్ చేయాలి అన్న లెవల్లో మాట్లాడాడిందాక. ఇప్పుడు తనే అది రాశానని చెప్తే...

"నేను రాశానంటే ఎగ్జాక్ట్‌గా నేనే కాదనుకోండి– ఐమీన్– దానికి చాలామంది కన్సల్టేషన్స్, సజెషన్స్, డెవలప్‌మెంట్స్ ద్వారా సహాయం చేస్తూంటారన్నమాట. అంటే ఒక నవల ఒక రచయిత రాశాడూ అంటే దాని వెనుక ఎంతోమంది రచయిత లుంటారన్న మాట. అంటే–"

"మిస్టర్ చంద్రకాంత్! మర్యాదగా లేచి నిలబడు."

భవానీశంకర్ లేచి నిలబడ్డాడు.

"వాట్ కల్నల్? ఎనీ ప్రాబ్లమ్?"

"ఎస్! నిన్ను గన్‌తో కాల్చాలి యిప్పుడు."

"మనది మిలటరీ రూల్ కాదు బ్రదర్! ఎవడినిబడితే వాడిని కాల్చి పారేయడానికి. అదృష్టవశాత్తో, దురదృష్టవశాత్తో మనది డెమొక్రసీ! అంటే కేవలం పోలీసులకే కాల్చిపారేయడానికి పవర్సుంటాయి. ఇంకెవరికీ వుండవ్."

"ఐ డోంట్ కేర్! నాకు ఉరిశిక్ష పడినా ఫర్లేదు– నిన్ను కాల్చి పారేయటం ఖాయం. ఉరికంబం ఎక్కి నా సమాజానికి గొప్ప సేవ చేశానన్న సంతృప్తి వుంటుంది నాకు."

"ఆల్‌రైట్ మేజర్! ముందు భోజనం కానీండి– కాల్పులు గురించి తర్వాత ఆలోచిద్దాం."

"డాడీ! చంద్రకాంత్ నా అభిమాన రచయిత– అతనితో అలా మాట్లాడటం నాకు నచ్చలేదు" కోపంగా అంది పూజ.

"అతన్ని కాల్చాలను కోవటం అందుకేనమ్మా! నీలాంటి బ్రెయిన్ లెస్ కిడ్స్‌ని అలాంటి చెత్త నవలలు రాసి మెంటల్ కేస్‌లుగా మార్చేస్తున్నాడు. కేవలం సమాజ క్షేమం కోసం కాల్చక తప్పదు."

"డాడీ– ప్లీజ్! హి ఈజ్ అవర్ గెస్ట్" చిరాకుగా అంది సీత.

"ఎస్ ఫాదరిన్లా! నా బెస్ట్ ఫ్రెండ్!" తనూ సపోర్ట్ చేశాడు గోపాల్రావ్.

"ఆల్‌రైట్! ఒక కండిషన్ మీద వదిలేస్తాను"

"ఏమిటది మిత్రమా?"

"నువ్వు నన్ను హిప్నటైజ్ చేసి చూపించాలి."

"హిప్నాటిజమా?"

"అవును."

"అది కావాలంటే మీరెవరయినా హిప్నాటిస్ట్ దగ్గర కెళ్ళాలి కర్నల్! రచయితల వెంటపడితే ఏం లాభం?"

"మరి ఆ నవలంతా హిప్నాటిజం మీద రాశావు కదా! హీరో ఎవర్ని కావాలంటే వాళ్ళని హిప్నటైజ్ చేసి చివరకు విలన్స్ బారి నుంచి హిప్నాటిజం సాయంతోనే హీరోయిల్ని రక్షిస్తాడని రాశావుగా?"

"అలా రాశానా– రాసే వుంటాను"

"పైగా హిప్నాటిజం ఒక బ్రహ్మాండమైన సైన్స్. అది నాకొచ్చు అని ముందు మాటలో దబ్బాకొట్టుకున్నావు కదా?"



"అందులో అనుమానమే లేదు కర్నల్! నేను హిప్నాటిజంలో ప్రొఫెసర్ని."

"అవును డాడీ! చంద్రకాంత్‌గారు తన హిప్నాటిజంతో ఓ చిన్న పాపను ట్రాన్స్‌లోకి తీసుకెళ్ళి గుండె ఆపరేషన్ చేయించి తర్వాత మళ్ళీ యథాస్థితికి తీసుకొచ్చేశారట. ఆ పాపకు ఎనిస్తేసియా ఇవ్వాల్సిన అవసరం లేకపోయిందట"

"అవునా చంద్రకాంత్?"

"ఎస్సర్! ఇటీజే ఫాక్ట్."

"ఐసీ! ఇటీజేలై. అదంతా అబద్ధం."

"నో.. ఇటీజే ఫాక్ట్."

"ఆల్‌రైట్! ఆ పాప తల్లిదండ్రుల అడ్రస్ చెప్పు– రేపే ఆ విషయం నిజమో కాదో ఉత్తరం రాసి తేల్చుకుంటాను."

భవానీ కొంచెం కంగారుపడ్డాడు.

"వాళ్ళ అడ్రస్సా?"

"ఎస్!"

"వాళ్ళు కలకత్తాలో ఉండే వాళ్ళుగానీ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో వుంటున్నారని తెలిసింది."

"బంగ్లాదేశా?" నిరాశగా అడిగాడు కనకారావ్.

"అవును. ఢాకాకి అరవై రెండు కిలోమీటర్లలో" అబద్ధాన్ని నిజంగా చూపే ప్రయత్నంలో ఇంకో ట్రిక్ వుపయోగించాడు.

"ఆల్‌రైట్! వాళ్ళు లేకపోతే పోనీ– ఆ ఆపరేషన్ చేసిన డాక్టర్ పేరూ, అడ్రసూ యివ్వు– రేపే తేల్చేస్తాను."

"ఇంకెక్కడి డాక్టర్! సరిగ్గా సంవత్సరం క్రితం లారీ యాక్సిడెంట్‌లో మొత్తం ఫామిలీ తుడిచిపెట్టుకుపోయింది."

"వాట్– చచ్చిపోయాడా?"

"మొత్తం ఫామిలీతోపాటు"

"నేన్నమ్మను."

"బరియల్ గ్రౌండ్ అడ్రసిస్తాను– సమాధి నెంబర్స్– సెవెన్, ఎయిట్, నైన్, టెన్ అండ్ లెవెన్. కేరాఫ్ బంజారాహిల్స్ బరియల్ గ్రౌండ్."

కర్నల్ కేం చేయాలో తోచలేదు.

"ఓకే! నీతో వాదించటం నాకిష్టం లేదు. ఐయామే ప్రాక్టికల్ మేన్! రేపు నన్ను హిప్నటైజ్ చేసి చూపించాలి. అప్పుడే హిప్నాటిజం సైన్స్ అని నమ్ముతాను. లేకపోతే

ఇంకెప్పుడూ ఈ బుద్ధి తక్కువ రాతలు రాయను అని నీతో బాండ్ పేపరు మీద రాయించి అన్ని పేపర్లకూ కాపీలు పంపిస్తాను."

"అయ్యో! మీకు తెలీటం లేదు డాడీ! చంద్రకాంత్ ఎంత జీనియస్సో! మిమ్మల్ని అయిదు నిమిషాల్లో హిప్నటైజ్ చేసేస్తాడు."

"ఏడ్చాడు- నేనేం బ్లడీఫూల్‌ని కాదు, ఎవడేం చేస్తే అది అయిపోడానికి."

అందరి భోజనాలు ముగిశాయి.

భవానీశంకర్ తన గదిలో పడుకుని పూజని త్వరగా లవ్‌లో పడేసేందుకు ప్లాన్లు ఆలోచిస్తూంటే భజన్‌రావ్ మధ్యాహ్నం మూడు గంటలకు 'టీ' తీసుకొచ్చి అందించాడు.

"మీతో ఒక విషయం అర్జంటుగా మాట్లాడాలి సార్!" అన్నాడు సీరియస్‌గా.

"దానికి అపాయింట్‌మెంట్ అవసరంలేదు మిత్రమా! చెప్పేసెయ్- మనసులో దాచుకుంటే రేపు సడెన్‌గా హార్ట్ ఎటాక్‌తో ఎగిరి పోయావనుకో- నీ ఆత్మ ఇక్కడే తిరుగుతూండిపోతుంది అసంతృప్తితో."

"సంగతేమిటంటే సార్! ఇందాక బ్యాంక్ కెళ్ళాను. మీరిచ్చిన చెక్ చెల్లదు పొమ్మన్నారు" తాపీగా చెప్పాడు.

"చెల్లదన్నారా?"

"అవున్సార్!"

"అందుక్కారణం ఏమయినా చెప్పారా బ్రదర్?"

"చెప్పారు సార్"

"ఏమిటిది?"

"ఎకౌంట్లో అస్సలు డబ్బు లేదండీ!"

"లేకపోతే ఏమయింది బ్రదర్! ఇంత గొప్ప రచయిత చెక్ ఇచ్చి నప్పుడు ముందు హానర్ చేసి తర్వాత కట్టమంటే కట్టేస్తాం కదా?"

"కానీ ఆ మాట అనుకోవలసింది మనం కాదు కదండీ- వాళ్ళు- వాళ్ళలా అనుకోవటం లేదు మరి."

"అలాగా! అయితే సరే బ్రదర్! తొందరేముందీ? ఎకౌంట్‌లో డబ్బు వున్నప్పుడే తీసుకుందువుగాని."

"ఎకౌంట్‌లో డబ్బు ఎప్పుడు వుంటుంది సార్?"

"రేపే వుండవచ్చు. లేదా పదేళ్ళ తర్వాత వుండవచ్చు."

"అంతవరకూ నేనేం చేయాలి సార్?"

"ప్రతిరోజూ బ్యాంక్‌కెళ్ళి బ్యాలెన్స్ ఎంతుందో కనుక్కోవటం"



"ఒకవేళ. నా పదివేలూ ఇప్పుడే క్యాష్ ఇవ్వాలనీ... లేకపోతే మీరు డూప్లికేట్ చంద్రకాంత్ అన్న విషయం సీతా మేడమ్‌తో చెప్పివేస్తాననీ అన్నాననుకోండి... మీరేం చేస్తారు?"

"తెలివిగలాడివయితే నువ్వలా చెప్పవు మిస్టర్ భజన్‌రావ్."

"ఎందుకు చెప్పను?"

"ఎందుకంటే ఇందాకే నువ్వు సీతా మేడమ్, పూజ దగ్గర నువ్వు నా అభిమానివనీ, మా ఖమ్మం వచ్చి నా ఫొటో, నా ఆటోగ్రాఫ్ తీసుకుని వెళ్ళావనీ చెప్పావ్. అవునా కాదా?"

"అవును."

"మరి నా ఫొటో అప్పుడు చూసిన వాడివి... ఇప్పుడు ఉదయం నేను అసలు రచయితను కాదని వారికి ఎందుకు చెప్పలేదు? ఇతనే రచయిత చంద్రకాంత్ అని ఎలా కన్‌ఫరమ్ చేశావ్?"

భజన్‌రావ్‌కేం చెప్పాలో తోచలేదు.

"అప్పుడు పొరబాటు పడ్డానని అంటాను."

"కానీ నేను వూరుకోనుగదా! అప్పుడు నేనే చంద్రకాంత్‌నని అందరికీ దొంగసాక్ష్యం చెప్పటానికి నా దగ్గర పదివేలు అడిగాడని చెప్పాననుకో రెడ్‌హాండెడ్‌గా దొరికిపోతావు. ఆ చెక్ నువ్వే బ్యాంకుకి తీసుకెళ్ళినట్లూ, క్యాష్ చేసుకోడానికి ప్రయత్నించినట్లూ కూడా ఋజువులున్నాయి."

భజన్‌రావ్ భయపడిపోయాడు. కొద్ది క్షణాలు అటూ ఇటూ పచార్లు చేశాడు.

"ఆల్ రైట్ సార్! నేనే ఓడిపోయాను."

"ఎవడి కోసం ఓడిపోవు బ్రదర్! తెలివితేటలు ఎవడబ్బసొమ్మని.. నీకు ఇప్పుడు ఒక్క పైసా కూడా ఇవ్వను. ఏం చేస్తావో చేసుకో".

పూజ పరుగుతో గదిలోకొచ్చింది-

"చంద్రకాంత్‌గారూ! నేను రడీ. కాగితం పెన్‌తో వచ్చేశాను."

"అద్భుతమయిన పనిచేశారు. భజన్‌రావ్ ప్రస్తుతం నువ్వు బయటి కెళ్ళి ఇంకో గంటలో మళ్ళీ మా ఇద్దరికీ 'టీ' తీసుకొస్తావు ఎందుకంటే అప్పటికి మేమిద్దరం హాట్ డిస్కషన్‌తో అలసిపోయి వుంటాం. వాట్ పూజాజీ?"

"అవును."

భజన్‌రావ్ దిగులుగా చూశాడు-.

"అంత దిగులుపడాల్సిన పనిలేదు భజన్‌రావ్! నీ ప్రవర్తనావళి మెరుగుపడితే నీకు

కొంత సహాయం చేయడానికి భారతదేశం ఏ మాత్రం వెనుకాడదు... గుర్తుంచుకో."

భజన్‌రావ్ కళ్ళల్లోకి మెరుపు వచ్చింది.

"ఓ.కే. సర్! గుర్తుంచుకుంటాను"

"ఏమిటి భారతదేశం అంటున్నారు?"

"తను ఇండస్ట్రీ పెట్టుకోడానికి ఆర్థికసాయం చేయమని భారత ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నాడట... ఆ విషయంలో నన్ను రికమెండ్ చేయమంటున్నాడు."

పూజ పగలబడి నవ్వేసింది–

"వీడి ముఖానికి ఇండస్ట్రీ పెడతాడా? ఏమి ఇండస్ట్రీ?"

"ఫాస్ట్‌పుడ్ సెంటర్"

"అంటే ఇక్కడ ఉద్యోగం మానేద్దామని ప్లాన్లో వున్నాడా?"

"అలాగే కనబడుతున్నాడు డియర్!"

"రాస్కెల్! ఈ విషయం అక్కతో చెప్పేస్తాను."

"ఓకే డియర్! ప్రస్తుతానికి ఫాస్ట్‌పుడ్‌గాడిని వదిలేస్తే.. మనం నీలాంటి అందమయిన రచయిత్రులు తెలుసుకోవాల్సిన రచనా మెళకువల గురించి చర్చించుకుందాం! ఉదాహరణకు మీరో రొమాటింక్ నవల రాయాలనుకోండి... ఎలా రాస్తారు?"

"కాగితం మీద."

"ఆఫ్‌కోర్స్... ఆఫ్‌కోర్స్! సెంట్‌పర్సెంట్ కరెక్ట్. కాగితం మీద ఎలా రాస్తారు?"

"పెన్‌తో."

"ఒండర్‌ఫుల్! సూపర్బ్ ఆన్సర్. కానీ ఏం రాస్తారు?"

"రొమాన్స్"

"అదెలా రాస్తారు?"

"అది తెలియకే కదా మిమ్మల్నడిగింది."

"ఎస్! దానికి రెండు పద్ధతులున్నాయి."

"ఏమిటవి?"

"మొదటి పద్ధతేమిటంటే చాలా పాతది. మన పాత రచయిత్రులు విరివిగా వాడిన సూత్రం అన్నమాట! అదేమిటంటే మనకు తెలీనిదాన్ని గురించి రాసేప్పుడు వూహించి రాసేయటం. కొంతమందికి వూహించటం రాదనుకోండి. అప్పుడు వాళ్ళు అదే విషయం నిద్రపోయేముందు బోలెడు సార్లు అనుకుని, తలచుకుని దాన్ని గురించి దిగులుపడి అప్పుడు నిద్రపోతారు. అప్పుడదే కలలోకొస్తుంది. ఉదాహరణకు మీరు రొమాంటిక్ నవల రాయాలనుకోండి... రొమాన్స్ గురించే ఆలోచిస్తూ నిద్రపోయి...



నిద్రలో రొమాన్స్ తాలూకూ కల ఒకటి కంటారన్నమాట. ఆ కలలో మీరు ఓ హీరోతో రొమాన్స్ జరుపుతుంటారు. మేఘాల్లో తెలిపోతూ, నీళ్ళల్లో ఈతకొడుతూ, లేక ఎక్కడో ద్వీపం మీద పరిగెడుతూ, అలా మోస్ట్ కలర్‌ఫుల్ కల అన్నమాట. మర్నాడు పొద్దున్న నిద్రలేవగానే హీరోనీ, ఆ ప్రకృతినీ, ఆ రొమాన్స్‌నీ గుర్తుంచుకుని నవలలో రాసేస్తారు. ఇదీ పాత పద్ధతి. ఇందులో సహజత్వం తక్కువ వుంటుంది. ఎందుకంటే కలకు రీజనింగ్, నేచురాలిటీ వుండదు కదా. దానిష్టం.. ఎటుపడితే అటు వెళ్ళిపోతుంది. ఇక రెండో పద్ధతి ఏమిటంటే ఇది మోడ్రన్ పద్ధతి ఈ పద్ధతి ఫాలో ఆయే రచయిత్రులేం చేస్తారంటే రొమాంటిక్ నవల రాయాలనుకోండి వెంటనే తమకు అతి సమీపంగా వున్న హీరోని చూసి చిరునవ్వు నవ్వుతారు. దాంతో హీరో లవ్‌లో పడతాడు. ఇద్దరూ రొమాన్స్ ప్రారంభిస్తారు. ఆ రొమాన్స్ తాలూకూ ప్రతి మూడ్‌నీ, మూవ్‌మెంట్‌నీ, ఫీలింగ్స్‌నీ, అన్నీ ఎప్పటికప్పుడు నోట్స్ రాసేసు కుంటుందన్నమాట!.

ఉదాహరణకు హీరో ఆమెను కౌగలించున్నాడనుకోండి.

"అతని కౌగిలి ఇనుప కౌగలిలాగా వుంది. శరీరం ఆ కౌగిట్లో నలిగి పౌడర్ అయిపోతుందేవో అనిపించింది. అతని చేతులు తాకిన చోటల్లా అగ్ని గుండాలేర్పడుతున్నాయి" ఇలా పచ్చి నిజాలు, పచ్చి ఊహలు అన్నీ రాసేస్తూంటారు. అంతా ప్రాక్టికల్ కనుక వాళ్ళకు ఆ ఆవేశంలో తాము అతి భయంకరమైన బూతు రాస్తున్నామని కూడా తెలీదు. కానీ వయసులో వున్న పాఠకులు ఆ బూతుని ఉవ్విళ్ళూరుతూ, కసిగా చదువుతూండేసరికి మరింత బూతుని సరఫరా చేయటం ప్రారంభిస్తారు. అంత బూతు ప్రాక్టికల్‌గా రాయాలంటే ఇంకా ఎక్కువ సమయం రొమాన్స్‌కి కేటాయించాలి. గనుక చివరకు ఆ హీరోనే పెళ్ళి చేసేసుకుంటారు–

ఇదీ రెండో పద్ధతి. ఈ రెండింట్లో మీకేది బెటరనిపిస్తే అదే ఫాలో అవవచ్చు" అని ఆమె రియాక్షన్ కోసం ఎదురుచూడసాగాడతను.

పూజ కొద్ది నిమిషాలు ఆలోచించింది.

"ఓ.కే. అయ్‌వాంట్ టు బి ఎ మోడ్రన్ రైటర్."

భవానీశంకర్ ఆనందంతో తప్పట్లు కొట్టాడు.

"సూపర్బ్ చాయిస్! మీరు కనుక మొదటి పద్ధతి అంటే మీకూ నాకూ గుడ్‌బై– మీరెప్పటికీ సక్సెస్‌ఫుల్ రైటర్ కాలేరని చెప్పేవాడిని– ఓ.కే. ఇవాల్టికి ఈ లెసన్ చాలనుకుంటాను. నేను కొద్దిసేపు మీ బావ గోపాల్రావ్‌తో కొన్ని అత్యవసర విషయాలు డిస్కస్ చేసుకుని వస్తాను– సీయూ."

భవానీశంకర్ బయటపడ్డాడు.

ఇంక అనుమానం లేదు పూజ తన వలలో పడినట్లే.

రేపు స్కీమ్ నెంబర్ టూ అమలుపరచాలి.

గోపాల్రావ్ టెర్రేస్ మీద కూర్చుని సీతా తాలూకూ సైడ్ యాంగిల్ అందాన్ని పొగుడుతూ కెమెరాతో తెగ స్నాప్‌లు కొడుతున్నాడు.

"ఆహా! ఈ యాంగిల్ ఎంత బావుందో తెలుసా? సినిమా స్టార్లు బలాదూర్ నీ ముందు."

"నిజంగానా?"

"రేపు ఫోటోలు వచ్చాక మీ ఫ్రెండ్స్‌నే అడుగు-తెలుస్తుంది."

"హలో బ్రదర్! ఏమిటి అర్జంటుగా ఫోటోలు తీస్తున్నావు సిస్టర్ని? ఎనీ అకేషన్?"

"ఎస్!"

"ఏమిటది?"

"నిన్న మా మిసెస్ బర్త్‌డే."

భవానీశంకర్‌కి ఏమీ అర్థం కాలేదు

"నిన్నా?"

"ఎస్ ఫ్రెండ్."

"మరి హడావుడి యివాళేమిటి?"

"అదే మన స్పెషాలిటీ."

"అంటే అందరూ ఇవాళ చేసే పనిని మనం రేపు చేయటం" అంది సీత హేళనగా.

"ఎస్ కరెక్ట్! మనకి ఏ పని అయినా పదిమందిలో చేయటం యిష్టముండదు."

సీత వెళ్ళిపోయింది.

"ఇప్పుడో పెద్ద ప్రాబ్లెమ్ వచ్చిపడింది" అన్నాడు గోపాల్రావ్.

"ఏమిటి మిత్రమా అది?"

"ఆ అమ్మాయికి రేపు ఆ పెన్ యిస్తానని చెప్పాను- మా ఆఫీసుకి వస్తుంది."

"ఏ అమ్మాయి బ్రదర్?"

గోపాల్రావ్ మళ్ళీ కథంతా చెప్పాడు.

"నన్నడిగితే ఆ అమ్మాయికి అలాంటి పెన్ యింకోటి కొనిచ్చేయటం ఉత్తమం సార్" అన్నాడు భజన్‌రావ్ మళ్ళీ 'టీ' తీసుకొస్తూ.

"ఎందుకని భజన్‌రావ్?"

"ఎందుకంటే ఆ పెన్ సీతా మేడమ్‌గారు పూజా మేడమ్‌కి గిఫ్ట్‌గా ఇచ్చారు కదండీ. దానిని కర్నల్‌గారు చూసి ముచ్చటపడి నాకిచ్చేయమని అడిగి తీసుకున్నారండీ. మరి ఏ



వస్తువయినా ఒకసారి కర్నల్‌గారి చేతుల్లో పడిందంటే తిరిగిరాదని రత్నప్రభ మేడమ్‌గారంటూండగా విన్నానండీ"

"కానీ యిప్పుడు మార్కెట్‌లో అలాంటి పెన్ ఎక్కడుందో వెతికి తేవాలంటే కష్టం కదా- ముందా రాణీకి ఏమని చెప్తాం?" చిరాగ్గా అన్నాడు గోపాల్రావ్.

భవానీశంకర్ ఆలోచనలో పడ్డాడు.

"ప్రస్తుతానికి ఆపెన్‌ని దొంగిలించటం ఒక్కటే మార్గం. మన భజన్‌రావ్ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంలో ఎక్స్‌పర్ట్‌ని నాకనుమానంగా వుంది."

అతని మాటలకు భజన్‌రావ్ బెదిరిపోయాడు.

"కర్నల్‌గారి దగ్గర్నుంచీ దొంగతనం చేయటమా? నావల్ల కాదు సార్! ఇప్పటికి ఇంట్లో దొంగిలించడానికి వచ్చిన ఆరుగురు దొంగల్ని కాళ్ళమీద కాల్చి తనే గవర్నమెంటు హాస్పిటల్లో చేర్పించి తర్వాత పోలీసుకి ఇన్ఫర్మేషన్ యిచ్చాడని అన్ని న్యూస్ పేపర్లలోనూ రాశారు. ఆ రోజు నుంచీ ఇంతవరకూ ఏ దొంగయినా ఆయనింటి వైపు చూస్తే ఒట్టు- ఆయన ఇల్లు తాళం వేసి రెండు నెలలు టూర్ వెళ్ళినా వచ్చేవరకూ ఎవడూ ఇంటివైపు కన్నెత్తి చూడడు"

"ఓకే బ్రదర్! ఒకవేల భజన్‌రావ్‌కేమైనా ప్రాబ్లెమ్ వుంటే నువ్వే ఆ కార్యక్రమం నిర్వహించు."

"నో! నావల్లకాదు- అభాసుపాలయిపోతాను."

"లేకపోతే ఓ పని చెయ్యి- ఆ అమ్మాయికి ఆ పెన్ పోయిందని చెప్పి ఆ పెన్‌కి డబుల్ రేట్ యిచ్చేసెయ్యి."

"సరే ట్రై చేస్తాను"

రాత్రి భోజనాలయ్యాక భవానీశంకర్ టెర్రేస్ మీద పూజతో పాటు వెన్నెల్లో కబుర్లు చెపుతూ రొమాంటిక్ నవల గురించి డిస్కషన్ చేస్తూండగా కర్నల్ కనకారావ్ టెర్రేస్ మీదకొచ్చి ఆ దృశ్యం చూసి మండిపడ్డాడు. పూజ భవానీశంకర్‌తో అంత చనువుగా వుండటం అతనికి నచ్చలేదు.

"రేపు నన్ను హిప్నటైజ్ చేసే కార్యక్రమానికి బాగా ప్రిపేరు అయ్యావా మిస్టర్ చంద్రకాంత్?"

"ఎస్ కామ్రేడ్! సెంట్‌పర్సెంట్"

"దట్స్ గుడ్! లేకపోతే నేను చాలా చెడ్డవాడినయిపోతాను- తెలుసా నీకా సంగతి?"

"చాలామంది చెప్పారు కల్నల్."

"ఏమని?"

"మీకు కోపం వస్తే మనిషి కాదని, మృగం కంటే అన్యాయమనీ."

"ఎస్! అది దృష్టిలో వుంచుకో. ఆ హోకస్‌ఫోకస్ నవల రాసింది నువ్వేనన్నావు కదూ?"

"ఎస్ బ్రదర్! ఎనీ ప్రాబ్లెమ్?"

"దాని రచయితని ఎప్పటికయినా పట్టుకుని మళ్ళీ రాయకుండా చేతి మీద కాల్చేయాలనుకున్నాను. కానీ వెతకటానికి టైమ్ దొరకలేదు. టేకిట్ గ్రాంటెడ్ చంద్రకాంత్! నీ చేతివేళ్ళు కాల్చిపారేసేది ఖాయం."

"డోంట్ గెట్ ఎగ్జయిటెడ్ ఫ్రెండ్! లీగల్‌గా అలాంటి చర్యను చట్టం వప్పుకోదు. ఇది డెమోక్రసీ! మిలటరీ రూల్ కాదు."

"టు హెల్ విత్ డెమొక్రసీ? డెమొక్రసీలో కూడా కాల్చిపారేయడానికి అధికారముంది. లేకపోతే రోజూ అన్నిచోట్లా కాల్పులు, మర్డర్లు ఎలా జరుగుతాయి? ఎనీవే- గెట్ రడీ. పూజా! పద" అన్నాడు.

"నేను నవలలు రాసే టెక్నిక్ నేర్చుకొస్తాను డాడీ."

"నో! ఇలాంటి చెత్త రచయితల దగ్గర నేర్చుకుంటే నువ్వు చివరకు కాపీరైట్ యాక్ట్‌కింద జైలుకెళ్తావ్- డూ యూ నో! ఈ చంద్రకాంత్ పరమ కాపీ రచయిత అని ఇందాకే మా ఫ్రెండొకడు ఫోన్‌లో చెప్పాడు. హిందీ టీవీ సీరియల్సన్నీ యధాతథంగా కాపీ కొట్టేస్తున్నాడంట. ఈ రోజున పేరుప్రఖ్యాతులు తెచ్చుకున్న రచయితల గ్యాంగ్ అంతా కేవలం ఇంగ్లీష్ తెలుగు ట్రాన్స్‌లేటర్స్ అని, వీళ్ళకే మాత్రం ఒరిజినాలిటీ లేదని అతను చెప్పాడు. అంచేత డోంట్ ఓవర్ ఎస్టిమేట్ దెమ్-ఓ.కే?"

"నో! ఐ కాన్ట్ బిలీవ్! మా డాడీ చెప్పే మాట నిజమేనా మిస్టర్ చంద్రకాంత్?"

"ఎక్కడో ఒకరిద్దరు అలా చేస్తున్నమాట నిజమేగాని మనదంతా ప్యూర్ ఒరిజినాలిటీ మిస్ పూజా! మియర్ అబ్జర్వేషన్ ఆఫ్ లైఫ్.'

"ఆల్ రైట్ పూజా! కమాన్" కోపంగా అన్నాడు కల్నల్.

"గుడ్‌నైట్ మిస్టర్ చంద్రకాంత్.

"గుడ్ నైట్."

ఇద్దరూ వెళ్ళిపోయారు.

• • •

మర్నాడు ఉదయం అందరూ డైనింగ్ టేబుల్ దగ్గరుండగా డోర్‌బెల్ మోగిన చప్పుడయింది.



భజన్‌రావ్ వెళ్ళి తలుపు తెరిచాడు.

రచయిత చంద్రకాంత్ అతనిని చూసి చిరునవ్వు నవ్వాడు.

"హలో!"

"హలో" అన్నాడు భజన్‌రావ్.

"నా పేరు చంద్రకాంత్... రచయిత చంద్రకాంత్.. గుర్తుపట్టేశారు కదూ?"

భజన్‌రావ్ స్టన్ అయిపోయాడు.

"రచయిత చంద్రకాంతా?"

"అవును. ఫేమస్ రైటర్ చంద్రకాంత్‌ని నేనే."

భజన్‌రావ్ బుర్రగోక్కున్నాడు. నమ్మలేనట్లు అతనివంక మరో సారి చూశాడు.

"రచయిత చంద్రకాంత్‌గారు మీరా?"

"అవును. సీతాదేవిగారున్నారా?"

భజన్‌రావ్ ఆశ్చర్యపోయాడు.

"సీతా మేడమ్‌గారా?"

"అవును! ఆమె నన్ను అర్జంటుగా రమ్మని మెయిలిచ్చారు."

"ఓ- మీరా! ఓకే! ఓకే! ఒక్క నిమిషం ఇక్కడే కూర్చోండి. నేను లోపలికెళ్ళి ఏర్పాట్లు చేసి వస్తాను."

చంద్రకాంత్ ఆనందంగా సోఫాలో కూలబడ్డాడు.

సీతాదేవి ఎలా వుంటుందో? అందంగా ఉంటుందా? ఏజ్ గ్రూప్ ఏమిటో? పాతికలోపా, పైనా? తనకి కొంచెం ఏజ్ విషయంలో సరదాలున్నాయిగానీ ఎడిటర్ నీలకంఠంకి ఆ పట్టింపేం లేదు. ఎదురుగా వున్న కాండిడేట్ ఆడదన్న చిన్న ఇండికేషన్ కనిపించినా చాలు! రూమ్‌కి తీసుకెళ్ళిపోతాడు.

భజన్‌రావ్ లోపలికొచ్చి బిగ్గరగా గోపాల్రావ్‌తో అన్నాడు-

"మీ కోసం ఆఫీస్ నుంచి ఎవరో వచ్చారండీ. అర్జంటుగా ఏదో ఫైల్ గురించి మాట్లాడాలట. చాలా అర్జంటంట"

గోపాల్రావ్ గుండె వేగంగా కొట్టుకుంది.

బహుశా ఆ రాణి పెన్ కోసం వచ్చి వుంటుంది.

భజన్‌రావ్ గోపాల్రావ్‌కి కన్ను గీటాడు.

అతనికి చెమటలు పట్టటం కర్నల్ గమనిస్తూనే వున్నాడు. గోపాల్రావ్ త్వరత్వరగా ఫలహారం ముగించేశాడు.

వాష్‌బేసిన్ దగ్గరకు నడిచి చేతులు కడుక్కుంటుంటే భజన్‌రావ్ అతనికి సమీపంగా

వచ్చాడు.

"ఒరిజినల్ రైటర్ చంద్రకాంత్ వచ్చాడు సార్! సీతా మేడమ్ తన మీద లవ్‌తో మెయిలిచ్చిందనీ, తనతో సీక్రెట్‌గా వ్యవహారం జరపడం కోసమే భర్త ఇంట్లో లేనప్పుడు రమ్మందనీ అనుకుంటున్నాడు.

గోపా్రావ్ కిందపడబోయి వాష్‌బేసిన్ పట్టుకుని నిలదొక్కుకున్నాడు.

వెంటనే భవానీశంకర్‌కి సైగజేసి తన గదిలోకి నడిచాడు.

"భజన్‌రావ్! మా ఇద్దరికీ కాఫీ తిసుకురా త్వరగా" అన్నాడు మళ్ళీ భజన్‌రావ్‌కి కన్నుగీటుతూ.

ముగ్గురూ గోపా్రావ్ గదిలో సమావేశమయ్యారు.

"మరేం లేద్సార్! ఇప్పుడు నేను చాలా కీలకమయిన పొజిషన్‌లో వున్నాను. బయట విజిటర్స్ రూమ్‌లో కూర్చున్నవాడు ఒరిజినల్ రైటర్ చంద్రకాంత్ అని అందరి ఎదురుగా పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ చేశాననుకోండి. అప్పుడేం జరుగుతుందో మనం ఒక్క సీన్ అలా గాల్లో వేసుకుని చూసుకోవచ్చండీ. కల్నల్‌గారు రివాల్వర్ తీసి భవానీశంకర్ గారి చేతి మీద కాల్చటం, అక్కడితో కదలకుండా పోలీస్‌కి అప్పజెప్పటం– ఆ కథను నిజానికి అంతటితో ఆపేసి ఫుల్‌స్టాప్ అని పెట్టుకోవచ్చండీ! కానీ సీతా మేడమ్‌గారు అలా ఫుల్‌స్టాప్‌లు పెట్టే టైప్ కాదండీ (ఇంకా వుంది) అని ప్రింట్‌లో చూసుకోడానికి అలవాటు పడ్డ పాఠకురాలండీ. అందుకని గోపా్రావ్ గారి చెంపలు ఛెళ్ళుమనిపించటమే గాకుండా కల్నల్‌గారితో పాటు పుట్టింటి కెళ్ళిపోవటం, విడాకులకు కోర్టులో కేసు పడేయటం ఇలా ఆనంతంగా సాగిపోతుందన్నమాట సార్! అంచేత..."

"అంచేత?" ఇద్దరూ గాబరాగా అడిగారు.

"ఎంతో కొంత క్యాష్ సర్దితే, ముగ్గురం కలిసి వాడి పీడా వదిలించుకోడానికి ఉపాయాలు ఆలోచించవచ్చండీ."

"ఎంత కావాలి?"

"కనీసం రెండు వేలయినా లేకపోతే నన్ను నేను ఇన్సల్ట్ చేసుకున్నట్లవుతుందండీ."

గోపా్రావ్ పర్సులోనుంచి కొన్ని నోట్లు తీసి అతని చేతిలో పెట్టాడు.

"పిచ్చి వేషాలేయకుండా దీంతో ఎడ్జస్ట్ చేసుకో."

"మరీ తక్కువగా వున్నట్లుంది సార్!"

"నీ స్టాండర్డ్‌కి అది చాలా ఎక్కువ."

"సరే" డబ్బు జేబులో పెట్టుకున్నాడు.

"అయితే ఇప్పుడేం చేద్దామంటారు?" అడిగాడు భజన్‌రావ్.



"సీతగారు లేరని వాడిని పంపించివేస్తే?"

"నమ్మడండీ! పైగా మల్లెపూల చెండు కూడా తెచ్చేసుకున్నాడు."

"బాస్టర్డ్" పళ్ళు పటపట కొరికాడు గోపా్రావ్.

"ఓ.కే. భజన్‌రావ్! మన దగ్గరో మాస్టర్ ప్లానుంది."

"ఏమిటి సార్ అది?"

"ఇప్పుడు రత్నప్రభగా రెక్కడుంటారు?"

"ఫలహారం అవగానే బెడ్‌రూమ్‌లోకెళ్ళి ఫాషన్ డిజైనింగ్‌తో ఎక్స్‌పెరిమెంట్స్ చేస్తూంటారండీ."

"ఫాషన్ డిజైన్సా?" ఆశ్చర్యంగా అడిగాడు భవానీ.

"అవునండీ! మీరు గమనించటం లేదేమో! ఆవిడ ఈ మధ్యే ఫాషన్ డిజైనింగ్ కోర్స్ కంప్లీట్ చేశారండీ. అప్పటుంచీ సెల్వార్ కమీజ్‌లు అతి భయంకరమైన డిజైన్స్‌తో కుట్టి పూజా మేడమ్‌కి తొడిగి ప్రయోగాలు చేస్తున్నారండీ. కనుక మాణింగ్ ఎనిమిదిన్నర నుంచీ మధ్యాహ్నం పన్నెండువరకూ కొత్తరకం సెల్వార్ కమీజ్ డిజైన్ వేసి తను వేసుకుని అద్దం ముందు నిలబడి చూసి అప్పుడు పూజా మేడమ్‌కి వేసి ఫాషన్ షో వాళ్ళ దగ్గరకు పంపుతారండీ వాళ్ళకి నచ్చితే ఆ డ్రస్ ఫాషన్ పెరేడ్ పోటీల్లో తీసుకుంటారన్న మాటండీ."

"ఓ ఐ అండర్‌స్టాండ్– అయితే ఇంతకన్నా మంచి ప్లాన్ ఇంకోటి లేదా భజన్‌రావ్! ఆ చంద్రకాంత్ గాడిని ఇంకొంచం టెంప్ట్ చేయ్. సీత వాడి కోసం పరితపించి పోతోందనీ, ఇంట్లో ఆమె భర్త గోపా్రావ్ లేడు గనుక వెంటనే ఆమె గదిలోకెళ్ళి ఆమెను కౌగిట్లోకి తీసుకుని ముద్దులతో ముంచెత్తమని సలహా ఇవ్వు."

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్! వాడెళ్ళి నా మిసెస్‌ని కౌగలించుకుంటూంటే మనం చూస్తూ "ఊరుకోవాలా?" కోపంగా అన్నాడు గోపా్రావ్.

"భయపడకు మిత్రమా! వాడిని పంపించేది సీత గదిలోకి కాదు. రత్నప్రభ అనగా మీ అత్తగారి గదిలోకి. ఆమే సీత అనుకుని వాడు పిచ్చివేశాలేస్తాడు! దాంతో అంతా గగ్గోలు. మేజర్ గన్‌తో రావటం, వాడిని కాల్చటం లాంటి కార్యక్రమాలు శరవేగంతో జరుగుతాయి. వాడు ఆ గాయాలతోనే ఇంటికి పరుగెత్తేస్తాడు. దాంతో వాడి పీడా మనకు శాశ్వతంగా విరగడయిపోతోంది" చెప్పాడు భవానీ.

"ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే మాస్టర్ ప్లానండీ! ఇంతకంటే గత్యంతరం లేదు" అన్నాడు భజన్‌రావ్.

"అయితే మేమిక్కడే వుంటాం" నువ్వెళ్లి ఆ కార్యక్రమం పూర్తి చేయ్ బ్రదర్."

"అలాగే సార్!" అంటూ విజిటర్స్ రూమ్‌లోకి నడిచాడతను.

చంద్రకాంత్ అతనిని చూడగానే ఆనందంగా నవ్వాడు.

"సీతగారికి చెప్పావా నేనొచ్చానని?"

"చెప్పాను సార్!"

"ఏమన్నారు?"

"మిమ్మల్ని వెంటనే తన గదిలోకి పంపించమన్నారు సార్! అయ్యగారెలాగూ సాయంత్రం అయిదు గంటలవరకూ రారు కాబట్టి తనను సాయంత్రంవరకూ డిస్టర్బ్ చేయవద్దనీ, ఎవరు వచ్చినా ఇంట్లో ఎవరూ లేరని- చెప్పమనీ చెప్పారు సార్!"

చంద్రకాంత్ శరీరమంతా కోరికల తాలూకూ సెగలతో నిండిపోతోంది.

"ఆమె ఏజ్ ఎంత వుంటుంది?" రహస్యంగా అడిగాడు.

"అ- ఎంతోనా? ఇరవై నాలుగు సార్- రెండు టీవీ సీరియల్స్ హీరోయిన్"

"హా- ఇరవై నాలుగా?" ఎగ్జయిట్‌మెంటుతో అడిగాడు.

"అవున్సార్- ఓన్లీ ట్వంటీ ఫోర్."

"ఫెంటాస్టిక్ ఏజే కదూ?"

"బ్రహ్మాండమయిన ఏజ్ సార్."

"ఆమె రూపం ఎలా వుంటుంది?"

"చాలా ఎట్రాక్టివ్‌గా వుంటుందండీ. భయంకరమయిన టేస్ట్ వున్న వాడికి. అందుకే మీ హెల్ప్ తీసుకుని టీవీ సీరియల్లో నటించాలని తెగ ఆశపడ్తోందండీ"

"అయితే మరిక ఆలస్యం దేనికీ?"

"అనవసరం సార్- పదండి."

భజన్‌రావ్ వెనుకే బయల్దేరాడు చంద్రకాంత్.

విశాలమయిన ఆ ఇల్లు చాలా ఆధునికమయిన ఫర్నిచర్‌తో నిండివుండటం చూసేసరికి చంద్రకాంత్‌కి కళ్ళు తిరిగినట్లనిపించింది.

"సీతాదేవికి బాగా డబ్బుందా?"

"తెగ డబ్బు సార్! మూలుగుతోంది. మిమ్మల్ని లైక్ చేసిందంటే మీకిక డబ్బే డబ్బు-"

మేడ మీద రత్నప్రభ గదివరకూ వెళ్ళిగది చూపించాడు భజన్‌రావ్.

"గదిలోకెళ్ళగానే తలుపేసుకోండి. సాయంత్రంవరకూ తియ్యనక్కర్లేదు."

"థాంక్యూ మిస్టర్! నీ పేరేమిటి?"

"భజన్ రావండీ."

"చాలా మంచిపేరు- నీ ఋణం తీర్చుకోలేనోయ్."

"తీర్చుకోగలరండీ- ఓ అయిదొందలు కొడితే"



"అయిదొందలా?"

"అవున్సార్! ఈ రోజులలో అయిదొందలకి వాల్యూ ఏముంటుంది?"

"నిజమే గానీ- ఈ రెండొందలు తీసుకో - ఈసారి వచ్చినప్పుడు అయిదు వందలిస్తా."

భజన్‌రావు రెండొందలు తీసుకుని వెళ్ళిపోయాడు.

చంద్రకాంత్ రత్నప్రభ గదిలోకి నడిచేసరికి రత్నప్రభ అద్దం ముందు నిలబడి తను అప్పుడే రడీ చేసిన సెల్వర్ కమీజ్ ఎలా వుందా అని మీద వేసుకుని చూసుకుంటోంది.

చందక్రాంత్ గది తలుపులు మూసివేస్తూంటే ఆమె పూజ వచ్చిందనుకుని "ఇంకా రడీ అవలేదు. ఇంకో అయిదు నిమిషాలుండు" అంది వెనక్కు తిరక్కుండానే.

చందక్రాంత్ వెనుక నుంచి వెళ్ళి అమాంతం ఆమెను కౌగలించుకుని ఆమె మెడంతా ముద్దులతో నింపేస్తూ ఆమె కళ్ళు మూసేశాడు ఓ చేత్తో.

"ఎవరో చెప్పుకో" అన్నాడు చిలిపిగా ఆమె చెవిలో.

రత్నప్రభ అదిరిపడింది.

"బ్లడీఫూల్ హు ఆర్ యూ?" అంది కోపంగా గింజుకుంటూ.

"ఉహు- నేనెవరో చెప్పుకునేవరకూ వదలను."

ఆమెకింక తిక్కరేగిపోయింది.

అమాంతం తన ఛాతీని చుట్టిన చేతిని అందుకుని బలంగా కొరికింది.

దాంతో గావుకేక వేసి ఆమెను వదిలి వెనక్కు ఒక్క గెంతుగెంతాడు చంద్రకాంత్.

అతనిని చూసి రత్నప్రభ కెవ్వున కేక వేసింది.

అప్పుడే రివాల్వర్ క్లీన్ చేస్తున్న కనకారావుకి వినిపించిందా కేక. కాపురానికి వచ్చిన ఇన్నేళ్ళల్లో రత్నప్రభ భయంతో గావుకేకే పెట్టటం అదే ప్రప్రథమం. ఆ కేకే అతనికెంతో ఆనందం కలిగించింది. ఆమెతో అలాంటి కేక పెట్టించిన సందర్భం ఏమిటో ప్రత్యక్షంగా చూడాలని కోరిక కలిగింది. వెంటనే ఆ రివాల్వర్ అక్కడపడేసి పరుగుతో తమ బెడ్‌రూమ్‌కి చేరుకున్నాడు. లోపల్నుంచీ రత్నప్రభ "దొంగ-దొంగ" అని సైరన్‌లా అరుస్తోంది.

అప్పటికే అక్కడ గోపాల్రావు, భవానీశంకర్ నిలబడి "అత్తాజీ! ముందు డోరు ఓపెన్ చేయి - ఏం ఫర్లేదు- భయపడకు- మేమున్నాం" అని అరుస్తున్నారు.

ఆ గొడవకు భజన్‌రావు, సీతా, పూజా కూడా అక్కడికి చేరుకున్నారు.

చంద్రకాంత్‌కి పై ప్రాణాలు పైనే పోయాయి.

"సీతాదేవిగారూ! ప్లీజ్ గొడవ చేయకండి. మీ కోరిక మీదేగా వచ్చాను" అంటున్నాడు రత్నప్రభకు దణ్ణం పెడుతూ.

రత్నప్రభ పరుగుతో వెళ్ళి తలుపు తెరచింది.

అదే అదనని చంద్రకాంత్ బులెట్‌లాగా బయటకు పరుగెత్తడానికి ప్రయత్నించారు. కానీ మేజర్ అతనికంటే వేగంగా పరుగెత్తి అతని కాలరు పట్టుకుని ఆపేశాడు.

"రాస్కెల్ వదలకండి. వీడెవడో మెంటల్‌గాడు. నా మీద అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు" అంది రత్నప్రభ ఆయాసంతో రొప్పుతూ.

"వాట్? నీ మీదా?" ఆశ్చర్యపోతూ అడిగాడు కనకారావ్.

"అవును."

"అయితే తప్పకుండా మెంటల్ కేసే".

"నోనోనో... యూ ఆర్ మిస్టేకెన్ ఫ్రెండ్స్! వీడు మామూలు మెంటల్ కాదు కర్నల్– సైకో డెకాయిట్."

"సైకో డెకాయిట్టా?"

"అవును."

"అంటే ఏమిటి?" అనుమానంగా అడిగాడు కల్నల్.

"అంటే దోపిడీ చేయటమే కాకుండా అత్యాచారం చేసి చంపేసే వాళ్ళన్నమాట."

"మైగాడ్! అయితే వెంటనే పోలీస్‌లకి ఫోన్ చేయాలి" అన్నాడు కల్నల్ ఫోన్ దగ్గరకెళుతూ.

చంద్రకాంత్ కెవ్వున కేక వేసి కల్నల్ కాళ్ళు పట్టుకున్నాడు.

"నేను సైకో డెకాయిట్‌ని కాద్సార్! పోలీస్‌ని పిలవకండి" అన్నాడు ఏడ్చేస్తూ.

"కాదా? కాపోతే మరెవరు?"

"రచయితను సార్."

కర్నల్ కనకారావ్ వులిక్కిపడ్డాడు.

"రచయితవా?"

"అవున్సార్!"

"చూశావా బేబీ! రచయితలంతా పరమకిరాతకులూ, దొంగలూ, లోఫర్లూ, స్కౌండ్రల్స్ అంటే నువ్వు విన్నావా? కాదు డాడీ! వాళ్ళు హీరోలన్నావు. అన్నావా?"

పూజ చంద్రకాంత్ చొక్కా పట్టుకుని పైకి లేపింది.

"రాస్కెల్! నువ్వు రచయితనని అబద్ధం చెప్తునానవా? అలా చెప్తే వదిలేస్తామని అనుకుంటున్నావా?" కోపంగా అంది.

"నేను నిజమే చెప్తున్నాను మేడమ్! నేను ధరూ జెంటిల్మన్ ని– ఫేమస్ రైటర్ని."

"జెంటిల్మన్ అయితే నా మీద ఎందుకు అత్యాచారం చేయబోయావురా బద్మాష్" బిగ్గరగా అరిచింది రత్నప్రభ.

"మీరేకదండీ– నన్ను సీక్రెట్‌గా రమ్మన్నారు?" ఏడుపు ఆపుకుంటూ అన్నాడు చంద్రకాంత్.

"రాస్కెల్! నేను నిన్ను రమ్మన్నానా? చెప్పు తీసుక్కొడతాను" చెప్పు తీయడానికి ప్రయత్నిస్తూ అంది రత్నప్రభ.

"మీ ఆయన లేనప్పుడు వచ్చి కలుసుకోమంది మీరేకదా మేడమ్?"

రత్నప్రభ చెప్పు చంద్రకాంత్ చెంప మీద ఛెళ్ళుమనేసరికి బాబోయ్ అంటూ భోరుమని ఏడ్చాడు చంద్రకాంత్.

"నిజం చెప్పరా– ఎవర్నువ్వు?" అడిగాడు కర్నల్.

"నిజమే చెప్తున్నాన్సార్! నేను ఫేమస్ రైటర్ చంద్రకాంత్‌ని. సీతాదేవి రమ్మందని వచ్చాను."

ఆమాటతో సీత వులిక్కిపడింది.

"వాట్? నేను రమ్మన్నానా?" అడిగిందామె.

"మీరు కాదు సీతాదేవి" అంటూ రత్నప్రభను చూపించాడతను.

"సీతాదేవి అంటూ నన్ను చూపిస్తావేంరా బ్రూట్" అంటూ చెప్పుతో మళ్ళీ కొట్టింది రత్నప్రభ.

భవానీశంకర్ వాడి చొక్కా పట్టుకుని గాలిలోకి లేపాడు.

"ఏంట్రా? నువ్వు రచయిత చంద్రకాంత్‌వా?"

"అవును."

"నువ్వు రచయిత చంద్రకాంత్ అయితే నేనెవర్రా మరి?"

"నాకు తెలీదు సార్!"

"నేనూ రచయిత చంద్రకాంత్‌నేరా! నీకు వేషం వేసుకోడానికి దొరక్క దొరక్క నా వేషమే దొరికిందా? రాస్కెల్– నిజం చెప్పు– ఎందుకు జొరబడ్డావు?"

"సీతాదేవి కోసం."

సీతాదేవి అతని చెంప పగలగొట్టింది.

"రాస్కెల్! ఇందాకట్నుంచీ చూస్తున్నాను– మాట్లాడితే నా పేరు చెప్తున్నావు– నిన్నింతవరకూ జన్మలో చూడలేదు. నేను నిన్ను రమ్మన్నానా?"

"సిస్టరిన్లా! మీరూరికే ఎగ్జయిట్ అవకండి. వీడెవడో సైకోడెకాయిట్ అయుం టాడని ముందే చెప్పాను కదా. వీడి సంగతేమిటో మేము తేల్చుకుంటాం– కమాన్ గోపాల్రావ్! వీడిని ముందు మన రూమ్‌కి తీసుకెళ్ళి ఇంటరాగేషన్ చేద్దాం" అన్నాడు భవానీ.

గోపాల్రావ్, భవానీశంకర్ కలిసి అతనిని తమ గదిలోకి ఈడ్చుకొచ్చారు.

"మనం వీడిని పోలీస్‌లకి అప్పజెప్తే అన్ని విషయాలూ బయట పడతాయి ఇప్పుడే ఫోన్ చేస్తాను" అన్నాడు కనకారావ్ ఫోన్ తీసుకుంటూ.

భవానీ చప్పున అడ్డుపడ్డాడు.

"నోనో... మేజర్! పోలీస్ వరకూ వెళ్ళటం మంచిది కాదు. సీతాదేవే రమ్మని పిలిచింది అని వాడు పోలీస్ దగ్గర కూడా వాగితే- వాళ్ళా విషయం న్యూస్ పేపరుకిస్తారు. దాంతో మన పరువు రోడ్డునపడిపోతుంది. సమజ్‌నేకీ బాత్‌హై కల్నల్‌జీ?"

కనకారావ్ ఫోన్ వదిలేశాడు.

భవానీశంకర్ తన రూమ్‌లోకి వెళ్ళి తలుపు వేసశాడు.

గోపాల్రావ్ చంద్రకాంత్‌ని చొక్కా పట్టుకుని గాల్లోకి లేపాడు.

"ఎవర్రా నువ్వు?"

"బై గాడ్ చెప్తున్నా సార్! నేను ఫేమస్ రైటర్ చంద్రకాంత్‌ని".

"ఇక్కడికెందుకొచ్చావ్ నువ్వు?"

"సీతా గోపాల్రావ్ అనే ఆవిడ సీక్రెట్‌గా వచ్చి కలుసుకోమని మెయిలిచ్చింది సార్!"

డొక్కలో కాలితో తన్నాడు గోపాల్రావ్.

"రాస్కెల్! అబద్ధం చెప్తున్నావా- నిజం చెప్పు ఎవడివి నువ్వు?"

"నిజం సార్! నేను రచయిత చంద్రకాంత్‌ని."

మళ్ళీ ఒక్క తన్ను తన్నాడు గోపాల్రావ్. చంద్రకాంత్ వచ్చి భవానీశంకర్ కాళ్ళమీద పడ్డాడు. భవానీశంకర్ మరో కిక్ ఇచ్చాడు.

"ఓరి దేవుడో! నన్ను వీళ్ళు చంపేస్తున్నార్రోయ్-... నన్ను రక్షించండి బాబోయ్!" అంటూ బిగ్గరగా అరుస్తూంటే నోటి మీద కొట్టాడు గోపాల్రావ్.

"నోర్మూసుకో ముందు."

అతను నోరు మూసేశాడు.

"ఇప్పుడు చెప్పు- ఎవరు నువ్వు?"

"నిజంగానే చెప్తున్నా సార్! ప్రామిస్- రచయిత చంద్రకాం.."

మళ్ళీ తన్నాడు గోపాల్రావ్.

"మళ్ళీ చెప్పు- ఎవర్నువ్వు?"

"రచయిత చం..."

మరో తన్ను.

"ఇప్పుడు చెప్పు- ఎవర్నువ్వు?"



"రచయ.. కాద్సార్... నేను చంద్రకాంత్‌ని కాదు... రచయితను కాదు."

"అయితే నీ పేరేమిటి?"

"ఏమో సార్! తెలీదు."

"అలా దారికిరా- ఇంకోసారి నీ పేరు రచయిత చంద్రకాంత్ అన్నావంటే నీ అంతు తేలుస్తాను."

"ఛస్తే అనను సార్! అంటే చంపేయండి."

"అయితే ఇప్పుడిక్కడికి ఎందుకొచ్చావ్?"

"సీతాదేవిగారు...."

మళ్ళీ తన్నాడు గోపాల్రావ్.

"ఇప్పుడు చెప్పు- ఎందుకొచ్చావ్?"

"నాకు తెలీదు సార్!"

"తెలీకుండా ఎలా వుంటుంది?"

"నిజంగానే చెప్తున్నా సార్! నాకు తెలీకుండానే వచ్చేశాను."

"అంటే నీకు మతిస్థిరం లేదన్నమాట."

"ఉంది సార్! అహహ... కొట్టకండి సార్!... మతిస్థిరం లేని వాడిని."

"ఇంకెప్పుడయినా నువ్వు రచయిత చంద్రకాంత్‌నని ఎవరి దగ్గరయినా అంటావా?"

"ఛస్తే అనను సార్!"

"ఇంకెప్పుడయినా ఈ ఏరియాలో కనబడతావా?"

"ఛస్తే కనబడను సార్!"

"నీ ఇల్లెక్కడ?"

"ఖమ్మం సార్!"

"ఇంకో పది రోజులదాకా నువ్వు ఖమ్మం వదిలావంటే నిన్ను చట్నీ చేస్తాం. సరేనా?"

"సరే సార్! ఇక వదిలెయ్యండి సార్! వళ్ళంతా హూనమయిపోయింది."

"సరే- వెనక్కు తిరిగి చూడకుండా ఫో!"

తలుపు తెరవగానే కుంటుకుంటూనే శరవేగంతో పరుగెత్తాడు చంద్రకాంత్.

అప్పుడే ఫోన్ మోగింది.

"కర్నల్ కనకారావ్ హియర్!"

"హలో కర్నల్! నేను ఇన్స్‌పెక్టర్ రాంబాబుని మాట్లాడుతున్నాను."

"ఎస్... వాడ్డూయూ వాంట్?"

"మీరు బ్యాంకు లాకర్లో వుంచిన వజ్రాలు రెండూ బ్యాంకు రాబరర్స్

ఎత్తుకుపోయారు"

కనకారావ్ అదిరిపడ్డాడు.

"వాట్! నా డైమండ్స్ ఎత్తుకుపోయారా?"

"అవును."

"ఎప్పుడు?"

"రెండ్రోజుల క్రితం బ్యాంకు రాబరీ జరిగింది. అప్పటినుంచీ మిమ్మల్ని వెతుకుతున్నాం. చివరకు ఇప్పటికి మీ అమ్మాయి ఇంటిఫోన్ నెంబర్ సంపాదించగలిగాం."

"మైగాడ్! ఇంతవరకూ ఆ రాబరర్స్‌ని పట్టుకోలేదా మీరు?"

"లేదు. ఆ విషయంలోనే మీ సాయం కావాలి. మీరు అర్జంటుగా పోలీస్‌స్టేషన్‌కి రావాలి."

"ఎందుకు?"

"ఆరోజు దోపిడీ చేసినవాళ్ళు మీ ఇంటి రోడ్డుమీద నుంచే పారిపోతూంటే మీరు ఆ జీప్ మీద కాల్పులు జరపారని మీ చుట్టుపక్కలవాళ్ళు చెప్పారు."

"వాట్! ఆ రోజు మా కుక్కపిల్లను చంపబోయింది ఆ డెకాయిట్సేనా?"

"ఎస్!"

"అయితే మరి అప్పుడే నా కెందుకు చెప్పలేదా విషయం?"

"అప్పటికింకా వాళ్ళే దొంగలని తెలీదు."

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్ ఇన్స్‌పెక్టర్? వాళ్ళే డెకాయిట్స్ అంటున్నారు– వాళ్ళు దొంగలని తెలీదంటున్నారు. మీరు మందుకొట్టి మాట్లాడుతున్నారా?"

"కర్నల్! మీరు వెంటనే పోలీస్‌స్టేషన్‌కి రండి. ఎక్కువ మాట్లాటం మంచిది కాదు. లేకపోతే మేమే రావాల్సి వస్తుంది."

"ఓకే! అయామ్ కమింగ్."

ఫోన్ పెట్టేశాడు.

"ఏమయింది డాడీ?" అడిగింది సీత.

"మన ఫ్యామిలీ డైమండ్స్ బ్యాంకు లాకర్లో నుంచి దొంగలు కాజేశారట."

"మైగాడ్! చాలా కాస్ట్‌లీ డైమండ్స్ కదు డాడీ?"

"అవును– పాతికోట్లుంటుంది."

"నేను ముందే చెప్పాను– అంత ఖరీదయినవి మన దగ్గరెందుకు– అమ్మి పారేసి క్యాష్ బ్యాంకులో వేయండీ అని. విన్నారా?" రత్నప్రభ మండిపడుతూ అంది.

"డోంటాక్! వాటినెలా అమ్ముతామే– పది తరాల్నుంచీ వస్తున్నాయి. మా పూర్వీకులు



ఒకప్పుడు రాజుల దగ్గర సేనాపతిగా యుద్ధాలు గెలిచి నందుకు రాజుగారే స్వయంగా బహుమతిగా ఇచ్చారంట. అలాంటివాటిని మనం అమ్మిపారేయటమా? నో!"

"అయితే ఇప్పుడేడవండి మొత్తం పోయింది కదా!"

"ఎలా పోతాయో నేనూ చూస్తాను. ఆ కమీషనర్‌ని దుమ్ము దులిపేస్తాను. బ్యాంకు వాళ్ళమీద కోర్టులో దావా వేస్తాను. హెూం మినిస్టర్ని అసెంబ్లీలో నిలేయిస్తాను" ఆవేశంగా అన్నాడు త్వరత్వరగా రడీ అవుతూ.

• • •

పోలీస్‌స్టేషన్‌లో అడుగు పెడుతూనే బిగ్గరగా అరచాడు "ఎవరు– ఇన్స్‌పెక్టర్ రాంబాబు ఎవరిక్కడ?"

"ష్– అవరకు– మెల్లగా మాట్లాడు" ఓ కానిస్టేబుల్ దబాయించాడు

"లోపలికెళ్ళు– ఆ కుర్చీలో కూర్చున్నాయనే ఇన్‌స్పెక్టర్‌గారు."

లోపలకు నడిచి కూర్చీ కూర్చుంటూ "ఐ యామ్ కర్నల్ కనకారావ్" అన్నాడు.

"ఓ! వెరీ గ్లాడ్ టు సీయూ కర్నల్."

"నా డైమండ్స్ సంగతేమిటి? ఐ వాంట్ టు స్పీక్ విత్ పోలీస్ కమీషనర్."

"పోలీస్ కమీషనరయినా, మినిస్టరుగారయినా ఏమీ చేయలేరు కల్నల్‌గారూ! ఆల్టిమేట్‌గా చేయాల్సింది నేనే– మీరు కోపరేట్ చేస్తే త్వరగా వాళ్ళను బుక్ చేయడానికి వీలవుతుంది."

"ఆల్‌రైట్! నేనేం చేయాలి?"

"ఆ రోజు మీరు మీ కుక్కపిల్ల మీదకు జీపు వచ్చినప్పుడు రివాల్వర్ కాల్చారు కదా– ఆ జీపులో వున్న వాళ్ళనెవరినయినా చూశారా?"

"ఎస్! ఒకడు కిందకు దిగి నాకుక్క పిల్లను ఎత్తి అవతల పారేశాడు. వాడి మీద కోపంతోనే రివాల్వర్ కాల్చాను. కానీ టైర్‌కి తగల్లేదు. మిస్సయిపోయినయ్"

"ఆ కుక్కపిల్లని ఎత్తి పారేసినవాడిని యిప్పుడు చూస్తే గుర్తుపట్టగలరా?"

"ఎస్!"

"అయితే రండి."

ఇద్దరూ వెళ్ళి జైల్లో వున్న విక్కీని చూశారు.

"ఎస్! వీడే– బాస్టర్డ్! నా కుక్కపిల్లని విసిరేసింది వీడే. వీడి వలనే దాని కాలు ఫ్రాక్చరయ్యింది. వీడిని కాల్చిపారేస్తాను" ఆవేశంగా అన్నాడు కర్నల్ రివాల్వర్ తీస్తూ.

"కాల్చిపారేస్తే వజ్రాలు దొరకవు" అన్నాడు రాంబాబు.

కనకారావ్ కూల్ అయిపోయాడు.

"ఇంకా ఆలస్యం ఎందుకు? వాడిని టార్చర్ చేయండి. వజ్రాలు ఎక్కడ దాచాడో బయటపెడతాడు."

"వాడంత తేలిగ్గా బయటపెట్టే రకం కాదు కర్నల్. అదీగాక వాడో పెద్ద లాయర్ని పెట్టుకున్నాడు. వాడికేమయినా గాయం తగిలితే చాలు హాస్పిటల్లో ట్రీట్‌మెంట్ కన్న వంకతో చేరి అక్కడి నుండి పారిపోవాలని ప్లాన్"

"అయితే ఏం చేస్తారు మరి?"

"ముందు వాడిని కోర్టులో మీరు గుర్తుపట్టి ఆ రోజు జీప్‌లో పారిపోయింది వీడేనని సాక్ష్యం చెప్పాలి. చెప్తే వీడిని మన కస్టడీలో ఎంత కాలం కావాలంటే అంత కాలం వుంచుకోవచ్చు."

"ఓ యస్! పదండి కోర్టుకి"

"కోర్టు ఎప్పుడంటే అప్పుడు మన కోసం తెరచి పెట్టుకోరు! వచ్చే వారం మన కేస్ వస్తుంది. అప్పుడు రావాలి మీరు. ఏ రోజు రావాల్సింది మీకు ఫోన్ చేసి చెప్తాను."

"ఓకే!"

కర్నల్ వచ్చేశాడు.

∘ ∘ ∘

చంద్రకాంత్ భార్య అష్టలక్ష్మి మధ్యాహ్నం తీరిగ్గా ఆ ల్యాప్‌టాప్ తీసుకెళ్ళి అందులో మెయిల్ పక్కింటి సుజాతకు చూపించింది.

"ఇది ఎవరి దగ్గర్నుండి వచ్చిందో, అందులో ఏమి రాసి వుందో అన్నీ చెప్పు?" అంది ఆత్రుతగా.

సుజాత చకచకా చదివింది.

ఆమెకు కాపురాలు చెడొట్టేయడం హాబీ. ఆ చుట్టుపక్కల ఏరియాలో ఆమె ఒక్కర్తే ఇంగ్లీషు తెలిసిన కేండిడేట్ అవటం వల్ల అందరూ రకరకాల వుత్తరాలు, డాక్యుమెంట్లు, విల్లులు అన్నీ తెచ్చి చదివించుకుంటుంటారు.

అలాంటి సందర్భాల్లో ఆమె అక్కడ రాసున్న దానికంటే కొంచెం ఎక్కువ కలిపి వాళ్ల సంపారాల్లో వీలయినంత పెద్ద చిచ్చు పెట్టేయడానికి ప్రయత్నిస్తూంటుంది.

మెగుడూ పెళ్ళాలు ఆవిడ వలన కొట్టుకుని రోడ్డున పడటం, సంపారాలు ముక్కలయిపోవడం, కాపురాలు వేరుపడిపోవడం చూస్తే ఆమెకి ఎక్కడలేని ఆనందంగా వుంటుంది.



అందుకని ఆ మెయిల్ మేటర్ చదువుతూనే తన మషాలా కలిపి తెలుగులో చెప్పటం మొదలెట్టింది.

"అయ్యో-అయ్యో! అదెవత్తో ఎంత సిగ్గు విడిచి ఏం రాసిందో చూశావా?"

"ఏం రాసిందక్కా?"

"ఇంకేం రాస్తుందే పిచ్చి ముఖమా? నువ్వట్లా అడ్డగాడిదలాగా మీ ఆయన్ని నమ్ముతూండు- ఏదోక రోజు నిన్ను గెంటి, ఎవత్తెనో తెచ్చుకుని సెటిలైపోతాడు".

అష్టలక్ష్మి కన్నీ రొత్తుకుంది.

"నాకు మొదటి నుంచీ అనుమానమేనే అక్కా! ఆ శంకర్రావ్ యాదగిరి ఎప్పటికప్పుడు చెప్తూనే వున్నారు. చంద్రకాంత్ సార్ ఇవాళ ఒకామెతో హెూటల్లో లంచ్ చేస్తుంటే చూశాం. ఆటోలో బయటకొచ్చి కార్లో దిగుతూంటే చూశాం. లాడ్జింగ్‌లో నుంచి ఒకావిడతో బయటకొచ్చి కార్లో వెళుతూంటే చూశాం అంటూ...

"ఇంతకూ ఇందులో ఏం  ఉందక్కా?"

"అదెవత్తో సీతాగోపాల్రావు అని- గోపాల్రావు అనే వాడి పెళ్ళాం సిగ్గు విడిచి, బరితెగించి ఏం రాసిందో తెలుసా?"

"ఏం రాసిందక్కా?"

"అర్జంటుగా వున్న పళాన వచ్చెయ్. మా ఆయన లేనప్పుడు వస్తే స్వర్గ సుఖాలు అనుభవిద్దాం విరహంతో చచ్చిపోతున్నాను. రా, కదలిరా, మన్మథదేశం నిన్ను పిలుస్తోంది. రా-ఇట్లు నీ సయ్యాటల సీత."

"ఓర్నాయనో! ఈ మనిషి అందుకనే ఇవాళ సెంట్ తెగ రాసుకెళ్ళాడు నాకప్పుడే అనుమానం వచ్చేసింది."

"ఇదిగో అష్టలక్ష్మీ! నువ్విలా వూరుకుంటే లాభం లేదు. వెంటనే చీరకొంగు బిగించు. సిటీ బండెక్కు-హైద్రాబాద్‌లో ఈ సీతా గోపాల్రావ్ ఇంటికెళ్ళి గొడవ చెయ్. దాన్ని వీధిలో కీడ్చెయ్. నలుగురినీ పోగెయ్- ఈ మెయిల్ గురించి చెప్పు వీలయితే దాని మొగుడు ఆ గోపాల్రావుని కూడా జాడించు."

"అంతేనంటావా అక్కా!"

"లేకపోతే సంసారం కూలిపోతుందే పిచ్చిదానా! ఆ తర్వాత నువ్వింకెవడి నయినా చూసుకుని వాడితో సయ్యాటలు మొదలుపెట్టు. ఆ సంగతి మీ ఆయనకు తెలిసేట్లు చేసి అప్పుడు బెదిరించు. సిటీలో నువ్వు వేషవ్వేషాలు వేస్తున్నావు గనుక నా యిష్టమొచ్చినోడితో గడిపే హక్కు నాకుందను"

"అమ్మో! అలాచేస్తే నన్ను గెంటేస్తాడేమో!"

"ఏడ్చాడు! గెంటితే పోలీస్ రిపోర్ట్ ఇద్దువుగాని - కట్న కానుకలు తెమ్మని వేధిస్తున్నాడని ఒక్క లెటర్ రాసిస్తే చాలు- ముందు మీ ఆయన్ని మూసేస్తారు."

"సరే అక్కా! ముందు హైద్రాబాద్ వెళ్ళి దాని సంగతి తేల్చుకుని వస్తా-దాని అడ్రస్ ఓ కాగితం మీద రాసివ్వు."

సుజాత అడ్రస్ రాసిచ్చింది.

అష్టలక్ష్మి అప్పటికప్పుడే బయల్దేరి రైల్వేస్టేషన్ చేరుకుంది.

• • •

"చంద్రకాంత్‌గారూ!" హడావుడిగా చంద్రకాంత్ గదిలో కొచ్చేసింది పూజ.

"హలో పూజాజీ! ఎనీ ఇంప్రూవ్‌మెంట్?"

"చూశారా! అప్పుడే నవల తాలూకూ ఓ చాప్టర్ రాసేశాను."

"ఒండర్‌ఫుల్! నాకు తెలుసు మీలో రచయిత్రి లక్షణాలు క్రిక్కిరిసిపోయి వున్నాయని."

"చదివి వినిపించమంటారా?" ఉత్సాహంగా అడిగింది.

"ఏమాత్రం ఆలస్యం చేయకుండా...."

ఆమె చదవటం ప్రారంభించింది.

"శైలేష అభిలాష్ కళ్ళల్లోకి చూసింది. ఆమె కళ్ళల్లోని ఆకర్షణ అభిలాష్‌ని చిత్తు చేసింది. అమాంతం ఆమెని కౌగలించుకుని తనలో ఐక్యం చేసేసుకున్నాడు"

"అద్భుతం పూజాజీ! ఇతర రచయితలూ, రచయిత్రులూ ఒకే దృశ్యాన్ని ఎంత సెక్సాత్మకంగా వర్ణిస్తారో, ఎంత సెక్స్‌ప్లాయిటేషన్ చేస్తారో నాకు తెలుసు. కానీ మీరు బ్రహ్మాండమయిన డీసెన్సీ మెయింటైన్ చేసి అదే అర్థం తీసుకొచ్చేరు."

పూజ ఆనందంతో పొంగిపోయింది.

"అంటే నేను ఫస్ట్ ఎటెంప్ట్‌లోనే సరిగ్గా రాశానంటారా?"

"తిరుగు లేకుండా రాశారు."

"ఇంకేం మార్పులు అవసరం లేదంటారా?"

"చాలా చిన్న మార్పులు చేయాలి."

"ఏమిటవి?"

"హీరో హీరోయిన్ ఒక విచిత్రమయిన పరిస్థితిలో కలుసుకున్నారన్నారు కదా?"

"అవును."

"అనుకోకుండా వారి మధ్య రొమాన్స్ అంత ఫాస్ట్‌గా డెవలప్ అవకూడదు."

"అంటే- ఎలా డెవలప్ అవాలి?"



"అదే చెప్పబోతున్నా- ఉదాహరణకు ఆ హీరో, హీరోయిన్ మనమే అనుకోండి."

"మనమా?" ఎగ్జయిట్‌మెంట్‌తో అంది.

"మీకేమైనా అభ్యంతరమా?"

"నో నో! మీ దగ్గర నేర్చుకునే అవకాశం ఇవ్వటమే గొప్ప నాకు."

"ఆల్ రైట్! హీరోయిన్, హీరో కళ్ళల్లోకి చూసిందని రాశారనుకోండి- అది ఓకే! ఆ తర్వాత హీరోయిన్ కళ్ళల్లోని ఆకర్షణ హీరోని మంత్రముగ్ధుడిని చేసిందని రాస్తే సరిపోతుంది."

"మరి రొమాన్స్"

"అక్కడికే వస్తున్నాం. కానీ సడెన్‌గా ఐక్యమైపోయారని రాయకూడదు."

"మరెలా రాయాలి?"

"ముందు మీరు ఇంకొంచెం దగ్గరకు రండి."

పూజ అతనికి సమీపంగా జరిగింది.

"ఇప్పుడు నా కళ్ళల్లోకి చూడండి."

పూజ అతని కళ్ళల్లోకి చూసింది.

"ఇలా నా కళ్ళల్లోకి ఎందుకు చూస్తున్నట్లు మీరు సడెన్‌గా?"

"రొమాన్స్ అన్నాక ఎక్కడో చోట స్టార్టవాలి కదా మరి?"

"అవాలిగానీ, అది అసహజంగా వుండకూడదు."

"సహజంగా వుండాలంటే ఎలా రాయాలి?"

"నా కళ్ళల్లోకి చూసేముందు ఓ చిన్న సంఘటన జరిగి వుండాలి."

"ఉదాహరణకి..."

"ఉదాహరణకి- అదిగో ఆ పెన్ నాకు ఇవ్వబోయారనుకోండి మీరు..."

ఆమె పెన్ తీసుకుని అతని కందించింది.

ఆమె చేతిలోని పెన్ బదులు ఆమె చేతిని అందుకుని పెదాలకు హత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు భవానీశంకర్.

పూజ ఆశ్చర్యంగా అతని వేపు చూసింది.

"చూశారా! ఇప్పుడు మీరు నా కళ్ళల్లోకి చూడటం సహజం- ఎందుకంటే మీరు ఊహించని చర్యకు నేను పాల్పడ్డాను కాబట్టి- అంటే పెన్‌కు బదులు, మీ చేయి పట్టుకున్నాను కాబట్టి మీరు ఆశ్చర్యంగా నా కళ్ళల్లోకి చూశారు.

కానీ నేను చేయి వదలకుండా ఇంకో చేత్తో మిమ్మల్ని కౌగిట్లోకి తీసుకున్నాను"

అంటూ పూజని నిజంగానే తన కౌగిట్లోకి లాక్కున్నాడు భవానీశంకర్.

పూజ వళ్ళంతా అతని వేడి స్పర్శకు గగుర్పొడిచింది.

అకస్మాత్తుగా శరీరంలో విద్యుత్ ప్రవహిస్తున్న ఫీలింగ్.

అతని రెండోచేయి ఆమె నడుముని బలంగా చుట్టేసరికి పూజ మరింత గాఢంగా అతనికి హత్తుకుపోయింది.

"ఇప్పుడేం రాయాలి?" వణుకుతోన్న గొంతుతో అడిగింది.

"హీరో ఇప్పుడు ఆమె కళ్ళల్లోని ఆకర్షణా శక్తికి తుఫానుగాలిలోని తీగ మొక్కలా గిలగిల కొట్టుకున్నాడు. విచ్చుకున్న ఆమె పెదాలను తన పెదాలతో మూసివేశాడు."

అంటూ పూజ పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

పూజ శరీరం ఒక్కసారిగా భగ్గుమన్నట్లయింది.

అతని తలను తన రెండు చేతులతో పెనవేసుకుని తనలో ఐక్యం అయిపోవడానికి ప్రయత్నించసాగింది.

కాలం కొద్ది క్షణాలు స్థంభించిపోయింది. ముందు భవానీశంకరే స్పృహలో కొచ్చాడు.

"చంద్రకాంత్!" మత్తుగా పిలిచింది. పూజ.

"ఎస్ డియర్!"

"నన్ను నిజంగా లైక్ చేస్తున్నారా?"

"ఇంకెవ్వరినీ లైక్ చేయలేనంత ఎక్కువగా."

"నన్ను గాఢంగా ప్రేమిస్తున్నారా?"

"ఎప్పటికీ తరగనంత మిక్కుటమైన ప్రేమ."

"నన్ను... నన్ను..... పెళ్ళి చేసుకోవటం మీకిష్టమేనా?""

"ఈ ప్రశ్న నేనడగాలి పూజాజీ."

"చంద్రకాంత్! నేను మిమ్మల్ని మీ మొదటి నవల చదివినప్పుడే ప్రేమించాను. మీ టీవీ సీరియల్ చూడగానే మిమ్మల్నే పెళ్ళి చేసుకోవాలనుకున్నా! అప్పట్నుంచీ మిమ్మల్ని కనీసం కొద్ది క్షణాలయినా కలుసుకుని మీతో ఏకాంతంగా గడపాలని, కొద్ది నిమిషాల కోసమయినా మీ కౌగిట్లో ఇమిడిపోవాలనీ ఎన్నో కలలు కన్నాను. కానీ కలలన్నీ యి నిజమయిపోతాయనుకోలేదు."

"థాంక్యూ పూజా! నేనూ మీలాంటి అందగత్తెను పెళ్ళిచేసుకోగలనని వూహించలేకపోయాను."

"మీరింతకాలం పెళ్ళెందుకు చేసుకోలేదు చంద్రకాంత్?"

"ఎందుకేముంది? మీరు కనిపించింది ఇప్పుడు కదా!"

ఇద్దరూ నవ్వుకున్నారు.



సరిగ్గా అప్పుడే గది తలుపులు దభేల్‌మని తెరుచుకున్నాయి.

గడపలో రివాల్వర్ పట్టుకుని నిలబడి వున్నాడు కర్నల్.

ఇద్దరూ మధ్యలో బాంబు పడినట్లు కౌగిలి వదిలి దూరంగా జరిగారు.

"నాకు తెలుసు- నువ్వు మా పూజని మాయచేసి లవ్‌లోకి దించేస్తావని. మా పూజలాంటి యంగ్ గాళ్స్‌ని నీ వల్లో ప్రణయ కలాపాలు జరిపి నీ దారిన నువ్వు పోవాలని నీ ప్లాన్. అవునా?"

"యూ ఆర్ మిస్టేకెన్ మైడియర్ కల్నల్."

"డోంటాక్ - కమాన్- మా పూజకు నీ మీదున్న హీరో ఇమేజ్‌ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తానో చూసుకో- కమాన్- నన్ను హిప్నటైజ్ చేయ్ చూద్దాం."

భవానీశంకర్ గాబరా పడ్డాడు.

"ఇప్పుడా?"

"ఎస్! రైట్ నౌ?"

"నో! ఇప్పుడు కుదరదు."

"ఎందుక్కుదరదు?"

"ఎందుకంటే హిప్నటైజ్ చేయాలంటే మాంఛి మూడ్ రావాలి."

"ఈ రివాల్వరే నీకు మాంఛి మూడ్‌ని తెస్తుందిలే భయపడకు"

అంటూ ట్రిగ్గర్ నొక్కాడు.

ఓ బుల్లెట్ పెద్ద శబ్దంతో భవానీశంకర్ నెత్తిమీద నుంచీ కిటికీ చువ్వకు గతిలి కిందపడింది.

భవానీశంకర్‌కు కొద్ది క్షనాల వరకూ మాట రాలేదు.

"దీసీజ్ వెరీ బాడ్ కల్నల్."

"ఆఫ్‌కోర్స్! బాడ్ థింగే. అయినా నేను చేస్తాను. దమ్ముంటే వెంటనే హిప్నటైజ్ చేయ్ నన్ను. నువ్వు నన్ను హిప్నటైజ్ చేసిందీ లేనిదీ జడ్జిమెంట్ యివ్వడానికి రత్నప్రభను జడ్జీగా నియమిస్తున్నాను. కమాన్! డోంట్ లుక్ లైక్ దట్! త్వరగా కానీ."

"పోనీ రేప్ చేస్తాను."

"ఇప్పుడేం వర్జ్యం వుందా?"

"కాదు. కొంచెం ప్రిపేరవుదామని."

"నథింగ్ డూయింగ్. కమాన్ హరియప్! నన్ను హిప్నటైజ్ చేయలేకపోతే నువ్వు కైలాసానికి, నేను జైలుకి వెళతాం- గుర్తుంచుకో."

"హిప్నాటిజం చేయాలంటే చాలా ప్రాబ్లెమ్స్ వున్నాయి."

"ఏమిటవి?"

"మీరు హిప్నటైజ్ అవటానికి యిష్టంగా వుండాలి."

"షటప్! ఛస్తే యిష్టంగా వుండను. ముందు స్టార్ట్ చెయ్."

"ఎలా చేస్తాను? హిప్నాటిజమంటే మీకు నమ్మకం లేదుకదా?"

"లేదు."

"లేనివాళ్ళను హిప్నటైజ్ చేయటం కష్టం."

"నో! నేన్నమ్మను అదంతా ట్రాష్."

"నమ్మకపోయినా ఫాక్ట్ అదే కల్నల్. కావాలంటే హిప్నాటిజం మీద బుక్స్ చదవండి."

"డోంటాక్ రాట్! ఇప్పుడు నన్ను హిప్నటైజ్ చేస్తున్నావా? లేదా?"

"ఇప్పుడు చేయటం కొంచెం కష్టం."

"కష్టమయినా సరే! లేకపోతే హిప్నాటిజం మీద నువ్వు రాసిన నవలలన్నీ బోగస్ అనీ... హిప్నాటిజం అనే విద్య బోగస్ అనీ పబ్లిగ్గా స్టేట్‌మెంట్ ఇవ్వు! నిన్ను కాల్చిపారేసి ఆ స్టేట్‌మెంట్ ప్రెస్‌కి రిలీజ్ చేస్తాను."

గోపాత్రావ్ చప్పున భవానీశంకర్ని ఆదుకోవడానికి ప్రయత్నించాడు.

"అదికాదు మామయ్యగారూ! హిప్నటిజం సైన్సుని చాలామంది ఒప్పుకున్నారు."

"ఎందుకూ పనికిరానివాళ్ళ స్టేట్‌మెంటది."

"మన ఆంధ్రప్రదేశ్ పోలీస్ కూడా హిప్నాటిస్టుల సాయం తీసుకుని ఎన్నో నేరాలు పరిష్కరించగలిగారు"

"అలాంటి పోలీసులను వెంటనే డిస్‌మిస్ చేసి మెంటల్ హాస్పిటల్లో చెకప్‌కి పంపాలి."

"గవర్నమెంట్ కూడా పోలీసులకు హిప్నాటిజం మీదున్న నమ్మకాన్ని తెగ పొగిడింది మామయ్యగారూ..."

"గవర్నమెంటే మెంటల్ హాస్పిటల్ అసలు."

గోపాత్రావ్ కింకేం మాట్లాడటానికీ వీల్లేకపోయింది.

"ఇక్కడే కాదు డాడీ! హిప్నాటిజంని నేరపరిశోధనకు విదేశాలు కూడా విరివిగా వుపయోగిస్తున్నారని మొన్న పేపర్లో రాశారు."

"ఎవర్రాశారది?"

"హిప్నాటిస్ట్ ఒకతను."

"వాడి అడ్రస్ చెప్పు- అబద్ధాలు రాసినందుకు ముందు వాడిని షూట్ చేస్తాను."

"అందులో నిజముంది కర్నల్" తనూ కల్పించుకుంటూ అన్నాడు భవానీశంకర్. అదీగాక త్వరలోనే నేనూ కొన్ని నేర పరిశోధనల్లో పోలీసుకి సాయం చేయాలను



కుంటున్నాను" అన్నాడు భవానీ.

కనకారావ్ ఆలోచనలో పడ్డాడు.

"ఆల్ రైట్! నేర పరిశోధనలో హిప్నాటిజం అద్భుతంగా పనిచేస్తుందన్నావు కదా?"

"ఎస్సర్!"

"ఓకే అయితే మన వజ్రాలు కాజేసిన వాడిని హిప్నటైజ్ చేసి, అవెక్కడ దాచాడో చెప్పించు. దెన్ అయ్ విల్ బిలీవ్ యూ."

భవానీశంకర్ గతుక్కుమన్నాడు.

"మరి కరడుగట్టిన డెకాయిట్‌ని హిప్నటైజ్ చేయాలంటే నేను చాలా కష్టపడాలి-"

"నో! యూ ఆర్ లయింగ్! కమాన్! రడీగుండు. రేపే నిన్ను పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్ళి ఇన్స్‌పెక్టర్ రాంబాబుకి చెప్తాను. అక్కడ విక్కీ గాడిని హిప్నటైజ్ చేసి ఆ వజ్రాలు ఎక్కడ దాచాడో కనుక్కోగలిగితేనే పూజను నువ్వు పెళ్ళిచేసుకోడానికి పర్మిషనిస్తాను."

"లేకపోతే?"

"లేకపోతే రివాల్వర్‌తో నీ బాడీమీద ఎక్కడో చోట కాల్చి బయటకు గెంటేస్తాను."

"కానీ నేనూ, చంద్రకాంత్ సిన్సియర్‌గా లవ్ చేసుకున్నాం డాడీ. ఇలా కండిషన్స్ పెడితే ఎలా?"

"వీడు నిన్ను సిన్సియర్‌గా లవ్ చేశాడా?"

"ఎస్ డాడీ!"

"నేను ఛస్తే నమ్మను. ఈ టీవీ ఛానెల్‌గాళ్ళ మీద నాకు ఏమాత్రం నమ్మకం లేదు. ఆ మధ్యన పేపర్లో వేశారు... ఓ టీవీ సీరియల్ డైరెక్టర్‌గాడు పెళ్ళయినా కూడా పెళ్ళికాలేదని చెప్పి ఇంకో నలుగురమ్మాయిలను నాలుగు మెట్రాపాలిటన్ సిటీస్‌లో పెళ్ళిచేసుకున్నాడంట."

"వాడెవడో ఛీట్"

"కాదు. అంతకుముందు ఓ సీరియల్‌కి కూడా స్టోరీ రాశాడట."

"అలాంటిదేమీ లేదు అంకుల్!ఆ ఛీట్ గురించి నేను పేపర్లో చదివాను కదా! ఎక్కడా వాడు కథలు రాసినట్లు ఇన్ఫర్మేషన్ లేదు. ఆ పేపర్ మా ఆఫీసులో వుంది. కావాలంటే ఇప్పుడే తెస్తాను" అన్నాడు గోపాత్రావ్.

"ఆల్ రైట్! వాడు అప్పటికి రచయిత కాకపోవచ్చు. కానీ వాడికి జైలు శిక్ష పడింది కాబట్టి జైల్లో తప్పకుండా ఆత్మకథ రాసితీర్తాడు. దాంతో ఆటోమేటిగ్గా రచయిత అయిపోతాడు."

"వాడు ఆత్మకథ రాయటమేమిటి కర్నల్? కొయిట్ అబ్సర్డ్...."

"డోంటాక్... ఫూలన్‌దేవి రచయిత్రా? కాదా?"

"కానీ ఫూలన్‌దేవి..."

"తమిళనాడులో ఎంతోమందిని మర్డర్ చేసిన ఆటో శంకర్ మాటేమిటి? జైల్లో ఇప్పుడు ఆత్మకథ రాస్తున్నాడా లేదా?"

"రాసినా కూడా..."

"అంచేత కీప్ యువర్ మౌత్ షట్! నేను ఛస్తే ఈ రచయితల్నీ, డైరెక్టర్లనూ నమ్మను."

"నన్ను నమ్మవచ్చు మై డియర్ కర్నల్! కావాలంటే నాకు పెళ్ళికాలేదని, దివ్యమయిన బాచులర్ననీ మెట్రోపాలిటన్ సిటీస్ అన్నింటి నుంచీ సర్టిఫికెట్స్ తెచ్చి చూపిస్తాను."

"ఇంజనీరింగ్, ఎం.బి.బి.యస్. డిగ్రీలే దొంగ డిగ్రీలు దొరుకుతుంటే ఈ బోడి సర్టిఫికెట్లు దొంగవి సృష్టించటం కష్టమా?"

సరిగ్గా ఆ టైమ్‌కే డోర్ బెల్ మోగిన చప్పుడయింది.

భజన్రావ్ వడివడిగా వెళ్ళి తలుపు తెరిచి చూశాడు.

ఎదురుగా అష్టలక్ష్మి కనిపించింది.

"ఎవరు కావాలి?" అడిగాడతను అనుమానంగా.

"మీరు గోపాల్రావా?" అడిగింది అష్టలక్ష్మి అనుమానంగా.

"కాదు భజన్‌రావ్."

అతనికి అనుమానం వచ్చింది ఆమె పెన్ కోసం వచ్చిన బాపతై వుంటుందని.

"మీరో పనిచేయండి. ఆ చివరకు వెళ్ళి ఎదురుగా ఉన్న సందులోకి మళ్ళి, ఎనిమిదో ఇంటి దగ్గరున్న కూల్‌డ్రింక్ షాప్ ముందు నిలబడండి. నేను వచ్చి కలుసుకుంటాను...."
అనేసి తలుపు మూసేశాడు భజన్‌రావ్.

• • •

కనకారావ్ తన ఎదురుగా నిలబడ్డ భవానీశంకర్ వైపు కసిగా చూశాడు. అతడిని పూజకు భర్త కాకుండా ఎలా అపాలా అని లోలోపల రకరకాలుగా ఆలోచించసాగాడు.

ఎంత ఆలోచించినా ఏమీ ఉపాయం తట్టటంలేదు.

రివాల్వర్‌తో కాల్చిపారేయటమే ఉత్తమయిన మార్గం అనిపిస్తోంది.

"పోనీ పూజ లైక్ చేస్తోంది కాబట్టి చంద్రకాంత్ గారికిచ్చి చేసేద్దాం డాడీ" అంది సీత.

"అవును. అతనలా మోసాలు చేసేరకంలాగా కనిపించడం లేదు" అంది రత్నప్రభ.

గోపాల్రావ్ భవానీశంకర్‌కి కన్ను గీటాడు.



"మనిద్దరం బయటికి చెక్కేదాం పద. ఎదురుగా ఉంటే కోపంతో పిచ్చెక్కి మనిద్దరిమీద కాల్పులు జరిపినా జరపవచ్చు" అన్నాడు రహస్యంగా.

ఇద్దరూ బయటికి నడిచారు.

"ఎక్కడికి?" అడిగింది సీత.

"అదే.. మా కామన్ ఫ్రెండ్ రంగరాజు ఇంటికి..." అన్నాడు గోపాల్రావ్.

"రంగరాజా?" ఆశ్చర్యంగా అడిగాడు కనకారావ్.

"అవును."

"ఇంతకు ముందెన్నడూ అతడు మనింటికి వచ్చిన గుర్తులేదే..."

"వాడీ మధ్యే అమెరికా నుంచి వచ్చేశాడు."

ఇద్దరూ బయటపడి 'హమ్మయ్య' అని గాలి పీల్చుకున్నారు.

"ఎక్కడికెళదాం" అడిగాడు గోపాల్రావ్ కారు డ్రైవ్ చేస్తూ.

"ఎక్కడి కేమిట్రా పిచ్చివాడా! ఆ అమ్మాయి ఎవరో పెన్ కోసం ఎక్కడో వెయిట్ చేస్తూంటుందని భజన్‌రావ్ చెప్పాడు కదా! ఇప్పుడు మనం అక్కడికి వెళ్ళకపోతే తనే మనింటి వస్తుంది. దాంతో కొంప మునిగిపోతుంది."

"మైగాడ్! పద.. పద..." అంటూ కారు వేగం పెంచాడు గోపాల్రావ్.

• • •

అష్టలక్ష్మికి భజన్‌రావ్ చెప్పిన మాటలేం అర్థంకాలేదు.

తను గోపాల్రావ్ ఇంటికి వెళ్ళాల్సింది పొరపాటున భజన్‌రావ్ అనే వాడింటి కెళ్ళిందేమో. అయినా అతను వచ్చి తనను ఈ కూల్‌డ్రింక్ షాప్ దగ్గర ఎందుకు కలుసుకుంటానన్నాడు?

దారిన వెళుతున్న పెద్దమనిషిని ఆపిందామె.

"ఈ అడ్రస్ గల ఇల్లెక్కడో కొంచెం చెప్తారా?"

అతడు ఆ కాగితం తీసుకుని చూశాడు.

"అదిగో ఆ పెద్ద గేటు ఉన్న ఇల్లే."

"మరి అక్కడికి వెళితే గోపాల్రావ్ కాదనీ భజన్‌రావ్ అనీ అన్నాడే?"

"అదా! అతను వాళ్ళ వంటవాడు."

అష్టలక్ష్మికి అర్థమయింది.

మళ్ళీ గోపాల్రావ్ ఇంటికి చేరుకుంది.

ఈసారి సీత తలుపు తెరిచింది.

సీత మేకప్ గెటప్ చూసేసరికి ఆమెకు అనుమానం వచ్చేసింది. ఇదే చంద్రకాంత్‌కి ఆ లవ్ మెయిల్ ఇచ్చి వుంటుందని.

“ఎవరు కావాలి?” అడిగింది సీత.

“సీతాగోపాల్రావ్.”

సీత ఆశ్చర్యపోయింది.

“అయామ్ సీతాగోపాల్రావ్.”

“నాకు ఇంగ్లీషు రాదు తెలుగులో చెప్పు”

ఆమె ఏకవచనంతో మాట్లాడటం సీతకు కోపం తెప్పించిందిగానీ కోపం అణచేసుకుంది.

“నేనే సీతాగోపాల్రావ్‌ని. నువ్వెవరు?”

“అష్టలక్ష్మి…”

“అష్టలక్ష్మా.?”

“అవును.”

“నాతో ఏం పని నీకు?”

“నా మొగుడితో నీకేం పనో అడుగుదామని వచ్చాను.”

“వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్?” కోపంగా అంది సీత.

“తెలుగులో మాట్లాడు.”

“ఏమిటా పిచ్చివాగుడు?”

“పిచ్చి వాగుడు నీది, పిచ్చి చేష్టలు నీవి, పిచ్చి సంస్కృతి నీది” ఫిట్స్ వచ్చినట్లు చేతులూపుతూ అరిచింది అష్టలక్ష్మి.

“ఏయ్! బయటికి పోతావా? గెంటించమంటావా?”

“నేనెందుకు పోతానే! బయటికి గెంటింపబడటానికి రాలేదే అంత దూరం నుంచి, నీ అంతు తేల్చుకోడానికొచ్చాను. బద్మాష్ ముండా.. ఈ టిక్కులన్నీ చూపించి, నా మొగుడిని వలలో వేసుకుని ఊరేగుతున్నావా? ఇంత పెద్ద జనాభా గల సిటీలో నా మొగుడే దొరికాడా నీకు…?” బిగ్గరగా అరుస్తోంది–

సీత ఇంక సహించలేక ఆమె చెంప ఛెళ్ళుమనిపించింది.

దాంతో అష్టలక్ష్మి ఆవేశానికి కట్టలు తెగిపోయాయి.

అమాంతం ఎగిరి సీత మీదకు దూకి ఆమెతో కలబడింది. ఇద్దరూ ఆ ఫోర్స్‌కి కిందపడి కొట్టుకుంటూంటే కర్నల్ కనకారావు పరుగుతో వచ్చి రివాల్వర్ గాలిలోకి పేల్చాడు.



అష్టలక్ష్మి ఆ శబ్దానికి భయపడిపోయి సీతను వదిలేసి లేచి నిలబడింది.

“ఎవర్నువ్వు? ఎందుకొచ్చావిక్కడికి?” అరిచింది రత్నప్రభ.

భజన్రావు పెద్ద కర్ర తీసుకొచ్చాడు ఆమెను కొట్టటానికి.

“దీన్ని పోలీసులకు అప్పగించాలి. పిచ్చిదిలాగుంది పూజా! పోలీస్‌కి ఫోన్ చెయ్” అరిచాడు కర్నల్.

వాళ్లందరి హడావుడీ చూపి అష్టలక్ష్మి భోరున ఏడ్చేయటం మొదలెట్టింది.

ఏడుస్తూనే మధ్య మధ్యలో మాట్లాడుతోంది.

“నా సంసారం కూల్చేస్తావా? నా మొగుడే కావాల్సి వచ్చాడా నీకు? కావాలంటే నీకు బోలెడుమంది దొరుకుతారు కదా! ఆడు నీ అందం చూసి వెంటపడుతున్నాడనుకుంటున్నావేమో! కాదు– నీ డబ్బు చూసి – నిన్ను లేపుకెళ్ళి, నాల్రోజులు సంసారం చేసి నీ నగలూ, డబ్బూ అయిపోగానే నిన్ను వదిలేస్తాడు.”

“షటప్” బిగ్గరగా అరిచింది సీత.

అష్టలక్ష్మి సైలెంటయిపోయింది.

“ఏమిటి నువ్వు మాట్లాడేది? నీ మొగుడేమిటీ – నాకు కావాల్సి రావటమేమిటి? సరిగ్గా వివరంగా మాట్లాడు. ముందు ఏడ్చి తర్వాత మాట్లాడు లేకపోతే ముందు మాట్లాడి తర్వాత ఏడు.”

“అసలు ఏడవడానికి వీల్లేదు, ఇదేం ఇల్లనుకుంటున్నావా స్మశానం అనుకొంటున్నావా– భోరున ఏడవడానికి” అంది పూజ.

ఈ సారి కొంచెం వివరంగా చెప్పింది అష్టలక్ష్మి.

“మా ఆయనను నువ్వు మెయిలిచ్చి పిలిపించుకుంటున్నావు. నీకిది న్యాయమేనా?.”

సీతకు ‘మెయిల్’ అన్నమాట వినిపించేసరికి అనుమానం వచ్చింది.

“మీ ఆయనకు నేను మెయిలిచ్చానా?”

“అవును”

“మీ ఆయనెవరు?”

“రచయిత చంద్రకాంత్.”

అందరూ ఉలిక్కి పడ్డారు.

“రచయిత చంద్రకాంత్ మీ ఆయనా?”

“అవును! కొంపతీసి నిన్ను కూడా పెళ్ళి చేసుకున్నాడా? ఓరి దేవుడో.. కొంప కూలిపోయి రెండయింది…”

“అదిగో ఆ పిచ్చి వాగుడే వాగొద్దన్నాను. ఏడ్చావంటే రివాల్వర్తో కాల్చిపారేస్తాను”

కోపంగా అరిచాడు కర్నల్.

సీతకు మాటర్ అర్థమైంది.

"చూశారా డాడీ! మీరు వేసిన ప్లాన్ ఇది- ఎంత హెడేక్‌గా తయారయిందో చూడండి."

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్? పాకిస్తాన్ వార్‌లో నేను వేసిన ప్లాన్ వల్ల పాకిస్తానీ పోస్ట్ మొత్తం మన జవాన్ ఒక్కడికి కూడా ప్రాణ నష్టం కలగకుండా కాప్చర్ చేశాం. అంత సూపర్బ్ ప్లాన్స్ వేయగలిగిన వాడిని హెడేక్ ప్లాన్స్ యిస్తానా?"

"ఆ పాకిస్తానీ పోస్ట్‌ని అంతకు ముందెప్పుడో వదిలిపోయారని అందరికీ తెలుసు. ఊరికే రెచ్చిపోకండి" అంది రత్నప్రభ.

కర్నల్‌కి రత్నప్రభను కాల్చిపారేయాలనిపించింది. ఆమె చెప్పింది కొంతవరకూ నిజమే అయుండవచ్చు గానీ, అంతమాత్రాన అందరెదురుగా తన పరువు తీయాలని రూలేం లేదు.

"నువ్వూరికే అపార్థం చేసుకుంటున్నావ్. మీ ఆయన చంద్రకాంత్‌కీ, నాకూ ఏ సంబంధమూ లేదు. అసలు నిన్నటి వరకూ చంద్రకాంత్ ఎవరో కూడా నాకు తెలీదు."

"తెలీపోతే ఆ మెయిలెలా ఇచ్చారు?"

"ఆ సంగతంతా చెప్తాను- లోపలకు రా"

అష్టలక్ష్మికి ఇంకా నమ్మకం కలగటం లేదు ఆమె మాటలు.

అయినా గానీ ఆమె ఏం చెప్తుందో వినాలని లోపలకు నడిచింది.

అందరూ సోఫాల్లో కూర్చున్నారు.

"మా ఆయన పేరు గోపాల్రావు. ఆయనా, నీ భర్త చంద్రకాంత్ స్నేహితులు- మొన్న రాత్రి మా ఆయన ఇంటికి రాకుండా చంద్రకాంత్‌తో ఎక్కడో రూమ్‌లో గడిపానని చెప్పాడు. అది నిజమా, కాదా అని మీ ఆయననడిగి తెలుసుకోవాలని మెయిలిచ్చాను."

అష్టలక్ష్మికి ఇంకా ఆమె మాటలు అనుమానంగానే వున్నాయి.

ఈలోగా పూజ పెద్దగా ఏడ్చేయటం మొదలుపెట్టింది.

కనకారావు ఆశ్చర్యపోయాడు.

"అరె-వాట్ హేపెన్డ్ బేబీ? నువ్వెందుకు ఏడుస్తున్నావు?"

"మీరు చెప్పిన మాటే నిజం డాడీ! టీవీ సీరియలోళ్ళంతా మోసగాళ్ళు. రచయిత చంద్రకాంత్‌కి పెళ్ళయినా కూడా మనతో పెళ్ళి కాలేదనీ, నన్ను ప్రేమించానీ, పెళ్ళి చేసుకుంటాననీ ఎన్ని అబద్దాలు చెప్పాడో చూశారా?"

"నాకు ముందే తెలుసు బేబీ! ఈ రచయితల మీద నాకు బొత్తిగా సదభిప్రాయం



లేదు. మా కాలేజ్‌లో జరిగిన ఇన్సిడెంట్ గురించి నీకు చెప్పానా?"

"ఇప్పటికి కొన్ని వందలసార్లు కొన్ని వేలమందికి చెప్పారు" అంది రత్నప్రభ.

"షటప్! నేను నీతో మాట్లాడడం లేదు. పూజతో మాట్లాడుతున్నాను."

"మీరెవ్వరితోనూ మాట్లాడనక్కర్లేదు."

పూజ మాటలు విన్న అష్టలక్ష్మి హఠాత్తుగా శోకాలు మొదలెట్టింది.

"ఓరి దేవుడో- నేననుకున్నంతా అయిందిరో- ఆ మాయదారోడు పెళ్ళి కాలేదని అబద్ధాలు చెప్పి ఇంకెవత్తెనో చేసుకోడానికి ప్లానేశాడు.. నా సంసారం సర్వనాశనమైపోయింది. ఇంక నాకు దిక్కెవరు దేవుడా-"

కర్నల్‌కి వళ్ళు మండిపోతోంది. "నోర్మూస్తావా లేదా?" అంటూ బిగ్గరగా అరిచేసరికి ఆమె ఏడుపు ఆపేసింది.

అప్పటికే చుట్టుపక్కల వాళ్ళు గేటు ముందు గుమికూడి ఏం జరిగిందని అడుగుతూంటూ భజన్‌రావు అందరికీ నచ్చచెప్పి పంపించేస్తున్నాడు.

"డాడీ! నేనింక జన్మలో పెళ్ళి చేసుకోను డాడీ! నాకు పెళ్ళంటేనే విరక్తి కలిగేలా చేశాడు ఆ ఇడియట్" కోపంతో అంటుంది పూజ.

"పూజా! డోంట్ గెట్ అప్సెట్! చంద్రకాంత్‌కి బుద్ధి చెప్దాం మనం" అంది సీత ఆమెను ఓదారుస్తూ.

"ఇదిగో చూడు అష్టలక్ష్మి! నీకేం అన్యాయం జరగలేదు-జరగదు. అంచేత నువ్వు వూరికే కొంపలు మునిగిపోయినట్లు ఏడవకు."

"మా ఆయనేరీ?" అడిగింది అష్టలక్ష్మి కళ్ళు తుడుచుకుంటూ.

"వస్తాడు. మా వారూ, అతనూ కలసి వాళ్ళ ఫ్రెండ్ రంగరాజు దగ్గరకెళ్ళారు"

అష్టలక్ష్మికి మళ్ళీ అనుమానం వచ్చింది.

"రంగరాజంటే ఆడదా, మగదాండీ?"

"మగాడే!"

"అయితే ఫర్లేదులెండి" సంతృప్తిగా అంది. "ఈ మనిషి గురించి మీకు తెలీదండీ- పరమ నికృష్టుడు. ఎప్పుడూ కన్ను ఇంకో ఆడదాని మీదే- వీడికీ తోడు ఆ క్రియేటివ్ హెడ్‌గాడొకడు తయారయ్యాడు. ఎప్పుడు చూసినా వీళ్ళిద్దరూలేడీ ఆర్టిస్ట్‌లను వెంటేసుకుని అడ్డమైన చోటా తిరుగుతూ కనబడుతూంటారని మా యాదగిరి చెప్పాడు."

"యాదగిరెవరు?"

"మగాడేలెండి - ఆడది కాదు."

సీతకు నవ్వొస్తోంది.

"నిజం చెప్తున్నానండీ- వీడినెప్పుడో వదలి మా అమ్మ వాళ్ళ దగ్గరకెళ్ళి పోదామనుకున్నానండీ - కానీ మా అమ్మ మా నాన్నతో పోట్లాడి వాళ్ళమ్మ ఇంటికెళ్ళిపోయిందండీ"

"అదేమిటి? ఆమె ఎందుకెళ్ళిపోయింది ఈ వయసులో?"

"మా నాన్న ఇంకెవత్తెనే తీసుకొచ్చి ఇది నా రెండో పెళ్ళాం" అంటూ ఇంట్లో దించాడండీ."

"ఈ వయసులో గొడవపడి వెళితే మీ అమ్మనెవరు చూస్తారు? రెండో పెళ్ళాంతోనే అడ్జస్టవాల్సింది" అంది రత్నప్రభ.

"ఎలా అవుతుందండీ? అసలు మా అమ్మే రెండో పెళ్ళామండీ మా నాన్నకు."

"మరి మొదటి పెళ్ళాం ఎవరు?"

"ఆమె సూరయ్య కొడుకు రెండో పెళ్ళామండీ."

ఎవరికీ ఏమీ అర్థం కాలేదు.

"సరే! మీ ఇంటి గొడవ వదిలేద్దాంలే" అంది రత్నప్రభ ఓసారి తన నెత్తిమీద గట్టిగా కొట్టుకుంటూ.

"అష్టలక్ష్మీ! నువ్వేం భయపడకు- మీ ఆయన్ని నాలుగు చీవాట్లేసి ఇంకోసారలాంటి వేషాలేస్తే మర్యాదగా ఉండదని వార్నింగిచ్చి నీతో ఇంటికి పంపిస్తాం- సరేనా?"

అష్టలక్ష్మి ఆలోచనలో పడింది.

పూజ కోపంగా తన గదిలో దూరి తలుపేసుకుని మంచం మీద వాలిపోయింది.

అష్టలక్ష్మిని చంద్రకాంత్ గదిలోకి తీసుకెళ్ళింది సీత.

"స్నానం అదీ ముగించి రడీ అవ్! ఇదిగో- ఈ అల్మారారో చీరలుంటాయ్- వాటిల్లో ఒకటి కట్టుకో- నీకు ఆకలేసినప్పుడు చెప్తే భజన్‌రావ్ నీకు భోజనం వడ్డిస్తాడు. ఇంకేమైనా కావాలంటూ నన్నడుగు. సరేనా?"

"ఆలోచిస్తూంటే నాకింకోటి అనిపిస్తోందండీ."

"ఏమిటది?"

"వీడినొదిలేసి మా చిన్నమ్మ ఇంటికెళ్ళి పోదామని- నేను వాడి నొదిలేసి వస్తే తను దత్తత చేసుకుంటానని చెప్పింది."

"అష్టలక్ష్మీ! మీరిద్దరూ విడిపోతే విడిపోండిగాని అది నా వల్ల జరగటం నాకిష్టం లేదు. అందుకని దయచేసి ఈ సారికి అతన్ని క్షమించి ఇంటికి తీసుకెళ్ళు."

అష్టలక్ష్మి ఏం మాట్లాడలేదు. మెత్తగా వున్న పరుపు మీద నడుము వాల్చేసరికి ఆమెకు నిద్ర కమ్ముకొచ్చింది.



• • •

రాణీకోసం చాలాసేపు వెయిట్ చేశారు గోపాల్రావ్, భవానీశంకర్లు.

ఆమె చాలాసేపటి తర్వాత వచ్చింది.

"ఏదీ నా పెన్?" అడిగింది గోపాల్రావ్‌ని.

"అదే రాణీ! ఆ విషయం మాట్లాడదామనే వచ్చాను."

"ఇందులో మాట్లాడేదేముందీ? నా పెన్ నాకివ్వండి-అంతే!"

"అదికాదు రాణీ! అసలేం జరిగిందంటే..."

"ఈ అసలేం జరిగిందంటే కథలు నాకు వినిపించొద్దు. చాలా విని విని విసిగిపోయాను."

"నిజం చెప్తున్నాను రాణీ! కొంచెం చెప్పేది విను."

"ఏమిటది?"

"ఆ పెన్ మా కల్నల్ మావ దగ్గరున్నంచీ కొట్టేయటం కష్టంగా వుంది."

"ఎందుకష్టం- అది మీది కాదని చెప్పి తీసుకోవాలి."

"పోనీ ఇంకో పని చేద్దామా?"

"ఏమిటి?"

"అలాంటి పెన్నే నీకు కొనిస్తామనుకో ఎలా వుంటుంది?"

"ఏడ్చినట్లుంది. నాకు నా పెన్నే కావాలి."

"ఏ పెన్నయితేనేం?"

"ఆ సంగతి మీకనవసరం."

"అంతేనంటావా?"

"అవును."

గోపాల్రావుకేం చేయాలో తోచక భవానీశంకర్ వైపు చూశాడు.

"హలో రాణీ! పోనీ మనం ఇంకో పని చేస్తే ఎలా వుంటుంది?" అన్నాడు భవానీ కల్పించుకుంటూ.

"ఇంకేం చేసినా బావుండదు"

"సపోజ్ మేము ఆ పెన్‌కి డబుల్ ఖరీదు మీకిచ్చామనుకోండి... అప్పుడు థ్రిల్లింగ్‌గా వుండదూ?"

"పరమ నికృష్టంగా వుంటుంది."

"పోనీ మూడు రెట్లు?"

"అయినా అంతే!"

"పోనీ పదింతలు?"

"లాభం లేదు."

"పోనీ వందింతలు?"

"లక్షింతలయితే ఆలోచించవచ్చు"

"అంటే ముప్పై లక్షలా?"

"అవును."

"ఒక పెన్ను ఖరీదు ముప్పై లక్షలా?"

"ఫోన్లే గదాని– లేకపోతే ఇంకా ఎక్కువ అడిగేదాన్ని."

"ఉదాహరణకు మేమిప్పుడు నీ పెన్ ఇవ్వం– ఏం చేసుకుంటావో చేసుకో అన్నామనుకో అప్పుడేం చేస్తారు మీరు?"

"చెప్పనా?"

"చెప్తే బావుంటుంది డియర్!"

"తిన్నగా గోపాల్రావు వాళ్ళింటికెళ్ళి ఆ రోజు రాత్రి మేమిద్దరం హొటల్ రూంలో గడిపామనీ, అతను నా పెన్ను తీసుకుని పారపోయి వచ్చాడనీ చెప్పాననుకోండి ఏమవుతుంది? అప్పుడేం చేస్తారు మీరు?"

"నా కాపురం గోవిందా" అన్నాడు గోపాల్రావు.

"అర్థమయిందిలే" అన్నాడు భవానీ.

"ఓకే! అయితే ఓ పని చెయ్!"

"ఏమిటది?"

"రేపుదయం మళ్ళీ ఈ టైమ్‌కి కనిపించు. పెన్ ఇచ్చేస్తాం."

"అబద్ధం"

"నిజం–ప్రామిస్!"

"ఆల్‌రైట్! ఇదే లాస్ట్ వాయిదా."

"ఫైనల్ వాయిదా!"

"ఒక వేళ ఇది ఫెయిలయితే?" అనుమానంగా అడిగింది.

"ఫెయిలయితే అప్పుడు నీ ఇష్టం."

"ఏమిటి నా ఇష్టం?"

"నువ్వు అనుకున్నది చేసేయవచ్చు"

"ఓకే! సీయూ!"



ఆమె వెళ్ళిపోయింది.

"మహా డేంజరస్ కేసులాగుంది" అన్నాడు భవానీ.

"బుద్ధితక్కువయి ఇరుక్కుపోయాను."

"అయినా ఆ పెన్ ఎవడడిగి తీసుకోమన్నాడు నిన్ను?"

"నేను తీసుకోలేదు గురూ! పొరపాటున తనే నా బ్రీఫ్‌కేస్‌లో పడేసింది."

"అయినా ఆ పెన్నంటే ఎందుకంత ఇది? అలాంటిది ఇంకోటయితే నేం?"

"వాళ్ళ సిస్టర్‌దది. ఆ అమ్మాయికి ఆ పెన్‌తో 'సెంటిమెంట్' వుందంట."

"ఆమె సినిమా ఫీల్డ్ మనిషా?"

"ఎందుకు?"

"అక్కడ ఇలాంటి సెంటిమెంట్స్ చాలా ఎక్కువలే"

"ఏదేమయినా ఇవాళ రాత్రికి మనం ఆ పెన్ కాజేయకపోతే మన కొంప మునిగిపోతుంది."

"మీ మామగాడికి దొంగతనం చేస్తూ దొరికిపోతే కొంప ఇంకొంచెం ఎక్స్ట్రా మునిగిపోతుంది."

ఇద్దరూ ఇంటికి చేరుకునేసరికి సాయంత్రం నాలుగయిపోయింది.

హాల్లో అందరూ తమ కోసమే ఎదురుచూస్తున్నట్లు కూర్చుని ఉండటం చూసేసరికి గోపాల్రావ్‌కి భయమేసింది కొంచెం.

"హలో చంద్రకాంత్! కమాన్– నీ కోసమే వెయిట్ చేస్తున్నాం." అన్నాడు కనకారావ్ రివాల్వర్‌లో బులెట్స్ నింపుతూ.

"ఎనీథింగ్ స్పెషల్ మైడియర్ కర్నల్?"

"ఎస్.... ఎస్.. స్పెషల్లీ స్పెషల్."

"ఏమిటిది?"

రత్నప్రభ కనకారావ్‌ని కసురుకుంది.

"మీరూరికే గొడవ చేయకండి. ఫస్ట్ లెట్ హిమ్ సెటిల్" అంది కనకారావ్ వైపు కోపంగా చూస్తూ.

"నేను సెటిలయిపోయాను" అన్నాడు భవానీ.

"ఇక్కడ కాదు చంద్రకాంత్! మీ రూమ్‌కెళ్ళి రిలాక్సవండి."

"థాంక్యూ వెరీమచ్ కర్నల్!"

"మీకో ప్లెజెంట్ సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాం. చంద్రకాంత్‌గారూ!"

"అదేమిటో కొంచెం హింట్ ఇవ్వగలరా?"

"మీరే తెలుసుకుంటారు కాసేపాగితే."

భవానీశంకర్ కలవరపాటుతో గోపాల్రావ్ వైపు చూశాడు.

సీతా భవానీశంకర్ వెంబడే నడిచి అతని గది దగ్గర ఆగింది.

అతను లోపలికెళ్ళగానే గది తలుపులు అమాంతం లాగి బయటగొళ్ళెం పెట్టేసింది.

భవానీశంకర్ కొంచెం ఫజిలయ్యాడు.

"ఏమిటి సీతాజీ! బయట గొళ్లెం పెడుతున్నారు– కుట్రలేమీ జరగటం లేదు కదా?"

"ఎస్! జరుగుతోంది."

"ఏమిటది?"

"మీకు పెళ్ళికాలేదని అబద్ధం చెప్పినందుకు పనిష్మెంట్"

భవానీ అదిరిపడ్డాడు.

"నాకు పెళ్ళి కాలేదని.."

సీత మాట్లాడకుండా వెళ్ళిపోయింది హాల్లోకి.

భవానీశంకర్‌కి ఒక్కసారిగా మల్లెపూల వాసన గుప్పుమని తాకింది.

తన గదిలో మల్లెపూలు ఎలా వచ్చాయ్?

బెడ్‌మీద పడుకోబోతూ అవతలివేపు తిరిగి కూర్చున్న యువతిని చూసి ఆశ్చర్యపోయాడు. అతనికిప్పుడు అర్థమయిపోయింది.

ఆమె పూజ అయి వుంటుంది. తనను తప్ప ఇంకొకరిని చేసుకోనని గొడవచేసి వుంటుంది. అందుకని తామిద్దరి పెళ్ళికీ వప్పుకుని ఇలా ఇద్దరినీ ఆనందంగా మాట్లాడుకోమని ఏకాంతం కల్పించి ఉంటారు. పూజ తలలో మల్లెపూల పరిమళం గదంతా వెదజల్లుతోంది. ఆనందంగా ఆమెను సమీపించి అమాంతం తన చేతుల్లోకి ఎత్తుకుని ఆమెతోపాటు బెడ్ మీదకు వరిగిపోయి ఆమె పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు.

"ఇంత సడెన్‌గా మీ డాడీ మన పెళ్ళికి ఎలా వప్పుకున్నారు పూజా?" అని అడుగుతూ ఆమె మొహం వెలుతురు లేని గదిలో దగ్గరగా చూసి షాక్ తిని అదిరిపోయి బెడ్‌మీద నుంచి కిందకు దూకాడు.

అప్పుడే అతనిని కూడా చూసిన అష్టలక్ష్మి అతను చంద్రకాంత్ కాదని గ్రహించి భయంతో గావుకేక పెట్టింది.

"ఎవర్నువ్వు?" అడిగాడు భవానీశంకర్.

ఆమె మరింత భయపడిపోయింది.

తను చూసి సినిమాల్లో దృశ్యాలు కొన్ని కళ్ళముందు కదలటం ప్రారంభించాయి.

ఓ సినిమాలో ఇలాగే హీరోయిన్ అర్థరాత్రి ఇల్లు వదిలి పారి పోతూంటే ఓ స్త్రీ



ఆమెకు ఆశ్రయం కల్పిస్తానని ఇంటికి తీసుకెళ్తుంది.

తీరా ఆమె ఇంటికెళ్ళేసరికి అది వేశ్యాగృహం. ఇద్దరొచ్చి హీరోయిన్ మీద పడేసరికి ఆమె జీవితం వాళ్ళకి బలయిపోయింది.

"నొన్నదిలేయండి.... నాకేం తెలీదు" అందామె వణికిపోతూ.

"నువ్వెవరసలు?"

ఆమె మళ్ళీ కెవ్వున కేకవేసింది.

ఉదయం నుంచి ఇంటర్వెల్స్‌లో కెవ్వున ఆ ఇంట్లో నుంచి కేకలు, ఏడుపులు, అరుపులు, రివాల్వర్ కాల్పులు వినబడుతూండేసరికి చుట్టుపక్కల వాళ్ళందరికీ అక్కడేదో మర్డర్లు, మానభంగాల్లాంటివి తెగ జరిగి పోతున్నాయని అనుమానం వచ్చేసింది.

వెంటనే అప్పటికప్పుడు 'గోపాల్రావ్ నివాస చుట్టుపక్కల బాధితుల సంఘం' అనేదొకటి అర్జంటుగా స్థాపించి ఆ సంఘం మెంబర్స్ అందరూ గోపాల్రావ్ గేటు దగ్గరకొచ్చి గోపాల్రావ్‌ని బయటకు రమ్మని కేకలు వేయసాగారు.

అతను కంగారుగా బయటకు నడిచాడు.

ఆమె కేకలను అడ్డుకునే ప్రయత్నంలో సీత, రత్నప్రభ, పరుగుతో భవానీశంకర్ గది కిటికీ దగ్గరకు చేరుకున్నారు.

"నన్ను రక్షించండి– వీడు నా మొగుడు కాదు! నన్ను రేప్ చేస్తాడు" అంటూ అష్టలక్ష్మి అరుస్తోంది.

"ఇదిగో చూడు అష్టలక్ష్మీ! అతను తప్పుచేసి వుండవచ్చు– అంత మాత్రాన అతను నీ భర్తేకాదన్నట్లు ప్రవర్తించటం అన్యాయం. మీరు ఇద్దరూ ఒకటవటమే నాక్కావలసింది. మా ఇంటి నుంచి మీ ఇద్దరూ ఇప్పుడే పెళ్ళయిన దంపతుల్లా, ఆనందంగా కలిసి వెళ్ళి కొత్తగా సంసారం చేస్తున్నట్లుగా కలిసిపోవాలి. భార్యాభర్తల భాంధవ్యం ఎంత పవిత్రమయిందో నీకు తెలీదు" అంది రత్నప్రభ.

అష్టలక్ష్మితోపాటు భవానీశంకర్ కూడా ఆమె మాటలకు ఉలిక్కిపడ్డాడు.

"ఇతను నా భర్తేమిటండీ! మీకేం మతిపోయిందా?" ఏడుపు ఆపుకుంటూ అందామె.

"అదిగో... అదే వద్దన్నాను! మా వల్ల మీకు మాటామాట వచ్చింది గనుక మళ్ళీ మావల్లే మీరు ఒకటయిపోవాలి."

"చూడండి మేడమ్! మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటం లేదు" అన్నాడు భవానీశంకర్.

"ఇదిగో చంద్రకాంత్! నువ్వు పెళ్ళి కాలేదని పూజకు అబద్ధం చెప్పినా మేము వూరుకున్నాం. ఎందుకో తెలుసా? నిన్ను పోలీసులకు పట్టిస్తే నీ భార్య జీవితం

పాడయిపోతుందని."

"ఈమె నా భార్యా? ఓర్నాయనో- నాకసలు పెళ్ళేకాలేదని చెప్పాను కదా"

"ఈ అమ్మాయి నీ భార్యకాదని నువ్వన్నా ప్రపంచం వప్పుకోదు. అయినా అష్టలక్ష్మికి ఏం తక్కువయిందని? లక్షణంగా వుంది... ముందాపిల్లను దగ్గరకు తీసుకుని తప్పయిపోయింది అష్టలక్ష్మీ! ఇక నుంచీ మనిద్దరం దెబ్బలాడుకోకుండా ఆనందంగా కలిసి కాపురం చేద్దాం' అని చెప్పు దబాయించింది రత్నప్రభ.

"ఈ అమ్మాయితో కాపురమా? పైగా ఈమెకు అదివరకే పెళ్ళి అయిపోయిట న్లుంది.. మెడలో మంగళసూత్రం వుంది."

"ఇదిగో చంద్రకాంత్! నేను చెప్పినట్లు చేస్తావా లేదా? అష్టలక్ష్మీ! నువ్వు నోర్మూసుకో ఇక" కోపంగా అంది రత్నప్రభ.

అష్టలక్ష్మి కోపంగా అరిచింది- "ఏయ్.. ఎవతెవే నువ్వు? వాడెవడినో తీసుకొచ్చి చంద్రకాంత్ అని పిలుస్తున్నావ్? పైగా ముక్కు మొహం తెలీనివాడితో నేను కాపురం చేయాలా?"

బయట తన బాధితుల సంఘం అందరినీ బ్రతిమాలి పంపించిన గోపాల్రావ్ లోపలికొచ్చాడు.

అప్పుడే కర్నల్ రివాల్వర్ తీసుకుని చంద్రకాంత్ గది దగ్గరకు వచ్చాడు.

"ఏయ్ రచయితా! నువ్వు తప్పు చేశానని ముందు నీ భార్యాకాళ్ళు పట్టుకో" అన్నాడు రివాల్వర్ గురిపెడుతూ.

"ఆమె నా భార్యకాదు కల్నల్! ఆవేశపడిపోకు... రెచ్చిపోతే పరాయి ఆడదాన్ని నా గదిలో పెట్టి బలవంతంగా ఒకటవమంటన్నందుకు నిన్ను మూసేస్తారు."

కనకారావ్ అనుమానంగా అష్టలక్ష్మి వైపు చూశాడు-

"ఏం అతను చెప్పేది నిజమేనా?"

"నిజమే."

"మరి నువ్వు రచయిత చంద్రకాంత్ భార్యవని ఎందుకబద్ధం చెప్పావ్?"

"అబద్ధమేమిటి నీ తలకాయ్! నేను రచయిత చంద్రకాంత్ భార్యనే."

"అయితే అతను నీ మొగుడు కాదన్నట్లు గొడవ చేస్తావెందుకు?"

"వీడెవడో నాకేం తెలుసు?" సరిగ్గా అప్పుడే పూజ వచ్చిందక్కడికి- చంద్రకాంత్ చెంప పగులగొట్టటానికి.

అప్పుడర్థమయింది భవానీశంకర్కీ, గోపాల్రావ్కి.

గోపాల్రావ్ ముందుకొచ్చి తలుపు తెరిచాడు.



"ఓరేయ్! ఇది చంద్రకాంత్ భార్య అనుకుంటూ.. ట్రాక్ మార్చెయ్. లేకపోతే మన బండారం బయటపడిపోతుంది" రహస్యంగా అన్నాడు.

"అంతేనంటావా?"

"అంతే!"

"అలా చేస్తే కొత్త ప్రాబ్లమ్స్ ఏమీ రావంటావా?"

"వచ్చినా ఫర్లేదుగానీ ఇప్పుడింక చేయగలిగిందేమీ లేదు."

"సరే."

గోపాల్రావ్ ఇప్పుడు గట్టిగా మాట్లాడాడు-

"ఓరేయ్ చంద్రకాంత్! అబద్ధాలు చెప్తే చెప్పావ్గానీ... ఇప్పుడిక నీ భార్యా, నువ్వూ ఒకటయిపోండి."

"ఓకే బ్రదర్! నువ్వు కోరావ్ గనుక ఒప్పుకుంటున్నా- హలో అష్టలక్ష్మీ! జరిగిందేదో జరిగిపోయింది. ఇకనుంచీ ఇద్దరం కొట్టుకోకుండా పాలు నీళ్ళలాగా కలిసిపోయి ఉ ందాం. లేకపోతే నలుగురిలో నవ్వుల పాలయిపోతాం" అంటూ ఆమెను దగ్గరకు తీసుకోబోయాడు.

అష్టలక్ష్మి ఉలిక్కిపడింది.

పూజకు చంద్రకాంత్ మీద జాలి కలిగింది.

"ఏయ్.. ఎవర్రా నువ్వు! నేన్నీ పెళ్ళాన్నా? నువ్వు నా మొగుడివా?" విరుచుకుపడింది అష్టలక్ష్మి.

"అష్టలక్ష్మీ! పాత గొడవలన్నీ మర్చిపోదామన్నా కదా. ఇంకా ఎందుకు తవ్వుతావ్?"

అష్టలక్ష్మి తన భుజం మీద వేసిన అతని చేతిని పక్కకు తోసి లాగి చెంపమీద కొట్టింది.

"ఒరేయ్ దగ్గర్కొచ్చావంటే ఛంపేస్తా!"

భవానీశంకర్ దీనంగా పూజ వైపు చూశాడు.

"పూజా! నాకు పెళ్ళి కాలేదని నీకు అబద్ధం చెప్పడానికి కారణం వుంది. ఈ అష్టలక్ష్మి ఎప్పుడో నాతో విడాకులు తీసుకుంటానని గొడవ చేసి పుట్టింటికెళ్ళిపోయింది. మా పెళ్ళికి ముందు నుంచే దీనికీ దీని బావకు అక్రమ సంబంధం ఉంది. తనను వాళ్ళ బావ పెళ్ళి చేసుకుంటాడనుకుని అతనింట్లో సెటిలయిపోయింది. ఇప్పుడు వాళ్ళ బావతో కూడా గొడవలొచ్చాయని మళ్ళీ నా దగ్గరకొచ్చేసింది. అయినా మీ అందరినీ మాటలు కాదనలేక నేను ఆమెను క్షమించాలనుకున్నాను. కానీ ఆమె ప్రవర్తన ఏమాత్రం మారలేదు. మీరంతా చూస్తూనే వున్నారు కదా- ఈ కథంతా చెప్పటంవల్ల ప్రయోజనం ఏమీలేదని-

నేను నీతో నా ఫ్లాష్‌బాక్ ఏమీ చెప్పలేదు. నీతో ఫ్రెష్‌గా, ప్రేమతో నిండిన జీవితం ప్రారంభించాలనుకున్నాను. కానీ ఈ కులట మళ్ళీ వచ్చేసింది. నా జీవితం పూర్తిగా నాశనం చేసేవరకూ నన్ను వదలదనుకుంటాను" విచారంగా అన్నాడు.

పూజకు అష్టలక్ష్మి మీద కోపం ముంచుకొచ్చింది.

"ఏయ్... ఎంత దొంగవెధవ్వి నువ్వు! నువ్వు నా మొగుడివా? నేను నిన్నొదిలి మా బావ ఇంటికెళ్ళి వాడితో కాపురం చేశానా? నీ అంతు తేలుస్తానిప్పుడే- మా ఆయన పేరుతో నాటకమాడి నన్ను నాశనం చేయాలని చూస్తున్నావు. ఇప్పుడే వెళ్ళి మా ఆయన్ని తీసుకొస్తా" అనేసి భవానీ శంకర్‌ని పక్కకు తోసి బయటకు పరుగెత్తింది.

కనకారావ్ రత్నప్రభ, పూజ, సీత అంతా నిశ్చేష్టులయి చూస్తూ వుండిపోయారు.

• • •

రచయిత చంద్రకాంత్ వళ్ళు నొప్పులతో నీలకంఠం దగ్గరకు చేరుకున్నాడు.

"వచ్చావా చంద్రకాంత్! అర్జంటుగా ఆటోలో వెళ్ళి నీలిమను తీసుకురా. ఇవాళ పెద్ద మందుపార్టీ వుంది" అన్నాడు ఆనందంగా.

"నా వళ్ళంతా హూనం అయిపోయింది సార్! దొంగ రాస్కెల్స్- బొమికలు కూడా రెండు మూడు వందల చోట్ల విరక్కొట్టినట్లున్నారు..." అన్నాడు మూలుగుతూ.

"ఎవరు వాళ్ళు?"

"ఎవరో తెలీదు. ఆ ఇంట్లో ఒకడు నా పేరు పెట్టుకుని తనే రచయిత చంద్రకాంత్‌నని నాటకమాడుతున్నాడు. అక్కడ మరి వాడేం మిస్చీఫ్ చేశాడోగానీ నాకు ఒకావిడ అర్జంటుగా రమ్మని మెయిలిచ్చింది నేను ఏదో సెటప్ కేస్ అనుకుని వెళ్ళేసరికి... అబ్బ... అన్ని తన్నులు నా జన్మలో తినలేదు."

నీలకంఠం ఆశ్చర్యపోయాడు.

"నీ పేరుతో ఆ ఇంట్లో ఎవడో నాటకమాడుతూంటే నువ్వెలా వూరుకున్నావ్? వెంటనే పోలీస్‌కి రిపోర్టివ్వాల్సింది."

"ఇస్తే మళ్ళీ తంతారేమోనని భయం వేసింది."

"పక్కన పోలీసులుండగా ఎలా తంతారు?"

ఆ పాయింట్ చాలా థ్రిల్లింగ్‌గా కనిపించింది చంద్రకాంత్‌కి.

అవును. పక్కన పోలీసుల్ని పెట్టుకెళితే వాళ్లు తనమీద ఎలా చేయి చేసుకుంటారు? ఇంపాజిబుల్! ఎలాగయినా తను వాళ్ళ మీద రివెంజ్ తీసుకోవాలి.

లేకపోతే లవ్ చేసుకుందాం రమ్మని పిలిచి తీరా మొగుడి ముందు



పట్టుబడిపోతుందని భయపడి నువ్వెవడివి? అంటుందా? పైగా తన చెంప ఛెళ్ళు మనిపిస్తుందా?

నీలకంఠానికి హఠాత్తుగా అనుమానం వచ్చింది.

"చంద్రకాంత్!"

"ఏం గురూజీ?"

"ఒకవేళ నీకు ఘోస్ట్ రైటింగ్ చేస్తున్నావాడెవయినా వాడికి మోస్ట్ రైటింగ్ చేస్తున్నావాడిని పంపిస్తే వాడు చంద్రకాంత్‌ని నేనే అని చెప్పుకోవటం లేదుకదా?"

చంద్రకాంత్ గాబరాగా చూశాడు. అతనికి నీలకంఠం మాటలు అర్థం కాలేదు.

"అంటే నాకు స్క్రిప్ట్ రాసిపెట్టే వాళ్ళల్లో ఒకడెవడయినా అలా డ్రామా ఆడుతున్నాడని మీ అభిప్రాయమా?"

"అవును"

"కానీ అక్కడున్నవాడిని నేనింతకు ముందెప్పుడూ చూడలేదు కదా?"

నీలకంఠం ఒక పెగ్గు కొట్టాడు మళ్ళీ.

"సరే! పోతేపోనీ- నువ్వు ఇప్పుడు నీలిమను తీసుకురాలేవు కదూ?"

"ఇప్పుడు మాత్రం నా వల్ల కాదు గురూజీ."

"అయితే నీ టీవీ సీరియల్‌కి ఈ వారం నుంచీ రైటర్ని మార్చేస్తున్నా!"

చంద్రకాంత్ అదిరిపడ్డాడు.

"అన్యాయం! అలాంటి పని చేయకు."

"అయితే తీసుకురా వెళ్ళి. నీకొక్కడికే దానిల్లు తెలుసు. ఇదే ఆఖరుసారి. ఇంక నువ్వు ఆ ఇంటికి వెళ్ళనక్కర్లేదు."

చంద్రకాంత్‌కి ఆనందం కలిగింది.

"ఎందుకని గురూజీ? కొత్త కేండెట్ దొరికిందా?"

"కాదోయ్! దీన్ని పర్మనెంట్ సెటప్ చేసేస్తున్నాం."

"అంటే?"

"లేపుకెళ్ళి సపరేట్‌గా కాపురం పెట్టేస్తున్నాను."

"అంటే- అఫీషియలా?"

"అవును- రెండో పెళ్ళాం."

"కానీ ఆమె మొగుడు పెద్ద రౌడీ కదా... తర్వాత గొడవలు ఏమయినా..."

"వాడికి తెలిస్తేకదా... ఎక్కడుందో.. ఎవడికీ తెలీనిచోట కాపురం. వెళ్ళు త్వరగా."

చంద్రకాంత్ ఆటోలో బయల్దేరాడు.

నీలిమ ఎదురుచూస్తోంది.

"ఇదో పెద్ద అడవి. ఆటో దొరికి చావదు... అందుకే మీకు శ్రమ ఇస్తున్నా" అంది సెక్సీ నవ్వుతూ.

"శ్రమదేముందిలే- ఏదోకటైమ్‌లో తిరిగి తీర్చుకోవచ్చు" అన్నాడు చంద్రకాంత్.

ఇద్దరూ బయటకు నడుస్తుంటే ఎదురుగా వచ్చింది పనిమనిషి.

"సరిగ్గా ఇప్పుడే ఈ పాడుముండ- చూసిందే- వెళ్ళి మా ఆయనతో చెప్తుందో... ఏమో?" అంది గాబరాగా.

చంద్రకాంత్ గుండె ఆగినంత పనయింది.

"ఇప్పుడెలా మరి?"

"ఏం ఫర్లేదులే. ఇంక వాడికి కనపడనుకదా ఎలాగూ?"

అతని గొంతు తడారిపోయింది.

ఆ పానకాలుగాడికి తనే నీలిమను తీసుకెళ్ళాడని పనిమనిషి చెప్పిందంటే తన పని ఖాళీయే.

ఆటోలో ఆమెను గెస్ట్‌హౌస్ దగ్గర వదిలి పోలీస్‌స్టేషన్‌కి బయలు దేరాడతను.

తన పేరు మీద చెలామణి అవుతున్న ఆ డూప్లికేట్ గాడిని మాత్రం వదలడానికి వీల్లేదు. కసిగా అనుకున్నాడతను.

• • •

ఇన్స్‌పెక్టర్ రాంబాబు కర్నల్ కనకారావ్‌ని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏంటి మళ్ళీ వచ్చారు?"

"ఆ విక్కీగాడు వజ్రాలు ఎక్కడ దాచాడో కనుక్కోడానికి"

"అంటే మేమంతా కనుక్కోవడం చేతకాక వాజమ్మల్లా వదిలేసి కూర్చున్నామనా?"

"అదంతా నాకవసరం. వజ్రాలు నావి కనుక వాటి గురించి ఎక్స్‌ట్రా జాగ్రత్తలు, పరిశోధనలు తీసుకునే అధికారం నాకుంది. లేదంటే ఇప్పుడే చెప్పండి... కమిషనర్‌తో మాట్లాడతాను."

రాంబాబుకి వళ్ళు మండిపోయింది.

"ప్రతి నా కొడుకూ కమిషనర్‌తో మాట్లాడతాననేవాడే' అని గొణుక్కున్నాడు.

"ఏమిటి గొణుగుతున్నారు? ఏమయినా వుంటే పైకి మాట్లాడండి" ఛాలెంజ్ చేశాడు కనకారావ్.

"ఆల్‌రైట్! ఇప్పుడేం చేయాలనుకుంటున్నారు?"



"విక్కీగాడిని హిప్నటైజ్ చేసి ఆ వజ్రాలు ఎక్కడున్నాయో చెప్పిస్తాను"

రాంబాబు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

అవును. ఆలా చేస్తే విక్కీగాడు నోరు విప్పే అవకాశముంది ఇంతవరకూ తనకా ఆలోచనే రాలేదే? ఎందుకని?

"ఓ! సూపరైడియా! కానీ హిప్నాటిస్ట్‌ని తీసుకురావాలి కదా?"

"ఇతనే హిప్నాటిజంలో స్పెషలిస్ట్. మీట్ మిస్టర్ చంద్రకాంత్- రచయిత చంద్రకాంత్."

రాంబాబు ఇంకా ఆనందపడిపోయాడు.

"మైగాడ్! రచయిత చంద్రకాంత్ మీరా?"

"ఎస్ డియర్" అన్నాడు భవానీశంకర్ చిరునవ్వుతో.

"ఫెంటాస్టిక్! నేను మీ ఫాన్‌ని చంద్రకాంత్‌గారూ! మీర్రాసిన నవల "హోకస్-ఫోకస్' ఎన్ని వందలసార్లు చదివానో చెప్పలేను. సెన్సేషనల్ నావెల్. అంత అద్భుతమయిన నవల ఎలా రాయగలిగారు?"

"నాకే తెలీదు. సడెన్‌గా పూనకంలాగా వచ్చేసింది. వారం రోజులు చేతిలో పెన్ వదల్లేదు... అంతే.. నవల రడీ.."

"సూపర్బ్" ఒప్పుకున్నాడు రాంబాబు.

"డోంట్ వేస్ట్ మై టైమ్- కమాన్" అరిచాడు కనకారావ్ అసహనంగా.

"ఓకే లెటజ్‌గో."

ముగ్గురూ విక్కీని వుంచిన సెల్‌కి చేరుకున్నారు.

విక్కీ చాలా అశాంతిగా వున్నాడా సమయంలో.

అంతకుముందే అతని లాయర్ వచ్చి చెప్పాడు బెయిల్ మంజూరు కాలేదని.

ఈ పరిస్థితుల్లో ఎలాగోలా జైలు నుంచి తప్పించుకుని పారిపోవటం ఒక్కటే మార్గం.

కానీ అదెలా అనేదే తెలీటం లేదు.

సెల్ లోపలకు రాంబాబుతోపాటు ఓ మీసాలవాడు, మరో మీసాలు లేనివాడూ లోపలకు రావడం చూశాడతను.

"కమాన్ చంద్రకాంత్! కానీ" అరిచాడు కనకారావ్.

భవానీశంకర్‌కి ఇంక తప్పలేదు.

"హలో విక్కీ! నువ్విప్పుడు నా కళ్ళల్లోకే చూస్తున్నావ్.. నా గొంతే వింటున్నావ్.. నేను తప్ప నీకు ఇంకెవరూ కనబడటం లేదు. నా గొంతు తప్ప ఇంకేమీ నీకు వినిపించటం లేదు" అన్నాడు ఎక్కడో చూసిన హిప్నాటిజం ప్రోగ్రాం గుర్తు తెచ్చుకుంటూ-

విక్కీకి ఒక్కసారిగా ఎక్కడలేని ఉత్సాహం పొంగుకొచ్చింది.

అవును తను హిప్నాటిజం సంగతి మర్చేపోయాడు. కిందటిసారి జైల్లో ఉన్నప్పుడు హిప్నాటిజం ద్వారా బ్యాంక్ మేనేజర్‌తో సంతకాలు పెట్టించి, మోసం చేసి లక్షరూపాయల క్యాష్ తీసుకుపోయిన ఓ హిప్నాటిస్ట్ తనకు హిప్నాటిజం నేర్పించాడు.

తనకు అది బ్రహ్మాండంగా వచ్చేసింది.

తోటి ఖైదీ ఒకడివి హిప్నటైజ్ చేసి వాడి ముందున్న అన్నం తను తినేశాడు.

ఆ తర్వాత దానిని మళ్ళీ ప్రయోగించే అవకాశం దొరకలేదు.

ఇన్నాళ్ళకు ఇప్పుడు దాన్ని ఉపయోగించి జైలు నుంచి తప్పించుకు పారి పోయేందుకు బ్రహ్మాండమయిన ఛాన్స్ యిది.

"నీ కళ్ళు మూసుకుపోతున్నాయ్..."

నువ్వు ప్రశాంతమయిన లోకంలోకి వెళ్ళిపోతున్నావ్...

విచిత్రమయిన నిద్రావస్థ నిన్ను ఆవహిస్తోంది..." అంటున్నాడు భవానీశంకర్.

వెంటనే విక్కీ అందుకున్నాడు.

"మీ అందరి కళ్ళూ నా కళ్ళల్లోకే చూస్తున్నాయ్.

మీ కళ్ళు మూసుకుపోతున్నాయ్.

మీరంతా గాఢ నిద్రావస్థలో కెళ్ళిపోతున్నారు. మీ పరసరాలన్నీ మర్చిపోతున్నారు.

నిద్రపోతున్నారు....

నా గొంతు ఒక్కటే మీకు వినబడుతోంది. నిద్రలోకెళ్ళిపోయారు- నిద్రపోతున్నారు..." అన్నాడు విక్కీ.

ముగ్గురూ విక్కీ వైపు ఆశ్చర్యంగా చూశారు గానీ, కొద్ది క్షణాల్లోనే వాళ్ళకి మత్తుగా కళ్ళు మూసుకు పోసాగినయ్.

విక్కీ అమాంతం లేచి రాంబాబు డ్రస్ తను వేసుకుని, తన డ్రస్ రాంబాబుకి వేసి ఠీవిగా నడుస్తూ బయటికెళ్ళిపోయాడు.

భవానీశంకర్ నిద్ర మత్తులో కళ్ళు నులుముకుంటూ అతని వెనకే బయటికొచ్చేశాడు.

❁ ❁ ❁

రాంబాబు గావుకేకలేస్తున్నాడు.

"నా డ్రస్ ఎవడేసుకుంటే వాడికి సెల్యూట్ కొట్టేస్తారా? ఎవడు కాకీ బట్టలేసుకుంటే వాడికి జై కొట్టేస్తారా? మీ అందరినీ సస్పెండ్ చేస్తున్నాను.

వజ్రాల ఆచూకీ చెప్పకుండానే వాడు జైలు నుంచి పారిపోయాడంటే ఖచ్చితంగా



వజ్రాలతో సిటీ వదిలిపోడానికే. కమాన్ పరుగెత్తండి. రైల్వేస్టేషన్‌లు, బస్‌డిపోలూ, ఎయిర్‌పోర్ట్‌లూ అన్నీ కాపలా కాయండి. వాడు రకరకాలు వేషాల్లో వుండచ్చు. అందరినీ జాగ్రత్తగా చెక్ చేయండి. ఏ పరిస్థితుల్లోనూ వాడిని వదలకూడదు" పిచ్చెక్కినట్లు జుట్టు పీక్కున్నాడతను.

పోలీసులంతా వ్యాన్‌లో వెళ్ళిపోయారు.

రాంబాబు దిగాలుపడి కూర్చున్నాడు.

నోటి వరకూ వచ్చిన భోజనాన్ని ఎవరో విసిరికొట్టినట్లు అనిపించింది.

ఇంక ఆ విక్కీ గాడిని పట్టుకోవడం, వజ్రాలు సంపాదించటం తన వల్ల కాని పని.

అతనికి సడెన్‌గా రచయిత చంద్రకాంత్ మీద కోపం వచ్చింది.

ఇదంతా అతనివల్లే జరిగింది.

"పెద్ద పోటుగాడిలాగా హిప్నాటిజం చేస్తానని వచ్చాడు. కానీ వాడికి యింత కూడా రాదు.

అందుకే ఆఫ్టరాల్ ఓ దొంగ చేతిలో హిప్నటైజ్ అయిపోయి పారిపోయాడు.

రాంబాబుకి 'హోకస్ ఫోకస్' నవల మీద విరక్తి కలిగింది. అది చాలా గొప్ప నవల అని, అది రాసినవాడు యింకా చాలా గొప్పవాడనీ అతను స్వయంగా ఓ హిప్నాటిజం స్పెషలిస్ట్ అనీ నమ్మాడు.

ఆ నమ్మటం వల్ల తను ఫూలయిపోయాడు.

అప్పుడే నిద్రలేచినట్లు కళ్ళు మూసుకుపోతూంటే అతి కష్టం మీద తెరచుకుని రాంబాబు దగ్గరకొచ్చాడు కల్నల్.

"రివాల్వర్ ఏది? నా రివాల్వర్ తీసుకున్నారా?" అడిగాడు.

"మీ రివాల్వర్ సంగతి నాకేం తెలుసు...?" చిరాగ్గా అన్నాడు రాంబాబు.

"డోంట్ ప్లే గేమ్స్.... నా రివాల్వర్ నాకివ్వు ముందు."

"నన్నడుగితే ఏం లాభం? ఆ విక్కీ గాడే ఎత్తుకుపోయుంటాడు. మీరు తీసుకొచ్చిన ఆ రచయిత చంద్రకాంత్‌గాడు వట్టి ఇడియట్! హిప్నటిజం అంటే ఏమిటో తెలీని వెధవ అవటం వలన అందరం ఫూలయిపోయాం"

"అంటే?"

"ఆ విక్కీగాడికి నిజంగా హిప్నటిజం తెలిసి వుంటుంది. అందుకే చంద్రకాంత్ వాడిని హిప్నటైజ్ చేయబోతే వాడే మనల్ని ముగ్గురినీ చేసి పారిపోయాడు."

"ఓ... వెరీ గ్రిమ్ సిట్యుయేషన్... అంటే ఇప్పుడిక నా వజ్రాలు దొరకటం ఇంపాజిబుల్ అన్నమాట. అంతేనా?"

"టెంపరరీగా అంతే సార్!"

"అయితే ముందు వాడిని పట్టుకుంటేగానీ మన ప్రాబ్లమ్స్ తీరవు. ఓకే వాడి పని నేను పడతాను..." అన్నాడు కనకారావ్ బయటికి నడుస్తూ.

"ఎవడి పని?" అనుమానంగా అడిగాడు రాంబాబు.

"వాడే.. ఆ చంద్రకాంత్‌గాడి పని. వాడు రాసిన "హోకస్ ఫోకస్' అనే నవల అంతా బోగస్ అని పబ్లిక్‌లో డిక్లేర్ చేసి మళ్ళీ జన్మలో వాడింక నవలలు రాయకుండా ఇన్సల్ట్ చేసేస్తాను."

కనకారావ్ వెళ్ళిన అయిదు నిమిషాలకే ఒరిజినల్ రైటర్ చంద్రకాంత్ హడావుడిగా ఇన్‌స్పెక్టర్ రాంబాబు దగ్గరకొచ్చాడు.

ఆ టైమ్‌లో జైల్లోని ఖైదీ విక్కీ పారిపోయినందుకు అతడిని తెగ చివాట్లేస్తున్నాడు ఎస్పీ.

"గుడ్ మాణింగ్" అన్నాడు చంద్రకాంత్ కుర్చీలో కూర్చుంటూ.

"ఎస్. మీరెవరు?" చిరాగ్గా అన్నాడు రాంబాబు.

"నా పేరు చంద్రకాంతండీ! రచయిత చంద్రకాంత్‌ని సార్!"

రాంబాబు ఉలిక్కిపడ్డాడు.

ఆ పేరే అతనికి రక్తం సలసలా కాగేట్లు చేసింది.

"ఓ- రచయిత చంద్రకాంత్ నువ్వేనా?"

"అవున్సార్" చిరునవ్వుతో గర్వంగా అన్నాడు చంద్రకాంత్.

"ఏరా నేనిక్కడ చెవిలో పూలు, కంటికి కర్టెన్లూ వేసుకూర్చున్నానుకున్నావా? ఏయ్ త్రినాట్ సిక్స్! వీడిని తీసుకెళ్ళి లోపల వేసేయ్‌రా."

వెంటనే ఇద్దరు కానిస్టేబుల్స్ తీసుకొచ్చి అతడిని ఈడ్చుకెళ్ళి లాకప్‌లో పడేశారు.

"అదేమిటి సార్? నేను కంప్లైంట్ ఇవ్వడానికొచ్చా"

అతని కేకలతో వళ్ళు మండిపోయింది రాంబాబుకి.

లాఠీ తీసుకుని నడుమ మీద కొట్టాడు.

"ఏరా! నా మీద కంప్లైంట్ యిస్తావా? నువ్వు ప్రాణాలతో బయటికెళితే గదరా కంప్లైంట్ యిచ్చేది?"

చంద్రకాంత్ నడుము పట్టుకుని నేల మీద కూలబడిపోయాడు.

"అమ్మో... నా నడుము విరిగింది. బుద్ధి తక్కువై అన్నాను కంప్లయింట్ యిస్తానని. చెంపలేసుకుంటున్నాను. నన్నొదిలేయండి సార్!"

"పైగా రచయిత చంద్రకాంత్ నంటావా....? చంద్రకాంత్ ఎవడో నాకు



తెలీదనుకుంటున్నావా... ? ఇప్పుడే కదరా వాడు యిక్కడినుంచి వెళ్ళింది."

"నిజంగా సార్! నేనే చంద్రకాంత్‌ని. ప్రామిస్"

"అలాగా... హోకస్ ఫోకస్ నవల రాసింది నువ్వేనా?"

"నేనేసార్!"

మళ్ళీ లాఠీ వీపు మీద పడింది.

"నా కొడకా... రచయిత చంద్రకాంత్‌వి నువ్వా?"

చంద్రకాంత్ బెదిరిపోయాడు.

"నేనే సార్! బై గాడ్ చెపుతున్నాను. హోకస్ ఫోకస్ నవల మీద ఒట్టు" ఏడుపు మొహంతో అన్నాడు.

రాంబాబుకి అనుమానం వచ్చింది.

వీడు రచయిత చంద్రకాంతయితే ఇందాక వచ్చిన వాడెవడు మరి? ఇదేదో మిస్టరీ లాగుందే!

"ఏయ్! నువ్వు రచయిత చంద్రకాంత్‌వా?"

"అవున్సార్!"

"నిజం చెప్పు-"

"అవున్సార్- బై గాడ్!"

"ఇప్పుడిక్కడ కెందుకొచ్చావు?"

"ఇంకో మహా మాయగాడెవడో తనే రచయిత చంద్రకాంత్‌నని ఓ ఇంట్లో జొరబడి ఆ ఇంటి వాళ్ళందరినీ మోసం చేస్తున్నాడు సార్."

"వాడిప్పుడెక్కడున్నాడు?"

"ఆ ఇంట్లోనే వున్నాడు సార్. మీరు నాతో వస్తే చూపిస్తాను."

"ఒరేయ్! తీరా అక్కడికెళ్ళాక నీ మాటల్లో ఏమైనా తేడా వచ్చిందనుకో! తుక్కు లేపేస్తా జాగ్రత్త."

"ఏమీ తేడా రాద్సార్! బై గాడ్."

ఇద్దరూ జీప్‌లో బయల్దేరారు.

° ° °

వాళ్ళటు వెళ్ళగానే రౌడీ పానకాలు పోలీస్‌స్టేషన్ కొచ్చాడు ఫుల్‌గా మందుకొట్టేసి.

హెడ్‌కానిస్టేబుల్ అలవాటు ప్రకారం అతనికి నమస్కారం కొట్టాడు.

"ఏమిటి సార్! ఇలా వచ్చారు?"

"ఆ నా కొడుకు నా పెళ్ళాన్ని లేపుకెళ్ళిపోయాడు."

హెడ్ అదిరిపడ్డాడు.

"మీ పెళ్ళాన్ని లేపుకెళ్ళిపోయాడా?"

"అవును..."

"మీలాంటోళ్ళు అలాంటి టీవీ గ్యాంగ్‌ని చేసుకుంటే ఎంతకాలం ఉంటారు?"

"అంటే నీ ఉద్దేశ్యం"

"ఇంతకూ ఎవడు వాడు?"

"ఆడి పేరు షంద్రకాంత్ అంట. రచయిత షంద్రకాంత్."

"ఇద్దర్లో ఏ చంద్రకాంత్ సార్?"

పానకాలుకి నిషా సగం దిగిపోయింది.

"ఇద్దరు షంద్రకాంత్‌లున్నారా?"

"అవున్సార్! ఇప్పుడే రెండో వాడొచ్చి, మొదటివాడు డూప్లికేట్ అన్జెప్పి ఇన్స్‌పెక్టర్ గారిని తీసుకెళ్ళాడు అరెస్ట్ చేయించటానికి."

పానకాలు కూలబడిపోయాడు నీరసంగా.

"నా కొడుకులు- ఇద్దరినీ ఏసేస్తా- కైమా చేసేస్తా. ఎక్కడున్నారో చెప్పు..."

"అడ్రస్ తెలీదు సార్! ఇన్స్‌పెక్టర్‌గారొచ్చే వరకూ కూర్చోండి- రాగానే కనుక్కుందాం."

"ఆల్ రైట్! రానీ, వచ్చాక అడ్రస్ కనుక్కుని అప్పుడే మర్డర్ చేస్తా- తొందరేముంది?"

వాళ్ళు మాట్లాడుతూండగానే అష్టలక్ష్మి పరుగుతో పోలీస్‌స్టేషన్లో కొచ్చేసింది.

"సార్! ఒకడెవడో నా మొగుడు కాకపోయిన తనే నా మొగుడు చంద్రకాంత్‌నని నన్ను రేప్ చేయడానికి ట్రై చేశాడు సార్" హెడ్‌తో చెప్పిందామె.

పానకాలు ఉలిక్కిపడ్డాడు.

"ఇదిగో ఆ చంద్రకాంత్ పెళ్ళానివి నువ్వా?"

"అవును నువ్వెవడివి?" చిరాగ్గా అడిగింది అష్టలక్ష్మి.

"నీ మొగుడి పాలిట యముడిని- వాడి అంతు తేలుస్తా. కైమా చేస్తా- ఎక్కడ దాచావు వాడినీ, నా పెళ్ళాన్నీ?"

"నీ పెళ్ళాన్నా?"

"అవును. నీ మొగుడు నా పెళ్లాన్ని ఎత్తుకుపోయాడు."

అష్టలక్ష్మికి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

"నేనుకుంటూనే వున్నా- ఆ మెయిలిచ్చింది దేవాంతకురాలని- అది నీ



పెళ్ళామా?కానీ అక్కడింకోడెవడో తన పెళ్ళామని అంటున్నాడుగా?"

"అదంతా నాకు తెలీదు. వాళ్ళిద్దర్ని ఎక్కడ దాచావో చెప్పు ముందు"

"చంద్రకాంత్ ఎక్కడ చచ్చాడో తెలీదుగానీ, నీ పెళ్ళాం ఎక్కడుందో మాత్రం తెలుసు."

"ఎక్కడుంది?" ఆత్రుతగా అడిగాడు పానకాలు.

"ఇల్లు తెలుసు! ఆ ఏరియా పేరేంటో తెలీదు"

"అయితే ఆ ఇల్లు చూపించు పద. ఇద్దరినీ కైమా కొడతాను."

"ముందు నీ పెళ్ళాన్ని కైమా చెయ్యి- ఇల్లు చూపిస్తా."

ఇద్దరూ ఆటోలో బయల్దేరారు.

• • •

రాంబాబు, రచయిత చంద్రకాంత్ ఇంట్లోకొస్తూంటే గోపాల్రావ్, భవానీశంకర్ చూసి ఆశ్చర్యపోయారు.

"ఒరే భవానీ! ఆ రాస్కెల్ ఇన్స్‌పెక్టర్‌ని తీసుకొచ్చినట్లున్నాడు" అన్నాడు నెమ్మదిగా.

"అవును బ్రదర్! బహుశా మనం ఇందాక ఇచ్చిన కరాటే కిక్‌లు మర్చిపోయినట్లున్నాడు."

"ఇప్పుడేం చేద్దాం?"

"వంటింట్లో కూరగాయలు కోసే కత్తి ఒకటి వాడు చూస్తూండగా నాకు తెచ్చివ్వు."

"ఎందుకు?"

"వాడిని టెర్రరైజ్‌చేస్తేగానీ దారికి రాడు."

గోపాల్రావ్ లోపలికెళ్ళాడు.

"హలో ఇన్‌స్పెక్టర్ రాంబాబూ! ఇంత అర్జంటుగా మళ్ళీ ప్రత్యక్షమయ్యారేమిటి బ్రదర్?" అడిగాడు భవానీ.

"మిస్టర్! నువ్వెవరివి?" సీరియస్‌గా అడిగాడు రాంబాబు.

"నేనెవర్నా? చాలా వింత ప్రశ్న బ్రదర్. నేనెవరో బాగా తెలిసి కూడా ఆ ప్రశ్న వేస్తున్నావంటే- ఏదో పెద్ద విశేషం వుండి వుంటుంది. ఏమిటా విశేషం మిత్రమా- చెప్పేసెయ్ ఫర్లేదు."

"నేనడిగిందానికి తిన్నగా సమాధానం చెప్పు- హూ ఆర్ యూ?"

"రచయిత చంద్రకాంత్‌ని బ్రదర్. 'హోకస్ ఫోకస్' అనే సెన్సేషనల్ నవల రాసిన సెన్సేషనల్ రైటర్‌ని. ఇంతకుముందే జైల్లో నా అద్భుతమయిన హిప్నాటిజం ప్రదర్శనను తిలకించావు ఫ్రెండ్."

"అబద్ధం సార్! రచయిత చంద్రకాంత్‌ని నేను" ఆవేశంగా అన్నాడు చంద్రకాంత్.

సరిగ్గా అప్పుడే గోపాల్రావ్ కత్తి తీసుకొచ్చి భవానీశంకరానికి అందించాడు.

ఆ కత్తిని చూస్తూనే చంద్రకాంత్‌కి భయం పట్టుకుంది.

గోపాల్రావ్ మరో చాకు తీసుకుని యాపిల్ పండు కోస్తూ చంద్రకాంత్ వెనకకు వచ్చి నిలబడ్డాడు.

చంద్రకాంత్ గుండెలవిసిపోయినయ్.

వీళ్ళిద్దరూ కలిసి తనను మర్డర్ చేసేట్లే వున్నారు.

"ఇప్పుడేమంటావు మిస్టర్....?" భవానీ వైపు తీవ్రంగా చూస్తూ అన్నాడు రాంబాబు.

"వెరీ సింపుల్ బ్రదర్. దీని 'ఎడోర్ సైకాలజీ' అంటారు ఇంగ్లీషులో."

రాంబాబు తికమక పడ్డాడు.

"ఎడోర్ సైకాలజీయా? అంటే ఏమిటి?"

"అదో భయంకరమయిన సైకాలజీ బ్రదర్. మనం విపరీతంగా అభిమానించే వ్యక్తి గురించే ఎప్పుడూ ఆలోచిస్తూ ఇంకా ఇంకా తెగ అభిమానిస్తూ కొంతకాలం తర్వాత తనే తన అభిమాన హీరో అనిపించి అలాగే ప్రవర్తించే అవకాశం వుందని సైకాలజికల్ సైన్స్ చెప్తోంది... దాన్నే 'ఎడోర్ సైకాలజీ జబ్బు' అంటారు" చిరునవ్వుతో అబద్ధమాడేశాడు భవానీ.

"అంటే?" అతని మాటలు సరిగ్గా అర్థం కాలేదు రాంబాబుకి.

"అంటే ఈ పక్షి ఎవరో నన్ను తనభిమాన రచయితగా తెగ అభిమానించి, అభిమానించి చివరకు తనే రచయిత చంద్రకాంత్ ననుకునే స్టేజీ కొచ్చాడు. కొంతకాలం ఇలాగే వుంటుంది జబ్బు. తర్వాత మళ్ళీ నార్మల్ అయిపోతాడు. మనమేం వర్రీ అవనక్కర్లేదు."

"అవును. ఇలాంటి కేస్‌లు నేను కూడా చూశాను. మా ఫ్రెండ్ ఒకడు చిరంజీవిని తెగ అభిమానించి, అభిమానించి ఇప్పుడు నేనే చిరంజీవినని దేశమంతా తిరుగుతున్నాడు" అన్నాడు గోపాల్రావ్ సపోర్ట్‌చేస్తూ.

"అంతా అబద్ధం. నేనే చంద్రకాంత్ సార్! కావాలంటే మా బాస్ దగ్గర కెళ్దాం పదండి" అన్నాడు చంద్రకాంత్ ఉక్రోషంగా.

"షటప్! నువ్వెవడివో ఎంక్వయిరీ చేసుకుంటూ తిరగటమే నా డ్యూటీ అనుకున్నావా? తీసుకెళ్ళి లాకప్‌లో పడేస్తే అప్పుడే తెలుస్తుంది నువ్వెవడివో" కోపంగా అన్నాడు రాంబాబు.

అప్పుడే ఆటో దిగి లోపలికొచ్చారు పానకాలు, అష్టలక్ష్మి.

పానకాల్ని చూడగానే చంద్రకాంత్ పై ప్రాణాలు పైనే పోయాయి. ఒక్క దూకు



దూకి బయటకు పరుగెత్తేలోగా పానకాలు అమాంతం అతని కాలరు పట్టుకుని ఆపేశాడు.

"ఏరా- ఏది నా పెళ్ళాం" అన్నాడు కసిగా.

"నాకు తెలీదు సార్! బై గాడ్ చెప్తున్నాను."

"కైమా చేస్తా నా కొడకా- చెప్పు ఎక్కడ దాచావ్ దాన్ని?"

రాంబాబుకి పిచ్చెక్కి పోతున్నట్లుంది ఆ విశేషాలు చూస్తుంటే.

"ఏయ్ ఎవర్రా నువ్వు? నిన్నెక్కడో చూసినట్లుందే" అన్నాడు పానకాల్ని చూస్తూ.

పానకాలు అతనికి సెల్యూట్ కొట్టాడు.

"నేనే సార్! పానకాల్ని. నరసింహం మర్డర్ కేస్‌లో మీరు నన్ను అరెస్ట్ చేశారు కదండీ! తర్వాత కోర్టు నేను నిర్దోషినని వదిలేసింది."

"అదీ సంగతి. అలా చెప్పు- మనం ఎవడినీ మర్చిపోము. అవునూ వాడి చొక్కా పట్టుకుంటున్నావు ఏమిటి సంగతి?"

"వీడు మా ఆవిడను కిడ్నాప్ చేశాడు సార్!"

"ముందు వాడి చొక్కా వదులు. పోలీసులుండగా నీకేం పని చొక్కాలు పట్టుకోవటం? అది మా డ్యూటీ"

"వీళ్ళావిడను ఎత్తుకుపోయింది నేను కాద్సార్! మా బాస్ నీలకంఠం" గాబరాగా అన్నాడు చంద్రకాంత్.

"మీ బాసా? అంటే ఆ తుగ్లక్ చానెల్లో క్రియేటివ్ హెడ్‌గాడేనా?" అడిగాడు పానకాలు అనుమానంగా.

"అవున్సార్!"

"అయితే ఇప్పుడే వాడి అంతు తేలుస్తా. వస్తాను ఇన్‌స్పెక్టర్ గారూ! మనం మనం తర్వాత చూసుకుందాం" అనేసి బయటకు పరుగెత్తాడతను.

"సార్! ఈమె నా భార్య అష్టలక్ష్మి. కావాలంటే నా భార్య నడగండి- మా ఇద్దరిలో ఒరిజినల్ చంద్రకాంత్ ఎవరో?" అన్నాడు చంద్రకాంత్ ఆనందంగా.

భవానీశంకర్, గోపాల్రావ్ కంగారుపడ్డారు.

పూజ, సీత, కనకారావ్ అంతా సస్పెన్స్‌తో చూస్తున్నారు.

అష్టలక్ష్మికి మాత్రం తన భర్త చంద్రకాంత్‌ని చూస్తుంటే వళ్ళు మండిపోతోంది. చేతనయితే అతన్ని మర్డర్ చేయాలని వుందామెకి.

ఆ పానకాలు గాడి పెళ్ళాన్ని అతనే ఎత్తుకుపోయాడని ఎందుకో బలంగా అనిపిస్తోంది. వాడికి దానికీ కూడా అక్రమ సంబంధం ఉండే ఉంటుంది. అసలు వీడే దాన్ని ఎత్తుకుపోయి ఎక్కడో దాచిఉంటాడు ఇలాంటి వెధవతో నేను కాపురం చేయాలా?

వాడి దారిన వాడిని వదిలి తన దారి తను చూసుకోవటం మంచిది.

రాంబాబు అష్టలక్ష్మి వైపు చూశాడు.

"నువ్వు వాడి భార్యవని అతను చెప్పేది నిజమేనా? రచయిత చంద్రకాంత్ అంటే ఇతనేనా?"

"ఛీ– వీడెవడో నాకు తెలీదసలు. ఇంకోసారి నన్ను పెళ్ళామని అంటే చెప్పు తీసుక్కొడతా" అంది చెప్పు చేతిలోకి తీసుకుంటూ.

చంద్రకాంత్ నెత్తి కొట్టుకున్నాడు.

"ఏయ్– అన్యాయమే! నా మీద కోపం వుంటే మాత్రం నేను నీ మొగుడే కాదంటావా?"

ఆమె చెప్పు అతని చెంపమీద పేలిపోయింది.

రాంబాబు ఆమెను వెనక్కు లాగాడు.

"ఏయ్– పోలీసులిక్కడుండగా నువ్వెందుకు చేస్తున్నావా పని? ఫో ఇక్కడినుంచి."

అష్టలక్ష్మి ఏడుస్తూ వెళ్ళిపోతూంటే భవానీశంకర్ ఆమెకు అడ్డు వచ్చాడు– అష్టలక్ష్మీ! నామాట విను– నేను నీ సుఖానికి అడ్డు రాను. నువ్వు మీ బావనే పెళ్ళి చేసుకుని సెటిలయిపో! నీకు పెళ్ళే కాలేదనుకో!" అన్నాడు త్యాగమూర్తిలాగా రాంబాబుకి అతని మాటలేం అర్థం కాలేదు. చంద్రకాంత్ వైపు కోపంగా చూశాడు.

చంద్రకాంత్ భవానీశంకర్ మాటాలకు అదిరిపడ్డాడు– అష్టలక్ష్మికి బావొకడున్నాడా?

అష్టలక్ష్మి కన్నీరు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది.

"ఏరా– ఇప్పుడేమంటావ్?" నిన్ను వారం రోజులు లాకప్‌లో వేసి తోమితే గానీ నీ హిస్టరీ బయటపడదురా."

"ఆ అవకాశం కోసమే చూస్తున్న భవానీశంకర్ అమాంతం చంద్రకాంత్ పొట్టలో బాక్సింగ్ పంచ్ ఇచ్చాడు.

"ఏరా– నువ్వు చంద్రకాంత్‌వా?"

"కాదు బాబోయ్– కాదు– నన్నొదిలేయండి."

"వదలకండి– పొద్దున్న కూడా వచ్చి రైటర్ చంద్రకాంత్‌నని నా డాటర్‌తో మిస్ బిహేవ్ చేశాడు" అన్నాడు కనకారావ్.

గోపాల్రావ్ మరో పోటు పొడిచాడు చంద్రకాంత్‌ని.

"చెప్పరా– నిజం చెప్పు? ఎవర్నువ్వు? ఇన్‌స్పెక్టర్‌గారికి నిజం చెప్తే వదిలేస్తారు. లేకపోతే లాకప్‌లో వేసి బోన్స్‌ని పౌడర్ చేసేస్తారు."



"నిజమే చెపుతున్నా సార్! నేను చంద్రకాంత్‌ని కాదు" ఏడుపు గొంతుతో అన్నాడు.

"కాకపోతే నువ్వెవరు మరి" లాఠీతో ఒకటి వేస్తూ అడిగాడు రాంబాబు.

"నేనెవరయినా అవుతాను గానీ చంద్రకాంత్‌ని మాత్రం కాద్సార్! నన్నొదిలేయండి సార్! బుద్ధి గడ్డి తిని అబద్ధం చెప్పాను."

అతనిని వీధివరకూ తీసుకెళ్ళి బూటుకాలితో ఒక్క తన్ను తన్ని జీప్ ఎక్కాడు రాంబాబు.

చంద్రకాంత్ కిందపడి లేచి బులెట్‌లా దూసుకుపోయాడు రోడ్ మీద జనంలోకి.

"సారీ మిస్టర్ చంద్రకాంత్! వాడి మాటలు విని మీకు ట్రబుల్ ఇచ్చాను."

"దట్సాల్ రైట్ ఇన్‌స్పెక్టర్! తప్పులు పోలీసులు చేయకపోతే ఎవరు చేస్తారు. అది వాళ్ళ జన్మహక్కు? టేకిట్ ఈజీ"

"అయ్ ఆల్వేస్ టేకిట్ ఈజీ"

"పోలీస్ స్పిరిట్ అంటే అది."

"బై ది బై– వాడికున్న జబ్బు పేరేంటన్నారు?"

"ఎడోర్ సైకాలజీ."

"ఎడోర్ సైకాలజీ– థాంక్యూ కర్నల్! వస్తాను"

అతను వెళ్లిపోయాడు.

భవానీశంకర్ రిలాక్సవుతుంటే పూజ హడావుడిగా గదిలో కొచ్చింది.

"చంద్రకాంత్! అష్టలక్ష్మిని ఇంకో పెళ్ళి చేసుకోమని ఎంతో విశాల హృదయంతో మీరు చెప్పే మాటలు నన్ను కదల్చి వేసినయ్. మీరు రాసిన ఓ నవల్లో కూడా హీరో అచ్చం మీ అంత ఉదాత్తంగా ప్రవర్తించటం నాకు గుర్తు కొచ్చింది. నేను మిమ్మల్నే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నానను. మా అక్కా, బావా, మా మమ్మీ, డాడీ వప్పుకోకపోయినా సరే! నేను మిమ్మల్నే పెళ్ళి చేసుకుంటాను."

భవానీశంకర్ మరింత త్యాగపురుషుడయిపోయాడు.

"థాంక్యూ పూజా! కానీ నీలాంటి ధనవంతురాలు నాలాంటి మామూలు రచయితను చేసుకుని కష్టాలు పడటం నేను భరించలేను."

"అవి కష్టాలని నేననుకోను చంద్రకాంత్! ప్రేమసోపానాలనుకుంటాను".

"ప్రేమ సోపానాలా? అంటే ఏమిటి?"

"అదేంటి చంద్రకాంత్! నీ నవల్లో నువ్వే రాశావుగా ప్రేమసోపానాలని."

"ఆ! అదా– అవును! ప్రేమసోపానాలు చాలా బాగుంటాయి. రెడ్ కలర్ సోఫాలు"

"అయితే మన పెళ్ళికి వప్పుకున్నట్లేనా చంద్రకాంత్?"

"ఆనందంగా వప్పుకుంటున్నాను పూజా! ఇది నేను పూర్వజన్మలో చేసుకున్న

అదృష్టం."

'ఏది అదృష్టం?"

"ఇదే! ముందు నాలాంటి మహా వ్యక్తికి అష్టలక్ష్మిలాంటి భార్యను అంటగట్టినా తర్వాత దేవుడు తన తప్పు తెలుసుకుని నీలాంటి సోపానాల అమ్మాయిని నాకివ్వటం."

"చంద్రకాంత్– ఐ లవ్– యూ!"

"పూజా– ఐ టూ లవ్ యూ!"

పూజ అతని కౌగిట్లో కొచ్చేసింది.

"చంద్రకాంత్!"

"ఊ!"

"ప్లీజ్ కిస్ మీ."

"థాంక్యూ పూజా. ఇటీజే ప్రివిలేజ్"

ఆమెను ముద్దు పెట్టుకుంటూంటే సీత వచ్చి చూసి వులిక్కిపడింది.

"పూజా! ఏమిటిది?" అంది కోపంగా.

"మేమిద్దరం పెళ్ళి చేసుకోబోతున్నాం అక్కా ఈ ప్రపంచమంతా ఏకమయినా సరే ఎదిరిస్తాం."

"ప్రపంచానికేం పనీపాటా లేదనుకున్నావా మీలాంటి వాళ్ళ ప్రేమలను ఎదిరించటం తప్పు! పిచ్చి సినిమా డైలాగులు మాట్లాడకు. డాడీకి తెలిస్తే యిద్దర్నీ కాల్చిపారేస్తారు.'

"మీరు కనికరిస్తే ఆ మెంటల్ గాడి రివాల్వర్ బులెట్‌కి దొరకనంత దూరం క్షణాల్లో పారిపోతాం సిస్టరిన్లాజీ"

"అవును సీతా! తథాస్తు దేవతలే వాడి రూపంలో వచ్చారు."

భజన్‌రావ్ హడావుడిగా వచ్చాడు లోపలకు.

"సార్! మీ కోసం ఎవరో వచ్చారు" అన్నాడు గోపాల్రావ్‌కి కన్నుగీటుతూ.

గోపాల్రావ్ అదిరిపడ్డాడు. గుండె వేగంగా కొట్టుకుంది.

"ఎవరు? మా ఆఫీస్ వాళ్ళేనా" గాబరాగా అడిగాడు.

"అవున్సార్! ఉదయం వచ్చిన ఆఫీస్ వాళ్ళలాగానే వున్నారు. కాకపోతే ఒకళ్ళు ఎక్స్ట్రా."

"ఎక్స్ట్రా?"

"అవున్సార్?"

"వాళ్లూ మా ఆఫీస్ వాళ్ళే అయ్యుంటారు."

"అవున్సార్ అలాగే వున్నారు."



గోపాల్రావ్ బయటకు నడిచాడు వడివడిగా.

సోఫాలో కూర్చుని వున్న విక్కీని, డాకూ రాణినీ చూసేసరికి గోపాల్రావ్ మరింత గాబరా పడ్డాడు. విక్కీని అంతకు ముందెక్కడో చూసినట్లనిపిస్తోందిగానీ ఎక్కడ చూసిందీ గుర్తుకి రావటం లేదు.

"ఏమిటిలా వచ్చావ్? ఇంటికి రావద్దని చెప్పాను కదా! నీతోపాటు ఈ డ్రాకులా ఎవరు?"

"ఏయ్! నన్ను డ్రాకులా గ్రీకులా అన్నావంటే మర్యాదగా వుండదు" కోపంగా అన్నాడు విక్కీ.

"ఇతను మా బావ– మా పెన్ను కోసం వచ్చాం అసలు ఆ పెన్ను ఇతనిదేనన్నమాట."

గోపాల్రావ్‌కి వళ్ళు మండిపోయింది.

"నీ పెన్నెక్కడికీ పోదు. వెంటనే ఇక్కడ్నుంచీ పోండి... రేపు తెచ్చిస్తాను."

"ఏయ్ మిస్టర్! నా పెన్ను నేను తీసుకెళ్ళడానికొచ్చాను. మర్యాదగా యిచ్చెయ్ నా దారిన నేను పోతాను."

గోపాల్రావ్ కంగారుపడి అతని నోరు నొక్కేశాడు కర్చీఫ్‌తో.

"అలా గాడిదలా అరుస్తావెందుకు? మా ఇంట్లో వాళ్ళు వింటే కొంపలు మునిగిపోతాయ్."

"మునిగితే మునగనీ. మాకేం? మా పెన్ మాకిచ్చేవరకూ ఇక్కడి నుండి కదలం" అంది రాణి.

గోపాల్రావ్‌కి పిచ్చెక్కిపోయినట్లయింది.

"పోనీ రెండొందలిస్తాను ఇంకో పెన్ కొనుక్కో డ్రాకులా."

"నాకు లక్షలిచ్చినా తీసుకోను. అదే పెన్ కావాలి." అతని గొంతు కూడా ఎక్కడో విన్నట్లనిపిస్తోంది.

"అది ఆ మిలటరీ కల్నల్ దగ్గరుంది– ఇప్పుడు వాడివ్వడు."

"వాడి బాబు దగ్గరున్నా సరే! మాది మాకివ్వాల్సిందే."

"ఒక్కరోజు టైమివ్వు– అతని దగ్గర్నుంచి దొంగతనం చేసి మీకు ఇచ్చేస్తాను."

"అంతవరకూ ఇక్కడే వుంటాం మేము."

గోపాల్రావ్ ఎగిరిపడ్డాడు.

"మా ఇంట్లో వుంటారా?"

"ఖచ్చితంగా."

"ఎలా వుంటారు? మీరెవరని అడిగితే ఏం చెప్పాలి?"

"నీ తరపు దూరపు బంధువులం అని చెపుదాం" రాణి నవ్వుతూ అంది.

"దూరపు బంధువులా? డ్రాకులా లాంటి వాడికెవరైనా బంధువులుంటారా అసలు?"

"ఉంటారు– శ్రీకాకుళంలో! నీ పెళ్ళికి రాలేకపోయాం. అందుకని ఇప్పుడొచ్చి నాల్రోజులుండి వెళతామని చెప్తాం."

"నో! వద్దు– లేనిపోని గొడవలవుతాయి" భయంగా అన్నాడు గోపాల్రావ్

"వద్దంటేనే ఇంకా ఎక్కువ గొడవలవుతాయ్" అన్నాడు విక్కీ.

భవానీశంకర్ వచ్చాడక్కడికి భజన్‌రావ్‌తోపాటు.

"ఓ.కే. కామ్రేడ్ గోపాల్రావ్! ఈ డ్రాకులాని, ఆ వాంపైర్నీ వుండనిద్దాం. వాళ్ళు మీ దూరపు బంధువులని అందరికీ చెప్పేస్తే గొడవ వదిలిపోతుంది."

"అంతేనంటావా?"

"అంతే – గత్యంతరం లేదు గనుక."

"ఆఫ్‌కోర్స్! నాకూ ఆ గత్యంతరం కంటే ఇంకో గత్యంతరం కనిపించటం లేదు."

"భజన్‌రావ్!" పిలిచాడు భవానీశంకర్.

"ఎస్సార్."

"పరిస్థితులన్నీ గ్రహించావ్ సార్."

"చాలా సూక్ష్మంగా గ్రహించాను సార్."

"వాళ్ళిద్దరూ గోపాల్రావ్‌గారి తరపు దూరపు బంధువులని సిస్టరిన్లాతోను, ఆ మీసాల మిలటరీ అతనితోనూ చెప్పేసేయ్ మరి."

"చెప్పాలంటే మరి... కొంచెం... రిస్కేమో అని ఆలోచిస్తున్నాను సార్."

"ఎంత?" అడిగాడు గోపాల్రావ్.

అతను బుర్ర గోక్కున్నాడు.

"ఏమిటి ఎంత సార్?"

"అదే– రిస్క్ అలవెన్స్ ఎంత?"

"ఓ వందయినా లేపోతే..""

"ఓ.కే! ఇస్తాన్లే."

"అయితే పదండి సార్– ఎనౌన్స్ చేద్దాం."

భజన్‌రావ్ విక్కీ తాలూకూ ఎయిర్‌బ్యాగ్ తీసుకుని హాల్లోకి నడిచాడు.

"మేడమ్! ఆయన తరుపు దూరపు బంధువులంటండీ. ఎవరో... శ్రీకాకుళం నుంచి వచ్చారు" అన్నాడు బ్యాగ్ లోపలి గదిలోకి తీసుకువెళుతూ.



సీత, కనకారావ్ ఆశ్చర్యంగా చూశారు విక్కీవంక, రాణీవంకా.

"హలో చెల్లీ! బాగున్నావా?" అంది రాణి సీతను చూసి నవ్వుతూ.

"మీరు...?"

"నా పేరు రాణి! గోపాల్రావ్ మా మామయ్య."

"మామయ్యనా!" గాబరాగా అన్నాడు గోపాల్రావ్.

"వరసదేముందిలే– ఎడ్జస్ట్‌మెంట్ ముఖ్యం గాని."

"ఈయన మా వారు" అంది రాణి విక్కీని చూపిస్తూ.

"పాపం! వీళ్ళు మన పెళ్ళికి రాలేకపోయారని ఇప్పుడొచ్చారంట సీతా" చెప్పాడు గోపాల్రావ్.

"అవును. రెండ్రోజులుండి వెళదామని... మా మిసెస్ ఒకటే గొడవ."

"కానీ నీకు శ్రీకాకుళంలో బంధువులున్నట్లు ఎప్పుడూ మాకు చెప్పలేదే?" అనుమానంగా అన్నాడు కనకారావు.

"నిజం చెప్పాలంటే మా రెండు కుటుంబాల మధ్య సంబంధాలు సరిగ్గా లేవు. అదీగాక మా బంధుత్వం చాలా దూరం లెండి" అంది రాణి.

"ఎనిమిదొందల కిలోమీటర్లు" అన్నాడు విక్కీ.

"భజన్‌రావ్!" పిలిచాడు గోపాల్రావ్.

"ఎస్సార్!"

"వీళ్ళకి ఆ మేడ మీద రూమ్ చూపించు– విశ్రాంతి తీసుకుంటారు."

"పదండమ్మా! పాపం రాత్రంతా ప్రయాణం చేసి చేసి కంటిమీద కునుకు కూడా లేదేమో."

భజన్‌రావ్‌తోపాటు వాళ్ళిద్దరూ మేడమీదకి వెళ్ళారు.

"నాకు వీళ్ళిద్దరి మీద అనుమానంగా వుంది" అన్నాడు కనకారావ్.

గోపాల్రావ్ గాబరాగా చూశాడు.

"అనుమానమా? ఏం అనుమానం?"

"అదే తెలీటం లేదు. ముఖ్యంగా వాడి ముఖం ఇంతకుముందు ఎప్పుడో, ఎక్కడో బాగా చూసిన గుర్తు."

"కొంతమంది ముఖాలంతే. మనం ఇంతకుముందెప్పుడూ చూడకపోయినా ఎక్కడో చూసినట్లుంటాయి." అన్నాడు గోపాల్రావ్.

"కానీ వీడి మొహమలా అనిపించే బాపతు కాదు– నిజంగానే ఎప్పుడో ఎక్కడో చూశాను."

"ఎప్పుడు ఎక్కడ?" అడిగింది సీత అసహనంగా.

"అదే తెలీటం లేదు. చూస్తూండు 24 గంటల్లో గుర్తు తెచ్చుకుని వాడినెక్కడ చూశానో పట్టేస్తాను"

భవానీశంకర్ వులిక్కిపడ్డాడు.

"అంత మునిగిపోయిందేముంది లెండి- 48 అవర్స్ తీసుకుని తీరిగ్గా గుర్తు తెచ్చుకోవచ్చు"

"నో! 24 అవర్స్- అంతే."

∘ ∘ ∘

రాత్రి ఒంటిగంటవుతోంది.

విక్కీ కళ్ళు ఇల్లంతా పరీక్షగా చూస్తున్నాయి.

తన గదిలో బెడ్ మీద పడుకుని విక్కీని ఎక్కడ చూసిందీ గుర్తు తెచ్చుకోడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు కర్నల్. అంతలోనే నిద్రపట్టేసింది.

అదే టైమ్‌లో మరోబెడ్‌రూమ్‌లో బెడ్ మీద నుండి ఛటుక్కున లేచి కూర్చున్నాడు విక్కీ.

"పద" అన్నాడు రాణితో.

ఇద్దరూ గది తలుపు తెరుచుకుని బయటికొచ్చారు.

అంతా నిశ్శబ్దం.

కర్నల్ కనకారావ్ గాఢ నిద్రలో వున్నాడు.

విక్కీ నెమ్మదిగా అతని గదికి చేరుకున్నాడు.

గది తలుపు మూసేసి వుంది.

"ఇప్పుడెలా?" అంది రాణి.

"బయటి నుంచి బాల్కనీలోకి దూకి గదిలోకెళ్ళాలి."

"బాల్కనీలోకి ఎలా వెళతావు?"

"విండో సెల్ మీద ఎక్కి బాల్కనీలోకి దూకుతాను."

"విండో సెల్ మీదకెలా ఎక్కుతావ్?"

"ఆ చెట్టు మీదెక్కుతాను- నువ్విక్కడే నిలబడు."

అదే సమయంలో తన గదిలో నుంచి మెల్లగా బయటికి వచ్చాడు గోపాల్రావ్.

భవానీశంకర్ గది ముందు నిలబడి విజిల్ వేశాడు.

భవానీశంకర్ చీకట్లో తడుముకుంటూ బయటికొచ్చాడు.



"ఒకవేళ ఆ కర్నల్‌గాడు లేస్తే ఏం చేద్దాం?" అడిగాడు భవానీ శంకర్.

"ఎలాగోలా ఆ పెన్ కాజేసి వాళ్ళకిచ్చి ఇంటినుంచి పంపటం ముఖ్యం. ఎవడడ్డొచ్చినా చావకొట్టేద్దాం" అన్నాడు గోపాల్రావ్.

ఇద్దరూ కర్నల్ గది దగ్గరకు నడిచారు.

"దొంగ రాస్కెల్! తలుపు లోపల బోల్ట్ చేశాడు" కసిగా అన్నాడు గోపాల్రావ్.

"ఏం ఫర్లేదు మిత్రమా! వెనుకనుంచీ బాల్కనీలోకి దూకుదాం."

"అంతేనంటావా?"

"అంతే!"

ఇద్దరూ బయటకు నడిచారు.

ముందు విక్కీ బాల్కనీలోకి దూకాడు.

ఆ చప్పుడుకి అమాంతం లేచి కూర్చున్నాడు కనకారావ్.

ఖచ్చితంగా ఎవడో దొంగతనానికి వచ్చి వుంటాడని అర్థమయింది కల్నల్‌కి.

దొంగలను పట్టుకోవటం అతనికి మొదటినుంచీ హాబీ.

ఇంతవరకూ నూట పధ్నాలుగుమంది దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. ఇంకా ఇద్దర్ని పట్టుకుంటే గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కవచ్చని ఓ ఇన్స్‌పెక్టర్ చెప్పాడు.

ఇంతకుముందు ఆల్జీరియా అనే దేశంలో ఒక కల్నల్ నూట పదిహేనుమంది దొంగలను పట్టుకున్నాడని కూడా చెప్పాడు.

ఆ రోజునుంచీ తను 115వ దొంగకోసం వెయిట్ చేస్తున్నాడు. ఆ తర్వాత ఇంకొక్క దొంగను పట్టుకోవటం కష్టమేమీ కాదు. 116వ వాడ్ని పట్టుకోగానే తను గిన్నిస్‌బుక్ రికార్డ్సుకి అప్లయ్ చేస్తాడు.

బాల్కనీ వైపు కళ్ళు చిట్లించి చూశాడు కనకారావ్.

ఓ నల్లని ఆకారం కిటికీలోంచి లోపలకు దిగుతూ కనిపించింది.

కనకారావ్ శబ్దం కాకుండా టేబుల్ దగ్గరకు నడిచి గోడకానుకుని నిలబడ్డాడు. టేబుల్ మీద రివాల్వర్ని చేతిలోకి తీసుకున్నాడు.

ఊపిరి కూడా పీల్చకుండా చూస్తున్నాడు.

హఠాత్తుగా అతని కళ్ళకు మూడు ఆకారాలు దూరందూరంగా కనిపించేసరికి మతి పోయినట్లయింది.

శరీరమంతా ఆనందంతో పులకరించింది.

ముగ్గురు!

కొంపదీసి ఇవాళే తను గిన్నిస్ రికార్డ్ సాధించటం లేదుకదా?"

ఆహా! ఒకడు- ఇద్దరు కాదు- ముగ్గురు.

ముగ్గురిలో ఒకడు తప్పించుకు పారిపోయినా ఫర్లేదు.

మిగతా ఇద్దర్నీ పట్టుకుంటే చాలు...

గిన్నిస్ రికార్డ్...

అకస్మాత్తుగా మూడు ఆకారాలూ చీకట్లో కలిసిపోయినయ్.

కనకారావ్ కంగారుపడ్డాడు.

ఇంతలోకే ఏమైపోయినయ్ మూడూ?

హఠాత్తుగా గావుకేక వినిపించింది 'ఢఢ్' అన్న శబ్దంతోపాటు.

కనకారావ్ గుండె వేగంగా కొట్టుకుంది.

ఆ శబ్దం వచ్చిన వైపు రివాల్వర్ పేల్చాడు.

"అబ్బా' అని ఇంకో గొంతు అరచింది. దానివెనుకే పరిగెడుతున్న శబ్దాలు...

దూకుతున్న శబ్దాలు..

కనకారావ్ ఇంక ఆలస్యం చేయకుండా ఓ పక్కగా కదులుతున్న నల్లని ఆకారాన్ని అమాంతం రెండు చేతులతో చుట్టేశాడు.

"చోర్... చోర్... చోర్" అని సైరన్‌లా అరవసాగాడు.

గదిలో ఛటుక్కున లైట్లు వెలిగాయి.

తన చేతుల్లో వున్న దొంగను చూసి ఆశ్చర్యపోయాడు కనకారావ్.

తన భార్య రత్నప్రభ!

"నువ్వా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఛీ! సిగ్గులేకపోతే సరి- బంగారంలాంటి దొంగల్ని వదిలి నన్ను పట్టుకున్నారా?"

"దొంగలు పారిపోయరా?"

"ఒకడ్ని నేను పట్టుకోబోతుండా మీరు నన్ను పట్టుకు తగలడ్డారు. దాంతో వాడు తప్పించుకున్నాడు" కోపంగా అందామె.

"నువ్వెందుకు లేచావసలు? రాత్రుళ్ళు నీకు ఛస్తే మెలుకువ రాదుగా?"

భవానీశంకర్, గోపాల్రావ్ పరుగుతో వచ్చి గది తలుపు కొట్టారు.

కనకారావ్ తలుపు తెరిచాడు.

"దొంగలెవరయినా దొరికారా?" ఆత్రుతగా అడిగాడు గోపాల్రావ్.

"కొంచెంలో తప్పించుకు పారిపోయారు దొంగ వెధవలు."

"వెంబడి పడాల్సింది- దొంగ రాస్కెల్! దొరికిపోయేవాళ్ళు."



హఠాత్తుగా కనకారావ్ దృష్టి గోపాల్రావ్ షర్ట్ మీద పడింది.

"ఏమిటి షర్టంతా ఆ మట్టి, బూజూ అంటుకున్నాయి" అడిగింది రత్నప్రభ.

అతను కంగారుపడ్డాడు.

"ఇదా? ఇదీ... సాయంత్రం గార్డెన్‌లో పడ్డాను."

"కాదు బ్రదర్! మనం రివాల్వర్ శబ్దం వినగానే బయటకు పరుగెత్తి దొంగలను ఛేజ్ చేయబోయి చీకట్లో కిందపడ్డాం కదా?"

"ఆ! అదే- నేను 'ఇందాక' అనబోయి 'సాయంత్రం' అన్నాను."

"జస్ట్ స్లిపాఫ్ టంగ్."

"ఎస్! స్లిపాఫ్ టంగ్."

సీత, పూజ హడావుడిగా వచ్చి జాయినయ్యారు.

"ఏం జరిగింది?" అడిగింది సీత.

గోపాల్రావ్ చెప్పటం మొదలుపెట్టాడు.

"ముందు రివాల్వర్ పేలిన శబ్దం వినిపించిందన్నమాట. వెంటనే నేను లేచి బయటకు పరుగెత్తాను."

"రివాల్వర్ శబ్దం వినబడగానే నేను లేచి లైట్ స్విచ్ వేశాను కదా... అప్పుడు మీరు బెడ్ మీద లేరు మరి" ఆశ్చర్యంగా అంది సీత.

"అంటే... అసలేం జరిగిందంటే రివాల్వర్ శబ్దానికి ముందే నాకెందుకో మెలకువ వచ్చిందన్నమాట. ఎందుకొచ్చిందో తెలీదన్నమాట- ఏమిటా అని లేచి తలుపు దగ్గరకెళ్ళే సరికి అప్పుడు రివాల్వర్ శబ్దం వినిపించిదిన్నమాట."

భజన్‌రావ్ హడావుడిగా వచ్చాడు.

"ఏమిటి సార్? ఏం జరిగింది?"

"దొంగలు...""

"ఆ... దొంగలా? మనింటికి దొంగలు రావటమేమిటి? చాలా ఆశ్చర్యంగా వుందే?"

కనకారావ్‌కి భజన్‌రావు మీద వళ్ళు మండింది.

"దొంగలు రావటంలో ఆశ్చర్యమేముందిరా ఇడియట్? ఇది ఆంధ్రప్రదేశ్- ఇక్కడ రోజూ దొంగలు పడకపోతే ఆశ్చర్యపోవాలి."

"ఆ మాట నిజమే సార్! కానీ మనింట్లో పడడానికి ఏ మాత్రం ఛాన్స్ లేదండీ"

"ఎందుకని?"

"మనింట్లో ఏముంటుందండీ? మొత్తం క్రెడిట్ కార్డు మీదేగా గడిచేది. ఇంట్లో ఏ రోజూ ఒక్కపైసా కనబళ్ళేదు నాకు- ఎంత వెతికినా"

"షటప్– నువ్వు నోర్మూసుకో" కోపంగా అంది సీత.

"అవునూ నీ చెవి పక్కన నెత్తిమీద ఆ వాపేమిటి? ఏమైనా దెబ్బ తగిలిందా?" అడిగింది రత్నప్రభ.

"మీ రివాల్వర్ పేలిన శబ్దం విని కంగారుగా లేచి రాబోతుంటే కుర్చీ తగిలి కింద పడ్డాను మేడమ్– గ్రైండర్ కొట్టుకుంది."

మరికాసేపు చర్చలయ్యాక ఎవరి దారిన వాళ్ళు మళ్ళీ పడుకున్నారు.

మర్నాడు అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర సమావేశమైనప్పుడు విక్కీ భుజానికి బ్యాండేజ్ కట్టి ఉండటం టెర్లిన్ షర్టులో నుంచి కనబడింది కనకారావ్‌కి.

"అవునూ– మీ భుజానికి ఆ బ్యాండేజ్ ఏమిటి?" అనుమానంగా అడిగాడు.

విక్కీ కోపంగా చూశాడు.

"ఒక తెలివితక్కువ వెధవ వల్ల దెబ్బ తగిలింది."

"ఎవడా తెలివితక్కువ వెధవ?"

"పేరు తెలీదు. నేను స్కూటర్ మీద వెళుతూంటే వాడు మోటార్ సైకిల్ మీద వచ్చి డాష్ యిచ్చాడు. అంతే! బోన్ క్రాష్ అయిపోయింది."

"ఎప్పుడు జరిగిందది?"

"మూడు రోజుల క్రిందట."

"మరి నిన్న బ్యాండేజ్ కనిపించలేదేం?"

"నిన్నటివరకూ బోన్‌కేమీ అవలేదనుకున్నా గానీ రాత్రి బాగా నొప్పి చేసేసరికి పొద్దున్నే కట్లు కట్టించుకొచ్చేశాను."

"బావకి మరీ తొందరెక్కువ అక్కా– రాత్రి రెండింటి వరకూ తిరుగుతూనే వుంటారు. ఇలాగే యాక్సిడెంట్లు అవుతాయండీ– తిరక్కండీ అని చెప్తే వింటేనా? వినరు" అంది డాకూరాణి.

విక్కీ ఆమె వైపు ప్రేమగా చూశాడు.

కనకారావ్‌కి ఎందుకో విక్కీ మాటలు నమ్మబుద్ధి కావటం లేదు.

రాత్రి తను కాల్చిన రివాల్వర్ బులెట్ ఆ ముగ్గురి దొంగల్లో ఒకడికి ఖచ్చితంగా తగిలిందని తెలుసు. అందుకే వాడు ఆర్తనాదం చేశాడు.

ఒకవేళ రాత్రి దొంగతానికి వచ్చింది విక్కీ కాదు కదా అన్న అనుమానం అతనిని పీడిస్తోంది.

"నిన్నెక్కడో చూశానోయ్– ఎంత ఆలోచించినా గుర్తు రావటం లేదు" అన్నాడు కనకారావ్.



విక్కీ నవ్వాడు.

"చూసే వుంటారు. నేను సేల్స్ ఆఫీసర్‌గా పనిచేశాను కదా. స్టేట్ అంతా తెగ టూర్ చేసేవాడిని. కొంతకాలం ఇంటింటికీ వ్యాన్‌లో తిరిగి కాస్మటిక్స్ అమ్ముతూండేవాళ్ళం."

"ఐసీ– ఇప్పుడేం చేస్తున్నారు?"

"ఇప్పుడు ఉద్యోగం మానేశాను."

"ఎందుకని?"

"చేయాల్సిన అవసరం లేదు. కాలు మీద కాలు వేసుకుని తినేంత ఆస్తి సంపాదించేశాను. ఎప్పుడన్నా ఒకటి రెండిళ్ళు చూసుకుంటేచాలు."

"ఇళ్ళా?"

"అహహ కాదు– బ్యాంకులు."

"బ్యాంకులేమిటి?"

"బ్యాంక్స్‌కి కమీషన్ ఏజెంట్‌నన్న మాట."

"ఓ– ఐసీ!"

భోజనాలు ముగిసినయ్.

సోఫాల్లో కూర్చుని టీపాయ్ మీదున్న మేగజైన్ చేతిలోకి తీసుకుంది సీత.

అది ఆ రోజే వచ్చిన వారపత్రిక.

అందులో వెనుక కవరు మీదున్న ఫోటో చూస్తూనే ఉలిక్కిపడ్డాడు భవానీశంకర్.

అది రచయిత చంద్రకాంత్ ఫోటో.

త్వరలో ప్రారంభం–

ఆంధ్రుల అభిమాన నెంబర్ వన్– టీవీ చానెల్లో రచయిత శ్రీచంద్రకాంత్ కలం నుంచి జాలువారిన మరో డైలీ సీరియల్ "సీబారిక్కూ చమహా"

భవానీశంకర్‌కి చెమటలు పట్టేసినయ్.

అదృష్టవశాత్తూ ఎవరూ ఈ పత్రిక వంక చూడటం లేదు.

సీత కూడా లోపలి పేజీలు తిరగేస్తోంది.

"మిత్రమా!" గోపాల్రావ్‌తో నెమ్మదిగా మాట్లాడాడు భవానీ.

"ఏమిటి?"

"మీ మిసెస్ చేతిలో పత్రిక చూడుము."

"చూచితిని."

"వెనుక కవరు చూడు బ్రదర్."

చూస్తూనే గోపాల్రావ్‌కి వణుకు వచ్చేసినంత పనయింది.

"ఏం చేద్దాం?" అన్నాడు కంగారుగా.

కనకారావ్ తన ఆర్మీ అనుభవాలు విక్కీకీ, డాకూరాణీకీ చెప్తున్నాడు కనుక పత్రిక వైపు చూడటం లేదు.

"దూ యూ నో– బంగ్లాదేశలో మేము పాకిస్తాన్‌కు ఎంటరయేసరికి పాకిస్తాన్ సైన్యం ఆ సిటీ వదిలి పారిపోయారు– మొత్తం సిటీలో జనమంతా కూడా ఇళ్ళు వదిలి వేరే ఊళ్ళకు పారిపోయారు. అప్పుడెవరయినా ఏం చేస్తారు?" అడిగాడు కల్నల్.

"బ్యాంకులన్నీ దోచుకోవచ్చు హాయిగా" అన్నాడు విక్కీ.

"నగలు మాత్రం తక్కువేముంది? తెగ కొట్టేయవచ్చు" అంది డాకూరాణి.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్– ఆ టైమ్‌లో ఎవరైనా ఏం చేస్తారు? భారతదేశ జాతీయ పతాకం ఎగరేశాం" గర్వంగా అన్నాడు.

"ఏం చేద్దాం భవానీ?" మళ్ళీ అడిగాడు గోపాల్రావ్.

"ముందు పుస్తకం లాగేసుకుని చింపేసెయ్."

"ఇంకెమైనా వుందా? నన్ను పిచ్చివాడనుకుంటారు."

"నువ్వు భార్యను మోసం చేసి ఇంకో అమ్మాయితో లిఫ్ట్‌లో గడిపిన వాడివి అనుకోవటం కంటే అది మంచిది కదా?"

"ఆఫ్‌కోర్స్– చాలా మంచిది."

"ఇంక ఆలోచింపకుము"

"అంతేనా?"

"అంతే!"

"కొంచెం భయంగా వుంది– సీత రియాక్షన్ తల్చుకుంటే."

"నీ వెధవ్వేషాలు తెలిశాక కలిగే రియాక్షన్ కంటే ఈ రియాక్షన్ చాలా మంచిది కదా?"

"అవునవును– తెగ మంచిది."

"పూజ ఇంగ్లీష్ వీక్లీ చదవటం ఆపి ఏ క్షణంలోనయినా సీత చదువుతున్న వారపత్రిక వైపు చూడవచ్చు."

"అవును."

గోపాల్రావ్ లేచి నిలబడ్డాడు. 'సీతా!" అని ఇల్లెగిరేట్లు అరిచాడు.

అందరూ అతని వైపు ఆశ్చర్యంగా చూశారు.

సీత నిశ్చేష్టురాలయింది– ఎందుకంత పెద్దగా అరిచాడో తెలీక.



"సీతా!" మళ్ళీ అరిచి అమాంతం ఆమె చేతిలోని వారపత్రిక తీసుకుని ముక్కలు ముక్కలుగా చింపి ఇల్లంతా విసిరేయటం మొదలుపెట్టాడు.

"నీకెన్నిసార్లు చెప్పాను... ఈ పిచ్చి వారపత్రికలు చదవొద్దని. అంతా బూతుమయం. ఇవి ఫ్యామిలీ మేగ్‌జైన్స్ కాదు.. సెక్స్ పత్రికలు. సెక్స్ కథలు, సెక్స్ సమస్యలకు లేడీ డాక్టర్ సెక్సీ సమాధానాలు, సెక్స్ సీరియల్స్, సినిమా తారాల సెక్స్ సంబంధాల టిట్‌బిట్స్, సెక్స్ సినీ తారల ఫోటోలు, హిప్నాటిజం ద్వారా సెక్స్ ఎడిటోరియల్లో సెక్స్, సెక్స్ జోకులు. నో... ఈ పత్రికలు మనింటికి రావటానికి వీల్లేదు... అందుకనే చింపి పారేస్తున్నా" అంటూ ఇంకా కసిగా ఆఖరి కవరు కూడా ముక్కలు చేసి పడేశాడు.

అంతా అతని వైపు స్టన్నయ్ చూస్తూండిపోయారు.

ఆ తరువాత ఏం చేయాలో తెలీలేదు గోపాల్రావ్‌కి.

భవానీశంకర్ వైపు చూశాడు.

భవానీ అతనిని మెచ్చుకోలుగా చూశాడు.

"వెల్‌డన్ బ్రదర్! వండర్‌ఫుల్ గెశ్చర్.. ఎస్.. ఈ నాటి తెలుగు పత్రికల్లో సెక్స్ నగ్నంగా వీరవిహారం చేస్తోంది. అంతా సెక్స్ మేనియాక్స్ అయిపోయారు. మొన్న మా చానెల్ హెడ్ కూడా నన్ను ఓ సెక్స్ సీరియల్ రాయమంటే నేనేం చెప్పాను? 'నో' అన్నాను. నాకు అయిదు లక్షలు ఇచ్చినా సరే– నో నో నో.. నా పాఠకులు కోరే సస్పెన్స్, క్రైమ్ తప్ప ఇంకేం రాయను అని క్రిస్టల్ క్లియర్‌గా చెప్పేశాను. అంచేత నువ్వు చేసింది అద్భుతమయిన త్యాగం. పదిరూపాయల ఖరీదుగల పుస్తకాన్ని ఇంత దూకుడుగా, ఇంత తెగింపుతో చింపి ముక్కలు చేసే వారెవరున్నారీ రోజులలో... ఒకే ఒక్కడు.. గోపాల్రావ్."

సీత అనుమానంగా చూసింది గోపాల్రావ్ వైపు.

"మీకు మైండ్ సరిగ్గా వుందా?"

"మైండా? మైండ్‌కేమయింది?"

"ఒకసారి డాక్టర్‌కి చూపించుకోవటం మంచిదనిపిస్తోందిప్పుడు."

"ఎందుకు డియర్! ఆ పుస్తకం చింపినందుకా? డోంట్‌వర్రీ డియర్! ఎప్పటినుంచో మన వారపత్రికల మీద రగులుకుంటున్న అగ్ని ఇవాళ ఇలా బయటపడింది. నువ్వే చెప్పు డియర్! ఇవన్నీ చెత్త వార పత్రికలు అని నువ్వే కదా అన్నావు?"

"అదే నేనూ చెప్పేది. ఎన్నోసార్లు ఇలాంటి చెత్త కొనుక్కొచ్చి ఇంట్లో పడేయకండి, వాటిని చదవాలంటేనే నాకు ఎలర్జీ అని చెప్పానా?"

"ఓ! అవునవును గుర్తుకొచ్చింది... చాలాసార్లు చెప్పావు. అంచేత నేనిప్పుడు చేసిన పనిలో తప్పులేదుకదా?"

"లేదుగానీ! ఆ పుస్తకాలు వద్దన్నా కొనుక్కొస్తోంది మీరే. ఇవాళ ఈ పుస్తకం కొనుక్కొచ్చింది కూడా మీరే."

అతని ముఖంలో ఆనందం కాస్తా ఎగిరిపోయింది.

ఆ పుస్తకం తనే కొనుక్కొచ్చిన మాట నిజమే–

"నేను కొనుక్కొచ్చానా?" అన్నాడు గాబరాగా.

"అవును"

"నేను కొనుక్కొచ్చానా?"

"ఎస్! నేనూ చూశాను. నీ చేత్తో తెచ్చి ఇక్కడ పడెయ్యటం..." అన్నాడు కనకారావ్ కసిగా.

"మైగాడ్! అయితే నేను వెంటనే సైక్రియాట్రిస్ట్‌కి చూపించుకోవాల్సిందే."

"అవును! ఇలాంటి విషయాల్లో ఆలస్యం తగదని చాలామంది అంటుంటారు. నువ్వే పుస్తకం కొని నువ్వే తగలబెట్టావంటే.. నీకు డెఫినెట్‌గా పిచ్చెక్కినట్లే."

"యూ ఆర్ మిస్టేకెన్ మై డియర్ కెప్టెన్! మీరు గోపాల్రావ్‌ని అర్థం చేసుకోలేకపోయారు" అన్నాడు భవానీ.

"వాడ్డూ యూ మీన్! అది ఖచ్చితంగా పిచ్చే. ఇనీషియల్ స్టేజ్‌లో వుంది" కసిగా అన్నాడు కల్నల్.

"ఇంకో విషయం... ఇంకోసారి నన్ను కెప్టెన్ అన్నావంటే మర్యాదగా వుండదు మిస్టర్ – లాస్ట్ వార్నింగ్ ఇది."

"నో... గోపాల్రావ్‌కి పిచ్చికాదు. అతను మన పురాతన భారతదేశ సాంప్రదాయాల్ని ఫాలో అయ్యాడు అంతే."

"ఏమిటా సాంప్రదాయం?" అడిగింది సీత.

"అదే సిస్టరిన్లా! స్వాతంత్రోద్యమ సమయంలో విదేశీ వస్తు బహిష్కరణ అన్నప్పుడు వాళ్ళేం చేశారు? విదేశీ వస్తువులు కొని నడివీధుల్లో తగలబెట్టారు. గోపాల్రావ్ కూడా ఆ వారం పత్రికను బహిష్కరించడానికికని తనే కొని ఇంటికి తీసుకొచ్చి స్వయంగా చింపి పారేశాడు. ఇందులో అసహజమేముంది? నథింగ్."

గోపాల్రావ్‌కి భవానీ మాటలు వినేసరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

"ఎస్! నా అంతర్యాన్ని అద్భుతంగా చెప్పాడు భవానీ" అన్నాడు కనకారావ్‌తో.

"దిసీజాల్ బంకమ్" అన్నాడు కనకారావ్.

"వాట్ బంకమ్?" అడిగాడు భవానీ.

"మీరిద్దరూ చెప్పిన కథ"



ఇద్దరూ అదిరిపడ్డారు.

"మేము చెప్పింది కథ అనుకుంటున్నారా?" బిగ్గరగా నవ్వేస్తూ అన్నాడు భవానీ.

"నువ్వెంత నవ్వినా అది కథే మిస్టర్."

'నో కల్నల్! ఇటీజే ఫాక్ట్"

"నాకు చాలా డౌట్స్ వున్నాయి."

"మీ డౌట్స్ వల్లే మీ బెటాలియన్ యుద్ధంలో తేలిగ్గా గెలిచే చోట నానా చావూ చచ్చి గెలిచింది" అంది రత్నప్రభ.

కనకారావ్‌కి ఆమె మీద వళ్ళు మండిందిగానీ మామూలుగానే ఏమీ అనలేకపోయాడు.

"మీ డౌట్స్ ఏమిటి ఫాదరిన్లా?" అడిగాడు గోపాల్రావ్ ఎందుకయినా మంచిదని.

"నేను చెప్పను."

ఆ సాయంత్రం కనకారావ్ టీ తాగుతూ గార్డెన్‌లో పచార్లు చేస్తుంటే సడెన్‌గా గుర్తుకొచ్చింది తనింట్లో రాణీ భర్తగా వచ్చినతనిని తను జైల్లో చూశాడు. వాడిపేరు విక్కీ.

తమ వజ్రం కాజేసింది వాడే.

వాడినెప్పటికయినా పట్టుకుని వాడి అంతు తేలుస్తానని తను రాంబాబుకి చెప్పాడు కూడా.

కనకారావ్‌కి గర్వం కలిగింది.

హ! తనా మర్చిపోయేది?

ఎవడినయినా, ఎంతకాలమయినా అలా గుర్తు పేట్టేసుకోగలడు.

టీ కప్పు అక్కడే పడేసి రాణీ గదికి చేరుకున్నాడతను.

రాణీ బెడ్‌మీద కూర్చుని కూల్ డ్రింక్ తాగుతోంది.

"హలో కల్నల్ సాబ్! రండి" అంది అతనిని చూసి చిరునవ్వుతో.

"ఏడీ?" అడిగాడాయన.

"ఏమిటి ఏడి?"

"వాడేడీ?"

"ఎవడు వాడు?"

"వాడే నీ మొగుడి పేరుతో డ్రామా ఆడుతున్నవాడు?"

"డ్రామా ఏమిటి? నిజంగా మా ఆయనే కల్నల్‌గారూ!"

"షటప్! నాకు అంతా గుర్తుకొచ్చేసింది. వాడు విక్కీ... నిన్నే జైలు నుంచి పారిపోయాడు. వాడే వజ్రం దొంగ."

రాణీ కంగారుపడిపోయింది.

"విక్కీయా... మీరు పొరబాటు పడ్డారు సార్! ఆయన అన్నయ్య పేరు విక్కీ, ఆయన పేరు చిక్కీ. వాళ్ళు ఇద్దరూ కవల పిల్లలు."

"ఇతని పేరు చిక్కీయా?"

"అవును."

"నేన్నమ్మను"

"నమ్మకపోయినా నిజం అదే."

"సరే! వీడు విక్కీయో, చిక్కీయో నేను ఇప్పుడే తేలుస్తాను."

"ఎలా తేలుస్తారు?"

"ఇన్స్‌పెక్టర్ రాంబాబుని తీసుకొస్తాను."

ఆమె గాబరాపడిపోయింది.

"ఆ.. కరెక్ట్! మీకంత అనుమానం వుంటే అలాగే తీసుకురండి. అదే బెస్ట్ పద్ధతి" అంది నవ్వుతూ.

"అవును! అదే బెస్ట్ మెథడ్–"

అంటూ తన గదిలోకి వచ్చాడు కనకారావ్.

అప్పుడే తన టేబుల్ మీద నుంచి ఆ ఫ్యాన్సీ తీస్తోన్న భవానీశంకర్ అతనిని చూడగానే గాబరాపడి పెన్ చేత్తో పట్టుకుని దానివంక చూడసాగాడు.

"నా గదిలో ఏం చేస్తున్నావు మిస్టర్ చంద్రకాంత్?" అనుమానంగా అడిగాడు కర్నల్.

"అదే– మీ పెన్ చాలా బావుందని పూజ చెప్తూంటే చూద్దామని వచ్చాను."

"నా పర్మిషన్ లేకుండా నా గదిలోకి రావటం, నా వస్తువులు తీసుకుని చూడటం– వెరీ బాడ్ మిస్టర్."

"నేనలా అనుకోవడం లేదు మేజర్."

"మేజర్ కాదు, కర్నల్."

"అదే కర్నల్– ఎందుకంటే అందమయిన వస్తువులు చూడటానికీ, పొగడటానికీ అందరికీ హక్కు వుంటుంది."

"అలా అని ఎవరు చెప్పారు నీకు?"

"చాలామంది చెప్పారు. జనగామ్ నుంచి విక్రమ్, బెల్లంపల్లి నుంచి విమల్– అదిలాబాద్ నుంచి శీను, సత్తి, రమేష్, వారి మిత్రులు– కూకట్‌పల్లి కాలనీ నుంచి ధర్మరాజు, జంబులింగం."

"స్టుపిట్" కోపంగా అరిచాడు కనకారావ్.



"ఓ.కే. ఓ.కే. ఫ్రెండ్! బై దిబై ఈ ఇంపోర్టెడ్ ఫ్యాన్సీ పెన్ చాలా బాగుంది. ఈ రెడ్ ఇండియన్ తల సూపర్బ్– మీలాంటి కల్నల్స్‌కి సెంట్‌పర్సెంట్ వుండాల్సిన అద్భుతమయిన పెన్."

కర్నల్ కొంచెం మెత్తబడ్డాడు.

"ఆఫ్‌కోర్స్! అయ్ ఎడోరిట్ - అందుకే పూజ నడిగి తీసుకున్నాను."

"ఓకే కర్నల్– థాంక్యూ"

భవానీశంకర్ బయటకు నడిచాడు.

గోపాల్రావ్ ఆతృతగా అతన్ని కలుసుకున్నాడు.

"ఏమయింది? పెన్ కొట్టుకొచ్చావా?"

"ఆ కర్నల్‌గాడు సరిగ్గా టైమ్‌కి రూమ్‌లోకి తగలడ్డాడు బ్రదర్. దాంతో రెడ్ హాండెడ్‌గా దొరికిపోయి, కొంచెంలో తప్పించుకొని బయటపడ్డాను."

"భవానీ! ఈ లెక్కన మనం ఆ రాణీని, వాడినీ వదిలించుకోవటం కష్టమనుకుంటాను."

"అవును"

"ఇప్పుడేం చేద్దాం మరి?"

"ట్రై అండ్ ట్రై– టిల్ యూ సక్సీడ్ అన్నారు పెద్దలు."

"కానీ అది మా ఫాదరిన్లాను చూడకముందు అని వుంటారు. చూస్తే ట్రై అండ్ ట్రై టిల్ యూ డై– అని వుండేవాళ్ళు."

"ఆఫ్‌కోర్స్! నీ మాటల్లో గొప్ప సత్యం వుంది బ్రదర్."

"అయితే ప్రస్తుతం మన కర్తవ్యం ఏమిటి?"

"మళ్ళీ రాత్రికి మరో రాబరీకి ప్రయత్నించటం."

"చాలా రిస్క్ అనుకుంటాను."

"కొత్తగా మనకొచ్చే రిస్క్ ఏమీలేదు మిత్రమా– మనం ఇప్పటికే మెడలోతు రిస్క్‌లో వున్నాం."

"ఓ.కే. అలా అయితే లెటజ్ ప్రొసీడ్."

∘ ∘ ∘

కర్నల్ కనకారావ్, భవానీ తన గదిలోనుంచి బయటకు వెళ్ళగానే పోలీస్ ఇన్స్‌పెక్టర్ రాంబాబుకి ఫోన్ చేశాడు.

"హలో! నేను కర్నల్ కనకారావ్‌ని."

"హలో కర్నల్ సాబ్! ఏమిటి విశేషం?"

"వాడిని పట్టుకున్నాను."

"ఎవడిని?"

"ఇంకెవడో అయితే నాకెందుకు- నా వజ్రం కాజేసిన రాస్కెల్‌ని."

"ఎవరు? విక్కీయా?" ఆనందంగా అడిగాడు రాంబాబు.

"అవును."

"ఎక్కడున్నాడు వాడిప్పుడు కర్నల్ సాబ్?"

"మా ఇంట్లోనే..."

"మీ ఇంట్లోనా?"

"అవును- మీరు వెంటనే వస్తే వాడిని అరెస్ట్ చేసి పారేయవచ్చు."

"ఓ.కే.! అయిదు నిమిషాల్లో అక్కడుంటాను కర్నల్."

ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు కనకారావ్.

అతను ఫోన్‌లో ఏం మాట్లాడుతున్నాడో కనిపెట్టటానికి కిటికీచాటు కొచ్చిన రాణి అతని డైలాగ్‌లన్నీ విని తన గదిలోకి పరుగెత్తింది.

తమ బ్యాగ్ తీసుకుని కిటికీలోనుంచి వేలాడి కింద ఫ్లోరులోని కిటికీ సెల్ మీదకు దూకి అక్కడి నుంచి గార్డెన్‌లోకి దూకి, క్షణాల్లో అదృశ్యమైపోయింది.

◦ ◦ ◦

ఆమె అటు వెళ్ళగానే ఇటు రాంబాబు జీప్‌వచ్చి గోపాల్రావ్ ఇంటి ముందాగింది.

రాంబాబు, అతని కానిస్టేబుల్స్ గన్స్ ఎయిమ్ చేసి యింట్లోకి పరుగెత్తుకొచ్చి కనబడ్డవారందరినీ చేతులు పైకెత్తించేశారు.

కర్నల్‌ని కూడా చేతులు పైకెత్తిస్తూంటే రాంబాబు ఆపేశాడు...

"ఏడి ఆ విక్కీగాడు?"

"మేడ మీద గదిలో వుంటాడు."

వాళ్ళ మాటలు వినగానే గోపాల్రావ్‌కీ, భవానీకీ, ఆశ్చర్యం కలిగింది.

"విక్కీ మన దగ్గరున్నాడా?"

"అవును. ఆ రాణీ భర్తగా వచ్చిన వాడెవరనుకున్నారు మరి?" గర్వంగా అన్నాడు కర్నల్

"మైగాడ్! వాడు విక్కీగాడా?"

"అవును- నేను కాబట్టి కనుక్కోగలిగాను. ఆర్మీ బ్యాక్ గ్రౌండ్ వుంది కాబట్టి.



నేనూ మీలాగా సివిలియన్ గాడినైతే మీలాగానే ఛస్తే కనుక్కోగలిగేవాడిని కాదు."

రాంబాబు, కానిస్టేబుల్స్ గన్స్‌తో మేడ మీదకి పరుగెత్తారు.

ఒక్కసారిగా బిగ్గరగా ఛార్జ్- అని అరుస్తూ రాణి గదిలోకి జొరపడ్డారు.

గదంతా ఖాళీగా కనిపించేసరికి నిరాశపడ్డాడు రాంబాబు.

"ఏరీ వాళ్ళు?" అడిగాడు కనకారావ్‌ని.

"అందులోనే వుండాలి ఇంతకుముందు వరకూ."

"ఇప్పుడు లేరు కదా?"

"వాళ్ళ లగేజ్ వుండాలి కదా?"

"అది కూడా లేదు కదా!"

"వెరీ స్ట్రేంజ్- ఇంతలో ఏమయిపోయి వుంటారు?"

"అదే నేనూ అడుగుతోంది."

కనకారావ్‌కి కోపం వచ్చేసింది- "ఆల్‌రైట్!వాడు ఎక్కడున్నా వెతికి పట్టుకుని వాడి అంతు తేలుస్తాను."

"అంతేం తేలుస్తారులెండి... వెతికి పట్టుకుని ఇలాగే వదిలేస్తారు."

"నో నెవర్! 114 మంది దొంగలను రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్న వాడిని."

"ఆ దొంగలకు బహుశా అదే మొదటి దొంగతనం అయుంటుంది. అందుకే మీలాంటివాడి చేతికి కూడా దొరికపోయి వుంటారు."

"డోంటాక్ రాట్! నేను రెండు యుద్ధాల్లో సాధించిన విజయం గురించి తెలుస్తే స్టన్ అయిపోతావు మిస్టర్."

"అంత తేలిగ్గా స్టన్ అయే రకాన్ని కాదులెండి నేను."

ఇద్దరూ కోపంగా ఒకరి నొకరు చూసుకున్నారు.

"ఇంతకూ ఆ విక్కీగాడు మీ యింట్లో, ఈ రూమ్‌లో ఎందుకున్నాడు?" అడిగాడు రాంబాబు.

"రాణి భర్తనని పరిచయం చేసుకున్నాడు. నాకు వాడి మొహం చూడగానే ఎక్కడో చూసిన అనుమానం కలిగిందిగానీ, గెటప్ బాగా మార్చేసి, మారువేషం వేసుకోవటం వల్ల గుర్తుపట్టలేకపోయాను."

"రాణి అంటే ఆమె కూడా ఆ టైపేనా?"

"తెలీదు. గోపాల్రావ్‌నే అడగాలి అతనికే బంధువట"

గోపాల్రావ్ కంగారుపడ్డాడు.

"నాకూ తెలీదు ఇన్‌స్పెక్టర్‌గారూ! ఎప్పుడో చిన్నప్పుడు చూశానామెని. అంటే

ఏదెనిమిది ఏళ్ళ క్రితం... ఆ తరువాత సంబంధాలు లేవు."

"ఆమె సంగతలా ఉండనీయండి. ఈ విక్కీగాడు మారువేషాలేసుకుని ఏరికోరి మీ ఇంటికి ఎందుకొచ్చినట్లు? మీరు వాడిని గుర్తుపడితే వాడికే నష్టం కదా?"

"అదే నాకూ అర్థం కావటం లేదు."

"ఇదంతా పెద్ద మిస్టరీగా వుంది."

"అవును- మాక్కూడా."

"అసలు మీ అందరినీ స్టేషన్‌కి తీసుకెళ్ళి లాకప్‌లో వేయాలనుంది నాకు."

"సాధారణంగా పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళందరికీ మామూలు జనాన్ని చూస్తే అలాగే అనిపిస్తుంది కామ్రేడ్" అన్నాడు భవానీ.

"ఆల్‌రైట్! ఆ రాణీ అనే ఆమె ఎలా వుంటుంది?"

కనకారావ్ గుర్తులు చెప్పగానే రాంబాబు ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

"అర్థమయింది. నేనిప్పుడే వస్తాను మళ్ళీ" అనేసి కానిస్టేబుల్స్‌తో పాటు బయటకు పరుగెత్తాడు.

రాణీ కోసం పోలీసులంతా గాలింపు మొదలుపెట్టారు.

° ° °

"పూజా! నీతో ఓ అర్జంట్ విషయం మాట్లాడాలి" అన్నాడు కనకారావ్.

కనకారావ్ రూమ్‌లో సీత, పూజ, రత్నప్రభ ముగ్గురూ సమావేశమయ్యారు.

"ఏంటి డాడీ అది?"

"అదేనమ్మా...! నాకు ఆ చంద్రకాంత్ మీదా, గోపాల్రావ్ మీదా అనుమానంగా వుంది."

"ఏంది అనుమానం?" అడిగింది రత్నప్రభ.

"అదే వాళ్ళ బిహేవియర్. వాళ్ళేదో పెద్ద డ్రామా ఆడుతున్నారని నాకు అనుమానంగా వుంది."

"నాకూ అదే అనుమానంగా ఉంది డాడీ" అంది సీత.

"నాకూ అంతా కన్‌ఫ్యూజన్‌గానే ఉంది" అంది పూజ.

"ఏదో డ్రామా లేకపోతే ఆ రాణి అనేదాన్నీ, ఆ విక్కీ అనే గజదొంగనీ గోపాల్రావ్ తన బంధువులని చెప్పి మనింట్లో ఎందుకు దింపాడు?"

"అవును డాడీ! ఆ మాట నిజమే. ఒకవేళ రాణి నిజంగా బంధువు అయినట్లయితే ఎవ్వరితోనూ చెప్పకుండా ఇద్దరూ అలా కిటికీ దూకి ఎందుకుపోతారు?"



"అదే నాకూ అనుమానం కలిగిస్తోంది" అంది రత్నప్రభ.

"ముందు వాడెవడో నేనే రచయిత చంద్రకాంత్‌నని రావడం, ఆ తర్వాత అష్టలక్ష్మి తను చంద్రకాంత్ భార్యనని రావటం, ఆ తర్వాత మళ్ళీ వాడు నేనే చంద్రకాంత్‌నని వచ్చి అందరి ఎదురుగా మళ్ళీ చంద్రకాంత్‌ని కాదనటం, రెండోసారి అష్టలక్ష్మి వాడిని నువెవ్వడివో తెలీదు అనటం, అంతా చూస్తూంటే యీ రచయిత చంద్రకాంత్ మీద కూడా అనుమానంగా వుంది నాకు."

పూజకు కోపం వచ్చింది.

"డాడీ! నేను చంద్రకాంత్‌ని పెళ్ళి చేసుకోకుండా ఇలా అబద్ధాలు చెపుతున్నావు కదూ?" నిష్ఠూరంగా అడిగింది.

"నో బేబీ! నేను ఫాక్ట్స్ మాట్లాడుతున్నాను."

"అంటే ఇతను రచయిత చంద్రకాంత్ కాదంటారా డాడీ?"

"కాదని ఖచ్చితంగా అనలేను. కానీ అతను నిజంగా రచయిత చంద్రకాంత్ అవునో కాదో తెలుసుకోడానికి ఓ ప్లాన్ ఆలోచించాను..."

"ఏమిటది?"

"రేపు సాయంత్రం రవీంద్రభారతిలో చంద్రకాంత్‌కి సన్మానం చేస్తామని ప్రకటన యిద్దాం. దాంతో జనమంతా వస్తారు. అక్కడ వేదిక మీద వున్నతను నిజంగా చంద్రకాంత్ కాకపోతే వాళ్ళే ఆ విషయం అరిచి, గొడవ చేసి చెప్తారు. దాంతో స్టేజ్ మీదే మన వాడిని రాంబాబు అరెస్ట్ చేసేస్తాడు. అంత పబ్లిక్‌గా పనిష్మెంట్ యివ్వాలి అలాంటి దొంగలకు."

"ఒకవేళ అతనే చంద్రకాంత్ అని తేల్తే?"

"అప్పుడిక సమస్యే లేదు. అతనికి నిజంగానే సన్మానం చేసి, వేదిక మీదే మీ యిద్దరికి పెళ్ళి ఎనౌన్స్ చేస్తాను."

పూజ ముఖంలో ఆనందం కనిపించింది.

"ఒకే డాడీ! ఈ ప్లాన్ నాకు నచ్చింది"

"అయితే ఓ ముఖ్యమైన విషయం."

"ఏమిటది?"

"ఈ విషయం మన నలుగురి మధ్యే వుండాలి. గోపాల్రావ్‌కి కూడా తెలీకూడదు."

"ఒకే డాడీ! నేను బయటపెట్టను" ఒప్పుకుంది సీత.

"ఆల్‌రైట్! నేను బయటికెళ్ళి ఏదొక కల్చరల్ సంస్థ ప్రెసిడెంట్‌ని కలుసుకొని కొంత డబ్బిచ్చి వెంటనే రచయిత చంద్రకాంత్‌కి సన్మానసభ ఏర్పాటు చేయమని చెప్తా"

"డబ్బులిస్తే సన్మానాలు ఏర్పాటు చేస్తారా డాడీ?"

"హైదరాబాద్‌లో సాంస్కృతిక సంస్థల్లో 90% అలాంటివేలే... నాకు తెలుసు."

"సరే.'

కనకారావ్ ఆనందంగా బయల్దేరాడు.

కార్లో కొద్దిదూరం వెళ్ళాడో లేదో ట్రాఫిక్ జంక్షన్ దగ్గర పక్కనే ఇంకో కారు వచ్చి ఆగింది.

"హలో కల్నల్" అన్నాడు ఇంకో మాజీ కల్నల్.

"హలో కల్నల్" అన్నాడు కనకారావ్.

"చాలా కాలమైంది కలుసుకుని. ఇప్పుడెక్కడ వుండటం?"

"ఇక్కడే. పద ఎక్కడయినా కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం"

ఇద్దరూ కాఫీ తాగుతూ చాలాసేపు మాట్లాడుకున్నాక వెళ్ళేటప్పుడు కనకారావ్ జేబులో వున్న ఫ్యాన్సీ పెన్ చూశాడు కల్నల్.

"వండర్‌ఫుల్ పెన్! కాపోతే రెడ్ ఇండియన్ తల కలర్ ఇంకో రంగులో వుంటే బాగుండేది."

"ఏం కలర్ బాగుంటుందంటావ్?"

"రెడ్ కలర్ బాగుంటుందనుకుంటా."

అప్పటికప్పుడే అన్ని షాపులకూ వెళ్ళి ఆ పెన్ ఎక్కడ దొరికేదీ వాకబు చేయసాగాడు.

చివరకు సూపర్ బజార్లో దొరుకుతాయన్న విషయం తెలిసి సూపర్ బజార్ చేరుకున్నాడు.

"హలో.. ఇలాంటి పెన్‌లు మీ దగ్గర ఇంకా వున్నాయా?" మేనేజర్ని అడిగాడు.

"ఆ చివరి ఆల్మారాలో ఉన్నాయ్ చూసుకోండి సార్!"

"నా పెన్ రంగు బావుండలేదు. ఇంకో రంగు పెన్ ఎక్స్ఛేంజ్ చేసుకుంటాను."

"సాధారణంగా ఎక్స్ఛేంజ్ పర్మిట్ చేయం. మీరు ఆర్మీ ఆఫీసర్ కాబట్టి పర్మిషన్ యిస్తాం."

"థాంక్యూ" లోపలికి నడిచి అక్కడున్న పెన్స్‌లోంచి రెడ్ కలర్ పెన్ తీసుకుని, తన దగ్గరున్న పెన్ వాటిల్లో పడేసి ఆనందంగా బయటకు నడిచాడు.

• • •

మర్నాడుదయం తనకు సన్మానం జరుగబోతోందంటూ న్యూస్ పేపర్లో వచ్చిన వార్త చూసి భవానీశంకర్ ఉలిక్కిపడ్డాడు.

తను ఆ సన్మానసభ కెళ్లకపోతే కనకారావు దగ్గర బండారం బయటపడిపోతుంది.



వెళితే అక్కడ స్టేజ్ మీద జనంలో బయటపడిపోతుంది.

ఏమిటి చేయడం?

వెంటనే గోపాల్రావు గదిలోకి పరుగెత్తాడు.

గోపాల్రావు ఇంకా నిద్రపోతూనే వున్నాడు.

"హలో బ్రదర్! త్వరగా లే! కొంపలంటుకున్నాయి."

ఠకీమని లేచి కూర్చున్నాడు గోపాల్రావు.

"ఏమిటి సంగతి?"

"మన మిలటరీవాలా మనిద్దరికీ ఎసరు పెట్టాడు."

"ఏం చేశాడు?"

భవానీశంకర్ న్యూస్‌పేపరు అతని మీదకు విసిరేశాడు.

"లాస్ట్ పేజ్‌లో ఆ ప్రకటన చూడు."

అది చదువుతూనే గోపాల్రావుకి పైప్రాణం పైనే పోయింది.

"మైగాడ్! ఇప్పుడెలా?"

"మనం అర్జంటుగా ఏదైనా ఉపాయం ఆలోచించాలి. లేకపోతే మనిద్దరినీ పిట్టల్ని కాల్చినట్లు కాల్చిపారేస్తాడు మిత్రమా!"

"కానీ ఇంకేం ఆలోచిస్తాం?"

"నన్ను వేదిక మీద చూశారంటే ఆ చంద్రకాంత్‌గాడి అభిమానులు నువ్వు చంద్రకాంత్‌వి కాదని గొడవ చేస్తారు. ఒకవేళ సన్మానికి రాకుండా పారిపోతే మిలటరీ ఫెలోకి అనుమానం బలపడిపోతోంది"

"అహ్హహ్హ- ఏమిటి ఇద్దరూ అంత గాఢంగా ఆలోచిస్తున్నారు? ఇంత పొద్దున్నే లేచి?" వాళ్ళదగ్గరకొస్తూ అన్నాడు కనకారావు.

"అహహ-ఏమీ లేదు మామయ్యా! జస్ట్ డిస్కసింగ్."

"ఏమిటో అంత అర్జంట్ డిస్కషన్."

"అదే కర్నల్! ఈసారి పాకిస్తాన్ యుద్ధం వస్తే ఏం జరగుతుందా అని."

కనకారావు ఉత్సాహంగా చూశాడు.

"ఏం జరగటమేముంది? ఇండియా మళ్ళీ గెలుస్తుంది."

"ఎలా గెలుస్తుంది?"

"ఎందుగ్గెలవదు?"

"మీరు రిటైరయిపోయారు కదా! మన ఆర్మీకి బ్రహ్మాండమయిన యుద్ధవ్యూహాలు పన్నేవాళ్ళు ఎవరున్నారు?"

కనకారావు గర్వంగా చూశాడు.

"ఆఫ్ కోర్స్! కొంతవరకూ మీ పాయింట్ నిజమేగానీ మన ఆర్మీసెటప్ ఎలా వుంటుందటే ఏ పరిస్థితిలోనయినా సెకండ్ లైన్ ఆఫ్ డిఫెన్స్ వుంటుంది."

"అదే మామయ్యా! నేనదే చెప్తూంటే చంద్రకాంత్ కాదంటున్నాడు."

"ఏమోయ్ చంద్రకాంత్ ఏమిటి నీ డౌట్స్?"

"ఎలాగయినా మీలాంటి థింక్ ట్యాంక్స్ ఆర్మీలో ఉండటం చాలా అవసరం."

"నేనూ అదే డిఫెన్స్ మినిస్టర్‌కి లెటర్రాశానోయ్! నాలాంటి వాళ్ళను హానరరీటీమ్‌గా ఏర్పాటు చేసి ఆర్మీ విషయంలో ఎప్పటికప్పుడు మా సలహాలు తీసుకోమని, కానీ రాసి సంవత్సరం అవుతున్నా ఇంతవరకూ జవాబు రాలేదు ఎందుకనంటావ్?"

"చాలా సీరియస్‌గా మీ లెటర్ గురించి డిస్కస్ చేసుకుంటున్నా రనుకుంటున్నాను లేకపోతే 'ఎస్' ఆర్ 'నో' అని అప్పుడే చెప్పేసేవాళ్ళు మిత్రమా!"

"ఐసీ.. నాకూ అదే అనుమానం వచ్చింది. అన్నట్లు ఇవాళ నీకు సన్మానసభ ఏర్పాటు చేశామోయ్. పేపర్లో ప్రకటన కూడా యిచ్చాం చూశావా?"

"ఓ చూశాను కామ్రేడ్! గన్ లోపల కూడా కళాత్మకమయిన బులెట్స్ వుంటాయని రుజువుచేశారు."

"ఆఫ్‌కోర్స్! ఇదంతా మా పూజ ప్రోద్భలం."

"ఓ–ఐసీ! పూజక్కూడా కళాత్మక హృదయం గలదు."

"నువ్వు రాసిన హోకస్‌ఫోకస్ నవల సూపర్‌హిట్ అయిన సందర్భంగా ఈ సన్మానం ఏర్పాటు చేశాం."

"ఓ–థాంక్యూ!"

"ఆల్‌రైట్! నేను వెళ్ళి ఆ సభ ఏర్పాట్లు చూడాలి వస్తా" అతను వెళ్ళిపోయాడు.

రవీంద్రభారతికి చేరుకోడానికి బయల్దేరబోతుండగా ఓ కానిస్టేబుల్ మోపెడ్ దిగి వచ్చాడు అతని దగ్గరకు.

"కర్నల్ కనకారావు ఎవరు సార్?"

"నేనే... ఎందుకు?"

"మీరు వెంటనే కోర్టుకి రావాలి సార్."

"ఎందుకు?"

"ఆ విక్కీగాడే వజ్రాల దొంగ అని గుర్తుపట్టానికి."

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్? వాడు పారిపోయాక ఇంకా గుర్తుపట్టి ఏం లాభం?"



"ఆ సంగతి నాకు తెలీదు సార్! మా ఇన్స్‌పెక్టర్ గారి నడగండి."

"మీ ఇన్స్‌పెక్టరో వట్టి దద్దమ్మ"

"కొంచెం మర్యాదగా మాట్లాడితే బావుంటుంది సార్! లేకపోతే మా బాస్‌ని అమర్యాదకరమయిన పదాలతో దూషించినందుకు మిమ్మల్ని ఆరెస్ట్ చేయాల్సి వస్తుంది."

"వాట్! నన్ను అరెస్ట్ చేస్తావా? కల్నల్ అంటే నా రాంక్ ఏమిటో తెలుసా నీకు? డీజీపీ రాంక్ మిస్టర్."

"డీజీపీ బాబు రాంక్ అవనీండి! మూసేయడానికి మాకు ఫుల్ పవర్స్ వున్నయ్"

"ఐసీ! అయితే మీ డీజీపీతో ఇప్పుడే మాట్లాడతాను."

"ముందు కోర్టుకొచ్చి తర్వాత ఎవరితో కావాలంటే వాళ్లతో మాట్లాడండి సార్!"

"ఆల్ రైట్! నువ్వెళ్ళు– నేను కోర్టుకొస్తాను."

"ఓకే సార్!"

అతను వెళ్ళిపోగానే కనకారావు కారు గారేజ్‌లో నుంచి బయటకు తీసి కోర్టుకి బయల్దేరబోతుండగా చకచక నాలుగు బులెట్స్ అతని తలకు సమీపంలో అన్నివైపుల నుంచీ దూసుకుపోయాయ్.

కనకారావు అమాంతం కిందకు పడిపోయి కారు కిందకు దూరిపోయి తన రివాల్వరు తీసి ఆ బులెట్స్ వస్తోన్న వైపుకి ఎదురుకాల్పులు జరిపాడు. ఆ బులెట్స్ వార్ చూసి రోడ్ మీద జనమంతా ఎక్కడివాళ్ళక్కడ నిలబడిపోయారు.

అయిదు నిమిషాలపాటు వార్ జరిగాక కనకారావు మీద కారులో కూర్చుని తుపాకీ కాల్పులు జరిపిన వీర్రాజు కారు స్టార్ట్ చేసుకుని పారిపోయాడు.

కనకారావు కోర్టుకెళ్ళి తన ఫొటోను గుర్తుపట్టకుండా టెర్రరైజ్ చేయమని వీర్రాజుకి విక్కీ ఆదేశాలిచ్చాడు.

కాల్పులు ముగియుగానే ఆ చుట్టుపక్కల జనమంతా కనకారావు ఇంటి ముందు మూగారు.

కర్నల్ కనకరావ్ జిందాబాద్!

నగర పౌరుల పాలిట పెన్నిధి కనకారావ్ జిందాబాద్!

మున్సిపల్ కార్పొరేషన్ పాలసీలకు నిరసనగా కాల్పులు జరిపిన కల్నల్ కనకారావ్ జిందాబాద్!

సినీనటి అమల సలహా మీద హైదరాబాద్ తుగ్లక్ కార్పొరేషన్ పెంచుకుంటున్న వీధి కుక్కల మీద యుద్ధ ప్రకటించిన కర్నల్ కనకారావ్ జిందాబాద్!

హీరో కర్నల్ కనకారావ్ జిందాబాద్!

తుగ్లక్ కార్పొరేషన్ ముర్దాబాద్!

కుక్కల కార్పొరేషన్ జిందాబాద్!

పిచ్చికుక్కల నిలయం- హైదరాబాద్ జీహెచ్ఎమ్సీ- ముర్దాబాద్!

మనుషుల ప్రాణంకన్నా కుక్కల ప్రాణాలు గొప్పవని నిరూపించనిడానికి ప్రయత్నిస్తున్న తుగ్లక్ కార్పొరేషన్-ముర్దాబాద్."

నినాదాలు మిన్నంటుతూంటే కనకారావు కారు కిందనుంచీ బయటకొచ్చి అయోమయంగా వాళ్లవైపు చూశాడు.

"ఏమిటి? నాకెందుకు జై కొడుతున్నారు?"

"మీరు జరిపిన కాల్పుల్లో పాతిక పిచ్చి కుక్కలు చచ్చాయి. మన ఏరియా వాళ్లదర్నీ కుక్క కాట్ల నుంచి రక్షించినందుకు మా జోహార్లు. వెయ్యంద్రా దండలు" అరిచాడొకతను.

కనకారావు మీద పూలవర్షం కురిసింది.

"ఆపండి" బిగ్గరగా అరిచాడు కనకారావు.

అంతా సైలెంటయిపోయారు.

"నా మీద కాల్పులు జరిపిన టెర్రరిస్ట్ని ఎవరయినా చూశారా..?"

అందరూ ఉలిక్కిపడ్డారు.

"అతను టెర్రరిస్టా?"

"లేకపోతే నా మీద కాల్పులు ఎందుకు జరిపాడు? నన్ను చంపటానికి ఎందుకు ప్రయత్నిస్తాడు?"

"తను పిచ్చి కుక్కలను చంపటానికి వచ్చిన ప్రజా రక్షకభటుడి నన్నాడే.."

"ఏడిశాడు-ఆయనా వాడేం చెప్తే అది మీరు నమ్మేయటమేనా?"

"కానీ మీ మీద టెర్రరిస్ట్లు ఎందుకు కాల్పులు జరుపుతారు? బులెట్స్ వేస్ట్ కదా వాళ్లకు?"

"ఎందుకేమిటి మీ తలకాయ్. సౌత్లో ఏ కల్లోలాలూ లేకుండా కాలు మీద కాలేసుక్కూచుని కేబుల్ టీవీ సినిమాలు చూస్తూండటం వల్ల దేశంలో ఏం జరుగుతుందో మీకేం తెలిశ్చావటం లేదు. మేము పంజాబ్లో ఆర్మీయాక్షన్ తీసుకున్నప్పుడు టెర్రరిస్ట్లు మాలో కొంతమందిని హిట్లిస్ట్లో వేశారని తెలిసింది. నేనూ అందులో వుండబట్టే వాడెవడో నా మీద కాల్పులు జరిపాడని నా అనుమానం" అనేసి కనకారావు ఇంట్లో కొచ్చేశాడు.

"దీసీజ్ టూమచ్ కర్నల్! దేశాన్ని కాపాడిన మీకే రక్షణ లేదంటే టూమచ్. వెంటనే మీరు పోలీస్ ప్రొటెక్షన్ అడగాలి" అన్నాడు భవానీ శంకర్.

"అవును డాడీ! లేకపోతే మళ్ళీ ఎటాక్ జరగవచ్చు."



"ఏడ్చాడు- ఇంట్లోనే బంకర్లు కట్టి వాళ్ళ తుక్కు లేపేస్తాను- నా సంగతి తెలీదు వాళ్ళకి."

"ఇంట్లో బంకర్లు కడతారా?" భయంగా అడిగాడు గోపాల్రావు.

"అవును! ఎక్కువ ఖర్చేమీ కాదు. హాల్లో రెండు వందల ఇసుక బస్తాలు వేయిస్తే చాలు. మననింకెవ్వడూ ఏమీ చేయలేడు."

"ఈ పరిస్థితుల్లో సాయంత్రం రవీంద్రభారతిలో ప్రోగ్రాం కాన్సిల్ చేయటం మంచిది కర్నల్" అన్నాడు భవానీశంకర్ ఉత్సాహంగా.

"నో" ఘర్జించాడు కనకారావు.

"ఆ ఫంక్షన్ ఖచ్చితంగా జరిగి తీరాల్సిందే."

"తీరాల్సిందేనా?"

"తీరాల్సిందే!"

"ఆల్రైట్! ప్రాణం మీది- మా సొమ్మేం పోయింది."

"ప్రాణం పోయినా ఫర్లేదు."

"ఇంకా ఫర్లేదేమిటి? పోవటం ఖాయం."

"పోతేపోనీ."

"పూజా! కమాన్! ఇద్దరూ రవీంద్రభారతికి వెళ్ళి ఎరేంజ్మెంట్స్ చూద్దాం."

"విల్లు రాసి వెళ్ళండి" లోపల్నుంచి అరిచింది రత్నప్రభ.

"ఇంక విల్లెందుకు నీ తలకాయ్-ఉన్న వజ్రాలు కాస్తా పోయాయ్ కదా!"

కనకారావు, పూజ వెళ్ళిపోయారు.

° ° °

అష్టలక్ష్మికి, చంద్రకాంత్కి రాజీ కుదిరిపోయింది.

"ఇంకెప్పుడూ అమ్మాయిల జోలికి పోను అష్టా!" అన్నాడతను.

"నిజంగానా? వట్టెయ్."

అతను వట్టేశాడు.

అతని చెంప పగటగొట్టిందామె.

"అదేమిటి? ఎందుక్కొట్టావు?"

"క్రిందటిసారి కూడా ఇలాగే ఒట్టేసి మళ్ళీ వేధవ్వేషాలేశావు కదా- అది గుర్తుకొచ్చి కొట్టాను."

"ఈసారి ఇది నిజంగా అగ్ని ప్రమాణమేనే."

సరిగ్గా అప్పుడే న్యూస్ పేపరు వచ్చిపడింది గడపలో.

పేపరు తీసి చూడగానే కనిపించిందా ప్రకటన.

"ఇదిగో చూశావా? నా డూప్లికేట్ గాడు ఆ ఇంట్లో నా పేరు మీద డ్రామా ఆడటమే కాకుండా నా పేరు మీద సన్మానం కూడా చేసుకుంటున్నాడు" ఏడుపు మొహంతో అన్నాడు చంద్రకాంత్.

"అదేమిటి? అలా ఎలా వూరుకుంటాం? వెంటనే వెళ్ళి వాడి నాటకమంతా బయటపెట్టాలి" అంది అష్టలక్ష్మి.

"ఒక పని చేద్దాం.... మనం కూడా రవీంద్రభారతికెళ్ళి ఆ సన్మానం మధ్యలో స్టేజ్ మీదకెళ్ళి వాడి రంగు బయటపెడదాం."

"అవును- వాడి తిక్క వదుల్తుంది."

"పద వెళదాం" హడావుడిగా రడీ అవుతూ అన్నాడు.

• • •

"అసలిందంతా నీవల్లే జరిగింది. నువ్వు నాకే చెయ్యిచ్చి ఆ వజ్రాలు కాజేయలని ప్లానేశావ్! అందుకే ఈ సమస్యన్నీ-" కోపంగా అన్నాడు విక్కీ.

"పొరబాటు జరిగిందని ఒప్పుకున్నాగా- అన్నట్లు ఇదిగో ఈ పేపరు చూడు- ఆ రైటర్ చంద్రకాంత్‌గాడికి ఆ కర్నల్‌గాడు ఇవాళ సాయంత్రం రవీంద్రభారతిలో సన్మానం చేస్తున్నాడట."

"అయితే మనకేం లాభం?"

"నీ తెలివి తగలేసినట్లే ఉంది. వాళ్ళంతా రవీంద్రభారతిలో ఉంటే మనం వాళ్ళింట్లో దూరి మన పెన్ మనం ఎత్తుకుపోవచ్చు కదా?"

విక్కీ మోహంలో ఆనందం కనిపించింది.

"అవును. ఆ పాయింట్ తట్టనేలేదు. కానీ ఆ కర్నల్‌గాడు ఆ పెన్ కూడా జేబులో పెట్టుకెళితే?"

"ఏమో చెప్పలేం! ఎందుకయినా మంచిది... మనం మారువేషాల్లో వెళ్ళి ఆ కర్నల్ గాడ్ని అబ్జర్వ్ చేయాలి."

ఇద్దరూ హడావుడిగా రడీ అవసాగారు.

• • •

పూజ భవానీశంకర్ కళ్ళల్లోకి ఆనందంగా చూసింది.

"చంద్రకాంత్! ఇవాళ పొద్దున్నుంచీ ఏమిటదోలా వున్నారు?"



భవానీశంకర్ నవ్వాడు.

"ఎలా ఉన్నాను డియర్?"

"ఏదో భయంగా, గాబరాగా..."

"నెవర్ డియర్! మన హిస్టరీలో లేదు భయపడటం. కాకపోతే ఓ ముఖ్యమయిన విషయం గురించి సీరియస్‌గా ఆలోచిస్తున్నాను."

"ఏమిటది?"

"ఇక నుంచీ టీవీ సీరియల్స్ రాయటం మానేసేయాలనుకుంటున్నాను."

పూజ ఆశ్చర్యపోయింది.

"నిజంగానా?"

"ఎస్ డియర్! నేనెప్పుడూ ట్రూత్ మాత్రమే మాట్లాడతాను."

"కానీ ఎందుకు మానేయటం?"

"అందుక్కారణముంది డియర్!"

"ఏమిటది?"

"ఇదిగో ఈ ఉత్తరం చదవండి."

ఆమెకు ఓ ఉత్తరం యిచ్చాడతను.

ఆ ఉత్తరం చదవుతూనే ఆమె మూడ్ మారిపోయింది.

"చంద్రకాంత్! ఈ ఉత్తరం రాసిన స్టూడెంట్ మీ సీరియల్ చూసి నిజంగానే వాళ్ళ తమ్ముడికి ఆపరేషన్ చేశాడా?"

"చేశాడనేకదా అతనిని పోలీసులు జైల్లో వేశారు."

"కానీ సీరియల్ చూసినంత మాత్రాన ఆపరేషన్ ఎలా చేశాడు?"

"హీరో అతని ప్రియురాలూ ఒక ఫామ్‌హౌస్‌లో ఒక ద్వీపకల్పంలో చిక్కుబడి పోతారన్న మాట. ఆ సమయంలో హీరోయిన్‌కి సడెన్‌గా ఆపరేషన్ చేయాల్సి వస్తుంది. హీరో దగ్గర ఆపెండిసైటిస్‌కి సంబంధించిన న్యూస్ పేపర్ ఆర్టికల్ వుంటుందన్నమాట. అది చదివి సక్సెస్‌ఫుల్‌గా ఆపరేషన్ చేసేస్తాడు. ఆ సీరియల్ చూసిన కుర్రాడు వాళ్ళ తమ్ముడికి హార్ట్ ఆపరేషన్‌కి బోలెడు ఖర్చుపెట్టడం ఎందుకని తనే ఆపరేషన్ చేసేశాడు... మధ్యలో పేషెంట్ ప్రాణం మీదకొచ్చి హాస్పిటల్‌కి తీసకెళ్ళారు. ఆ కుర్రాడ్ని పోలీసులు అరెస్ట్ చేశారట."

పూజకు అప్పుడు గుర్తుకొచ్చిందా సీరియల్.

"నిజమే! అయినాకానీ మీరు మాత్రం అలా ఎందుకు రాసినట్లు?"

"థ్రిల్ కోసం. ఆ ఆపరేషన్ చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు థ్రిల్ ఫీలవుతారని రాశాను.

కానీ దానికిలాంటి సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని తెలిశాక... టీవీ సీరియల్స్ రాయటం మానేయాలనుకుంటున్నాను"

పూజ మనసంతా ఆందోళనతో నిండిపోయింది.

"పూజాజీ!" పిలిచాడు భవానీ

"ఊ!"

"నేను అలా స్క్రిప్ట్ రైటింగ్ మానేయటం మీకు నచ్చటం లేదు కదూ?"

"అలా అనుకోవటం లేదు నేను."

"ఒకవేళ నేను భవిష్యత్‌లో రచయితనిపించుకోకపోయినా మీకు నా మీద ప్రేమ ఇలాగే వుంటుందా?"

"ఎందుకుండదూ?"

"నేను రచయితననేగా నన్ను ప్రేమించారు ఆ క్వాలిఫికేషన్ లేకపోతే నా మీద ఆకర్షణ ఎందుకుంటుందింకా?"

"మొదట్లో మీరు రచయితనే ప్రేమలో పడ్డాను. కానీ మీకు పెళ్ళి అయిపోయిందనీ, అవనట్లు నాకు అబద్ధం చెప్పారనీ తెలిశాక నాకు మీ మీద కోప మొచ్చింది. అయితే తర్వాత మీ భార్య అష్టలక్ష్మి మిమ్మల్ని ఎంత దారుణంగా యాతన పెడుతుందో చూశాక మీ మీద సింపతీ కలిగింది. మీకు నాలాంటి భార్య వుంటే మీరెంత ఆనందంగా జీవితం గడుపుతారోనన్న ఆలోచన మీ మీద మరింత ప్రేమ కలిగేలా చేసింది. అందుకే డాడీకి ఎదురుతిరిగి మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటానని చెప్పాను. కానీ డాడీకి మీ మీద అనుమానం- మీరు అసలు చంద్రకాంత్ కాదనీ, ఇంకో అసలు చంద్రకాంత్ వుండుంటాడని అనుకుంటున్నాడు. మా డాడీ మాట కాదనటం ఇష్టంలేక మీకు స్టేజ్ మీద సన్మానం చేసే డ్రామాకి వప్పుకున్నాను. స్టేజ్ మీద ఎలాగూ మీరే నిజమయిన చంద్రకాంత్ అన్న విషయం డాడీకి తెలుస్తుంది కదా... అప్పుడింక ఏ అబ్జెక్షనూ లేకుండా మన పెళ్ళికి వప్పుకుంటారు."

"ఒకవేళ నేను రచయిత చంద్రకాంత్‌ని కాదని తేలిందనుకోండి- అప్పుడేం చేస్తారు?"

"మీరే చంద్రకాంత్ అయినప్పుడు కాదని ఎలా తేల్తుంది?"

"ఒకవేళ అలా జరిగిందనుకోండి..."

"ఉహు అలా జరగదు."

"ఒకవేళ జరిగితే?"

ఆమె ఓ క్షణం మౌనం వహించింది.



"ఆల్ రైట్! మీరెవరయినా నాకు ఒకటే. ఎందుకంటే ప్రస్తుతం నేను ప్రేమిస్తోంది మిమ్మల్ని."

"మరి మీ డాడీ అడ్డుపడితే – సినిమాల్లో హీరోయినలాగా "డాడీ! నేనూ, అతనూ ప్రేమించుకున్నాం.... మా బొందిలో ప్రాణాలున్నంత వరకూ ఎవరూ మమ్మల్ని విడదీయలేరు డాడీ.... విడదీయలేరు" అంటూ ఉపన్యాసం యిస్తారా?"

పూజ నవ్వేసింది.

"ఏమంటానో అప్పుడు చూద్దురుగాని."

సరిగ్గా అప్పుడే సైరన్‌లా 'పూజా' అంటూ అరిచాడు కనకారావ్.

పూజ గాబరాగా అక్కడి నుండి పరిగెత్తింది.

• • •

ఇన్‌స్పెక్టర్ రాంబాబుకి చాలా చిరాగ్గా వుంది. అతను ఇరవయ్ నాలుగ్గంటల నుంచీ మొత్తం హైదరాబాద్ అంతా డాకూరాణి కోసం గాలించేశాడు.

బస్‌స్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు- క్లబ్‌లు, హోటళ్ళు- షాపింగ్ సెంటర్లు...

ఎక్కడ వెతికినా ఆమె జాడగానీ, విక్కీ జాడగానీ తెలీలేదు.

"హు! వజ్రం కాజేసి ఏ బంగ్లాదేశ్‌కో పారిపోయి వుంటారు" అనుకున్నాడతను. రాత్రి రెండు గంటలకు ఇంటికి తిరిగొచ్చి గాఢ నిద్రలో మునిగిపోయాడు.

తిరిగి మెలకువ వచ్చేసరికి ఉదయం ఏడయిపోయింది.

సరిగ్గా అప్పుడే సెర్చ్ పార్టీ ఇన్‌ఛార్జ్ రాఘవులు హడావుడిగా వచ్చి శాల్యూట్ కొట్టాడు.

"సార్! డాకూరాణి జాడ తెలిసింది."

ఒక్కసారిగా ఎగ్జయిట్‌మెంట్‌తో లేవబోయి ఢబేల్‌మనికిందపడి పోయాడు. రాఘవులు అతనికి చేయి అందించి లేపి నిలబెట్టాడు.

"ఎక్కడా? ఎక్కడుంది డాకూరాణి?" ఆత్రుతగా అడిగాడు.

"జనతా హోటల్ రూమ్‌లో వుందట సార్."

"జనతా హోటల్లోనా?"

"అవున్సార్."

"నిజంగా వుందా?"

"ఉంది సార్! నేను బూట్ పాలిష్‌వాడి వేషంలో వెళ్ళి చూసివచ్చాను."

"ఒండర్‌ఫుల్! కానీ ఇందాక నేనడిగినప్పుడు హోటల్లో డాకూరాణి లేదని ఆ ప్రొప్రయిటర్‌గాడు అబద్ధం చెప్పాడు- వాడి పని పడతా."

"వాడిని ఓసారి మూసేస్తేగానీ వాడి పొగరణగదు సార్– కిందటి సారి మా బామ్మర్దికి రూమ్ ఫ్రీగా ఇవ్వమంటే సగం ఛార్జ్ కట్టమన్నాడు."

"చూడు– ఇప్పుడు వాడినేం చేస్తానో"

ఇద్దరూ జీప్‌లో జనతా హొటల్‌కి చేరుకున్నారు.

ప్రొప్రయిటర్ మహాదేవన్ అతనిని చూస్తూనే నమస్కారం చేశాడు.

"ఏమిటి సార్ మళ్ళీ వచ్చారు?"

"ఇందాక నాకేం చెప్పావురా నువ్వు?"

"ఏం చెప్పాను సార్?"

"డాకూరాణి మీ హొటల్లో లేదన్నావు కదా?"

"అవున్సార్ లేదు."

"ఉందని నేను చెప్తున్నాను."

"చాలా బాగా చెప్పారు సార్! టాస్ వేద్దామా సార్?"

"చెప్పు తీసుక్కొడతాను.. టాప్ వేస్తావా? నాకొడకా– ఒరే రాఘవులూ వీడిని లాక్కెళ్ళి లాకప్‌లోకి తోసెయ్‌రా."

రాఘవులు మహాదేవన్‌ని రెక్కలు విరిచి పట్టుకున్నాడు.

"అరే– వదలండి సార్! నన్నెందుకు అరెస్ట్ చేశారసలు.." అంటుండగానే అతనిని కూడా తీసుకుని రాంబాబు చకచకా మేడమెట్లు ఎక్కి రాఘవులు చూపించిన గది తలుపులు కొట్టాడు.

లోపల్నుంచి ఓ తీయని గొంతు వినిపించింది.

"ఎవరూ?"

"తలుపు తియ్."

"ఎవరు?"

"తలుపు తీస్తావా లేదా ముందు?"

"ఎవరు?"

"ఏయ్– తలుపు తీస్తావా లేదా?"

"ఎవరు?"

"ఎవడినా? నీ మొగుడినే– తియ్ తలుపు."

"ఎవరు?"

రాంబాబుకి కోపం ఆగలేదు.

"ఏయ్– తలుపు తియ్యకపోతే బద్దలకొడతాను."



"ఎవరు?"

"నేను పోలీస్ ఇన్స్‌పెక్టర్ రాంబాబుని– త్వరగా తలుపు తియ్."

"ఎవరు?"

"చెప్తుంటే నీక్కాదూ? నేను పోలీస్ ఇన్స్‌పెక్టర్ని."

"ఎవరు?"

రాంబాబుకి దాని పీక పిసికేయాలన్నంత కోపం వచ్చింది.

"ఏయ్! ఇందాకట్నుంచీ చూస్తున్నా– పోలీస్ ఇన్స్‌పెక్టర్ని అని చెప్తుంటే ఎవరు ఎవరు అని నాటకమాడుతున్నావ్– నువ్వెవరు?"

"పోలీస్ ఇన్స్‌పెక్టర్!" అంది అవతలి గొంతు.

"ఏయ్– తలుపులు పగలగొట్టి లోపలకు రావాలా? చెప్పు– ఎవరు నువ్వు?"

"పోలీస్ ఇన్స్‌పెక్టర్!"

"మర్యాదగా నువ్వెవరో చెప్తావా లేదా?"

"పోలీస్ ఇన్స్‌పెక్టర్!"

రాంబాబుకి ఇంక కోపం ఆగలేదు.

బలంగా తలుపులు తన్నసాగాడు.

అయిదు నిమిషాలపాటు ఇద్దరూ కలిసి తలుపులు పగలగొట్టి లోపలకు వచ్చారు.

రూమ్ ఖాళీగా వుంది. "అరే– ఎవరూ లేరు– మరి ఇంతసేపూ మాట్లాడిందెవరు?" అనుమానంగా అన్నాడు రాంబాబు.

"పోలీస్ ఇన్స్‌పెక్టర్" అన్న గొంతు విని అదిరిపడి వెనక్కు తిరిగి చూశాడు.

తలుపు వెనుక పంజరంలో ఉంది చిలుక.

"ఇందాకట్నుంచీ మాట్లాడుతోంది ఇదే సార్" అన్నాడు కానిస్టేబుల్.

రాంబాబు మొహం మాడిపోయింది.

"హు! ఆఖరికి చిలకలు కూడా మనల్ని ఫూల్స్ చేసేస్తున్నాయి" అన్నాడు కసిగా.

హొటల్ ప్రొప్రయిటర్ విజయ గర్వంతో చూశాడు.

"నేను ముందే చెప్పాను గద్సార్– డాకూరాణీలు, బందిపోటు క్వీన్స్ మా హొటల్లో వుండరని– వాళ్ళకు ఇలాంటి థర్డ్ రేట్ లాడ్జీలలో ఉండాల్సిన అవసరం ఏముంది సార్.... ఫైవ్‌స్టార్ హొటల్స్‌లో వుంటారు."

"సారీ బ్రదరూ– పొరపాటయిపోయింది" అన్నాడు రాంబాబు.

"ఏం సారీ సార్? ఈ విషయం నేను కోర్టులో వేశాననుకోండి– మీరు ఇలా ఇష్టం వచ్చినట్లు మా లాడ్జి మీద దాడి చేసి తలుపులు పగలగొడుతూండటం వల్ల మా లక్షల

బిజినెస్ నాశనమైపోయింది కనుక ఆ లాస్ అంత పోలీస్ డిపార్ట్‌మెంటే కట్టాలని- అప్పుడు మీ పొజిషనేమవుతుంది?"

"ఏమవుతుంది? ఏమీ కాదు! మహా అయితే ట్రాన్స్‌ఫర్ చేస్తారు."

"ఎక్కడికి చేస్తారు సార్?"

"ఎక్కడికో అక్కడికి- నీకెందుకు?"

"అమ్మమ్మమ్మ- అలా అంటే ఎలా? ఎక్కడో నక్స్‌లైట్ ఏరియాలో పడేస్తారు. అప్పుడేమవుతుందో మీకూ తెలుసు కదా?"

రాంబాబు గాబరా పడ్డాడు.

"చూడవోయ్- జరిగిందేదో జరిగిపోయింది. ఈసారి నీ హోటల్ మీద ఎవరయినా కంప్లైంట్స్ ఇచ్చినప్పుడు నేను నీ తరపున వుంటాన్లే."

సరిగ్గా అప్పుడే పక్క గదిలో నుంచి తలుపు తెరచుకుని బయటి కొచ్చింది డాకూరాణి.

"ప్రొప్రయిటర్ గారూ! నా కోసం మళ్ళీ ఆ ఇన్స్‌పెక్టర్ రాంబాబు గాడు ఎవరినీ పంపలేదు కదా?" అంటూ రాంబాబుని చూసి కెవ్వున కేకవేసి పరుగెత్తసాగింది.

రాంబాబు వెంటపడి మెట్ల మీద పట్టుకున్నాడు.

"ఏమే- నా కళ్ళు కప్పి బ్రతగ్గలననుకుంటున్నావా?"

"ఏం చేయమంటావు? ఆ విక్కీగాడు గన్ పెట్టి నన్ను తీసుకొచ్చాడిక్కడికి."

"ఏయ్- నీ వేషాలన్నీ నా దగ్గర కాదు, చెప్పు- ఆ వజ్రాలు ఎక్కడ దాచావు?"

"ఏడ్చినట్లుంది- అవి నా దగ్గరుంటే ఇంకా ఈ దిక్కుమాలిన లాడ్జిలో ఉండాల్సిన ఖర్మ నాకేమిటి? ఫైవ్‌స్టార్ హోటల్లో ఉండేదాన్ని."

"అయితే ఎక్కడున్నయ్?"

"నిజం చెప్పెయ్యనా?"

"చెప్పకపోతే కాల్చిపారేస్తా."

"నీకు అంత దమ్మెక్కడుందిలే గానీ- అయినా చెప్పేస్తా. అవి ప్రస్తుతం మన చేతిలో లేవు."

"మరెవరి దగ్గరున్నయ్?"

"కర్నల్ కనకారావ్."

రాంబాబు అదిరిపడ్డాడు.

"కనకారావ్ దగ్గరా?"

"అవును."

"వాడి దగ్గరకెలా వెళ్ళినయ్?"



'అదంతా ఓ పెద్ద స్టోరీ."

"స్టోరీ అంతా అక్కర్లేదు."

"అయితే విను- అవి ఒక ఇంపోర్టెడ్ ఫ్యాన్సీ పెన్ లోపల అరలో వున్నయ్. ఆ పెన్ పొరబాటున కర్నల్‌కి చేరింది. కల్నల్ దగ్గర ఆ పెన్ వుందిగానీ అందులో ఆ వజ్రాలు వున్నయ్యని కర్నల్‌కి తెలీదు. అందుకే విక్కీ ఆ పెన్ కాజేయడానికి అర్ధరాత్రి దొంగతనానికి వెళ్ళి చావుదెబ్బలు తిని పారిపోయి వచ్చాడు"

రాంబాబుకి ఏం చేయాలో తోచలేదు.

"ఇప్పుడా పెన్ ఆ కర్నల్‌గాడి దగ్గర్నుంచి కాలేజయటం ఎలా?"

"మనవల్లకాదు".

"ఎందుకని?"

"వాడిని టెర్రరిస్ట్‌లు చంపేస్తారని ఓ నమ్మకం. అందుకని రాత్రుళ్ళు కూడా నిద్రపోకుండా ఇల్లంతా ఇసుక బస్తాలు వేసుకుని టెర్రరిస్ట్‌ల కోసం ఎదురు చూస్తున్నాడంట. ఎవడు వెళ్ళినా వాడి మీద కాల్పులు జరుపుతున్నాడని విక్కీ చెప్పాడు."

"అయితే ఆ పెన్ కాజేయడానికి ఏమిటి దారి?"

"ఒకే ఒక్క దారి వుంది."

"ఏమిటది?"

"చెప్తే నాకేమిస్తావ్?"

"మళ్ళీ కొత్తగా అడగుతావేం?"

"గుర్తులేదు."

"మనిద్దరం పెళ్ళి చేసుకునేట్లూ, మూడో వంతు డబ్బు నీకిచ్చేట్లూ అనుకున్నాంగా."

"ఆ ఆఫరు ఇప్పటికీ అలాగే వుందా?"

"అలాగే వుంది."

"ఓకే! అయితే సరే- ఇవాళ సాయంత్రం రవీంద్రభారతిలో ఆ రచయిత చంద్రకాంత్‌గాడికి సన్మాన సభ వుంది. కల్నల్ కనకారావు సన్మానం చేస్తున్నాడు కనుక కోటు జేబులో ఆ పెన్ పెట్టుకుని రావచ్చు. లేదా ఆ పెన్‌ని ఇంట్లో వదిలేసి రావచ్చు. ఎలాగయినా ఆ పెన్ కొట్టేసే గొల్డెన్ ఛాన్స్ ఇవాళే."

రాంబాబు మొహం ఆనందంతో నిండిపోయింది.

"ఆ సంగతి నా కొదిలేయ్ ఇక- వాడి పెన్ ఇల్లీగల్‌గానయినా కాజేద్దాం పద."

"నేనెక్కడికి?"

"నిన్ను వదుల్తే ఇదే ప్లాను ఆ విక్కీగాడితో అమలుచేసి ఇద్దరూ కలిసి పారిపోతారు.

అందుకని ఈ క్షణం నుంచీ నువ్వు నా పక్కనే వుండాల్సిందే. పద."

రాణి గత్యంతరం లేక అతనితో పాటు నడిచింది.

○ ○ ○

పానకాలు మందు కొడుతున్నాడు.

మధ్య మధ్యలో "నా కొడకా- నీ అంతు చూస్తా(నా అని కూడా లోలోపల అనుకుంటున్నాడు. తన భార్య నీలిమను కిడ్నాప్ చేసినవాడిని ఛస్తే వదలకూడదని అతను నిర్ణయించేసుకున్నాడు. గ్లాసు ఖాళీ అయిపోయింది.

"బేరర్!"

"ఎస్సార్!"

"ఇంకో క్వార్టర్ విస్కీ తీసుకురా."

"ఎస్సార్!"

"ఆగు" అరిచాడు పానకాలు.

"ఏమిటి సార్?"

"క్వార్టరు విస్కీ తెమ్మన్నానా?"

"అవున్సార్!"

"అందులో ఓ క్వార్టరు రమ్ము కలిపి తీసుకురా."

"రమ్ము కలపాలా సార్?"

"అవును - కలపాలి"

"కానీ అలా ఎవరూ కలపరు సార్!"

"నేను కలుపుతాను. నీకేమయినా అబ్జెక్షనా?"

"నాకేం లేద్సార్!"

"అయితే వెధవ కొశ్చెన్స్ వేయకుండా తీసుకురా-ఫో!"

అతను రెండడుగులు వేశాడు-

"బేరర్!" మళ్ళీ పిలచాడు.

"ఎస్సార్!"

"నేనేం ఆర్డర్ చేశాను?"

"విస్కీ-విస్కీలో రమ్ కలిపి తెమ్మన్నారు సార్!"

"అన్నానా?"

"అన్నారు సార్!"



"అయితే ఓ పని చెయ్- అందులో మళ్ళీ రెండు గ్లాసులు బీరు కలుపు."

"కొంప మునిగిపోతుంది సార్!"

"తాగేవాడిని నేనా-నువ్వా?"

"మీరే సార్!"

"బిల్ ఇచ్చేవాడిని నేనా-నువ్వా?"

"మీరే సార్!"

"మరి నువ్వెందుకలా ఏడుస్తావ్?"

"మిమ్మల్ని చూసి జాలిపడి సార్!"

"నన్ను చూసి మా ఆవిడే జాలిపడలేదు. నువ్వెవడ్రా జాలిపడ్డానికి."

"మీ ఆవిడకు మీరిలా కాక్‌టెయిల్ కొడతారాని తెలిసుండదు సార్! తెలిస్తే తప్పకుండా జాలిపడేది."

అతని మాటలతో నీలిమ గుర్తుకొచ్చి బోరున ఏడ్చేయసాగాడు అతను.

బేరర్‌కి జాలి ఇంకా ఎక్కువయి పోయింది.

"ఎందుకు సార్ ఏడుస్తున్నారు?"

"మా ఆవిడ గుర్తుకొచ్చింది."

"ఆవిడంటే మీకు చాలా ప్రేమా సార్?"

"ప్రేమేమిట్రా నీ తలకాయ్- నా ప్రాణం. దానికి లక్షరూపాయలు పెట్టి నగలు కొనిచ్చా"

"ఆహా-భార్యను ఇంత ప్రాణంగా ప్రేమించే తాగుబోతులు చాలా రేర్‌గా వుంటారు సార్!"

"అలాంటి భార్య మళ్ళీ మళ్ళీ దొరకదురా- గ్యారంటీగా చెప్తున్నాను."

"ఎందుకని సార్?"

"నా తాగుడికి అదే కదరా డబ్బిచ్చేది."

"ఆహా- నిజమే సార్! భర్త తాగుడికి డబ్బిచ్చే భార్యలు చాలా రేర్‌గా వుంటారు సార్!"

"అసలుండర్రా!"

"అవున్సార్! అసలుండరు- మీ ఆవిడ తప్ప. కానీ అంత మంచి భార్యుండగా ఇంకా ఏడుపెందుకు సార్?"

"అలాంటి దేవతలాంటి భార్యను రోజూ ఈ కసాయి చేతులతో చావగొట్టి మెడ పిసకాలంటే ఎవరికయినా ఎంత బాధగా వుంటుందిరా? ఆ బాధను తట్టుకోలేకే

ఏడుస్తున్నా(నా."

బేరర్ ఆశ్చర్యపోయాడు.

"అదేమిటీ? తాగడానికి డబ్బులిచ్చే దేవతలాంటి, గంగిగోవులాంటి, కల్పవృక్షం లాంటి భార్యను రోజూ కొట్టటం మెడపిసకటం ఎందుకు సార్?"

"ఎందుకెమిట్రా వె(రినాయలా! చావగొట్టకపోతే అది డబ్బిచ్చి చావదు కదరా!"

వాడికి మతి పోయినట్లయింది.

"అదేమిటి సార్! మీరంటే ఎంతో (పేమతో రోజు ఆవిడే తాగడానికి డబ్బిస్తుందని మీరేగా అన్నారు."

"అవును అన్నాను- ఇప్పుడు ఎవరు కాదన్నారు?"

"మరింకా చావగొట్టటం ఎందుకు సార్?"

"చావగొడితేనే డబ్బిస్తుందిరా అది - లేకపోతే ఒక్క పైసా విదిల్చదు."

"కానీ ఆమె (పాణం కంటే ఎక్కువన్నారు కద్సార్!"

"అన్నాను- ఇప్పుడెవరు కాదన్నారు."

"మరి (పాణం కంటే ఎక్కువగా (పేమించే భార్యను అలా చావగొట్టటానికి మనసెలా వప్పుకుంది సార్?"

"ఒరేయ్ పిచ్చి రాస్కెల్! అది తాగడానికి డబ్బిస్తుందనే కదరా అంతగా (పేమించటం. మరి భర్తనేవాడు అనని అలా (పేమించాలనే కదా (పతి భారత (స్త్రీ కోరుకునేది."

"అవున్సార్! ఆవి మాట నిజమే."

"తాగించాలంటే దాన్ని చావగొడితేనే కదరా పని జరిగేది."

బేరర్ బు(ర గోక్కున్నాడు.

"మీ మాటలు నాకేం అర్థం కావటం లేద్సార్!"

"అర్థమవ్వాల్సిన అవసరం కూడా లేదురా- త్వరగా మందు ప(ట్రా."

బేరర్ అన్నీ కలిపిన కొత్త వింత (ద్రవం తెచ్చి అతని ముందుంచాడు.

పానకాలు గడగడా తాగేసి గ్లాసు కింద పెట్టాడు.

హఠాత్తుగా ముఖానికి చేతులు అడ్డం పెట్టుకుని భోరున ఏడ్వేయ సాగాడు.

"ఏమిటి సార్! మళ్ళీ ఏమయింది?"

"మా ఆవిడ గుర్తుకొచ్చిందిరా. పాపం- నేను కావాలా, బాటిల్ కావాలో తేల్చుకోమంది."

"ఎప్పుడు సార్?"

"వారం రోజులక్రితం."



"మీరేమన్నారు సార్?"

"బాటిల్ని అందించే భార్య కావాలన్నాను."

"ఆహా! ఎంత అద్భుతంగా మాట్లాడారు సార్."

"కానీ తనేమందో తెలుసా?"

"తెలీదు సార్."

"నీలాంటి బాటిల్గాడు నాకక్కర్లేదని వెళ్ళిపోయింది."

"పుట్టింటికా సార్?"

"షటప్! అ(ప్రాచ్యపు వెధవా- పుట్టింటికెళ్తే నేనిలా ఎందుకేడుస్తా(నా."

"మరెక్కడి కెళ్ళారండీ?"

"ఇంకోడితో లేచిపోయిందిరా."

"శివ శివ శివా!"

"నోర్మూయ్- నెవ్వెవడివిరా శివశివశివ అనడానికి."

"బార్ బేరర్నండీ."

"అయినా సరే! నా మీద జాలిపడ్డానికి వీల్లేదు."

"సరేనండీ పాపం! ఆ షాక్తో ఇలా అన్నీ కలిపి కొట్టేస్తున్నట్లున్నారండీ."

"నోర్మూసుకో- బాటిల్ పెట్టి కొడతాను. నాకెందుకురా షాక్."

"మీకు షాక్ కూడా లేదా సార్?"

"ఒక్క ఇంచ్ కూడా లేదు."

"ఎందుకని సార్?"

"నేను పని చేసేది షాక్ ఎబ్జార్వర్స్ తయారుచేసే కంపెనీలోరా. అందుకని ఎలాంటి షాకింగ్ న్యూస్ అయినాసరే మనికి షాక్ వుండదు."

"ఆహా! అమరులు సార్ మీరు."

కుర్చీలో నుంచి నేల మీదకు జారి కింద పడుకున్నాడు పానకాలు.

"సార్! నేల మీద పడుకున్నారేంటీ సార్...! లేచి కుర్చీలో కూర్చోండి సార్."

"ఏడ్చావ్! నేను పడుకుంది సోఫాలో."

"కాద్సార్- నేల"

"నోర్మూసుకో- నా సంగతి నాకెక్కువ తెలుసా? నీకా?"

"మీకేనండీ."

"ఇందాక నీకేం చెప్పాను?"

"మీరు షాక్ (ప్రూఫ్ మనిషని చెప్పారండీ."

"అంతేకాదు, నేను మహా డేంజరస్ మనిషిని కూడా."

"అలాగా సార్?"

"అవును. ఇప్పటికి నాలుగు మర్డర్ కేసుల్లో మానేజింగ్ డైరెక్టరుగా పని చేశాను."

"ఆహా! ఎంత గొప్ప ఫ్లాష్‌బాక్ సార్."

"ఒక మర్డర్ కేసులో మొత్తం ప్రొప్రయిటర్ షిప్ నాదే."

"ఆహా- తిరుగు లేదు సార్."

"ఇదంతా ఎందుకు చెప్తున్నానో తెలుసా?"

"తెలీదు సార్"

"ఇవాళ సాయంత్రం బ్రహ్మాండమైన మర్డర్ చేయబోతున్నాను."

"ఆ! ని....జం...గా....నా...సా...ర్."

"నిజంన్నర. ఇదిగో- నిన్నే కత్తి కూడా కొన్నాను. చూస్తావా?"

అంటూ కత్తి బయటకు తీశాడు. దాని స్ప్రింగ్ నొక్కేసరికి బ్లేడ్ 'జిప్' మంటూ బయటికొచ్చింది.

"కానీ- ఎందుకు సార్ మర్డర్ చేయటం?"

"లేకపోతేవాడు పెళ్ళాని ఎత్తుకుపోతాడా? రెండు ముక్కలుగా నరికేస్తాను వాడిని."

"కానీ మీ ఆవిడే ఇష్టపూర్వకంగా వెళ్ళిపోయిందన్నారు కద్సార్. ఇంకో వాడి తప్పేముంది?"

"అయినా సరే! దాన్ని కిడ్నాప్ చేసుకెళ్ళేప్పుడు నాకు రోజూ తాగడానికి డబ్బిచ్చే ఏర్పాటు వేరే ఏదైనా చేసిపోవాలి కదా."

"అవున్సార్- తప్పకుండా చేయాల్సిందే."

"అందుకే వాడిని యివాళ లేపేయదల్చుకున్నాను. నిన్నే కత్తికొన్నాను చూస్తావా?"

"ఇంతకుముందే చూపించారు సార్... ఇంక బిల్లు చెల్లిస్తారా సార్."

"ఏంటి బిల్లా?"

"అవున్సార్- బిల్లు."

"ఏం బిల్లు?"

"అదే సార్ డ్రింక్స్ బిల్లు."

"ఏయ్! నీకేమయినా తెలివుందా?"

"ఎందుకు సార్?"

"ఇంతవరకూ చెప్పిందంతా ఏంటిబే- ఇప్పుడు అదివరకులాగా రోజూ తాగుడు బిల్ కట్టడానికి మా ఆవిడ లేదు. లేచిపోయిందనేగా?"



"అవున్సార్."

"మరింక బిల్లెలా అడుగుతున్నావురా?"

"బిల్లు కట్టాలి కద్సార్ మరి."

పానకాలు వెనుక పాకెట్‌లో నుంచి యింకో చిన్న కత్తితీశాడు.

"ఇదెప్పుడు కొన్నానో తెలుసా?"

"తెలీదు సార్."

"నిన్న పొద్దున్న."

"అలాగా సార్!"

"ఎందుకొన్నానని అడగవేం?"

"నేనడగను సార్."

"అడక్కపోతే పొడుస్తా! అడుగు నా కొడుకా" అమాంతం లేచి అతని చొక్కా పట్టుకున్నాడు పానకాలు.

"సరే సార్! వదిలేయండి అడుగుతాను."

"అలా రా దారికి. అడుగు" అంటూ అతని చొక్కా వదిలేశాడు.

"ఈ కత్తి ఎందుకొన్నారు సార్?"

"బిల్ అడిగితే పొడవడానికి. తెల్సిందా?"

"తెల్సింది సార్."

"ఇప్పుడు బిల్ అడుగుతావా?"

"అడగను సార్."

"మీ ప్రొప్రయిటర్ అడుగుతాడా?"

"అడుగుతాడు సార్."

"అడుగుతే ఆడూ రెండు కట్ పీస్‌లయిపోతాడు గదా."

"సరే సార్! నేను వెళ్ళి చెప్తాను."

"నేనూ వస్తున్నా పద."

అతని వెనుకే తనూ తూలుతూ కౌంటర్ దగ్గరకు చేరుకున్నాడు పానకాలు.

"ఇదిగో ప్రొప్రయిటరూ! ఇది కత్తి- నా చేతిలో వుంది. అది బిల్లు. సర్వర్ చేతిలో వుంది. నేను ఇలా బయటికెళ్తున్నా. ఏం కోరుకుంటావో కోరుకో ఫో..."

అంటూ బయటకు నడుస్తూంటే ప్రొప్రయిటర్ మాట్లాడకుండా ఊరుకుండి పోయాడు.

"సార్! వెళ్ళిపోతున్నాడు సార్" అన్నాడు బేరర్.

"పోనీ- గూండా కొడుకులతో ఎందుగ్గొడవ" అన్నాడు ప్రొప్రయిటర్.

పానకాలు ఆ మాట విని ఆనందంగా ఆటోలో కూర్చున్నాడు.

"ఎక్కడికి సార్?"

"రవీంద్రభారతి పోనీ" హుషారుగా అన్నాడు.

ఆటో బయల్దేరింది.

• • •

రవీంద్రభారతి చాలా కలర్‌ఫుల్‌గా వుంది.

రచయిత చంద్రకాంత్‌కి సన్మానం అనేసరికి జనం ఎక్కువ సంఖ్యలోనే గుమి కూడిపోయారు. అయితే వాళ్ళంతా అతని అభిమానులనుకుంటే మాత్రం దెబ్బ తీసినట్లే.

వాళ్ళల్లో చాలామంది చంద్రకాంత్ తాలూకూ అపోజిషన్ గ్రూప్ రైటర్స్ తాలూకూ అభిమానులు.

రచయితల్లో రెండు గ్రూపులుండటమే అందుక్కారణం.

ఆ మీటింగ్‌లో రసాభాస చేసి సన్మానాన్ని నవ్వులపాలు చేయాలని వాళ్ళ ప్లాన్. ఎప్పటినుంచో ఈ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు వాళ్ళు.

ఎందుకంటే కిందటిసారి వాళ్ళల్లో ఓ రచయిత ఏర్పాటు చేసుకున్న సన్మానసభలో చంద్రకాంత్ కొంతమంది కిరాయి రౌడీలను తీసుకొచ్చి నానా గలాటా చేయించాడు.

కనుక ఇప్పుడు వాళ్ళంతా టమాటోలు, కోడిగుడ్లు రహస్యంగా జేబుల్నిండా నింపుకొచ్చారు.

వీళ్ళ హడావుడి ఇలా వుండగా మరో వర్ధమాన రచయిత పదిమంది కిరాయి రౌడీలను రవీంద్రభారతికి తీసుకొచ్చాడు.

ఆ రచయిత పేరు విష్ణుమూర్తి.

అతను రాయక రాయక ఓ నవల రాశాడు. ఆ నవలను పట్టుకుని అడ్డమయిన పత్రికాఫీసుకి తిరిగాడు.

కానీ ఎవరూ వేయడానికి వప్పుకోలేదు.

ఒక ఎడిటర్ ఆ నవల పబ్లిష్ చేస్తానని చెప్పి దానిని చంద్రకాంత్‌కి అమ్మేశాడు. చంద్రకాంత్ ఆ నవల్నే టీవీ సీరియల్‌గా మార్చాడు.

"ఆ టీవీ సీరియల్ నా సబ్జెక్టే" అన్నాడా రచయిత నీలకంఠంతో.

"కాదు, చంద్రకాంత్ రాశాడు" అన్నాడు నీలకంఠం.

"అబద్ధం- ప్రతి అక్షరం నాదే! నాకు గుర్తుంది"



"ఆ విషయం నువ్వెలా రుజువు చేయగలవు?"

"రాస్కెల్! నీలాంటి బటాచోర్ క్రియేటివ్‌హెడ్‌ని మర్డర్ చేసినా పాపం లేదురా" అంటూ చొక్కా పట్టుకున్నాడు. కత్తి తీసి పొడవబోయాడు. మామూలు గానే వాచ్‌మెన్ వచ్చి అతనిని బయటకి ఈడ్చుకెళ్ళిపోయాడు.

"నీలాగా రోజూ గొడవ చేసి బయటకు ఈడ్వబడే రచయితలు బోలెడుమంది. ఎందుకొచ్చిన గొడవ- సైలెంట్‌గా వెళ్ళిపో" సలహా ఇచ్చాడు.

అతను సైలెంట్‌గా వచ్చేశాడు.

కానీ ఆ రోజునుంచీ చంద్రకాంత్ మీద 'రివెంజ్' కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆరోజు ఇవాళ వచ్చింది.

• • •

పోలీసుల కంటపడకుండా తప్పించుకు పారిపోయిన విక్కీ మారువేషంలో ముందు సీట్లోనే కూర్చుని వున్నాడు.

కర్నల్ కనకారావ్ జేబులో ఆ పెన్ వుందా లేదా? అని పరీక్షగా చూసి నిర్ధాణ చేసుకోడానికి వచ్చాడతను.

ఒకవేళ కనకారావ్ జేబులో కనిపించకపోతే ఇంటి దగ్గర వున్నట్లే కనుక ఇంటికెళ్ళి ఆ పెన్ ఎలాగయినా దొంగిలించి పారిపోవాలని ప్లాన్ చేశాడు.

ఆఖరి వరుసలో ఓ హేండ్‌బ్యాగ్‌తో మారువేషంలో కూర్చుని వున్నాడు విక్కీ అసిస్టెంట్ వీర్రాజు.

తన బాస్ విక్కీయే వజ్రం దొంగ అని కర్నల్ కనకారావ్ కోర్టుకెళ్ళి రుజువు చేయబోతున్న సందర్భంలో అతనిని అంతం చేయడానికి వేసిన మొదటి పథకం ఫెయిలవటంతో ఇప్పుడు రెండో పథకం తయారు చేశాడు.

ఆ పథకం ప్రకారం సన్మానసభ సగంలో వుండగా కల్నల్ కనకారావ్ రచయిత చంద్రకాంత్‌కి సన్మానం చేస్తూన్న సమయంలో తన దగ్గరున్న ఏకే ఫార్టీ సెవెన్ తీసి కాల్పులు జరిపి కర్నల్ కనకారావ్‌ని ఫినిష్ చేసి, అతని దగ్గరున్న పెన్‌లోకి వజ్రాలు తను కాజేయాలి- దాంతో రాణి చచ్చినట్లు తననే పెళ్ళి చేసుకుంటుంది.

మరో పక్క ఇన్స్‌పెక్టర్ రాంబాబు, అతనితోపాటు డాకూరాణి ఎంట్రన్స్ పక్కన నిలబడి కల్నల్ కనకారావ్ కోసం ఎదురుచూస్తున్నారు.

ఇంకో పక్క రవీంద్రభారతిలో ఏ ప్రోగ్రామ్ జరిగినా హాల్లోకి జొరపడిపోయి తప్పట్లు కొట్టే జనాభా ఇంకొంతమంది-

అసలు తన భర్త గోపాల్రావ్ తీసుకొచ్చిన రచయిత చంద్రకాంత్ నిజంగా రచయిత చంద్రకాంతేనా అని అనుమానం పట్టుకున్న సీత ముందు వరుసలోనే సస్పెన్స్‌తో కూర్చుంది.

తను ప్రేమించింది నిజమయిన సిసలయిన రచయిత చంద్రకాంత్‌నేనా అన్న విషయం తేల్చుకోడానికి పూజా ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

∘ ∘ ∘

కర్నల్ కనకారావ్ మైక్ ముందుకొచ్చాడు.

"లేడీస్ అండ్ జెంటిల్మన్" అంటూ ఆడియన్స్ వైపు చూశాడు పరీక్షగా.

ఆడియన్స్‌లో టెర్రరిస్ట్ ఎవరయినా కూర్చుని నెమ్మదిగా గన్‌తీస్తున్నాడా అన్న అనుమానం వచ్చిందతనికి.

"తెలుగులో మాట్లాడు" తెలుగు భాషా అభిమాని అయిన ఒక తమిళియన్ అరిచాడు జనంలో నుంచి.

తెలుగు వాళ్ళంతా అతని వైపు చిరాగ్గా చూశారు.

"సోదర– సోదరీమణులారా!" అన్నాడు కనకారావ్.

"తెలుగులో వద్దు– హిందీలో మాట్లాడు" అరిచారు తెలుగువాళ్ళు బిగ్గరగా.

కనకారావ్‌కి వళ్ళుమండిపోయింది.

గన్ పెట్టి అరిచే వాళ్ళను కాల్చేద్దామనిపించింది.

"భాయిమో–బెహనో" అన్నాడు కోపం అణచుకుని.

"ఉర్దూమే బోల్" అరిచాడు ఓల్డ్ సిటీ పౌరుడొకడు ఉద్వేగంతో.

"నేను ఉర్దూలో మాట్లాడను" తనూ కోపంగా అరిచాడు కనకారావ్.

"ఎందుకు మాట్లాడవు?"

"ఎందుకేమిటి నీ తలకాయ? నాకు ఉర్దూ రాదు గనుక."

జనమంతా ఆనందంగా ఈలలు వేసి తప్పట్లు కొట్టారు.

"ఈ రోజు మనందరం మన తెలుగువాళ్ళ అభిమాన రచయిత శ్రీ చంద్రకాంత్ గారికి సన్మానం చేయడానికి ఇక్కడ సమావేశమయ్యాం. చంద్రకాంత్ ఎంత గొప్ప రచయితో మీ అందరికీ తెలుసు".

"తెలుసు – హిందీ సీరియల్సన్నీ మక్కికి మక్కీ కాపీలు కొట్టేవెదవా..."

చంద్రకాంత్ వ్యతిరేక ముఠా వాళ్ళు అరిచేసరికి అంతా ఘొల్లుమన్నారు.

ఇన్స్‌పెక్టర్ రాంబాబు తన ప్రక్కనే నిలబడ్డ రాణి చెయ్యి గిల్లాడు.



"అదిగో! కనకారావ్ జేబులో పెన్ ఉంది చూడు అదేనా?"

"అదే" అంది రాణి.

"ఇంక ఆ వజ్రం ఎక్కడికీ పోదు. అంతిమ విజయం మనదే." అన్నాడతను.

"కానీ మనం దాన్నెలా కొట్టేస్తాం?"

"ఎలాగయినా సరే, అవసరమైతే కాల్పులు జరిపయినాసరే కొట్టేసాం."

"అయితే స్టేజ్ వెనుకవైపుకి వెళదాం పద."

ఇద్దరూ స్టేజ్ వెనక్కి చేరుకున్నారు.

విక్కీ మారువేషం వేసుకుని ముందు వరుసలో గోపాల్రావ్ పక్కనే కూర్చున్నాడు.

అతని ముఖం చూసిన భవానీశంకర్‌కి అనుమానం వచ్చింది.

"బ్రదర్! మీ మొహం ఇంతకు ముందెక్కడో చూసినట్లుందే... ఎక్కడ చూసి వుండొచ్చు?"

"కూరగాయల మార్కెట్‌లో."

"కూరగాయల మార్కెట్లోనా?"

"అవును."

"అక్కడేం చేస్తుంటారు మిత్రమా?"

"వంకాయలు అమ్ముతూంటాను."

"వంకాయలమ్ముతారా?"

"అవును. ఏం అమ్మకూడదా?"

"నిక్షేపంగా అమ్మవచ్చు బ్రదర్! కానీ వంకాయలమ్మేవాడికి వీఐపీ పాస్ ఎలా యిచ్చారా అని."

"వంకాయలు చూసి కాదు వీఐపీ పాస్ యిచ్చింది మనకున్న మనీ పవర్ చూసి."

"వాళ్ళలా మాట్లాడుతూండగానే పానకాలు తూలుతూ మరో పక్క సీట్లోంచి లేచి నిలబడ్డాడు.

వేదిక సైడ్ కర్టెన్‌లో ఉంటే చంద్రకాంత్‌ని లేపిపారేటయటం తేలికని అతనికి అర్థమయింది. అటువైపు నడవబోయి కిందపడి చేతులతో పాక్కుంటూ వెళుతుంటే ముందు వరుసలో వాళ్ళంతా నవ్వాపుకుంటూ చూస్తున్నారు.

"సోదరులారా! అలాంటి రచయిత చంద్రకాంత్‌పట్ల మీకున్న అభిమానానికి గుర్తు యీ క్రిక్కిరిసిన హాలు" అన్నాడు కనకారావ్ మళ్ళీ.

"కాదూ– వాడి భరతం పట్టాలని కోరుకుంటున్న జనాభా ఇదంతా" అన్నాడు ప్రతిపక్షం ముఠాలోనుంచి ఒకడు.

కనకారావ్ ఒళ్ళు మండిపోయింది.

"షటప్! ఎవడాడు అరిచింది?"

"నేను..." అంటూ పాతికమంది అరిచారు.

"దమ్ముంటే లేచి నిలబడండి కాల్చిపారేస్తాను."

పదిమంది లేచి నిలబడ్డారు.

కనకారావ్‌కి ఆవేశం ఆగలేదు.

రివాల్వర్ తీసి గాలిలోకి కాల్చాడు.

పైనుంచి దభేల్‌మని ఒకడు కిందపడ్డాడు.

అందరూ వాడి చుట్టూ మూగారు.

వాడి దగ్గర్నించి బ్రాందీ వాసన తెగ వస్తోంది.

"నేనే... ఆకాశంలో ఎగురుతూంటే ఎవడో కాల్చాడు. కిందపడ్డాను. మా పక్షుల్ని కాల్చటం పాపమని వాడికి చెప్పండి. పక్షులు కూడా మనుషులే! వాటిక్కూడా బాధ వుంటుంది. వాటిక్కూడా రెక్కలుంటాయ్. వాటితో అవి ఎగురుతాయ్. కాళ్ళతో నడుస్తాయ్. చేత్తో తల గోక్కుంటాయ్. అందుకే పక్షులను ప్రేమించండి. జై పక్షినాడూ..." అన్నాడు మాట్లాడలేక మాట్లాడుతూ.

"సైలెన్స్" అరిచాడు కనకారవ్.

"షటప్..."

"ఎవడా మాటంది?"

"నువ్వే..."

"కాల్చిపారేస్తాను. ఎవడాడు చెప్పండి?"

"నువ్వే" ఈసారి బోలెడుమంది అరిచారు.

రత్నప్రభ సైడ్ కర్టెన్‌లోంచి విరుచుకుపడింది.

"ఇదేం మీ ఇల్లు కాదు పిచ్చి కేకలేస్తే అందరూ భయపడిపోటానికి. ముందు సన్మానం కానీండి."

కర్నల్‌కి ఆమె సలహా నచ్చింది.

"మనమందరం ప్రముఖ రచయిత చంద్రకాంత్‌ని సన్మానించాలని నిశ్చయించుకున్న సందర్భంగా శ్రీ చంద్రకాంత్‌గారిని వేదిక మీదకు రావలసిందిగా ఆహ్వానిస్తున్నాను."

"హో... " అంటూ అరిచారు చాలామంది.

భవానీశంకర్ ముందు వరుసలోంచి లేచి నిలబడ్డాడు.

వెనక వరుసలో ఉన్న చాలామంది అతనిని చూసి ఆనందంతో తప్పట్లు కొట్టారు.



అతను వేదిక మీదకొచ్చి సభకు నమస్కరించి కుర్చీలో కూర్చున్నాడు.

"ఇప్పుడు శ్రీమతి రత్నప్రభా కనకారావ్ రచయిత చంద్రకాంత్‌కి సన్మానం చేస్తారు."

రత్నప్రభ ఆనందంగా వేదిక మీదకొచ్చింది.

రచయిత చంద్రకాంత్, అతని భార్య అష్టలక్ష్మి వెనుక వరుసలో కూర్చుని ఆనందంగా చూస్తున్నారు.

"ఇప్పుడు చూడు ఏం జరుగుతుందో..." ఉత్సాహంగా అన్నాడు చంద్రకాంత్.

"ఏం జరుగుతుంది?" అడిగింది అష్టలక్ష్మి.

"నా అభిమానులందరికీ వాడెవడో డూప్లికేట్ అని తెలిసి గొడవచేస్తారు. నా ఫోటో చూడని వాళ్ళెవరుంటారు?"

"అంటే వాళ్ళే వాడు డూప్లికేట్‌గాడని తేల్చేస్తారా?"

"తేల్చటం ఏమిటి?" దుమ్ము దులిపేస్తారు."

అతనూహించినట్లే కొంతమంది లేచి-

"అతను రచయిత చంద్రకాంత్ కాదు. మోసం- దగా..." అంటూ కేకలు వేశారు.

కనకారావ్ మొహంలో ఆనందం కనిపించింది.

తను బ్రహ్మాండంగా ఋజువు చేయబోతున్నాడు అతను నిజంగా రచయిత చంద్రకాంత్ కాదని.

భవానీశంకర్ గోపాల్రావ్‌కి సైగ చేశాడు.

గోపాల్రావ్ తను తీసుకొచ్చిన గ్యాంగ్ మెంబర్సుకి సైగ చేశాడు.

వాళ్ళంతా ఒక్కుమ్మడిగా లేచి-

"అతనే చంద్రకాంత్... రచయిత చంద్రకాంత్ సన్మానం వర్ధిల్లాలి" అంటూ అరిచేశారు.

వాళ్ళ నినాదాలు వింటూనే కనకారావ్ మొహం వాడిపోయింది.

అప్పుడే వేదిక దగ్గరకు చేరుకున్న చంద్రకాంత్, అతని భార్య అష్టలక్ష్మి మొహాలు కూడా వాడిపోయాయ్.

"అదేమిటి? వాళ్ళెవరో వాడే చంద్రకాంత్ అంటున్నారు..." అడిగింది అష్టలక్ష్మి.

"చాలా పెద్ద ఎత్తులో గూడుపురాణీ జరుగుతోంది. నేనిప్పుడే తేల్చుకుంటాను" అన్నాడు చంద్రకాంత్.

అతను వేదిక మెట్లు ఎక్కుతూండగా చూశాడు ఆ పక్కనే కింద పడిపోయి వున్న పానకాలు.

అతని తాగుడు నిషా అమాంతం దిగిపోయింది.

"వీడినెక్కడో చూసినట్లుందే" అనుకుని అమాంతం లేచి నిలబడి ఒళ్ళంతా దులుపుకున్నాడు. అతని కళ్ళకు యింకా అందరి మొహాలు మసగ్గానే కనబడుతున్నాయ్. అందరూ చంద్రకాంత్ లలాగానే కనబడుతున్నారు.

వేదిక మీద రత్నప్రభ దీపారాధన చేసింది.

మంగళవాయిద్యాలు స్టేజికీ ఓ మూల నిలబడి వాయిస్తున్నారు మేళాం వాళ్ళు.

పానకాలు నవ్వుకున్నాడు.

"ఆ! సన్మానం జరుగుతోంది గనుక వాడే చంద్రకాంత్ అయ్యుంటాడు" అనుకుంటూ వేదిక అతి కష్టం మీదెక్కి భవానీశంకర్ వైపు నడిచాడు.

కత్తి బయటికి తీసి రడీగా పట్టుకున్నాడు.

రెండే రెండు పోట్లు... అవుట్...

హఠాత్తుగా చంద్రకాంత్ మైక్ దగ్గరకొచ్చాడు.

పూనకం వచ్చినట్లు ఆవేశంతో ఊగిపోతూ మైక్ అందుకున్నాడు.

"సోదర సోదరీమణులారా! ఇదంతా మోసం... దగా... కుట్ర.... అసలు చంద్రకాంత్ని నేను. వాడు ఎవడో మోసగాడు...."

అంతవరకూ అవకాశం కోసం ఎదురుచూస్తున్న వీర్రాజు నెమ్మదిగా స్తంభం చాటు నుంచి గన్ తీశాడు. అది కనబడకుండా ఓ సంచీలో వుంచిన పూలదండ దానికి చుట్టి దానిని కర్నల్ కనకారావ్కి గురిపెట్టాడు.

కనకారావ్కి అమితయిన ఉత్సాహంగా వుంది.

రచయిత చంద్రకాంత్నని చెప్పుకుంటూ తన ఇంట్లో తిరుగుతూ తన కూతురు పూజను వల్లో వేసుకున్న ఆ డూప్లికేట్గాడు డూప్లికేట్ అని బ్రహ్మాండంగా తేలిపోతోంది.

ఇంక తను వాడిని గన్ తీసుకుని కాల్చి ఇంట్లో నుంచి పరుగెత్తించవచ్చు.

వీర్రాజు గన్ తాలూకు బుల్లెట్ తిన్నగా వెళ్ళి కనకారావ్కీ, రచయిత చంద్రకాంత్కీ మధ్య తగిలింది.

కర్టెన్ వెనక ఉన్న జనం చెల్లాచెదురయి పరుగెత్తారు.

కర్నల్ కనకారావ్ అమాంతం టేబుల్ కింద పడిపోయి తన రివాల్వర్ని ఆడియెన్స్కి గురిపెట్టాడు.

ఖచ్చితంగా టెర్రరిస్ట్లు తనను చంపటానికి వచ్చి ఉంటారని అర్థమయి పోయింది.

అందుకని టెర్రరిస్ట్ల కోసం వెతకటం ప్రారంభించాడు బై నాక్యులర్స్ పెట్టుకుని.

ఈలోగా జనం మధ్య నుండి పాక్కుంటూ వేదిక దగ్గరకొస్తున్న పానకాలుని చూసేసరికి చంద్రకాంత్ పై ప్రాణాలు పైనే పోయాయి.



"అష్టలక్ష్మీ!" భయంగా పిలిచాడు.

"ఊ!"

"ఆ పానకాలుగాడే నన్ను చంపడానికి తుపాకీ కాల్చి వుంటాడు కదూ?"

"ఇంకా అనుమానమెందుకు? పద పారిపోదాం."

ఇద్దరూ పారిపోబోతుంటే కనకారావ్ అతనిని అమాంతం లాగి కిందపడేశాడు తన పక్కనే.

"ఎక్కడికి పోతున్నావు?" అతనిని పైకి లేవనీకుండా జట్టు పట్టుకుని అడిగాడు.

"ఇంటికి."

"ఎందుకు పారిపోతున్నావ్?"

"సరదాకి."

"కాల్చిపారేస్తాను- ఇక్కడి నుండి వెళితే."

"ఎందుకు?"

"అసలు రచయిత చంద్రకాంత్వి నువ్వే కదా?"

"అవును."

"మరి వాడెవడో తనే చంద్రకాంత్నని సన్మానం చేయించుకుంటూ ఉంటే వాడి నాటకం బయటపెట్టవద్దూ?"

"పెట్టాల్సిందే- కానీ పెట్టను."

"ఎందుకని?"

"ఒకడు తాగి నా మీద కాల్పులు జరుపుతున్నాడు."

"నీ మీదా?"

"అవును."

"కాదు. వాడు కాల్పులు జరిపింది నా మీద."

"కాదు సార్- నా మీద."

"పిచ్చివాగుడు వాగావంటే కాల్చిపారేస్తాను- కాల్పులు జరిపింది నా మీద" రివాల్వర్ అతనికి గురిపెడుతూ అన్నాడు.

"సరే- మీ మీదే."

"నన్ను కాల్చిపారేయడానికి టెర్రిస్టులు ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నారు."

"నన్ను కూడా పానకాలు గాడు ఎప్పటినుంచో చంపడానికి చూస్తున్నాడు."

"పానకాలు గాడెవరు?"

"ఏమో తెలీదు" అబద్ధమాడేశాడు.

"ఆల్‌రైట్! ముందు మైక్ ముందుకెళ్ళి ఎనౌన్స్ చేయి– నువ్వే చంద్రకాంత్‌వని"

"వద్దు సార్! ప్రస్తుత పరిస్థితుల్లో బావుండదు."

"ఎనౌన్స్ చేస్తావా చేయవా?"

"ప్రాణానికి రిస్క్ సార్."

"అయినా సరే చేయాల్సిందే."

"సారీ సార్! ఇంకో రోజెప్పుడయినా తప్పకుండా చేస్తాను."

"నో! ఇప్పుడే చేయాలి."

"వద్దు సార్."

"అయితే ఇక్కడే ఛస్తావ్" రివాల్వర్ గురిపెట్టాడు కనకారావ్.

ఇన్‌స్పెక్టర్ రాంబాబు, డాకూరాణి వేదిక మీదకొచ్చారు పాకుతూ.

కర్నల్ కనకారావ్ టేబుల్ కింద పాకుతూండటం కనిపించింది వారికి.

"ఇదే మంచి అవకాశం" అన్నాడు రాంబాబు.

"దేనికి?" అడిగింది.

"నీ తలకాయ్! దేనికేమిటి? ఆ కల్నల్‌గాడి జేబులో పెన్ కొట్టేయడానికి."

"ఎలా?"

"ఎలాగేముంది? ఎలాగో వాడెవడో కాల్పులు జరుపుతున్నాడు... ఇదే హడావుడిలో నేను కూడా గాల్లోకి కాల్పులు జరిపి ఆ ఎమోషన్‌లో వాడి దగ్గర రివాల్వర్ కాజేస్తాను. వెంటనే నువ్వు వాడి పెన్ లాక్కుని మనం అనుకున్న చోటకు పరుగెత్తి జీప్‌లో కూర్చో... ఇద్దరం పారిపోదాం."

"సరే."

రాంబాబు మైక్ దగ్గరకొచ్చాడు.

"కాల్పులు జరుపుతున్నవారు వెంటనే పోలీసులకు లొంగిపోండి– లేకపోతే ఎదురు కాల్పులు జరపాల్సి వస్తుంది" అన్నాడు కొంచెం ఫోజుయిచ్చి.

అతని మాట పూర్తవకుండా అతని చెవిపక్క నుండి అరడజను బుల్లెట్స్ దూసుకుపోయినాయి. దాంతో వెనుక వున్న కర్టెన్ తెగి వేదిక మీద పడిపోయింది.

ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న విక్కీ అమాంతం జనంలో నుంచి లేచి గాల్లోకెగిరి వేదిక మీదకు జంప్ చేశాడు.

భవానీశంకర్ అమాంతం అతని చేయి అందుకుని మెలిపెట్టాడు.

"ఏమిటి మిత్రమా! అర్జంటుగా ఫ్లై డైవ్ కొట్టావ్? సంగతేమిటి?"

విక్కీ గాబరాపడ్డాడు.



తనను గుర్తుపడతాడేమో అని.

"నేను మీ ఫాన్‌ని. దండ వేయడానికి వచ్చాను" అన్నాడు ఆ పక్కనే వున్న దండ తీసి మెడలో వేస్తూ.

భవానీశంకర్, గోపాల్రావ్ ఏర్పాటు చేసుకున్న జనమంతా తప్పట్లు కొట్టారు.

"ఫ్రెండ్స్! నేనే రచయిత చంద్రకాంత్‌నని ఒక వెధవ యిప్పుడే వేదిక మీదకొచ్చి రక్కున అదృశ్యమయిపోయాడు. అలాంటి డూప్లికేట్ గాళ్ళకు బుద్ధి చెప్పండి" అన్నాడు గోపాల్రావ్.

చంద్రకాంత్ ప్రత్యర్థులంతా తప్పట్లు కొట్టారు.

"టేబుల్ కింద దూరాడు– బయటకు తరుము– వాడి పని మేము చూస్తాం" అన్నారు కొంతమంది అతని ప్రత్యర్థులు.

చంద్రకాంత్‌కి పౌరుషం పొడుచుకొచ్చింది.

"నేనే సిసలయిన చంద్రకాంత్‌ని" అన్నాడు లేచి నిలబడుతూ.

పానకాలు చేతిలో కత్తి సర్రున వచ్చి అతని చేతిని రాసుకుని కిందపడింది.

చంద్రకాంత్ అదిరిపడ్డాడు.

ప్రాణం పోయి తిరిగి వచ్చింది.

"కాదు– సిసలయిన చంద్రకాంత్‌ని నేను" అన్నాడు భవానీశంకర్.

"ఐ సెకండ్ ఇట్" అరిచాడు గోపాల్రావ్.

"ఐ థర్డ్ ఇట్" అంది పూజ

"ఐ హండ్రెడ్ ఇట్" అన్నాడు జనంలో నుండి ఒకడు.

మరో కత్తి పానకాలు చేతి నుండి బులెట్‌లాగా దూసుకొచ్చి మైక్‌కి కొట్టుకుని కిందపడిపోయింది.

అది చూసేసరికి భవానీశంకర్‌కి మూడ్ మారిపోయింది.

"భాయియో బెహనో– నా మూడ్ మారిపోయింది. నేను ప్రస్తుతం నా పక్కన వున్న పోటీ అభ్యర్థి చంద్రకాంత్‌కి అనుకూలంగా ఈ పోటీ నుండి విరమించు కుంటున్నాను" అన్నా చిరునవ్వుతో.

"అప్పుడే ఇంకో కత్తి వచ్చి చంద్రకాంత్ చెవిని రాసుకుని వెళ్ళిపోయింది.

చంద్రకాంత్ పై ప్రాణం పైనే పోయింది.

"సోదర సోదరీమణులారా! నేను తాగిన మైకంలో మాట్లాడాను ఇందాక – రచయిత చంద్రకాంత్‌ని నేను కాదు– అసలయిన చంద్రకాంత్ ఇతనే" అన్నాడు.

పానకాలుకి చాలా చిరాగ్గా వుంది వ్యవహారం.

మందు బాగా ఎక్కువయిపోవడంతో ఒక్కొక్క చంద్రకాంత్ ఇద్దరుగా కనబడుతున్నారు.

ఆ గొడవతోనే చస్తూంటే ఇద్దరూ వేదిక మీదకొచ్చి నలుగురిగా కనబడి మరీ కన్‌ఫ్యూజ్ చేస్తేస్తున్నారు.

ఎన్ని కత్తులు విసిరినా నలుగురి మధ్యలో వెళ్ళిపోతున్నాయి.

ఈసారి రెండు కత్తులు నలుగురి మీదకూ విసిరాడతను.

మళ్ళీ మిస్సయినయ్.

చంద్రకాంత్‌కి వణుకు పుట్టుకొచ్చేసింది.

అక్కడి నుండి వణుకుతో పరుగెత్తబోయాడు.

కానీ కర్నల్ కనకారావ్ అమాంతం పైకి లేచి అతని కాలర్ పట్టుకున్నాడు వెనుక నుంచీ.

"ఏయ్ మిస్టర్! నాకు తెలుసు– నువ్వే ఒరిజినల్ రైటర్."

"కాదు" అన్నాడు చంద్రకాంత్ భయంగా.

"నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువేస్తాను. నిజం చెప్పేసెయ్– వీడు డూప్లికేట్" అని అరిచాడు కనకారావ్.

"బాబోయ్– కాదు వాడే ఒరిజినల్" అన్నాడు చంద్రకాంత్.

"అవున్సార్– మా ఆయన పేరు ఇంద్రకాంత్" అంది అష్టలక్ష్మి 'చంద్రకాంత్ కాదు."

"నేన్నమ్మను."

సరిగ్గా అప్పుడే సత్తిరాజు ఇంకో బులెట్ వదిలాడు.

కనకారావ్ అమాంతం ఎగిరి నేలమీద పడిపోయాడు మళ్ళీ.

చంద్రకాంత్ వ్యతిరేక వర్గాలు బులెట్స్‌నీ, కత్తులునూ లెక్కచేయకుండా భవానీశంకర్ మెడలో దండలు వేస్తూనే వున్నారు.

రాంబాబు ఇంక ఆలస్యం చేయదల్చుకోలేదు.

అమాంతం కర్నల్ కనకారావ్ మీద పడి అతని రివాల్వర్ని ఈడ్చితన్ని దూరంగా పడేట్లు చేసి అతని జేబులోని పెన్ లాక్కుని పరుగెత్తాడు.

కానీ నాలుగుడుగులయినా వేశాడో లేదో విక్కీ అతని కాళ్ళకు తన కాలు అడ్డంపెట్టి కింద పడేసి ఆ పెన్ తను లాక్కుని పరుగెత్తాడు.

డాకూరాణి గాల్లోకి ఎగిరి విక్కీ భుజాల మీద ఒక్క తన్ను తన్ని అతని చేతిలోని పెన్ లాక్కుని తను పరుగెత్త సాగింది.



ఆ దృశ్యం చూసి భవానీశంకర్ డాకూరాణి వెంటపడి చీరకొంగు పట్టుకుని లాగాడు.

దభేల్ మంటూ కిందపడింది డాకూరాణి. చీర వూడిపోయి భవానీ శంకర్ చేతుల్లో కొచ్చింది.

ఆమె చేతిలోని పెన్ ఎగిరి దూరంగా పడింది.

అప్పుడే కింద నుంచి లేచిన రాంబాబు స్ప్రింగ్‌లా ఎగిరి పెన్ అందుకుని బయటకు పరుగెత్తాడు.

కర్నల్ కనకారావ్, విక్కీ, డాకూరాణీ, భవానీశంకర్, గోపాల్రావ్ అందరూ అతని వెంటపడ్డారు.

అప్పటికే తుపాకి కాల్పులతో చిరాకెత్తిపోయిన థియేటర్ ప్రేక్షకులు గావుకేకలతో బయటకు పరుగెత్తి ఆ వీధులన్నిటిలోనూ నుండిపోయారు. దాంతో ట్రాఫిక్ జామ్ అయిపోయి, ఎక్కడి జనం అక్కడ ఎక్కడి వాహనాలక్కడా నిలిచిపోయినాయి.

రాంబాబు జనాన్ని తప్పించుకోడానికి ప్రయత్నిస్తూ కిందపడి లేస్తూ పరిగెడుతూంటే మిగతావారంతా అతని వెంటపడ్డారు.

చివరకు రాంబాబుని కిందపడేసి ఆ పెన్ తను లాక్కున్నాడు విక్కీ.

అదంతా చూస్తున్న భవానీశంకర్ అమాంతం ఎగిరి తను లాక్కున్నాడు.

అతని చేతి నుంచీ మళ్ళీ డాకూరాణి లాక్కోబోయేసరికి పెన్ కిందపడింది.

అప్పుడే కనకారావ్ బూటు కాలు పొరబాటున ఆ పెన్ మీద పడి పెన్ రెండు ముక్కలయింది.

విక్కీ ఎగిరి ఆ రెండు పెన్ ముక్కలూ తీసుకున్నాడు.

ఆత్రుతగా వాటి లోపల చూశాడు.

ఖాళీ–

అతని ముఖం వాడిపోయింది.

అతని చేతిలో నుంచి ఆ పెన్ ముక్కలు డాకూరాణి లాక్కుని చూసి విసిరి పారేసింది నిరాశగా.

అందరి చూపులూ కర్నల్ వైపు తిరిగాయి.

మరుక్షణం ముగ్గురూ కర్నల్ గొంతు పట్టుకున్నారు.

"ఏం చేశావ్ వజ్రాలు?"

"వజ్రాలేంటి?"

"అవే... బ్యాంకులో నుంచి ఎవరో రాబరీ చేసిన వజ్రాలు."

"ఆ వజ్రాలా?"

"అవే- ఏవీ?"

"అవి నావే.. నేనే బ్యాంకులో పెట్టాను. వాటిని కాజేసింది ఎవరు?"

"పిచ్చివాగుడు వాగకు. అవేవి? ముందు చెప్పు" అంది డాకూరాణి.

"నాకేం తెలుసు- ఆ పిచ్చిపోలీస్ ఇన్స్పెక్టర్ని అడుగు. వాడే ఇన్వెస్టిగేట్ చేస్తున్నాడు. అన్నట్లు నిన్నెక్కడో చూసినట్లుందే?"

"వార్‌లో నన్ను చూసి పారిపోయావులే నువ్వు. అందుకని గుర్తుండి వుంటుంది"

కనకారావ్ నెత్తిన రివాల్వర్ రాడ్‌తో బలంగా కొట్టాడు రాంబాబు.

కనకారావ్ కళ్ళు చీకట్లు కమ్మినాయి.

అక్కడే కూలబడి పిచ్చిచూపులు చూడసాగాడు.

రాంబాబు గన్ అతని కణతల మీదకు గురిపెట్టాడు.

"రెండు నిమిషాలు మాత్రమే టైమిస్తున్నా... ఎక్కడున్నాయి వజ్రాలు?"

"బ్లడీఫూల్! వజ్రాలెక్కడో నువ్వే వెతుకుతున్నావ్- మళ్ళీ నా బుర్ర పగలకొట్టి ఆడగటం ఎందుకు?"

"ఎందుకంటే అవి రెండూ నీ దగ్గరున్న ఆ పెన్‌లో వున్నాయి కాబట్టి."

ఆ మాట వింటూనే అందరూ అదిరిపడ్డారు.

"ఆ! వజ్రాలు పెన్‌లో వున్నాయా?"

"అవును"

"ఏవి మరీ?"

"ఇడియట్! అదే నేనూ అడుగుతున్నాను."

"యూ ఆర్ మాడ్! నువ్వు మాట్లాడేదానికేం అర్థం లేదు."

"నిజం చెప్పు- వజ్రాలేవి?"

"డోంటాక్! నాకు తెలీదని ఓసారి చెప్పాను."

"తెలీయపోతే పెన్‌లో నుంచి ఎలా మాయమయ్యాయ్?"

"అసలు వాటిని పెన్‌లో పెట్టిన ఇడియట్ ఎవరు?"

"నేను" అంది డాకూరాణి.

"నువ్వా?"

"అవును."

"పెన్‌లో పెట్టావా?"

"అవును."

"నీకేమయినా మెదడుందా? వజ్రాలను ఎవరయినా పెన్‌లో పెడతారా?"



"మెదడుందనుకుని నువ్వు బ్యాంకులో పెడితే ఏమయింది? ఎవరో కాజేశారా లేదా?"

"అర్థమయింది ఆ పెన్ కోసం మీరంతా మారువేషాలేసుకుని అలా కారాడి చచ్చింది అందుకా?" అన్నాడు గోపాల్రావ్.

"నాకు ముందే అనుమానం వచ్చింది బ్రదర్- ఈ పిల్ల ఇచ్చిన పెన్ వెనుక ఇంత కాస్ట్‌లీ స్టోరీ వుంటుందనుకోలేదు" అన్నాడు భవానీశంకర్.

"అంటే మీకీ పిల్ల ముందే తెలుసా?" గోపాల్రావ్‌ని నిలేసింది సీత.

గోపాల్రావ్ గతుక్కుమన్నాడు.

గొంతు తడారి పోయింది.

"ఓకే ఒక్కసారి తెలుసు."

"అదీ రెండు నిమిషాలు" అన్నాడు భవానీ.

"అందరూ షటప్" గన్ గాలిలోకి పేలుస్తూ మధ్యకొచ్చాడు విక్కీ.

"కనకారావ్! త్వరగా చెప్పు- వజ్రాలేవి?"

హఠాత్తుగా కనకారావ్‌కి గుర్తుకొచ్చింది.

"ఆ! గుర్తుకొచ్చింది" అంటూ రివ్వున పరుగెత్తబోయాడుగానీ రత్నప్రభ కాలు అడ్డం పెట్టేసరికి దభేల్‌మని పడిపోయాడు.

మొహం నేలకు తగిలి చెక్కుకుపోయింది.

"వజ్రాలు మనవి- ఎక్కడున్నాయో వీళ్ళకెందుకు తెలియాలి? నువ్విక్కడే వుండు" అరిచిందామె.

కనకారావ్ మూలుగుతూ లేచి నిలబడ్డాడు.

"ఏయ్ మిలట్రీ! వజ్రాలు ఎక్కడ దాచావో చెప్తావా లేదా?" అరిచాడు రాంబాబు.

"నో! చెప్పను."

"చెప్పకపోతే ఛస్తావ్."

"డెఫినెట్‌గానా?"

"చేతిలో రివాల్వర్ చూశావ్ కదా?"

"మిస్టర్! ఇప్పుడే కమీషనర్ గారికి ఫోన్ చేసి నిన్ను అరెస్ట్ చేయిస్తాను" అరిచింది రత్నప్రభ.

"ఏడ్చావ్! ఆ లోపలే వజ్రాలతో నేనూ, డాకూరాణీ ఉగాండా వెళ్ళిపోతాం."

"ఉగాండా వెళితే ఛస్తావ్. ఇంకో దేశం తగలడు" సలహా ఇచ్చాడు కనకారావ్.

"ఎందుకు? ఉగాండా కేమయింది?"

"అక్కడి ప్రెసిడెంటే ప్రజలను తినేస్తాడు"

"ఇక్కడ మాత్రం తక్కువేముంది. మామూళ్ళు కరెక్షన్ చేసి ఇమ్మని మాపై అధికారులు మమ్మల్ని తినేయడం లేదూ?"

"బాబోయ్! ఈ గొడవతో మాకేం సంబంధం లేదు. మమ్మల్ని వదిలేయండి" అరిచాడు చంద్రకాంత్.

"ఎవ్వడూ కదలడానికి వీల్లేదు. వజ్రాల సంగతి తేలేవరకూ" అన్నాడు విక్కీ.

"కానీ నాకీ గొడవలతో ఎలాంటి సంబంధం లేదు."

"నువ్వెవడివసలు?"

"ఒరిజినల్ రైటర్ చంద్రకాంత్..." అంటూండగానే పానకాలు కత్తి కస్సుమని వచ్చి అతని భుజానికి తగిలి కిందపడింది. ఇంకో కత్తిదీసి సిద్ధంగా పట్టుకున్నాడతను.

"దేవుడోయ్! నేను డూప్లికేట్ని. ఒరిజినల్ చంద్రకాంత్ ఇతనే."

"నో-నేను ఏ మాత్రం కాదు బ్రదర్. నువ్వే" అన్నాడు భవానీ చిరునవ్వుతో.

"కాదు నువ్వే."

"కాదు మిత్రమా! నువ్వే-కావాలంటే ఇదిగో రుజువు" అంటూ తన జేబులోని వారపత్రిక కటింగ్ ఒకటి తీసి పానకాలుతో సహా చుట్టూ మూగిన వారందరికీ చూపించాడు.

అది చూస్తూనే అందరూ షాక్ తిన్నారు. అందులో రచయిత చంద్రకాంత్ ఫొటో వుంది.

సీత అమాంతం గోపాల్రావు చొక్కా పట్టుకుంది.

"అంటే మీరు ఆ రోజు రాత్రి ఇతని హోటల్ రూమ్‌లో గడిపిన విషయమంతా అబద్ధం అన్నమాట."

గోపాల్రావు భయంగా భవానీ శంకర్ వైపు చూశాడు.

"ఎస్ మైడియర్ సిస్టరిన్లా! అదంతా అబద్ధమే."

కనకారావు ఆనందంతో ఎగిరిగంతేశాడు.

"చూశావా- అయ్‌నో- వీళ్ళిద్దరూ డ్రామా ఆడుతున్నారని నేను ముందే చెప్పాను."

"అయితే ఆ రాత్రి ఎక్కడున్నారు?"

"నాతో- హోటల్ లిఫ్ట్‌లో" అంది డాకూరాణి నవ్వుతూ.

"నీతోనా?"

"హోటల్ లిఫ్ట్‌లో.. గదిలో కాదు" టీజింగ్‌గా అంది.

"నేన్నమ్మను."

"లిఫ్టు ఫెయిలవకపోతే మాత్రం ఖచ్చితంగా హోటల్ గదిలేనే ఉండేవాళ్ళం."

"ఇంపాజిబుల్- నేనలాంటివాడిని కాదు" భయంగా అన్నాడు గోపాల్రావు.



"నువ్వెలాంటివాడివో నాకు బాగా తెలుసు" మండిపడుతూ అంది సీత.

"సిస్టరిన్లా- అసలు సంగతేమిటంటే గోపాల్రావు అనే ఈ బాలుడు నిజంగా చెప్పాలంటే చాలా మంచి బాలుడు. అందమయిన అమ్మాయిలంటే కొంచెం వీక్‌నెస్ వున్నమాట నిజమే గానీ అది కేవలం మీ పెళ్ళికి ముందువరకే. తర్వాత కేవలం హలో హలో పలకరింపుల వరకే. అయినా మీరు అడుగడుక్కీ అనుమానించేయడం వల్ల సైకలాజికల్‌గా టెర్రరైజ్ అయిపోయాడు. అమ్మాయి విషయం వచ్చేసరికి ఇష్టమొచ్చినట్లు అబద్దాలు చెప్పటం మొదలుపెట్టాడు. మొన్న జరిగింది కూడా అంతే! లిఫ్టులో ఇరుక్కుపోయాడు. పక్కన డాకూరాణి వుండిపోయింది. లిఫ్టు రిపేరయే సరికి తెల్లారిపోయింది. మీకు ఆ విషయం చెప్పినా నమ్మరని తెలుసు. అందుకే ఫ్రెండ్ దగ్గరున్నాని చెప్పాను. కానీ మీరు వదల్లేదు. కేస్ హిస్టరీ షీట్ కావాలన్నారు. దీంతో సడన్‌గా కనిపించిన నన్ను రచయిత చంద్రకాంత్‌గా ప్రవేశపెట్టాడు. కనుక జరిగిందాంట్లో ఎక్కువ భాగం తప్పు మీదే వుంది సిస్టరిన్లా! కావాలంటే ఓసారి ఫ్లాష్‌బాక్‌లూ, ఇమేజి నేషన్ షాట్స్ వేసి చూసుకోండి."

సీత కోపంగా చూసింది భవానీశంకర్ వైపు.

"అయితే మీరిద్దరూ కలసి నన్ను మోసం చేశారన్నమాట."

"మోసం అనరు సిస్టరిన్లా! డిసాస్టర్ మేనేజ్‌మెంట్ లేక క్రైసిస్ మేనేజ్‌మెంట్" అంటారు.

కనకారావు విరగబడి నవ్వాడు.

"నేను చెప్పలేదు బేబీ! వీళ్ళిద్దరూ చీట్స్."

"షటప్" అరిచింది రత్నప్రభ.

"వాట్? నన్ను షటప్ అంటావా?"

"అవును! ఈ గొడవంతా మీరు చేసిందే. గోటితో పోయేదానికి గొడ్డలి వేటు వేశారు. ఆ చంద్రకాంత్‌కి మెయిలివ్వబట్టి ఇంత రాద్ధాంతమయింది."

పూజ భవానీశంకర్ దగ్గరకొచ్చింది.

"భవానీ! ఆ రోజు మీరు మాట్లాడిన మాటలకు అర్థం ఇప్పుడు తెలిసింది."

"పూజా" భీకరంగా అరిచాడు కనకారావు.

"ఏమిటి డాడీ?"

"ఇంకా వాడితో మాటలేమిటి తన్ని తగలెయ్-హి ఈజే చీట్."

"ఆయామ్‌సారి డాడీ! అయ్ లైక్ హిమ్."

"వాట్-వాడు రచయిత కాకపోయినా లైక్ చేస్తావా?"

"ఎస్ డాడీ! రచయిత చంద్రకాంత్ ఎంత దొంగవెధవో-రచయిత అవటం కోసం

ఎన్నెన్ని బ్రోకర్ పనులు చేస్తున్నాడో నాకు పానకాలు చెప్పాడు."

"పానకాలా–వాడెవరు?"

పూజ వెనక్కు తిరిగి చూసింది.

"పానకాలూ!"

పానకాలు తూలుతూ వచ్చాడు.

అతనిని చూడగానే ఒరిజినల్ చంద్రకాంత్ అక్కడినుంచి పరుగెత్తబోయాడు గానీ పానకాలు పట్టుకున్నాడు.

"ఏరా– నేను చెప్పింది నిజమా కాదా?"

"అబద్ధం" భయంగా అన్నాడు చంద్రకాంత్.

అతని చెంప పగలగొట్టాడు పానకాలు.

"నిజమా కాదా?" కొత్త కత్తి తీస్తూ అడిగాడు.

"నిజమే!" వణకుతూ వప్పుకున్నాడు.

"నా భార్యను ఎత్తుకుపోయి ఆ చానెల్ క్రియేటివ్ హెడ్ నీలకఠం గాడికి హాండోవర్ చేశావా– లేదా?"

"చేశాను."

అతని చెంప మళ్ళీ చెళ్ళుమంది.

ఈసారి కొట్టింది అష్టలక్ష్మి.

"ఆ! నువ్వు కొట్టావా?" గాబరాగా ఏడుపు ముఖంతో అడిగాడు.

"అవును! అసలు నరకాలనుకున్నాను. కానీ అందరి ఎదురుగా నరికితే సాక్ష్యాలుంటాయని ఊరుకుంటున్నాను. సాక్షులెవరూ లేనప్పుడు చేస్తా నీ పని. ఇంట్లో కూరగాయల కత్తి ఎలాగూ వుందిగా."

"అది కాదే!" గాల్లో కెగిరి తన్నిందామె. బోర్లా పడిపోయాడు చంద్రకాంత్.

విక్కీ చేతిలో రివాల్వర్ మళ్ళీ పేలి బులెట్ గాల్లో కెగిరింది.

"ఏయ్! ఆ వజ్రాలేం చేశావు? లేకపోతే కాల్చిపారేస్తా. వన్–టూ–త్రీ–ఫోర్ – ఇలా ఎయిటీన్ వరకూ లెక్కపెడతా."

"ఎయిటీన్ వరకూ ఎందుగ్గురూ? సెంటిమెంటా?" అడిగాడు పానకాలు.

"కాదురా తెలివితక్కువ ఎదవా? నాకు ఇంగ్లీషులో అంతవరకే అంకెలు వచ్చురా. ఆ తరువాత రావు."

"ఏయ్ ఇడియట్స్! మీకేం పిచ్చెక్కిందా? ఆ పెన్‌లో వజ్రాలున్నాయన్న సంగతి తెలుస్తే నేనది షాప్‌లో ఇంకో పెన్‌లో ఎందుకు ఎక్స్చేంజ్ చేస్తాన్రా? డూ యూ హేవ్ బ్రెయిన్?



మీకు మెదడుందా?"

"వ్హాట్? అది ఇంకో పెన్‌తో ఎక్స్చేంజ్ చేశావా?" రాంబాబు అదిరి పడుతూ అడిగాడు.

"అవును."

"ఎందుకు చేశావా వెధవ పని?"

"కలర్ సెంటిమెంటు వల్ల – నాకు అచ్చి వచ్చిన కలర్ పెన్‌తో ఎక్స్చేంజ్ చేసుకుంటే బావుంటుందని ఆ షాప్‌కెళ్ళి ఎక్స్చేంజ్ చేశాను."

"ఆ! అయితే వజ్రాలున్న పెన్ ఆ షాప్‌లోనే వుందన్నమాట... హాహాహా" అని అరుస్తూ పరుగుతో వెళ్ళి జీప్‌ని ఎక్కి స్టార్ట్ చేసుకుని వేగంగా వెళ్ళిపోయాడు రాంబాబు.

"ఏయ్ రాంబాబూ! ఆ వజ్రాలు నీకు దక్కనివ్వన్రా" అంటూ విక్కీ ఆ పక్కనే ఉన్న మోటారు సైకిల్ దగ్గరకు దూకి దాని మీద కూర్చున్న వాడిని ఒక్క తోపు తోసి తను స్టార్ట్ చేసుకుని బయల్దేరాడు.

వాళ్ళను చూసి డాకూరాణి ఓ విజిల్ వేసి అప్పుడే అటు పక్కగా పోతున్న రన్నింగ్ బస్ ఎక్కేసింది.

"కమాన్! మనం కూడా వెళ్ళి మన వజ్రాలు తెచ్చుకుందాం– లేకపోతే వాటిని ఆ రాస్కెల్స్ కాజేస్తారు" అన్నాడు కనకారావు.

అందరూ కార్లో ఆ షాప్‌కి బయల్దేరారు.

షాప్‌కి చేరుకునేసరికే అక్కడ గన్ పట్టుకుని ఫ్యాన్సీ పెన్‌లన్నీ విరక్కొట్టి లోపల వజ్రాల కోసం వెతుకుతున్నారు రాంబాబు, విక్కీ డాకూరాణి.

అన్ని పెన్‌లు వెతకటం పూర్తయిపోయింది.

వెంటనే షాప్ ఓనరుకి గన్ గురి పెట్టాడు రాంబాబు.

"ఈ కర్నల్ ఎక్స్చేంజ్ చేసిన పెన్ ఏమైంది?"

"ఏమో సార్– నాకేం గుర్తు?"

"నిజం చెప్పు– ఆ పెన్‌లో వజ్రాలు నువ్వు కాజేశావా లేదా?"

"ఆ... అందులో వజ్రాలున్నాయా?"

"లేకపోతే పెన్‌ల కోసం తిరగడానికి మేమేం పెన్‌ల పిచ్చాళ్ళ మనుకున్నావా?"

"అయ్యయ్యయ్యయ్యో!"

"ఏమిటి దానర్థం?" అడిగాడు విక్కీ అనుమానంగా.

"ఆ సంగతి ముందే తెలుస్తే మొత్తం పెన్‌లన్నీ నేనే విరక్కొట్టే వాడిని."

"ఏడ్చావ్! ముందా పెన్ ఏం చేశావో చెప్పు."

"పెన్‌లేం జేస్తాడెవడయినా? అమ్మేస్తాడు."

"ఆ! ఆ పెన్ అమ్మేశావా?"

"ఖచ్చితంగా అమ్మే వుంటాను– మొత్తం పాతిక పెన్‌లమ్మాను ఈ రెండ్రోజుల్లో."

"ఎవరికమ్మావ్?"

"పెన్‌లు కొనేవాళ్ళ పేర్లూ, అడ్రస్‌లూ కూడా రాసుకుంటానేమిటి? మాదేం పోలీస్ డిపార్ట్‌మెంటు అనుకున్నారా– మొత్తం ఆచూకీ లాగడానికి?"

"అయితే ఆ పెన్ ఎవడి దగ్గరుందో ఎలా తెలుసుకోవడం?"

"అందరి జేబులూ చూడటం– ఎవడి జేబులో కనబడితే వాడిని ఫటాఫట్ చేయడం, ఆ పెన్ లాక్కోవటం– అంతే! వెరీ సింపుల్."

మరుక్షణం అందరూ రోడ్ల మీదకు పరుగెత్తారు.

ఆ పెన్ ఎవరి జేబులో కనబడితే వాళ్ళ మీదకు దూకి పెన్ లాక్కుని విరిచి అందులో వజ్రాలున్నాయోమో చూసి లేకపోతే మళ్ళీ ఇంకోడి దగ్గరకు పరుగెత్తుతున్నారు.

కొద్దిసేపట్లో ఆ పెన్లో వజ్రాలున్నాయనీ, ఆ పెన్ వెవరి దగ్గరుందో తెలీదనీ, అందుకే చాలామంది గాంగ్‌స్టర్స్ ఆ పెన్ కోసం వెతుకుతున్నారనీ నగరంలో జనమందరికీ తెలిసిపోయింది ఒక టీవీ చానెల్ ద్వారా.

దాంతో ఆ పెన్ ఎవరి దగ్గర కనబడితే వాళ్ళ మీద వందల మంది దాడి చేసి పెన్ లాక్కుని పారిపోతూంటే మరికొన్ని వందలమంది వాళ్ళను వేలాడి వాళ్ళ దగ్గర్నుంచి పెన్ లాక్కుని పారిపోతున్నారు.

కాసేపట్లో వీధులన్నీ అలాంటి పెన్‌ల కోసం వెతికే అల్లరిమూకలతో నిండిపోయాయ్.

ఆ పెన్ లమ్మే షాప్‌లన్నీ లూఠీ అయిపోయాయ్.

ఎక్కడ చూసినా పరుగులెత్తే జనం...

ఆ గొడవంతా చూసి నగరంలో కర్ఫ్యూ డిక్లేర్ చేశారు.

కనకారావు కోపంగా చిందులేస్తూ ఇంటికి చేరుకున్నాడు. ఇంటి ముందు ఓ కారు ఆగి వుంది.

ఎదురుగా సోఫాలో ఫుల్ సూట్‌లో కూర్చుని వున్నాడో వ్యక్తి.

అందరూ ఆశ్చర్యంగా అతని చుట్టూ మూగారు.

"హలో" అన్నాడా వ్యక్తి.

"హలో" అన్నాడు కల్నల్.

"హలో హలో" అన్నాడతను భవానీశంకర్ వైపు, గోపాల్రావు వైపూ కూడా చూసి విష్ చేస్తూ.



"హలో!"

"హలో!"

"హలో హలో!" అన్నాడతను సీతనూ, పూజనూ చూస్తూ.

"హలో!"

"హలో!"

"హలో!! అన్నాడతను రత్నప్రభను చూస్తూ.

"నీ గొంతు ఎక్కడో విన్నట్లుంది?" అంది రత్నప్రభ.

"వినే వుంటారు."

"నిన్నంతకుముదెక్కడో చూశాను" అన్నాడు కనకారావు.

"చూసే వుంటారు."

"మీ పేరు?" అడిగాడు గోపాల్రావు.

"పేరులో ఏముంది పెన్నిధి?"

"హా– దొరికావ్ బ్రదర్– భజన్‌రావ్" అన్నాడు భవానీశంకర్.

అందరూ ఆశ్చర్యపోయారు.

"భజన్‌రావా?" నమ్మకం చాలక రిపీట్ చేశాడు కనకారావు.

"ఎస్– మైడియర్ కనకారావ్!"

కనకారావు మొహం వాడిపోయింది.

"ఆ! నన్ను కనకారావ్ అని పేరు పెట్టి పిలుస్తున్నావా?"

"ఎస్! కనకారావ్ అని పిలుస్తాను."

"ఎంత ధైర్యం నీకు?"

"చాలా ధైర్యం."

"నిన్నూ నిన్ను... నిన్ను... షూట్ చెస్తాను."

"అవి పాత రోజులు కనకారావ్! ఇప్పుడు నా దగ్గర రెండు గన్స్ వున్నాయి."

రెండు గన్‌లు తీసి చూపిస్తూ అన్నాడు.

కనకారావు నోరు తెరిచేశాడు.

"కానీ నీ అవతారం ఏమిటి? ఈ డ్రస్ అద్దెకు తెచ్చుకున్నావా?" అడిగింది సీత.

"కాదు సీతా! నేనిప్పుడు కరోర్‌పతిని."

"కరోర్‌పతా?"

"ఎస్! బయట కారు కనిపించటం లేదూ?"

"అవునవును! ఆ కారు ఖరీదే అయిదు లక్షలుంటుంది" అంది రత్నప్రభ.

"ఇప్పుడే నేను అమెరికా మెళుతున్నాను. కొద్ది రోజులు అక్కడ సరదాగా గడుపుదామని."

"కానీ నీకింత డబ్బు ఎలా వచ్చింది బ్రదర్? ఎక్కడ కన్నం వేశావు?" అడిగాడు భవానీశంకర్.

"ఇక్కడే."

"ఆ! ఇక్కడా?"

"అవును గురూ."

"ఇక్కడ కోట్లెక్కడేడ్చినాయ్– గోపాలావుగాడి ఫారిన్ విస్కీ, కల్నల్‌గాడి తుప్పు పట్టిన గన్.. అంతకంటే ఇంకేమి లేవే?"

"ఛ! అవెవడిక్కావాలి. వస్తా.. నాకు ఫ్లైట్‌కి టైమయ్యింది."

అందరూ అతని వెనుకే కారు దగ్గరకు నడిచారు.

భజన్‌రావు డ్రైవరు బ్యాక్ డోరు తెరిచాడు.

భజన్‌రావు లోపల కూర్చున్నాడు.

"భజన్‌రావ్! ఎవడినో ముంచి గొప్పాడివయితే అయ్యావు. ఎంతమంది రాజకీయ నాయకులు జనాన్ని ముంచి కోట్లు సంపాదించటం లేదు. అంచేత ఆది తప్పనం. నిజం చెప్పు– ఎలా కరోర్ పతివయ్యావు?"

"అహ్హహ్హ.. వెర్రినాయాళ్ళలారా! ఆ పెన్‌లో వజ్రాలు కొట్టేసింది నేనే. ఆ డాకూరాణి పెన్ కోసం అలా మారువేషం వేసుకురావటం నాకు అనుమానం కలిగించింది" అందరూ షాక్ నుంచి తేరుకునేలోగానే కారు వెళ్ళిపోయింది.

"ఆ! నా వజ్రాలు నువ్వు కొట్టేశావా? పోలీస్.. పోలీస్" అంటూ ఫోన్ దగ్గరకు పరిగెత్తాడు కనకారావు.

ఫోన్‌లో పోలీస్ కంట్రోల్ రూమ్ కోసంరింగ్ కొడుతూనే వున్నాడు. అది ఎంగేజ్ చూపిస్తూనే వుంది.

"భవానీ!" అంది పూజ వెన్నెల్లో.

"ఎస్ డియర్."

"ఐ లవ్ యూ!"

"ఐ టూ డియర్."

"యూ ఆర్ మార్వలెస్."

"ఆఫ్‌కోర్స్! దటీజ్ మై హాబీ."

ఇద్దరూ ప్రణయంలో విహరించి ఇంట్లోకి తిరిగి వచ్చేసరికి తెల్లారుజామున



మూడయింది.

ఇంకా కనకారావు పోలీస్ కంట్రోల్ రూమ్ కోసం ఫోన్‌లో ప్రయత్నిస్తూనే వున్నాడు.

"హలో.. నేను పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేస్తున్నానయ్యా– ఆ! నువ్వెవడ్రా రాస్కెల్ – ఫోన్ పెట్టెయ్ ముందు– ఏంట్రా నేనే పెట్టెయ్యాలా– బాస్టర్డ్– కాల్చి పారేస్తా– ఏడ్చావ్ అంటావా? ఓరేయ్ నిన్నూ.. నిన్నూ.. నిన్ను..."

"హలో కనకారావ్?" పిలిచాడు భవానీ.

"వ్వాట్– నువ్వు కూడా పేరు పెట్టి పిలిచావా?"

"ఎస్ ఫాదరిన్లా!"

"వాట్–నేను ఫాదరిన్లానా?"

"ఎస్ డియర్! ఈ పాటికి ఆ భజన్‌రావు ఆమెరికా చేరి వుంటాడు. కనుక వజ్రాల సంగతి మర్చిపోయి టెలిఫోన్ అక్కడ పెట్టి నిద్రపోండి. నిద్ర ఆరోగ్యమునకు మూల సూత్రము."

కనకారావు పళ్ళు పటపటా కొరికి ఫోన్ నేలకేసి కొట్టాడు. ముక్కలయింది.

అప్పుడు వినిపించింది ఫోన్‌లో గొంతు– ముక్కల్లో నుంచి–

"హలో పోలీస్ కంట్రోల్ రూమ్ హియర్"

## ఇప్పుడు మార్కెట్లో ఉంది -

యర్రంశెట్టి శాయి

# లవ్ ఎట్

"హాయ్ రోజా! నేనెవరో చెప్పుకో చూద్దాం–"

రోజా తలెత్తి భవానీని చూసి ఆశ్చర్యంగా లేచి నిలబడింది. గుర్తు తెచ్చుకోడానికి ఎంత ప్రయత్నించినా అతనెవరో ఏమాత్రం గుర్తురావటం లేదు.

"సారీ! అయ్ కాన్ట్ రిమెంబర్–" అంటూ తండ్రి వేపు చూసింది.

"ఆదేంది? నీ బచ్‌పన్ కా దోస్త్‌నే గుర్తుపట్టవా?" అడిగాడు జైరాజ్ హాపీ మూడ్‌లో కొస్తూ. రోజా కన్‌ఫ్యూజయింది.

"బచ్‌పన్ కా దోస్తంటే..."

సబిత చెప్పేస్తూంటే భవానీ వారించాడు.

"నువ్ చెప్పద్దాంటీ– నేనే ఒక క్లూ ఇస్తా–" అంటూ రోజా దగ్గరకొచ్చి ఆమె చెవిలో "ఏయ్ ఉల్లిపాయ్! ఇంత త్వరగా నన్నెట్లా మర్చిపోయావే?" అన్నాడు సీక్రెట్‌గా.

ఉలిక్కిపడింది రోజా–

అతనిని ఎగ్జయిట్‌మెంట్‌తో చూసింది.

"ఓగాడ్! నువ్ రాకేష్‌వా?"

"ఏం డౌటా?"

"నువ్ రాకేష్‌లాగా లేవు–"

"రాకేష్‌నయితే కదా – అలా ఉంటానికి–"

"అంటే?"

"పదేళ్ళకిందటి రాకేష్ వేరు నేను వేరు – చాలా మారిపోయాను కదా! అసలు నా రూపమే మారిపోయింది–"

## టీవీ చానెల్ వార్‌లో

## వెంటనే ఎంజాయ్ చేయండి

లేటెస్ట్ కామెడీ నవల

# సెకండ్ సైట్

"యా– యా! అదే నేనూ ఫీలవుతున్నా–"

"నువ్ మాత్రం తక్కువేంటి? నేను కాబట్టి గుర్తుపట్టాను గానీ– అదే ఇంకెవరయినా అయితే ఇంకోదాన్ని వెతుక్కునే వాడు!" రోజా అతని డైలాగ్‌లకు కొంచెం అనీజీగా ఫీలయింది.

"నువ్ కొంచెం డిగ్నిఫైడ్‌గా మాట్లాడితే బావుంటుంది–" అంది కోపం అణచుకుంటూ.

జైరాజ్ వెంటనే వివరణ ఇచ్చాడు.

"రోజా జరంత ఇంటలెక్చువల్ టైప్ అనుకోరాదు– లాంగ్వేజ్, బిహేవియర్– అన్నీ అమెరికా టైపన్నట్లు!"

"ఓ! నౌ అయ్ అండర్‌స్టుడ్! చిల్లర్ టైప్‌ని లైక్ చేయదన్నమాట! అయితే ఇండియాలో ప్రాబ్లెమే– పాపం! అవునా రోజా–"

"యా! యా! బిగినింగ్‌లో కొంచెం ప్రాబ్లెమ్ అయింది. కానీ స్లోగా మా చానెల్ వాళ్ళందరినీ ఎడ్యుకేట్ చేసి ఒక లెవల్‌కి తీసుకురావడానికి చాలా శ్రమపడాల్సి వచ్చింది–" గర్వంగా చెప్పింది రోజా.

"వావ్! యూ ఆర్ రియల్లీ గ్రేట్! ఒబామాకి నీ లెవల్ తెలుస్తే పరేషానవుతాడు! ముల్కీ రూల్స్ కాన్సిల్ జేసి ఇండో–అమెరికన్ పోరీలు జిందాబాద్ అంటాడు–"

రోజాకి ఆ డైలాగ్ కూడా నచ్చలేదు.

"ఆ లూజ్ టాకే నాకిష్టం ఉండదు" అంది చికాకుగా.

"ఓ సారీ! ఏం చేస్తాం! ఆదత్ సే మజ్‌బూర్ హై!"

## మళ్ళీ మీ భవానీ శంకర్

## మార్కెట్లో ఉన్న నవలలు :

హ్యూమరాలజీ 1, 2, 3

రాంభరోసా అపార్ట్‌మెంట్స్

మొగుడు- ఇంకోపెళ్ళాం - వజ్రాలు

రైల్వే జంక్షన్

ప్రేమకు ఫుల్‌స్టాప్ ఉందా

సినీ పంచతంత్రం

సినీ బేతాళం

లవ్ ఎట్ సెకండ్ సైట్

బెస్ట్ జోక్స్- లేటెస్ట్ కూడా

అమ్మాయీ.. ఓ అమ్మాయీ ....

కామెడీ పెరేడ్

పారకులున్నారు జాగ్రత్త

హనీమూన్

**కాళీదాదా అపార్ట్‌మెంట్స్**